



ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY




హైదరాబాద్ 10-8-2017 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 1
రూ. 5-00 పేజీలు 18 + 24 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

# నయా 'షికారీ'లు

- వన్యప్రాణుల్ని వణికిస్తున్న వేటగాళ్లు
- పెద్దపులుల కోసం తెలంగాణ అడవులను జల్లెడ పడుతున్న అంతరరాష్ట్ర ముఠాలు
- సొమ్ము కోసం సహకరిస్తున్న స్థానిక ముఠాలు
- దర్జా కోసం.. సరదా కోసం.. వేట బాట పడుతున్న నవ యువతరం
- జంతువులకు అడవుల్లోనూ కొరవడిన రక్షణ
- పులుల చర్మాలు, గోళ్లు, ఎముకలు విదేశాలకు ఎగుమతి



మహదేవ్‌పూర్ అటవీప్రాంతంలో వేటగాళ్ల తూటాలకు బలైన వన్యప్రాణులు

ఈనాడు – హైదరాబాద్

అడవుల్లో స్వేచ్ఛగా సంచరించాల్సిన వన్యప్రాణులు ఇప్పుడు పొదల మాటున చేరి వణికిపోతున్నాయి. ఏ వైపు నుంచి ఏ తూటా దూసుకొస్తుందో.. ఏ మూలన ఏ ఉచ్చు దాగి ఉందో తెలీక అల్లాడుతున్నాయి.. అరుదైన అడవి జంతువుల్ని వధించి వాటి చర్మం, గోళ్లు, ఎముకలు తదితరాలతో అంతర్జాతీయ వ్యాపారం సాగించే ముఠాలు తెలంగాణ అడవుల్ని జల్లెడపడుతుండగా, స్వార్థం కోసం స్థానిక ముఠాలు వారికి అండగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు నిజాంల కాలంలో సరదా కోసం సాగే 'షికారా' (వేట) ప్రక్రియ మళ్లీ వేళ్లూనుకుంటున్నట్లు కనిపిస్తోంది. ధన, రాజకీయ ప్రాబల్యమున్న కొంతమంది యువత వారాంతాల్లో, సెలవుల్లో వచ్చి అడవుల్లో వాలిపోతున్నారు. తమ సరదాల కోసం మూగజీవాల్ని బలితీసుకుంటున్నారు. ఇటీవలే పాత వరంగల్ జిల్లా మహదేవపూర్ సమీపంలోని పలిమెల-సర్వాయిపేట అటవీ ప్రాంతంలో రెండు దుప్పుల్ని కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఓ పార్టీ నేతతో పాటు వేటను వృత్తిగా చేసుకున్న ఓ షూటర్ సహా తొమ్మిదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురి ఆచూకీ ఇంకా దొరకకపోవడం విశేషం.

- పెద్దపులులతో పాటు చిరుతలు, దుప్పులు, జింకలు, అడవిపందులు.. వంటి జంతువులు వేటగాళ్ల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నాయి. అటవీ విస్తీర్ణం రోజురోజుకు తగ్గుతుండటంతో వాటికి రక్షణ లేకుండాపోతోంది.
- తెలంగాణలో గత మూడేళ్లలో (2014-17) జంతువుల మరణాలపై 292 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి 4 నెలల్లో మరో 20 కేసులు. ఇవన్నీ అధికారికంగా గుర్తించిన మరణాలే. పట్టుబడని కేసులు, అవశేషాలు కూడా కనిపించకుండా మాయం చేసిన జంతువుల సంఖ్య మరికొన్ని రెట్లు ఉంటుంది.

### అంతర్జాతీయంగా డిమాండ్

పెద్దపులులు, చిరుతపుల చర్మాలు, గోళ్లు, ఇతర శరీర భాగాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో కొన్ని అంతర రాష్ట్ర ముఠాలు వాటినే లక్ష్యంగా చేసుకుంటున్నాయి. హర్యానా, మధ్యప్రదేశ్‌లకు చెందిన ముఠాలు పులులే లక్ష్యంగా తెలంగాణతో పాటు ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లోని అటవీప్రాంతంలో సంచరిస్తున్నాయి. ఇప్పటికే అంతరించే దశలో ఉన్న పెద్దపులులు, చిరుతలు అంతర రాష్ట్ర వేటగాళ్ల రాకతో మరింత ముప్పును ఎదుర్కొంటున్నాయి. గత ఏడాది కాలంలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల పరిధిలో మూడు పెద్దపులులు, రెండు మూడు చిరుతలు వేటగాళ్ల తూటాలకు బలైపోయాయి. ఇక స్థానిక వేటగాళ్ల కారణంగా దుప్పులు, ఎలుగుబంట్లు, నీల్గాయిలు, కుందేళ్ల భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నాయి.

### కానరాని పులుల జాడ

కవ్వాల్ అభయారణ్యంలో గతంలో పాతిక వరకు పెద్దపులులు ఉండేవి. ఇప్పుడక్కడ ఒకట్రెండుకు మించి లేవు. ఏడాదికాలంగా వాటి జాడా కెమెరాలకు చిక్కడం లేదు. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో 3, 4.. అమ్రాబాద్ జిల్లా పులుల సంరక్షణ కేంద్రం ప్రాంతంలో 14 వరకు, మొత్తంగా తెలంగాణలో 20కి మించి పెద్దపులులు లేవు. వీటిని వేటాడం, చంపడం కోసం ఈ ముఠాలు తుపాకులతో పాటు ఇతర పద్ధతులు అవలంభిస్తున్నట్లు సమాచారం. విద్యుత్తు తీగలు, వలలు, ఉచ్చు, ఆహారంలో విషం కలపడం, పేలుడు పదార్థాలతో ఎరవేయడం వంటి పద్ధతులతో వన్యప్రాణులను బలిగొంటున్నారు.

### క్రూరంగా చంపి.. చర్మం వలిచి..

- రెండువారాల క్రితం హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్‌లో ఓ చిరుతపులి చర్మం, గోళ్లను పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం గండిగోపాల్‌పూర్ అటవీ ప్రాంతంలో ఈ పులిని చంపినట్లు గుర్తించారు. ఎవరో ఉచ్చు పెడితే అందులో చిక్కుకుని పెద్దపులి మరణించిందని.. చర్మం, గోళ్లు తీసుకున్నామని ఇస్లాంపూర్‌కు చెందిన కొందరు చెప్పారు. వారితో జైనూరుకు చెందిన మరికొందరు, మధ్యవర్తులతో కలిసి హైదరాబాద్‌లో చర్మం, గోళ్లను విక్రయించారు. ఈ వ్యవహారంలో తొమ్మిది మందిపై కేసు నడుస్తోంది.
- ఆరునెలల క్రితం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు అటవీప్రాంతంలో పెద్దపులి చర్మాన్ని హైదరాబాద్‌కు తీసుకెళుతూ ముగ్గురు పట్టుబడ్డారు. మహారాష్ట్రలోని తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఈ పులిని చంపినట్లు చెప్పారు. ఈ కేసులో 13 మందిని అరెస్టుచేశారు. వీరిలో ఇద్దరు బెజ్జూరుకు చెందినవారున్నారు.


వేటకోసం ఉచ్చు

- ఎనిమిది నెలల క్రితం మంచిర్యాల జిల్లా కోటంపల్లి మండలం పిన్నారంలో ఓ నీటి కుంట సమీపంలో వేటగాళ్లు విద్యుత్తుతీగ పెట్టారు. నీరు తాగేందుకు వచ్చిన పెద్దపులి షాక్‌తో చనిపోయింది. భయంతో వేటగాళ్లు పులి మృతదేహాన్ని పాతిపెట్టారు. ఆ సమాచారం బయటకు పొక్కడంతో ఐదుగురిని అరెస్టుచేశారు. ఇతర జంతువుల కోసం తీగ పెట్టామని, పులి వచ్చే విషయం తెలియదని చెప్పినట్లు సమాచారం.
- ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరిలో ఓ పెద్దపులిని చంపారు. మూడునెలల క్రితం దాని చర్మాన్ని విక్రయిస్తూ వారు హైదరాబాద్‌లో పట్టుబడ్డారు.
- మంచిర్యాల జిల్లా కోటంపల్లి మండలంలోనే ఏటా వంద నుంచి 120 వరకు దుప్పులను హతమారుస్తున్నట్లు సమాచారం. ఇక్కడ మృత్యువాత పడుతున్నవాటిలో చుక్కల జింకలు, కుందేళ్ల సంఖ్య కూడా భారీగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

### నేపాల్ మీదుగా చైనా వైపు

పులి చర్మం, గోళ్లు ఎక్కువగా నేపాల్, బర్మా మీదుగా చైనాకు తరలిస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దపులి చర్మానికి రూ. 50 లక్షలకుపైగా ధర పలుకుతున్నట్లు అటవీశాఖ వర్గాల సమాచారం. చిరుతపులి చర్మానికి రూ. 10 లక్షలకుపైగా ధర ఉన్నట్లు తెలుస్తోంది. పులి ఎముకల్ని కూడా కిలోల చొప్పున విక్రయిస్తుంటారు. చైనాలో ఔషధాల తయారీలో వీటిని ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఒక్కో పులి శరీరంలో 6-8 కిలోల ఎముకలు లభిస్తాయి. ఎలుగుబంటి గోర్లకు కూడా విదేశాల్లో మార్కెట్ ఉండటంతో వీటినీ లక్ష్యంగా చేసుకుంటున్నారు.

### ఇలా మాటు వేసి మట్టుపెట్టడం

- వేటగాళ్లు ఏదైనా జంతువును లక్ష్యంగా చేసుకున్నప్పుడు ముందు దాని జాడ కనిపెడతారు. దీనికోసం సమీప గ్రామాల వారికి డబ్బులిచ్చి అవి తిరిగే ప్రాంతాలను తెలుసుకుంటారు. తర్వాత వల పన్నుతారు.
- పులి, ఇతర జంతువులు అక్కడికి వచ్చినప్పుడు దానిమీద వలలో చిక్కుతాయి. ఆ తర్వాత చంపి చర్మం, గోళ్లు వంటివి తీసుకుపోతారు.
- దుప్పులు, నీల్గాయిలు వంటి జంతువులు మార్గమధ్యంలో పెంటవేస్తాయి. ఒకసారి వేసిన ప్రాంతానికే రెండోరోజు కూడా వస్తాయి. ఈ ఆనవాళ్ల ఆధారంగా వేటగాళ్లు సులభంగా వాటిని పట్టుకుంటున్నారు.

**వన్యప్రాణుల మరణాలపై నమోదైన కేసులు**

| సంవత్సరం | సంఖ్య |
|---|---|
| 2014-15 | 114 |
| 2015-16 | 101 |
| 2016-17 | 77 |
| 2017-18 | 20 |

2017-18 జులై నాటికి.



### కొత్తతరం వేటగాళ్లు

- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ముఠాలతోపాటు అటవీ ప్రాంతాల్లో ఉండేవారు కొందరు జంతువుల్ని వేటాడుతున్నారు. అటవీప్రాంతాల్లో ఉండేవారు ఎక్కువగా మాంసం కోసం షికార్ (వేట)కు వెళుతుంటారు. కొన్ని వర్గాల వారికి దశాబ్దాలుగా ఇది అలవాటే. కాని హైదరాబాద్, కరీంనగర్ వంటి నగరాల నుంచి వచ్చే కొందరు యువత మాత్రం వేటను ఓ ఫ్యాషన్‌గా కూడా మార్చుకుంటున్నారు.
- స్థానికంగా ఉండేవారి సహకారంతో ఆయుధాలు, వాహనాల్లో అడవుల్లోకి వెళుతున్నారు.
- నీటి మడుగుల వద్దకు వచ్చే జంతువుల్ని లక్ష్యంగా చేసుకున్నారు. జంతువుల వేట ఎక్కువగా రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు జరుగుతుంది.
- ఒక్కో బృందంలో ఐదు నుంచి పదిమంది వేటగాళ్లు ఉంటారు.
- దుప్పులు, నీల్గాయిలు, అడవిపందులు, కుందేళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారు.
- హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని కొన్ని దాబాల్లో జింక మాంసం, కుందేలు మాంసం మూడోకంటికి తెలియకుండా నమ్మకస్తులైన కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

### అటవీ శాఖ సిబ్బందికీ వాటాలు

కరెంటు తీగలు, ఉచ్చులు, ఇతర విషపదార్థాల ద్వారా వన్యప్రాణుల్ని చంపేవారు కేసులు, ఇతరత్రా గొడవలు లేకుండా వేటమాంసంలో కొంత భాగాన్ని కొంతమంది అటవీశాఖ సిబ్బందికి, పోలీసులకు, స్థానికంగా పేరున్నవారికి వాటాల రూపంలో పంపిస్తున్నట్లు సమాచారం. చుక్కల దుప్పిలో 60-70 కిలోల మాంసం దొరుకుతుంది. నీల్గాయి అయితే అంతకంటే ఎక్కువ ఉంటుందని అటవీశాఖవర్గాలు చెబుతున్నాయి.

### సంరక్షణలో అటవీశాఖ విఫలం

- అడవుల్లో జంతువుల జాడ తెలుసుకునేందుకు కెమెరాలు పెట్టిన అటవీశాఖ వాటి సంరక్షణపై పూర్తిస్థాయి శ్రద్ధ పెట్టడం లేదు.
- కేంద్రప్రభుత్వం నుంచి వేటగాళ్ల హెచ్చరికలు వచ్చిన సందర్భాల్లో తప్ప మిగిలిన సమయాల్లో అంత సీరియస్‌గా ఉండటం లేదు. జంతువుల వేటగాళ్లు, చెట్లు నరికేవారి సమాచారం తెలుసుకునేందుకు నియమించిన ఫారెస్టు వాచర్లకు కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కవ్వాల్ అభయారణ్యం మరికొన్ని అటవీ ప్రాంతాల్లో వీరు విధులకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

### వేటగాళ్ల ఆచూకీ చెప్పండి

వన్యప్రాణులకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు అటవీశాఖ ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబరు 1800 4255 364 ఏర్పాటుచేసింది. జంతువులు అడవి నుంచి బయటకువచ్చినా, ఎవరైనా వాటిని వేటాడుతున్నా ఈ నంబరుకు ఫోన్ చేసి తెలపవచ్చు.

### అడవిలోకి అడుగు పెడితే కటకటాలే

- అడవి జంతువుల సంరక్షణ కోసం ఉద్దేశించిన అటవీ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి.
- అడవిలో జంతువుల్ని వేటాడకున్నా.. కేవలం ఆయుధంతో ప్రవేశించినా నేరమే. దీనికి శిక్ష మూడేళ్ల వరకు తప్పదు.
- వన్యప్రాణులను చంపడమే కాకుండా చంపే ప్రయత్నం చేసినా 3 నుంచి 7 ఏళ్ల వరకు శిక్ష పడుతుంది.
- పెద్దపులి, చిరుతపులి, ఏనుగు వంటి షెడ్యూల్-1 జంతువుల్ని వేటాడితే మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్ష.
- దుప్పులు, జింకలు, మనుబోతులు వంటి షెడ్యూల్-3 జంతువుల్ని వేటాడితే మూడేళ్ల వరకు జైలుశిక్ష.
- ఒకసారి నేరం చేసి పట్టుబడినవారు రెండోసారి నేరానికి పాల్పడితే రెట్టింపు శిక్ష పడుతుంది.
- వన్యప్రాణి సంరక్షణ చట్టంలో శిక్షలు తక్కువగా ఉండడంతో వేటగాళ్ల ఆగడాలకు అడ్డుపడడంలేదని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ చట్టంలో మార్పులు చేసి శిక్షలు కఠినతరం చేయడానికి నిర్ణయించింది. 3 నుంచి 7 ఏళ్ల వరకు ఉన్న శిక్షలను 7 నుంచి 14 ఏళ్లకు మార్చాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలు పార్లమెంటు పరిశీలనలో ఉన్నాయి. త్వరలో ఆమోదం లభిస్తుందని భావిస్తున్నారు.

## అమిత్ షా, ఇరానీలను అభినందించిన ప్రధాని

**దిల్లీ:** గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం అభినందించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. కమల దళపతిగా షా మూడేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడంపైనా మరో ట్వీట్‌లో ఆయన అభినందనలు తెలిపారు. షా హయాంలో భాజపా దేశవ్యాప్తంగా బాగా విస్తరించిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

**శరద్‌యాదవ్‌కి పటేల్ కృతజ్ఞతలు:** గుజరాత్‌లోని ఏకైక జేడీ(యు) శాసనసభ్యుడు ఛోటూ వాసవ రాజ్యసభ ఎన్నికల్లో తనకు ఓటు వేయడం పట్ల ఆ పార్టీ నేత శరద్‌యాదవ్‌కి కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్‌పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఓటుతో కలిపి సరిగ్గా విజయానికి అవసరమైన 44 ఓట్లను పటేల్ దక్కించుకుని, అయిదోసారి పెద్దల సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. ఎన్నికలు ముగిశాక ఆయన ట్విటర్‌లో దానిపై స్పందిస్తూ- ఇది తన విజయం మాత్రమే కాకుండా ధనబలం, అధికార బలాల ఓటమి కూడానని చెప్పారు.

### భాజపా మూడో అభ్యర్థికి తప్పని ఓటమి

**అహ్మదాబాద్:** గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు నాటకీయ పరిణామాల మధ్య ఆలస్యమై బుధవారం తెల్లవారుజామున అధికారికంగా వెల్లడయ్యాయి. భాజపా నుంచి బరిలో దిగిన అమిత్‌షా, స్మృతి ఇరానీలు సునాయాసంగా గెలుపొందగా, మూడో అభ్యర్థి బల్వంత్‌సింగ్ రాజ్‌పుట్ మాత్రం ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు శాసనసభ్యులు క్రాస్ ఓటింగుకు పాల్పడడంతో పాటు గోప్యతను పాటించకుండా ఆ ఓట్లను భాజపా నేతలకు చూపించారనే ఫిర్యాదుతో ఆ రెండు ఓట్లను ఎన్నికల సంఘం రద్దు చేసిన విషయం తెలిసిందే. దాంతో అభ్యర్థుల విజయానికి కావాల్సిన ఓట్ల సంఖ్య 45 నుంచి 44కి తగ్గింది. పటేల్‌కు సరిగ్గా అన్ని ఓట్లే వచ్చాయి. భాజపాకి మద్దతుగా పడిన రెండు ఓట్లను ఈసీ రద్దు చేయడంపై న్యాయ పోరాటం చేస్తామని గుజరాత్‌సీఎం విజయ్ రూపానీ ప్రకటించారు.

### గుజరాత్ ఎమ్మెల్యేగా అమిత్‌షా రాజీనామా

**గాంధీనగర్:** భాజపా జాతీయాధ్యక్షుడు, అయిదుసార్లు గుజరాత్ శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికైన అమిత్‌షా... అసెంబ్లీకి వీడ్కోలు చెప్పారు. రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన నేపథ్యంలో ఆయన శాసనసభ్యునిగా రాజీనామా చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో చివరి రోజైన బుధవారం ఆయన దాదాపు గంటసేపు సభలో ప్రసంగించారు. ఆ తర్వాత స్పీకర్ రమణలాల్ వోరాకు రాజీనామా లేఖ సమర్పించారు.

### గుజరాత్‌లో 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వేటు

**అహ్మదాబాద్/ దిల్లీ:** గుజరాత్‌లో 8 మంది అసమ్మతి శాసనసభ్యులపై కాంగ్రెస్ పార్టీ కొరడా ఝుళిపించింది. మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరించి, అధికార అభ్యర్థికి కాకుండా వేరేవారికి ఓట్లు వేసినందుకు వారిని ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరించింది. వీరిలో శంకర్‌సింగ్ వాఘేలా కూడా ఉన్నారు. శాసనసభ్యులుగా ఇటీవల రాజీనామా చేసిన ఆరుగురినీ పార్టీ నుంచి బహిష్కరించాలని అధిష్ఠానానికి సిఫార్సు చేసినట్లు గుజరాత్ వ్యవహారాల బాధ్యునిగా ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అశోక్ గెహ్లోత్ వెల్లడించారు. (వీరిలో ముగ్గురు ఇటీవలే భాజపాలో చేరారు.) పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నవారిని ఉపేక్షించేది లేదని ఆయన చెప్పారు.

## అహ్మద్ గెలుపులో.. ఎన్ని మలుపులో!

- సునాయాసంగా అందాల్సిన విజయం..
- చెమటోడిస్తే తప్ప దక్కని వైనం
- గుజరాత్‌లో భాజపా 150 + ప్రణాళికకు ఎదురుదెబ్బేనా?


రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్ విజయంతో కాంగ్రెస్ కార్యకర్తల ఆనందం

ఈనాడు – దిల్లీ

కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యే ప్రక్రియ.. ఎన్నో మలుపుల మధ్య అత్యంత ఉత్కంఠభరిత పోరుగా మారుతుందని చాలామంది ఊహించలేదు. విజయం కోసం భాజపా అన్నిరకాల వ్యూహోపాయాల్నీ అమలు చేయగా.. కాంగ్రెస్‌లో క్రాస్‌ఓటింగ్, చీలికలు సంభవించినా.. చివరికి గెలుపునకు కనీసంగా అవసరమైన 44 ఓట్లతో అహ్మద్‌పటేల్ ఒడ్డున పడ్డారు. చాలాకాలంగా గెలుపు ముఖం చాటేసిన కాంగ్రెస్ పార్టీకిది అత్యుత్తమ వార్త అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే.. అహ్మద్‌పటేల్‌ను ఓడించేందుకు భాజపా తన శక్తియుక్తులన్నింటినీ ఎందుకు మోహరించిందన్నదే ఆసక్తికరం.

మొదటగా.. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి రాజకీయ కార్యదర్శిగా ఉన్న అహ్మద్.. ఆ పదవి ద్వారా పార్టీకి ప్రధాన వ్యూహకర్తగా ఉంటూ వస్తున్నారు. ఆయన్ని ఓడించేందుకు శాయశక్తులా యత్నించడం ద్వారా.. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యం నుంచి ఆ పార్టీ అత్యున్నత స్థాయి నేతలకూ మినహాయింపు లేదని రుజువు చేయాలని భాజపా భావించినట్లు తెలుస్తోంది. సోనియాగాంధీకి అత్యంత విశ్వసనీయ నేతలను ఓడించడం ద్వారా ఆమె చుట్టూ ఉన్న ఛత్రాన్ని విచ్ఛిన్నం చేయవచ్చనే సందేశాన్ని ఇవ్వాలని తమ పార్టీ కోరుకుందని భాజపా నేత ఒకరు పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ అభ్యర్థి ఓడిపోయినా పార్టీ కొంతమేర ప్రయోజనాల్ని సాధించిందన్నారు. తాజా ఉదంతం కాంగ్రెస్ నేతల్ని తప్పకుండా భయపెట్టే ఉంటుందనీ, ముఖ్యంగా సుదీర్ఘ కెరీర్‌ను ఆశించే వారికి ఆందోళన మిగిల్చి ఉంటుందని వ్యాఖ్యానించారు.

రెండోది.. గుజరాత్ నుంచి మూడోస్థానాన్ని గెలిచేందుకు భాజపా చేసిన యత్నాలు రాజ్యసభలో వారి స్థానాన్ని మెరుగుపరుచుకునేందుకు చేస్తున్న తీవ్రకృషికి తార్కాణంగా నిలుస్తున్నాయి. ఇటీవల 58 స్థానాలతో ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచినా మెజారిటీ స్థానాలైన 123కు చాలా దూరంలోనే ఉంది. పలు బిల్లుల్ని విపక్షాలు నిలువరిస్తుండటంతో రాజ్యసభలో ఎన్డీఏ పరిస్థితిపై భాజపా నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

మూడోది.. గుజరాత్‌లో 2017 చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో మూడోస్థానాన్ని గెలవడం ద్వారా ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తల్ని డీలా పడేలా చేయాలనేది భాజపా వ్యూహంగా తెలుస్తోంది.

**చెమటోడ్చి.. విజయం..:** 15 రోజులక్రితందాకా 57 మంది సభ్యులున్న కాంగ్రెస్‌కు అహ్మద్‌పటేల్ విజయం నల్లేరుపై నడకే కావాల్సి ఉన్నా.. చావుతప్పి కన్ను లొట్టపోయిన స్థితిలో నెగ్గడం గమనార్హం. అమిత్‌షా చాణక్యంతో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భాజపా వైపు మొగ్గు చూపగా, ఏడుగురు తిరుగుబాటు చేశారు. దీంతో కాంగ్రెస్ బలం 44 మంది ఎమ్మెల్యేలకు పరిమితమైంది. ఈ 44 మందిలోనూ ఒకరు అహ్మద్‌కు వ్యతిరేకంగా ఓటేయగా, జేడీయూ ఎమ్మెల్యే ఓటుతో ఆయనకు 44 ఓట్లొచ్చాయి. ఈ క్రమంలో సునాయాసంగా సాధించాల్సిన విజయానికి చెమటోడ్చాల్సి వచ్చింది. కొంతకాలంగా నానా విధాలుగా సతమతమవుతున్న కాంగ్రెస్‌కు భారీ వ్యతిరేక పరిస్థితుల మధ్య అహ్మద్‌పటేల్ సాధించిన నాటకీయ విజయం ఊపిరిపోసినట్లయింది. అయినప్పటికీ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను అధికారం నుంచి దించుతామని ఆ పార్టీ చెప్పడం అతిశయమే అవుతుందని భావించవచ్చు. మరోవైపు..గుజరాత్ అసెంబ్లీలో అమిత్‌షా లక్ష్యమైన 150+కు ఇది కొద్దిగా ఎదురుదెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అతను.. కాంగ్రెస్ సంక్షోభ పరిష్కర్త

- యూపీఏ ఏర్పాటులో..

**సర్కారు నడవడంలోనూ పటేల్ కీలకం**

**అహ్మదాబాద్:** రాజ్యసభ ఎన్నికల్లో గుజరాత్ నుంచి జరిగిన హోరాహోరీ పోరులో గట్టెక్కిన అహ్మద్‌పటేల్(67)కు కాంగ్రెస్‌లో సంక్షోభ పరిష్కర్తగా, వ్యూహకర్తగా పేరుంది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి సుదీర్ఘకాలంగా రాజకీయ కార్యదర్శిగా పార్టీలో శక్తిమంతమైన పదవిని నిర్వర్తిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా నలుగురు ప్రధాన మంత్రుల ప్రభుత్వాల్లో చేరే అవకాశాల్నీ సున్నితంగా తిరస్కరించారని పార్టీ వర్గాల సమాచారం. నెహ్రూ, గాంధీ కుటుంబానికి విధేయుడిగా పేరొందిన అహ్మద్ గుజరాత్ నుంచి పార్లమెంటుకు ఏడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. మూడుసార్లు లోక్‌సభ సభ్యుడిగా, నాలుగుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. రాజ్యసభ సభ్యత్వం కోసం తాజాగా ఐదోసారి చేసిన పోటీ మాత్రం ఆయనకు అతిపెద్ద సవాలునే విసిరింది. రెండు దశాబ్దాల కాలంలో గుజరాత్‌లో ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యతిరేకత లేకుండానే గెలుస్తూ వస్తుండగా.. తీవ్రస్థాయి పోటీ జరగడం ఇదే తొలిసారి. మొన్నటిదాకా గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ చీఫ్‌విప్‌గా పనిచేసిన బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్ భాజపా తరఫున బరిలోకి దిగగా, అహ్మద్‌పటేల్ అతికష్టమ్మీద ఆయనపై గెలిచారు. ఇది తన విజయం మాత్రమే కాదనీ, ధనబలం, కండబలం, అధికార దుర్వినియోగానికి దక్కిన ఓటమి అని ఆయన ట్వీట్ చేశారు. గుజరాత్‌లో పార్టీ అధ్యక్షుడిగా ఎవరుండాలి నుంచి, మేయర్ ఎన్నికల వంటివాటిలో ఎవరు నిలబడాలనే విషయంలో సైతం ఆయన చెప్పిన మాటే నడుస్తుందని పార్టీ వర్గాల మాట. ఓ సామాజిక కార్యకర్త కుమారుడైన అహ్మద్‌పటేల్ పార్టీలో అంచెలంచెలుగా పైకొచ్చారు. 1977లో భరూచ్ నుంచి 28 ఏళ్ల వయసున్న అహ్మద్‌ను ఇందిరాగాంధీ లోక్‌సభ బరిలో నిలపగా విజయం సాధించారు. ఆ తర్వాత 1980, 84లోనూ గెలిచారు. ఆ తర్వాతి కాలంలో గుజరాత్‌లో భాజపా కేంద్రస్థానంలో నిలవడం ప్రారంభమవడంతో ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడం ఆయనకు కష్టంగా మారింది. 1990లో లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోవడంతో 1993లో రాజ్యసభ మార్గంలో దిల్లీ చేరారు. 1999, 2005, 2011లో ఎగువసభకు ఎన్నికయ్యారు. ఎప్పుడూ ప్రముఖంగా కనిపించాలని భావించని అహ్మద్‌పటేల్ యూపీఏ-1 సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా నిలిచినట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్‌దోషి పేర్కొన్నారు. మిత్రపక్షాలతో సరైన సంబంధాల్ని నెరపడం ద్వారా పదేళ్ల యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం నడవడంలోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించారనే పేరుంది.

### అహ్మద్ గెలుపు 'శక్తి' అతనే!

**అహ్మదాబాద్:** గుజరాత్ రాజ్యసభ ఎన్నికల పోరులో అహ్మద్ పటేల్ విజయం వెనుక రాజకీయ నాయకుడిగా మారిన ఓ న్యాయవాది కీలకపాత్ర వహించారు. శక్తిసింహ్ గోహిల్ అనే న్యాయవాది రాజ్యసభ ఎన్నికల పోలింగ్‌లో ఆ పార్టీ ఏజెంట్‌గా ఉన్నారు. ఇద్దరు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు (శంకర్‌సింహ్ వాఘేలా వర్గం) రఘ్వీజీ పటేల్, భోలా గోహిల్ ఓటు వేసిన అనంతరం ఆ బ్యాలెట్ పత్రాలను అమిత్‌షా, ఆ పార్టీ ఏజెంట్‌కు చూపించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ఘటన జరగ్గా ఈ విషయాన్ని శక్తిసింహ్ వెంటనే పార్టీ అధిష్ఠానానికి తెలియజేయటంతో పాటు సంబంధించిన వీడియో దృశ్యాలనూ సాక్ష్యంగా పంపించారు. ఓటింగ్ అనంతరం కాంగ్రెస్ బృందం ఎన్నికల అధికారులను కలిసి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని, వారి ఓట్లను రద్దు చేయాలని డిమాండ్ చేయడంతో అర్ధరాత్రి ఎన్నికల సంఘం ఆ రెండు ఓట్లుచెల్లవంటూ ప్రకటించింది.

### యూపీ శాసనమండలికి ఇద్దరు సభ్యుల రాజీనామా

**లఖ్‌నవూ:** సమాజ్‌వాదీ పార్టీలో ములాయంకు ప్రాధాన్యం దక్కడం లేదని పార్టీ ప్రధాన కార్యదర్శి , ఎమ్మెల్సీ అశోక్ బాజ్‌పాయ్ బుధవారం రాజీనామా ప్రకటించారు. బీఎస్పీకి చెందిన మరో ఎమ్మెల్సీ అంబికా చౌదరి సైతం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

### రెడ్డి హాస్టల్, గురుకులం నిర్మాణానికి పది ఎకరాలు

**ఈనాడు, హైదరాబాద్:** రాజేంద్రనగర్ మండలం బుద్వేలు గ్రామంలో రెడ్డి హాస్టలు, గురుకులం, వృద్ధాశ్రమం నిర్మాణానికి సర్వేనంబరు 324లోని పది ఎకరాల స్థలాన్ని రాజా బహదూర్ వెంకటరామ్‌రెడ్డి విద్యాసంస్థకు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఎకరానికి రూపాయి ధరతో కేటాయించినట్లు పేర్కొంది. రెడ్డి హాస్టలు, గురుకులం, వృద్ధాశ్రమం నిర్మాణానికి పదెకరాలను కేటాయించినందుకుగాను హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి సీఎంకేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర్వుల ప్రతిని బుధవారం ఆయన ఆర్‌బీవీఆర్ విద్యాసంస్థ ప్రతినిధులు ఎ.రఘుపతిరెడ్డి, ఎస్.ఇంద్రసేనారెడ్డిలకు అందజేశారు. త్వరలోనే భవన నిర్మాణాలకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

### నెలాఖరుకు టీఎస్‌పీఎస్సీ సభ్యుని పదవీ విరమణ

తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ సభ్యుడు టి.వివేక్ ఈనెల 29న పదవీ విరమణ పొందనున్నారు. కమిషన్ నిబంధనల మేరకు వయోపరిమితి 62 ఏళ్లు పూర్తవుతుందని ఆయన పదవీ విరమణకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### టీఎస్ఐపాస్ దరఖాస్తు నమూనాలో మార్పులు

సరళతర వాణిజ్య విధానంలో భాగంగా తెలంగాణ పారిశ్రామిక అనుమతులు, స్వీయధ్రువీకరణ విధానం(టీఎస్ఐపాస్) ఉమ్మడి దరఖాస్తు నమూనాను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని రకాల అనుమతులతో కూడిన సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు.

### కవితా సంకలనాన్ని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

'వృక్షమే మన దైవం'పేరిట కరీంనగర్ జిల్లా రచయిత నాగుల సత్యాగౌడ్ రాసిన కవితా సంకలనాన్ని మంత్రి కేటీఆర్ బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. 'పడుగుపేకల' పేరిట రూపొందిన కథా సంకలనాన్ని సైతం ఆయన ఈ సందర్భంగా విడుదల చేశారు.

### 'ఆధార్ లేదని ప్రభుత్వ ప్రయోజనాల నిరాకరణ తగదు '

**దిల్లీ:** ఆధార్ లేకపోవడం, గుర్తింపులో లోపాల వల్ల ప్రభుత్వ ప్రయోజనాలను నిరాకరించడాన్ని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించి చర్యలు తీసుకుంటామని బుధవారం ఉడాయ్ సీఈవో అజయ్ భూషణ్ పాండే తెలిపారు. భారత ప్రాధికార సంస్థ(ఉడాయ్) ఆధార్ సంఖ్యను కేటాయిస్తుంది. బోగస్ లబ్ధిదారులను తొలగిస్తున్నారనే ప్రచారంలో నిజం లేదన్నారు. కొందరు వ్యక్తులు ఆధార్‌పై ఉన్న అనుమానాలను వక్రీకరించి వదంతులు పుట్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆధార్ సాంకేతికత ప్రజలకు సాధికారత కలిగిస్తుందని, వారిని లబ్ధిదారులుగా తొలగించి, తిరస్కరించడం దీని ఉద్దేశం కాదన్నారు. ఆధార్‌లేని కారణంగా లబ్ధిదారులకు ప్రయోజనాలను అందించకపోతే దానిని నేరంగా పరిగణించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

### కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రూ.6.5 కోట్ల రుణం ఎగవేత

**నిందితుడు కేడియా అరెస్టు**

**ఈనాడు, హైదరాబాద్:** కోటక్ మహీంద్రా బ్యాంక్ నుంచి రూ.6.5 కోట్ల రుణం తీసుకుని మోసం చేసిన సుభాష్ కుమార్ కేడియాను సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పంజాగుట్టలో ఉంటున్న కేడీయా మెదక్ జిల్లాలోని ముప్పిరెడ్డిపల్లిలో కేబీఆర్ రోలింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌సంస్థను నిర్వహిస్తున్నాడు. పంజాగుట్టలోని కోటక్ మహీంద్ర బ్యాంక్ నుంచి గతేడాది రూ.6.5కోట్ల రుణాన్ని తీసుకున్నాడు. ఒక్క వాయిదా చెల్లించలేదు. సంస్థలో ఉన్న వస్తువులను అక్రమంగా తరలించాడు. విషయం తెలుసుకున్న బ్యాంకు ఉన్నతాధికారి మహ్మద్ ఇక్బాల్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సుభాష్ కుమార్ కేడియాను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

### ఆందోళన బాటలో విద్యుత్తు ఉద్యోగులు

**ఖైరతాబాద్, న్యూస్‌టుడే:** రాష్ట్రం విడిపోయినా విద్యుత్తు శాఖలో ఆంధ్రా ఉద్యోగుల కుట్రలు కొనసాగుతున్నాయని తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్ల సంఘం, తెలంగాణ విద్యుత్తు అకౌంట్స్ అధికారుల సంఘాలు ఆరోపించాయి. వారి కుట్రలను నిరసిస్తూ శుక్రవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంఘాల నేతలు శివాజీ, అంజయ్య బుధవారమిక్కడి ప్రెస్‌క్లబ్‌లో వెల్లడించారు.





# ఈనాడు

హైదరాబాద్ 10-8-2017 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 1

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi







## 4 భూమిని పోలిన కొత్త గ్రహాలు

లాస్ ఏంజిలెస్: పరిమాణంలో భూమిని పోలి ఉన్న నాలుగు కొత్త గ్రహాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. భూమికి 12 కాంతి సంవత్సరాల దూరంలో టావు సెటీ అనే సూర్యుడి తరహా నక్షత్రం చుట్టూ ఇవి తిరుగుతున్నట్లు అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు గుర్తించారు. ఏ పరికరం సాయం లేకుండా (మిగతా 2లో)

# ఐదేళ్లలో నవ భారత్

- పేదరికం, నిరక్షరాస్యత, అవినీతిల అంతం చూద్దాం
- 2022 నాటికి సరికొత్త దేశాన్ని తీర్చిదిద్దుదాం
- 1942 స్ఫూర్తి మళ్లీ మనలో రగలాలి
- కలిసి పనిచేద్దాం... సాధించి చూపిద్దామన్న ప్రధాని
- క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవంలో మోదీ పిలుపు



> కరేంగే యా మరేంగే (సాధిస్తాం లేదా ప్రాణాలర్పిస్తాం) అనే నినాదం క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రతిధ్వనించింది. ఇప్పుడు దీనినే 'కరేంగే ఔర్ కర్ కే రహేంగే' (మేం సాధిస్తాం తప్పకుండా చేస్తాం) అనే ప్రతిజ్ఞగా మార్చుకుని రుగ్మతల నుంచి దేశానికి విముక్తి కల్పిద్దాం
>
> – మోదీ

దిల్లీ

పీడిస్తున్న సమస్యల నుంచి దేశానికి విముక్తి కల్పించి, 2022 నాటికి సరికొత్త భారతావనిని తీర్చిదిద్దడానికి ప్రజలు ప్రతిజ్ఞ తీసుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా దినోత్సవ 75వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆయన లోక్‌సభలో అరగంట సేపు ప్రసంగించారు. అంతకుముందు ట్విటర్ లోనూ ట్వీట్లు చేశారు. మహాత్మాగాంధీ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారందరికీ ఆయన నివాళులర్పిస్తూ వారి నుంచి ప్రజలు స్ఫూర్తిని పొందాలన్నారు. అలాంటి ఉద్యమాల గొప్పతనాన్ని భవిష్య తరాలకు తెలియపరచడం ప్రస్తుత తరంపై ఉన్న బాధ్యత అని చెప్పారు. చారిత్రక ఉద్యమాలను స్మరించుకోవడం జాతికి ఎంతో బలాన్ని ఇస్తుందన్నారు. స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలన్న లక్ష్యంతో ఆనాడు జాతి అంతా ఒక్కతాటిపైకి వచ్చిందని గుర్తు చేశారు. '1942లో దేశానికి వలసవాదుల నుంచి విముక్తి కల్పించడానికి ప్రజలంతా పోరాడారు. ఇప్పుడు, 75 ఏళ్ల తర్వాత మనముందున్న సమస్యలు వేరు. పేదరికం, అపారిశుద్ధ్యం, అవినీతి, ఉగ్రవాదం, కులతత్వం, మతతత్వం, అవినీతి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పోషకాహార లేమి వంటి వర్తమాన సమస్యల నుంచి దేశాన్ని బయటకు తీసుకురావడం ప్రస్తుత అవసరం. మహిళా సాధికారతకు ఉన్న అవరోధాల్ని తొలగించుకోవాలి. తద్వారా సరికొత్త భారతావనిని సృష్టించుకుని, 2022 నాటికి మన కలల్ని సాకారం చేసుకుందాం. ఈ (మిగతా 2లో)

# సహకరించని చట్టం

RIGHT TO INFORMATION

- తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం గగనం
- తుది అప్పీలుకెళ్లాలంటే కమిషన్‌కు తాళం
- 'సహ' కమిషనర్ల నియామకాల్లో తీవ్ర జాప్యం.. వాటికోసం పైరవీలు

ఈనాడు – హైదరాబాద్

సమాచార హక్కు(సహ) చట్టానికి తెలుగు రాష్ట్రాల్లో చెదలు పట్టింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలుచేయడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం అందడం గగనమవుతోంది. గత 3 నెలలుగా సమాచార కమిషన్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. గత మే 14న చివరి కమిషనర్ విజయబాబు పదవీ విరమణ చేసిన తర్వాత కొత్త కమిషనర్ల నియామకాల్లేకపోవడంతో కమిషన్ కార్యాలయానికి దాదాపు తాళం వేసినట్లయింది. కొందరు కిందిస్థాయి ఉద్యోగులు కార్యాలయానికి వస్తున్నా వారికి అప్పీళ్లపై విచారణ అధికారాలేమీ లేకపోవడంతో ఖాళీగా కూర్చుంటున్నారు. రెండు రాష్ట్రాలకు సమాచార కమిషన్‌ను ఇంకా విభజించలేదు. ఇరు రాష్ట్రాలకు సంయుక్తంగా అప్పీళ్ల విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో సమాచార కమిషన్ ఏర్పాటు చేయడానికి ఇంకా స్థలం, భవనం ఏర్పాటుచేయలేదని, పైగా విభజించిన తర్వాత నూతనంగా కమిషన్ ఏర్పాటు (మిగతా 2లో)

# పునరుజ్జీవ సంబరం

- పోచంపాడు చేరుకున్న ముఖ్యమంత్రి
- ఎస్సారెస్పీ వద్ద నేడు శంకుస్థాపన

2లో

## భర్త బలవంత సంయోగాన్ని నేరంగా పరిగణించలేం

పార్లమెంటు ఇదివరకే దీనిపై చర్చించింది: సుప్రీంకోర్టు

16లో

## 'పునరుజ్జీవం'తో సస్యశ్యామలం

- ఏడాదిలోగా శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకాన్ని పూర్తిచేస్తాం
- గడువులోగా 'కాళేశ్వరం' పూర్తి
- 'ఈనాడు-ఈటీవీ'తో మంత్రి హరీశ్



2లో

## సింహం సింగిల్‌గానే వస్తుంది

- ఎవరితోనూ పొత్తు లేకుండానే గెలుస్తాం
- హరీశ్‌కు నాకు మధ్య రేసు లేదు
- 2029 వరకు కేసీఆరే మా బాస్
- నేరెళ్లలో పోలీసులు అతి చేశారు
- పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్



## ఇదీ సంగతి!



# రైతుల భూమిలో 'రాంకీ' రాళ్లు

- పట్టాదారులకు తెలియకుండా అక్రమ రిజిస్ట్రేషన్
- నకిలీ పత్రాలతో వెలిమినేడులో 100 ఎకరాల భూ బదలాయింపు
- నల్గొండ జిల్లా చిట్యాల మండలంలో భూబాగోతం
- 'ఈనాడు- ఈటీవీ' పరిశోధనలో వెల్లడి
- మధ్యవర్తుల వల్లే జరిగింది.. రాంకీ ప్రతినిధులు -2లో



నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పొలాల్లో రాంకీ సంస్థ నాటిన హద్దు రాళ్లు



# సింహం సింగిల్‌గానే వస్తుంది

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లోనూ తెరాస ఘన విజయం సాధిస్తుందని, ఏ పార్టీతో పొత్తు లేకుండా సునాయాసంగా గెలుస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ తెలిపారు. భాజపా నుంచి తమకు పోటీయే లేదని, ఇప్పుడున్న అయిదు స్థానాల్లోనూ ఆ పార్టీ ఓడిపోతుందన్నారు. రాష్ట్రంలో తెదేపా, వామపక్షాల ఉనికి లేదని చెప్పారు. మంత్రి హరీశ్‌రావుకు, తనకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, సీఎం పదవికి ఎలాంటి ఖాళీ లేదని, మా మధ్య ఎలాంటి రేసు లేదని, 2029 వరకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.



### తెలంగాణకు ఎన్డీయే చేసిందేం లేదు

"తెరాస బలంగా ఉంది. 50 శాతానికి పైగా ఓట్లు మాకు వస్తాయి కేసీఆర్ ఉన్నంత వరకు మాకు ఎదురు లేదని అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు. సింహం సింగిల్‌గానే వస్తుంది. భాజపాతో సహా ఏ పార్టీతోనూ మాకు పొత్తు అవసరం లేదు. రాష్ట్రపతి, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీపై అంశాలపై సిద్ధాంతపరంగా మద్దతు ఇచ్చాం తప్ప వేరే ఆలోచనే లేదు. తెలంగాణకు ఎన్డీయే ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఎయిమ్స్, ఐఐఎం, ఐఐటీఆర్, ప్రత్యేక హైకోర్టు, బయ్యారం ఉక్కు కర్మాగారం ఇలా ఏ ఒక్కటీ ఇవ్వలేదు.

### జీఎస్టీని తగ్గించాలి

జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలి లేదా పూర్తిగా మినహాయించాలి. ఒకే దేశం, ఒకే పన్ను ప్రజలందరికీ అనుకూలంగా ఉంటుందని ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీలు చెబితే నమ్మాం.. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపైనా పన్నులు వేస్తారనుకోలేదు. దీనివలన రూ. 19 వేల కోట్ల భారం పడుతుంది. హైదరాబాద్‌లో తదుపరి జీఎస్టీ మండలి సమావేశం జరుగుతుంది. అందులో ఈ సమస్యకు పరిష్కారం వస్తుందనుకుంటున్నాం.

### హరీశ్‌తో...

నాకు, హరీశ్‌కు మధ్య అన్ని అంశాలపైనా స్పష్టత ఉంది. మా ఇద్దరి కంటే ముఖ్యమంత్రి కేసీఆరే ఆరోగ్యంగా ఉన్నారు. హరీశ్‌రావు సిద్ధిపేట ప్రజలతో మమేకమయ్యారు. అందరు ఎమ్మెల్యేల కంటే ఎక్కువగా ఆయన తన నియోజకవర్గానికి వెళ్తుంటారు. ఆదివారమైనా సెలవు తీసుకోవాలని ఆయనను కోరినా వినడం లేదు.

### నేరెళ్లలో భయంకరంగా కొట్టారని బాధితులు చెప్పారు

నేరెళ్ల ఘటనలో పోలీసులు అతిగా వ్యవహరించారు. ఈ సంఘటన వివరాలు నాకు తెలియలేదు. కేసులు పెట్టిన విషయం, కస్టడీలోకి తీసుకొని కొట్టిన విషయం నాకు తెలియదు. ఘటన పూర్తిగా జరిగిన తర్వాతే మొత్తం వివరాలు తెలిశాయి. ఇందులో మా స్థానిక నాయకత్వ వైఫల్యం ఉంది. నేను జోక్యం చేసుకునేలోపే అక్కడికి రాజకీయ పర్యాటకులు ఎక్కువయ్యారు. ప్రజలను రెచ్చగొట్టారు. నేను వెళ్లి పరామర్శించాను. తమను భయంకరంగా కొట్టారని బాధితులు తెలిపారు. డీఐజీతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీజీపీ చెప్పారు. నేను రాజకీయాల్లో ఉన్నంత వరకు సిరిసిల్ల నుంచే పోటీ చేస్తా. ఇసుక మాఫియాను అరికట్టిన ఘనత మా ప్రభుత్వానిదే.

### నా కుమారుడిని తిట్టడం బాధ కలిగించింది

నాతోపాటు నా కుమారుడినిసైతం కొందరు నేతలు దూషించడం బాధ అని అనిపించింది. రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని బాధ అనిపించింది.

### హిమాన్ష్ మోటార్స్ కార్యకలాపాల్లేవు

2004లో అమెరికా నుంచి వచ్చిన తర్వాత పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అనే స్నేహితుడితో కలిసి సిద్ధిపేట వద్ద హిమాన్ష్ ట్రాక్టర్ యార్డును ఏర్పాటు చేశాం. రాజకీయాలపై దృష్టి పెట్టడం వల్ల దానికి నష్టం వచ్చింది. దీంతో 2011లోనే కార్యకలాపాలను నిలిపివేశాం. అది మూతపడిందని చెప్పినా కాంగ్రెస్ నేతలు రాజకీయం చేశారు. ట్రాక్టర్లు కొనే కంపెనీకి ఇన్నోవా కార్లు, బైక్‌లకు సంబంధం ఏముంటుంది?

### మెట్రోరైలు ప్రారంభం

మెట్రోరైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. నవంబరులో ఈ కార్యక్రమం కోసం ప్రధాని కార్యాలయాన్ని కోరాం. ఇంకా ఖరారు కాలేదు. త్వరలోనే ప్రైవేటుగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రాష్ట్రానికి మంజూరవుతుంది.

### సభ్యత్వాల డిజిటలైజేషన్

తెరాసలో 75 లక్షలమంది సభ్యులు చేరారు. వాటన్నింటిని డిజిటలైజ్ చేస్తున్నాం. ఫోటోలు, ఫోన్ నంబర్లు, చిరునామాలు నమోదు చేస్తున్నాం. మొత్తం 75 లక్షలమందికి ఒకేసారి సంక్షిప్త సందేశం పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తెరాస విద్యార్థి విభాగాన్ని పటిష్ఠం చేశాం" అని కేటీఆర్ తెలిపారు.

# 'పునరుజ్జీవం'తో సస్యశ్యామలం

ఈనాడు, హైదరాబాద్: గోదావరి నదిపై శ్రీరాంసాగర్ పునరుజ్జీవపథకంతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తక్కువ భూసేకరణతో పథకాన్ని పూర్తి చేసి.. వర్షాలతో సంబంధం లేకుండా రెండు పంటలకు సాగునీటిని అందిస్తామన్నారు. గోదావరి కింద తెలంగాణకు కేటాయించిన 221 టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. కాళేశ్వరంనుంచి మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలద్వారా ఎల్లంపల్లికి, అక్కడి నుంచి మధ్యమానేరుకు గోదావరిజలాలు తరలిస్తామన్నారు. కాళేశ్వరం ప్యాకేజీ 20, 21, 22, గుత్పా-అలీసాగర్, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల కింద భూములన్నీ సాగులోకి వస్తాయని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకోసం పనిచేస్తుంటే కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేస్తూ రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకాన్ని ప్రారంభించనున్న సందర్భంగా మంత్రి హరీశ్‌రావు 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు.



**■ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంతో తెలంగాణకు కలిగే ప్రయోజనాలేంటి?**

వర్షాభావ పరిస్థితులు, గోదావరిపై మహారాష్ట్ర నిర్మించిన ప్రాజెక్టులతో దిగువకు వరద ప్రవాహం తగ్గిపోయింది. ఎస్సారెస్పీ, మానేరు, కడెం ప్రాజెక్టులకు గోదావరి కింద 221 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. కానీ, ఇందులో 140 టీఎంసీలు వాడుకునే పరిస్థితి లేదు. నీళ్లు నిల్వచేసుకునే సామర్థ్యమూ లేదు. మరోవైపు రెణ్నెల్లుగా కాళేశ్వరం నుంచి దాదాపు 217 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోయింది. ఆ నీటిలో మేడిగడ్డ నుంచి రోజుకో టీఎంసీ చొప్పున ఎత్తిపోసి ఎస్సారెస్పీలోకి 60 టీఎంసీలను మళ్లించాలని నిర్ణయించాం. ఎల్లంపల్లి నుంచి వరద కాలువల ద్వారా మానేరుకు నీటిని తరలిస్తాం. వరదనీటి కాలువ నుంచి 15 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు లిఫ్టులను ఉపయోగించి పోచంపాడు, అక్కడి నుంచి ఎస్సారెస్పీకి నీటిని మళ్లిస్తాం. వచ్చే జూన్, జులై నాటికి రైతులకు సాగునీరివ్వాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

**■ పునరుజ్జీవ పథకం ఖర్చెంత? ఎప్పటిలోగా పూర్తవుతుంది?**

ఎలాంటి భూసేకరణ లేకుండా తక్కువ ఖర్చుతో వేగంగా పనులు చేస్తున్నాం. రూ.1000 కోట్లతో ఈ పథకాన్ని ఏడాదిలోగా పూర్తిచేస్తాం. వరద కాలువలు రిజర్వాయర్లుగా పనిచేస్తాయి. ఎస్సారెస్పీ ఎగువ 4.6 లక్షల ఎకరాలు, సరస్వతీ కాలువ కింద 35వేల ఎకరాలు, లక్ష్మీ కాలువ కింద 25వేల ఎకరాలు, నిర్మల్-ముథోల్‌లో లక్ష ఎకరాలు, అలీసాగర్ కింద లక్ష ఎకరాలు, కడెం కింద పూర్తి ఆయకట్టు, కాళేశ్వరం ప్యాకేజీ 20, 21, 22 కింద మరో 4లక్షల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. ఏడాదికి రెండు పంటలకు నీళ్లు అందించవచ్చు. ఐడీసీ కింద లక్ష ఎకరాలు సాగులోకి వస్తుంది. వరద కాలువ, కాకతీయ కాలువకు మధ్య లక్ష ఎకరాల బీడు మాగాణి అవుతుంది.

**■ ఎల్లంపల్లి నుంచి శ్రీరాంసాగర్‌కు రివర్స్ పంపింగ్ చేయాలని జీవన్‌రెడ్డి అంటున్నారు?**

ఆయనకు తెలిసో తెలియకో సగం ఆలోచనతో మాట్లాడుతున్నారు. ప్రభుత్వం అన్నిరకాలుగా అధ్యయనం చేసి ముందుకు వెళుతోంది. తెలంగాణలో గోదావరి నది 470 కి.మీ. మేర ప్రవహిస్తోంది. పునరుజ్జీవ పథకంతో 275 కి.మీ. ఎప్పటికీ సజీవంగా మారుతుంది. బ్యారేజీలు ఎక్కువై, ఎత్తు పెంచడంతో భూములు నీటమునుగుతాయి. అందుకే వరద కాలువను ఉపయోగించి ముంపు లేకుండా తక్కువ వ్యయంతో 11 నెలల్లోనే పథకాన్ని పూర్తిచేస్తాం.

**■ కేసులు వేయడాన్ని తప్పుపడుతున్నారు. మరి ప్రభుత్వమే జీఎస్టీపై న్యాయపోరాటం చేస్తామంటోంది కదా..?**

కేసులు వేయడం తప్పుకాదు. నష్టపోయిన రైతులు వేయాలి. కానీ, ఇక్కడ కాంగ్రెస్ నాయకులు వేస్తున్నారు. ఇటీవల ఓ రైతు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడి న్యాయవాది గంటకు రూ. 6లక్షలు తీసుకుంటారు. ఎకరాకు రూ.10లక్షల పరిహారం కోరే రైతు ఆ మొత్తం చెల్లించగలరా? అంటే వీరి వెనుక కాంగ్రెస్ నాయకులు ఉన్నట్లే కదా. న్యాయం కోసం కేసులు వేస్తే తప్పులేదు. కానీ, చనిపోయినవారి పేర్లతో వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్ని మభ్యపెడుతూ ప్రాజెక్టులను అడ్డుకుంటోంది. కోర్టుల చుట్టూ తిరగడం వల్ల ఇంజినీర్ల సమయం వృథా అవుతోంది. నష్టపోయిన రైతులు ఉంటే మానవతా దృక్పథంతో ఆలోచిస్తాం.

**■ కాళేశ్వరం ప్రాజెక్టును గడువులోగా పూర్తిచేస్తారా?**

కాళేశ్వరం ప్రాజెక్టును నూరుశాతం గడువులోగా పూర్తిచేస్తాం. ఐదేళ్లలో పూర్తయ్యే ప్రాజెక్టును 18నెలల్లోనే పూర్తిచేసేందుకు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ప్రపంచరికార్డును నెలకొల్పుతాం.

**■ తెలంగాణకు జాతీయహోదా ప్రాజెక్టుపై కేంద్రం మీద ఒత్తిడి తెస్తారా?**

తెలంగాణకు జాతీయహోదా ప్రాజెక్టు రాకపోవడానికి కాంగ్రెస్ కారణం. విభజన బిల్లులో పోలవరాన్ని చేర్చి, ప్రాణహితను మరిచారు. అప్పట్లోనే ప్రాణహితను బిల్లులో చేర్చాలన్నా పట్టించుకోలేదు. తెలంగాణ ప్రాజెక్టుకు జాతీయహోదా కోసం కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొస్తాం.

# మూసీ పనులు వేగవంతం చేయండి: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: మూసీనది సుందరీకరణలో భాగంగా రూ. 1,665 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. రెండు ప్యాకేజీల్లో భాగంగా ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. బుధవారం సచివాలయంలో పురపాలకశాఖ ఉన్నతాధికారులు, మూసీ అభివృద్ధి కార్పొరేషన్ అధికారులతో ఆయన మూసీ సుందరీకరణపై చర్చించారు. తొలి ప్యాకేజీలో రూ. 956కోట్లు, రెండో ప్యాకేజీలో రూ.709కోట్లు వ్యయం చేయనున్నట్లు వివరించారు. ఈ నిధులకు ప్రభుత్వం ఇప్పటికే పరిపాలనపరమైన అనుమతి ఇచ్చిందన్నారు. గుజరాత్‌లోని సబర్మతి నదీ తీరప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్లు మూసీ అభివృద్ధిప్రాజెక్టు అమలు చేస్తామన్నారు. అనుమతులు ఇప్పటికే వచ్చిన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో పురపాలకశాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్ పాల్గొన్నారు.

# ఐదేళ్లలో నవ భారత్

(మొదటి పేజీ తరువాయి)

రుగ్మతలన్నింటి నుంచీ దేశానికి పూర్తి స్వాతంత్ర్యం లభించనిదే నాకు సంతృప్తి అనిపించదు. అయితే దీని కోసం మనం అహింసా మార్గాన్ని విడనాడకూడదు' అని ఆయన చెప్పారు. ఎంపీలంతా విభేదాలను పక్కనపెట్టి, ఉమ్మడి ప్రయత్నానికి ముందుకు రావాలని కోరారు. అన్ని రాజకీయ పక్షాలూ, అన్ని రాష్ట్రాలూ కలిసి వస్తు-సేవల పన్ను (జీఎస్టీ)కు చట్ట రూపం తీసుకువచ్చినట్లే ఇప్పుడు సమస్యల నుంచి దేశాన్ని బయటకు తీసుకురావడంలోనూ అదే విధంగా వ్యవహరించాలన్నారు.

### భుజం భుజం కలుపుదాం

'సంకల్పం నుంచి సిద్ధి వరకు' అనే నినాదాన్ని ఆయన ఇస్తూ- మన స్వాతంత్ర్య సమరయోధులు గర్వపడేలా దేశాన్ని తీర్చిదిద్దడానికి భుజం భుజం కలపాలని ప్రధాని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే కాకుండా ఆఫ్రికా, ఆసియా వంటి ఇతర ప్రాంతాల్లోని వలసవాదానికి స్వస్తి పలికే ఉద్యమంగా భారత స్వాతంత్ర్య సంగ్రామం నిలిచిపోయిందని చెప్పారు. 1857 నుంచి 1942 వరకు జరిగిన పోరాటం ఒక ఎత్తయితే, ఆ తర్వాతి అయిదేళ్లు జరిగింది గొప్ప పరిణామంగా నిలిచిపోయి లక్ష్యాన్ని సాధించిందని వివరించారు. ఆ సమరంలో మహాత్మాగాంధీ వంటి సీనియర్ నేతలు జైళ్లపాలైతే ఆ లోటును భర్తీ చేసి, ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి సరికొత్త నాయకుల తరం ఆవిర్భవించిందని చెప్పారు. 'ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ కాదు' అనే కసితో సమాజంలో అన్నివర్గాలూ ఒక్కతాటిపైకి వచ్చి లక్ష్యాన్ని చేరుకున్నాయని తెలిపారు. 1942లో ప్రపంచ పరిస్థితులు భారత్‌కు ఎలా అనుకూలంగా ఉన్నాయో ఇప్పుడూ అదే వాతావరణం ఉందని చెప్పారు. ఆనాటి పోరాటంలో మహిళలు పోషించిన పాత్రను మోదీ కొనియాడుతూ- ఉమ్మడి లక్ష్యసాధనలో ఇప్పుడూ వారెంతో బలాన్ని జోడించగలరని పేర్కొన్నారు. 1942 నుంచి 1947 మధ్య దేశంలో ఎలాంటి స్ఫూర్తి పరిఢవిల్లిందో ఇప్పుడు 2017 నుంచి 2022 మధ్య అలాంటి స్ఫూర్తినే మళ్లీ పుణికిపుచ్చుకుని, బలమైన సంకల్పంతో సానుకూల మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇలాంటి సానుకూల మార్పులతో అనేక ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుద్దామన్నారు. హక్కులతో పాటు బాధ్యతల్నీ గుర్తెరిగి, వాటిని జీవన విధానంగా మలచుకోవాలని చెప్పారు.

### ప్రజాస్వామ్యం బలోపేతం కావాలి

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి సాక్షిగా మన ప్రజాస్వామ్యం, లౌకికవాదం బలోపేతం కావాలని పార్లమెంటు ఆకాంక్షించింది. క్విట్ ఇండియా ఉద్యమం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం పార్లమెంటు ఉభయ సభలు ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుని, నేతల త్యాగ నిరతిని కొనియాడాయి. వారికి ఘనంగా నివాళులర్పించాయి. వలసవాద పాలన నాటి రోజులు ఇప్పుడూ కనిపిస్తున్నాయని కొందరు విపక్ష నేతలు తమ ప్రసంగాల్లో ఆరోపించారు. నాలుగు గంటల పాటు చర్చ తర్వాత లోక్‌సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. మహాత్మాగాంధీ, ఇతర సమరయోధులు కలలుకన్న జాతిని రాబోయే అయిదేళ్లలో నిర్మించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తామనీ, 125 కోట్ల మంది దేశ ప్రజల తరఫున దానిలో పేర్కొన్నారు. తమిళం, తెలుగు సహా అన్ని భారతీయ భాషల్నీ జాతీయ భాషలుగా గుర్తించి, అధికారిక హోదా కల్పించాలని ఉప సభాపతి ఎం.తంబిదురై డిమాండ్ చేశారు. రాజ్యసభలో మూడు గంటలపాటు చర్చ తర్వాత ఒక తీర్మానాన్ని ఆమోదించారు. బలమైన, స్వయం సమృద్ధ, లౌకిక, ప్రజాతంత్ర భారతదేశాన్ని నిర్మించడానికి సభ్యులు ప్రతినబూనారు. 'హిందూ పాకిస్థాన్'ను ఏర్పాటు చేసే ప్రయత్నాలు తగవని సీతారాం ఏచూరి (సీపీఎం) చెప్పారు.

# భూమిని పోలిన 4 కొత్త గ్రహాలు

(మొదటి పేజీ తరువాయి)

సాధారణంగానే మానవులు ఈ నక్షత్రాన్ని చూడవచ్చని తెలిపారు. ఈ కొత్త గ్రహాల ఉపరితలంపై ద్రవరూపంలోనే నీరు ఉండేందుకు అవకాశాలున్నాయని వారు వెల్లడించారు. కనీసం భూమికి 1.7 రెట్లు ఎక్కువ ద్రవ్యరాశితో ఈ గ్రహాలున్నాయని.. ఇప్పటివరకూ సూర్యుడి తరహా నక్షత్ర కుటుంబాల్లో కనుగొన్న గ్రహాల్లో అతి చిన్నవి ఇవేనని తెలిపారు. టావు సెటీ గమనంలో చోటు చేసుకుంటున్న కదలికలను విశ్లేషించడం ద్వారా వీటిని గుర్తించినట్లు పేర్కొన్నారు. సెకనుకు 30 సెం.మీ.లు లాంటి సున్నితమైన కదలికలను సైతం పసిగట్టగల సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఇది సాధ్యమైనట్లు వివరించారు. భూమి లాంటి గ్రహాల అన్వేషణకు సంబంధించి ఇది ఒక మైలురాయిగా వారు అభివర్ణించారు.

# సహకరించని చట్టం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నట్లు నోటిఫికేషన్ కూడా ఇవ్వనందున ఇప్పట్లో కొత్త కమిషనర్ల నియామకాలేమీ ఉండవని ఏపీ సాధారణ పరిపాలనా శాఖ వర్గాలు 'ఈనాడు'కు తెలిపాయి. ఇక తెలంగాణ ప్రభుత్వం ఇంతకాలం కమిషనర్ల నియామకాల గురించి పట్టించుకోకపోయినా 6 వారాల్లో నియమిస్తామని తాజాగా హైకోర్టుకు తెలిపింది. ఈ పదవులను రాష్ట్రప్రభుత్వం నేరుగా నామినేటెడ్ విధానంలో నియమిస్తున్నందున పలువురు పెద్దయెత్తున రాజకీయంగా పైరవీలు చేయిస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్, ఇతర శాఖల ఉన్నతాధికారులు వీటికి పోటీపడుతున్నారు. విశ్రాంత ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఒకరు ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ) పోస్టు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మీడియా, వివిధ సంస్థలకు చెందిన వారు సైతం పోటీపడుతున్నారు.

**విశ్రాంత అధికారులతో తిప్పలే:** గతంలో సమాచార కమిషనర్ల నియామకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిగా వ్యవహరించడం వల్ల సహ చట్టం సరిగా అమలుకాలేదు. పైరవీలతో కమిషనర్లుగా నియమితులైన వారు ప్రజలకు న్యాయం చేయలేదు. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో నేరుగా సీఎం పరిధిలో ఉండే సాధారణ పరిపాలనా శాఖ నుంచి ప్రజలకు సమాచారం సులభంగా అందదు. దీని నుంచి సమాచారం రాకపోతే సమాచార కమిషన్‌ను ఆశ్రయించినా సకాలంలో న్యాయం జరగదు. ఈ కమిషన్‌లో పది మంది కమిషనర్లు ఉండాలని సహ చట్టం చెబుతోంది. గత పుష్కర కాలంలో కమిషనర్లుగా నియమితులైన వారిలో విశ్రాంత ఉన్నతాధికారులకే సాధారణ పరిపాలనాశాఖపై వచ్చే అప్పీళ్ల విచారణ బాధ్యతలను సీఐసీలు అప్పగించారు. ఇతర వర్గాల నుంచి నియమితులైన కమిషనర్లకు సాధారణ పరిపాలనాశాఖ అప్పీళ్ల విచారణ బాధ్యతలిస్తే కచ్చితంగా సమాచారం ఇవ్వాలని తీర్పులిచ్చే ప్రమాదముందని ప్రభుత్వాలు ముందు జాగ్రత్తగా తాము కమిషనర్లుగా నియమించిన విశ్రాంత అధికారులకే ఈ శాఖపై విచారణ అధికారం ఉండేలా చూసుకున్నాయి. విశ్రాంత అధికారులను కమిషనర్లగా నియమించవద్దని, వారు ప్రభుత్వాన్ని నిగ్గదీసి ప్రజలకు సమాచారం ఇప్పించడం లేదని, వారికి పునరావాస కేంద్రంలా కమిషన్‌ను మార్చకుండా రెండు తెలుగు రాష్ట్రాలు శ్రద్ధ చూపాలని విశ్రాంత సమాచార కమిషనర్ ఒకరు అభిప్రాయపడ్డారు.

**పీఐఓలు ఆడింది ఆట:** ప్రభుత్వాలకే సహ చట్టం అమలుపై ఆసక్తి లేకపోవడంతో కిందిస్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లోని 'ప్రజా సమాచార అధికారులు'(పీఐఓ)లు ప్రజల దరఖాస్తులను పట్టించుకోవడం లేదు. ప్రజలు ఏదైనా కార్యాలయంలో సమాచారం కోసం దరఖాస్తు చేస్తే 30 రోజుల్లోగా ఇవ్వాలి. ఈ గడువులో పీఐఓ ఇవ్వకపోతే సహ చట్టం అమలుకు మొదటి అప్పిలేటుగా ఉండే అదే కార్యాలయ అధిపతిగా వ్యవహరించే ఉన్నతాధికారి సమాచారం ఇప్పించాలి. అక్కడా స్పందన లేకపోతే చివరి అప్పీలుగా కమిషన్‌ను ఆశ్రయించాలి. కానీ కమిషన్‌కే తాళం వేసినందున తమనెవరు ప్రశ్నిస్తారని పీఐఓలు, మొదటి అప్పిలేటు అధికారులు ప్రజలను పట్టించుకోవడం లేదు.

### పౌర సమాజం నుంచి నియమించాలి

సమాచార కమిషన్ పక్కాగా పనిచేయాలన్నా, చట్టం అమలుకావాలన్నా కమిషనర్లుగా పౌర సమాజం నుంచి మేధావులను, నిజాయితీపరులను నియమించాలి. న్యాయ వ్యవస్థ నుంచి వచ్చిన వారు సైతం కచ్చితంగా ఇప్పించగలరు. రాజకీయ నేతలను, విశ్రాంత అధికారులను, పైరవీకారులను నియమిస్తే కమిషన్ ఉన్నా లేనట్టే అన్నతీరుగా మారుతుంది.

–విజయబాబు, విశ్రాంత సమాచార కమిషనర్

# రైతుల భూమిలో 'రాంకీ' రాళ్లు!

ఈనాడు, నల్గొండ: ఇదే గ్రామంలోని ఏరుకొండ సాయిలు, కర్దూరి నర్సమ్మతో పాటు మరో 26 మంది రైతులదీ ఇదే పరిస్థితి. కొందరు దళారులు, రిజిస్ట్రేషన్ అధికారులు కాసుల కక్కుర్తితో కార్పొరేట్ కంపెనీ రాంకీ సంస్థకు ఈ భూములను అప్పగించారు. పట్టాదారులకు తెలియకుండా నకిలీ పత్రాలు సృష్టించి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సహకారంతో విలువైన భూములను అప్పనంగా రాయించేశారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు, గుండ్రాంపల్లిలో 'ఈనాడు-ఈటీవీ' బృందం పరిశోధనలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.



నకిలీ పత్రాలతో తమ పొలాలను రాంకీ సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకుందని పత్రాలను చూపిస్తున్న వెలిమినేడు రైతులు

### వంద ఎకరాలకు పైగా అక్రమ రిజిస్ట్రేషన్

చిట్యాల మండలంలోని వెలిమినేడు, గుండ్రాంపల్లి, సంకినిపల్లి గ్రామాల్లోని దాదాపు 1400కుపైగా ఎకరాలను 2011-12లో రాంకీ సంస్థ వివిధ అవసరాల కోసం రైతుల నుంచి కొనుగోలు చేసింది. సంస్థ తరఫున కొందరు మధ్యవర్తులు భూ లావాదేవీలు జరిపారు. కొందరు స్థానిక గ్రామాలకు చెందిన వారు కాగా... మిగిలిన వారు సంస్థ ఉద్యోగులు. వెలిమినేడు గ్రామానికి చెందిన రైతుల భూములను కొనుగోలు చేసేటపుడు ఆ భూమి చుట్టుపక్కల ఉన్న భూములను కూడా సదరు రైతులకు తెలియకుండా చౌటుప్పల్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా ఒక్క వెలిమినేడు గ్రామంలోనే దాదాపు 30 మంది రైతుల నుంచి సుమారు వంద ఎకరాలకు పైగా నకిలీ పత్రాలు సృష్టించి మధ్యవర్తులు రాంకీ సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ మధ్య సంస్థ ప్రతినిధులు ఈ భూములు తమవేనని రాళ్లు పాతడంతో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది. గుండ్రాంపల్లిలోనూ ఇలా 40 ఎకరాలకు పైగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు సమాచారం.

### అధికారుల సహకారం

చౌటుప్పల్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2012 ప్రాంతంలో పనిచేసిన ఓ మహిళా అధికారి ఈ భూబాగోతంలో కీలక పాత్ర పోషించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఆ అధికారి సహకారంతోనే దళారులు నకిలీ దస్తావేజులు సృష్టించి తమ భూములను రాంకీ సంస్థ పేరుతో రాయించినట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో వెలిమినేడు గ్రామానికి చెందిన ఇద్దరు రాంకీ సంస్థకు సహకరించినట్లు సమాచారం. సదరు సంస్థ ఈ భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందినట్లు తెలిసింది. అందుకే వాటిని ఇప్పటికిప్పుడు మళ్లీ రైతులకిచ్చేయాలంటే కుదరనిపని అని సంబంధిత రాంకీ సంస్థ ప్రతినిధులు 'ఈనాడు'కు వెల్లడించారు.

### 18 ఎకరాలు రాసేసుకున్నారు

మా తండ్రి, మా చిన్నాన్నకు కలిపి మొత్తం 18 ఎకరాలు ఉంది. ఈ మొత్తం భూమిని రాంకీ సంస్థకు అమ్మినట్లు రిజిస్ట్రేషన్ ఉంది. మేం ఒక్క ఇంచు భూమిని కూడా ఎవరికీ అమ్మలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఎల్లంల లక్ష్మయ్య, వెలిమినేడు

### మా దృష్టికి వచ్చింది

కొందరు మధ్యవర్తుల వల్లే ఇది జరిగింది. 40 ఎకరాల వరకు ఇలా (అక్రమ రిజిస్ట్రేషన్) జరిగిందని మా దృష్టికి వచ్చింది. వీలైనంత తొందరలో అందరికీ న్యాయం చేస్తాం.

– శ్రీధర్‌రెడ్డి, సీఈవో, రాంకీ సంస్థ



ఈ రైతు పేరు మెట్టు యాదయ్య. వెలిమినేడులో ఇతనికి సర్వే నెంబరు 665లో 8.15 ఎకరాల భూమి ఉంది. చీమల మల్లేశం నుంచి 2003లో తన భార్య అమృత పేరుతో యాదయ్య ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇదే భూమిని 2011లో చీమల మల్లేశం తమకు అమ్మినట్లుగా కాగితాలు సృష్టించి రాంకీ సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఇటీవల 'రాంకీ' సంస్థ ప్రతినిధులు వచ్చి ఈ భూమి తమదని రాళ్లు పాతేవరకు తన భూమి రాంకీ సంస్థ పేరుమీద ఉందని యాదయ్యకు తెలియకపోవడం గమనార్హం.



ఇతని పేరు మిర్యాల మల్లయ్య. ఇతనికి, సోదరుడు యాదయ్యకి కలిపి సర్వే నెంబరు 669లో 7 ఎకరాలు ఉంది. దీనిని 1996లో చంద్రశేఖర్ అనే వ్యక్తి నుంచి కొన్నారు. మల్లయ్య 2012లో ఈ భూమిని తమకు అమ్మినట్లుగా రాంకీ సంస్థ తరఫున నకిలీ పత్రాలు సృష్టించి చౌటుప్పల్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. 2011 నుంచి 2016 వరకు ఇతను ఇక్కడ లేడు. బతుకుదెరువుకు సౌదీ వెళ్లి ఆరు నెలల క్రితమే తిరిగొచ్చాడు. 'తన పేరుతో దొంగ వేలిముద్ర వేసి అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నార'ని మల్లయ్య 'ఈనాడు'తో వాపోయారు.



# పునరుజ్జీవ సంబురం

ఈనాడు, నిజామాబాద్: తెలంగాణలో మరో ప్రతిష్ఠాత్మక పథకానికి శ్రీకారం చుట్టుకుంటోంది. పూడికతో వట్టిపోతున్న శ్రీరాంసాగర్‌కు పూర్వకళ తీసుకువచ్చే బృహత్తరమైన పునరుజ్జీవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ఉదయం శంకుస్థాపన చేయనున్నారు. మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం వరకూ గోదావరి నదిలోనే రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని తరలించనున్నారు. ఎస్సారెస్పీ నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీలు కాగా జలాశయంలో పూడిక పెరిగిపోయి 90 టీఎంసీలకు పడిపోయింది. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం, గోదావరిపై మహారాష్ట్రలో విచ్చలవిడిగా నిర్మించిన బ్యారేజీల కారణంగా ఎస్సారెస్పీకి నీటి చేరిక తగ్గిపోవడంతో 9.10 లక్షల ఆయకట్టుపై పెనుప్రభావం చూపుతోంది. రెండో పంటకు ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీకి పూర్వ కళ తీసుకురావాలంటే మేడిగడ్డ నుంచి 60 టీఎంసీల నీటిని తరలించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనివల్ల ఆయకట్టు కింద ఖరీఫ్ సాగు సకాలంలో ప్రారంభమవుతుందని, ఈలోపు సెప్టెంబరు, అక్టోబరులలో గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు జలాశయంలోకి చేరి రబీ అవసరాలు తీరుతాయని ప్రభుత్వం పునరుజ్జీవం క్రతువుకు శ్రీకారంచుట్టింది. దీనికోసం సీఎం కేసీఆర్ బుధవారం సాయంత్రమే పోచంపాడు చేరుకున్నారు. రాత్రి ఎస్సారెస్పీ అతిథిగృహంలో బస చేశారు.

### ఇదీ ప్రణాళిక

- ■ ఎల్లంపల్లి నుంచి నందిమేడారం చెరువు ద్వారా వరద కాలువలోకి నీటిని సరఫరా చేస్తారు.
- ■ రోజుకు ఒక టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 60 టీఎంసీల నీటిని వరద కాలువ ద్వారా ఎస్సారెస్పీ జలాశయంలోకి మళ్లిస్తారు.
- ■ రూ. 1,091 కోట్ల వ్యయంతో వరద కాలువలో మూడుచోట్ల ఆనకట్టలు నిర్మిస్తారు.

### 11 గంటలకు శంకుస్థాపన

- ■ ముఖ్యమంత్రి గురువారం ఉదయం 11 గంటలకు మొప్కాల్ గ్రామంలోని వరద కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు.
- ■ మధ్యాహ్నం 1.10కి మొప్కాల్ చేరుకొని బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- ■ 3 గంటలకు హైదరాబాద్ బయల్దేరుతారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింది భాగం నుంచి పారుతున్న కాకతీయ కాలువ

ఎస్సారెస్పీ పునరుజ్జీవ శంకుస్థాపన కార్యక్రమానికి నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, సూర్యపేట జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులను తరలించేందుకు తెరాస నేతలు ఏర్పాట్లు చేశారు. సభను విజయవంతం చేసే బాధ్యతను మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు తీసుకున్నారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి,లతో సమావేశాలు నిర్వహిస్తూ జనసమీకరణకు ప్రణాళికలు రూపొందించారు.

### వర్షాలపై సీఎం ఆనందం

ఈనాడు, హైదరాబాద్: వరుణ దేవుడు కరుణించాడని, బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో సాగునీటి కరవు తీరుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనందం వ్యక్తంచేశారు. వానలతో పంటలకు పూర్తి భరోసా వచ్చినట్లేనన్నారు. బుధవారం ఆయన వర్షాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. వర్షాభావం వల్ల ఆందోళనగా ఉన్న తరుణంలో బుధవారం కురిసిన వానలు ఊరటనిచ్చాయని కేసీఆర్ అన్నారు. కర్ణాటక ప్రాజెక్టులు నిండడం వల్ల తెలంగాణకు అక్కడి నుంచి నీరు చేరుతుందని చెప్పారు. అనంతరం పోచంపాడు బయలుదేరి వెళ్లారు.

## గ్రహం అనుగ్రహం

**10–8–2017 గురువారం**

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం శ్రావణమాసం; **తదియ:** రా. 11-33తదుపరి చవితి; **శతభిషం నక్షత్రం:** ఉ. 6-06 తదుపరి పూర్వాభాద్ర
**అమృతఘడియలు:** రా. 10-16 నుంచి 11-53 వరకు
**వర్జ్యం:** మ. 12-31 నుంచి 2-07 వరకు
**దుర్ముహూర్తం:** ఉ. 9-59 నుంచి 10-49 వరకు తిరిగి మ. 3-03 నుంచి 3-54 వరకు
**రాహుకాలం:** మ. 1-30 నుంచి 3-00 వరకు
**సూర్యోదయం:** ఉ. 5-45; **సూర్యాస్తమయం:** సా. 6-26

## వాతావరణం

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
| --- | --- | --- |
| ఆదిలాబాద్ | 21.5 | 30.5 |
| హైదరాబాద్ | 21.8 | 24.8 |
| నిజామాబాద్ | 24.0 | 28.0 |
| కరీంనగర్ | 24.0 | 33.0 |
| మహబూబ్‌నగర్ | 24.5 | 27.4 |
| ఖమ్మం | 25.0 | 31.0 |

# ఉపరాష్ట్రపతి పదవిని ప్రజలకు చేరువ చేస్తా

- అభివృద్ధే దేశ అజెండాగా ఉండాలి
- వ్యవస్థలో మార్పులుచేర్పుల అవకాశాలపై దృష్టిపెడతా
- వెంకయ్యనాయుడు వ్యాఖ్యలు

ఈనాడు – హైదరాబాద్



విలేకరులతో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు

'మనసులో ఉన్నది దాచుకోకుండా చెప్పడం నాకు అలవాటు. కొత్త బాధ్యతల్లోకి వెళ్లాక ఇలా ఉండటం కష్టమే. రాజకీయాలు మాట్లాడే అవకాశం ఉండదు. మాట్లాడను కూడా. అయితే దేశానికి అవసరమైన విషయాలను మాట్లాడకూడదన్న నియమం లేదు. అధికారులను సంప్రదించి, పాత సంప్రదాయాలను గుర్తుపెట్టుకుంటూ ఉపరాష్ట్రపతి పదవిని కూడా ప్రజలకు ఉపయోగపడే విధంగా, చేరువయ్యేలా వ్యవస్థలో మార్పులుచేర్పులు చేసేందుకు ఉండే అవకాశాలపై దృష్టిపెడతా' అని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా సభా గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుతూనే ఉపరాష్ట్రపతి పదవికి వన్నె తెస్తానన్నారు. రాజ్యసభలో అర్థవంతమైన చర్చలు జరిగేలా సభ నడిపిస్తానని.. సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్‌హుస్సేన్ వంటి మాజీ ఉపరాష్ట్రపతులు సభను నడిపించిన తీరు అధ్యయనం చేస్తానని చెప్పారు. హైదరాబాద్‌లో బుధవారం ఉదయం పాత్రికేయులతో ఆత్మీయసమావేశంలో వెంకయ్యనాయుడు మాట్లాడారు. దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అందరూ కలిసిపనిచేయాలని, దేశం అజెండా అభివృద్ధి కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్య్రం వచ్చి 69 సంవత్సరాల తర్వాత కూడా దేశంలో ఇంకా పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక అసమానతలు, దళితులపై సాంఘిక వివక్ష ఉండటం బాధాకరమన్నారు. ఈ సమస్యలపై అందరూ ఆలోచించి సమాధానం కనుక్కోవాలని, కొత్త బాధ్యతలో తన వంతుగా ప్రయత్నం చేస్తానని చెప్పారు.

*జనంలో తిరగడం మహా ఇష్టం*

'నాకు పని అంటే, మీటింగ్‌లకు వెళ్లడం అంటే సరదా. దేశవ్యాప్తంగా 623 జిల్లాల్లో పర్యటించా. తెలుగురాష్ట్రాల్లో ఒక్కో జిల్లాలో కనీసం 20 సార్లు తిరిగిఉంటా. జనంలో తిరగడం, జనంలో ఉండటమంటే మహా ఇష్టం. చిన్నప్పుడే మా తాతగారు అనేవారు వీడికి అరికాళ్లలో చక్రం ఉందని.. ఒకచోట ఉండకుండా తిరుగుతుంటాడని.. .ప్రజాజీవితంలో తిరిగితే అరిగిపోరు. కరిగిపోరు. పెరిగిపోతారన్న విషయాన్ని నేను నేర్చుకున్నా. నా దృష్టిలో అన్ని రాష్ట్రాలూ ఒకటే. అయితే తెలుగురాష్ట్రాలకు ఏం చేయాలన్నది నా మనసులో ఉంది. చేయాల్సినవి తప్పకుండా చేస్తా.

వాడుక భాషలో కేసీఆర్ దిట్ట. నాదెండ్ల భాస్కర్‌రావు-ఎన్టీఆర్ ఎపిసోడ్ తర్వాత నాదెండ్లతో ఏనాడూ మాట్లాడలేదు. ఆయన ఎదురుపడినా నమస్కారం చేయను. సీపీఐ నారాయణతో మాట్లాడతాను కానీ నాదెండ్లతో మాట్లాడను. 20 ఏళ్లు ఎంపీగా పనిచేసిన వ్యక్తి ఉపరాష్ట్రపతి కావడం దేశంలో ఇదే తొలిసారి. ఉపరాష్ట్రపతిగా ఉండాలని అరునెలల నుంచే నాకు చెబుతూ వచ్చారు. ఉపరాష్ట్రపతిగా నా పేరు ప్రకటించినప్పుడు కన్నతల్లిలాంటి పార్టీకి దూరమవుతున్నానని కన్నీళ్ల పర్యంతమవుతుంటే అరుణ్‌జైట్లీ ఓదార్చారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించగానే.. మంత్రిపదవికి రాజీనామా చేశా. రాజ్యసభ సభ్యత్వం వదులుకునేందుకూ సిద్ధమయ్యా. ఓటింగ్ వరకు ఉండాలని అమిత్‌షా సూచించడంతో ఆగాను. దక్షిణాదిలో సామాన్యకుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిని. అప్పట్లో హిందీ సరిగా రాదు. అయినా దేశంలో అధికారంలో ఉన్న పార్టీకి అధ్యక్షుడిని అవడం సాధారణ విషయం కాదు. విలేకరులు, యాజమాన్యాలతో ప్రైవేటుగా స్నేహం చేసే అలవాటు నాకు లేదు. రాంనాథ్ గోయెంకా, నార్ల వెంకటేశ్వరావు, రామోజీరావుపై గౌరవం ఉంది. వీరు విలువలు పాటించే వ్యక్తులు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వవైఖరితో విభేదించి గట్టిగా నిలబడిన వారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య, తెన్నేటి విశ్వనాథం వంటి వారేం చెప్పేది విన్నాను. నా జీవిత విజయంలో మీడియాపాత్ర కూడా ఉంది. ఎన్నటికి మరిచిపోలేను. హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నా. జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ హైదరాబాద్‌లో ఉన్నా. వడివడిగా నడవడం,వేగంగా పనిచేయడం నాకు అలవాటు. రాజకీయాల్లో వారసత్వం ఉండొద్దు. మా పిల్లలు నా సలహా అడిగితే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహించను' అని వెంకయ్య తన అభిప్రాయాలను పంచుకున్నారు.



వెంకయ్య నాయుడుని సత్కరిస్తున్న తెదేపా నేతలు రమణ, మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖరరెడ్డి తదితరులు

## వెంకయ్యకు తెదేపా నేతల అభినందన

**ఈనాడు, హైదరాబాద్:** ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడిని తెలుగుదేశం తెలంగాణ పార్టీ నేతలు అభినందించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ, నేతలు రేవంత్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖరరెడ్డి, అరవిందకుమార్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లోని వెంకయ్య నివాసానికి వెళ్లి జ్ఞాపికను బహూకరించి అభినందనలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు, దేశానికి ఆయన ఎంతగానో సేవలు చేశారని రమణ కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మోత్కుపల్లి భుజం తట్టి "మీకు అభినందనలు" అని ప్రత్యేకంగా చెప్పారు. ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా మోత్కుపల్లి వెళతారని కొంతకాలం ప్రచారం జరుగుతోంది. త్వరలో 9 రాష్ట్రాలకు గవర్నర్లను కేంద్రం నియమించనుందని, ఇందులో మోత్కుపల్లికి సైతం చోటు దక్కే అవకాశముందని తెదేపా నేతలు అభినందించారు.





# జీవచ్ఛవాల్లా బతుకుతున్నాం

- ఇసుక రవాణాను పూర్తిగా నిలిపేయాలి
- ఎస్పీ, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలి
- విలేకరులతో నేరెళ్ల బాధితులు



విలేకరులతో మాట్లాడుతున్న నేరెళ్ల బాధితులు

**సిరిసిల్ల:** ఇసుకలారీల దహనంతో సంబంధం లేని తమపై కుట్రపూరితంగా అక్రమంగా కేసులు నమోదుచేసి.. నాలుగురోజులు చిత్రహింసలపాలు చేయడంతో జీవచ్ఛవాల్లా మారిపోయామని నేరెళ్లలో పోలీసుల చేతిలో గాయపడిన బాధితులు వాపోయారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు బాణయ్య, హరీష్ తదితరులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ మంగళవారం వచ్చి పరామర్శించినప్పుడు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించామన్నారు. ఎస్పీ, సీసీఎస్ పోలీసులు 4 రోజులపాటు కుటుంబసభ్యులను కూడా చూడనీయకుండా చిత్రహింసలకు గురిచేశారని.. కులంపేరుతో దూషించారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. తమకు జరిగిన అన్యాయాన్ని దేశం, రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు ఖండిస్తుండడంతో అధికార పార్టీ అభాసుపాలవుతుందనే ఉద్దేశంతోనే ఇన్నిరోజుల తర్వాత మంత్రి అకస్మాత్తుగా వచ్చి పరామర్శించారని అన్నారు. ప్రతిపక్షాల ఆధ్వర్యంలోనే చికిత్స, వసతి అందుతున్నాయని అన్నారు.

**న్యాయం జరిగేవరకు నేరెళ్లలో అడుగు పెట్టం:** ఇంత జరుగుతున్నా ఇసుక అక్రమ రవాణాను ప్రభుత్వం ఆపలేకపోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నేరెళ్లలో ఇసుకలారీల ప్రమాదంలో ఇప్పటికే నలుగురు మృత్యువాతపడినా ఎన్నడూ లారీలను అడ్డుకోలేదని, గతనెలలో జరిగిన లారీల దహనంతో తమకు ఎలాంటి సంబంధంలేదని వారు తెలిపారు. పోలీసుల దెబ్బల కారణంగా భవిష్యత్తులో ఎలాంటి పనులూ చేసుకోలేని పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై పెట్టిన అక్రమ కేసులను కొట్టివేసి, మెరుగైన వైద్య చికిత్సలతోపాటు పునరావాసం కల్పించాలని అన్నారు. కులం పేరుతో దూషిస్తూ చిత్రహింసలకు గురిచేసిన ఎస్పీ, ఎస్సైలతోపాటు 18 మంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసేవరకు నేరెళ్లలో అడుగుపెట్టబోమని తెలిపారు.




# ఆందోళన వద్దు.. వ్యక్తిగత భద్రతకే పాయింట్లు

- సంయుక్త కమిషనర్ రవీందర్ వెల్లడి

**ఈనాడు, హైదరాబాద్:** వాహనచోదకుల వ్యక్తిగత ఖాతాల్లో నమోదు చేస్తున్న పాయింట్లపై ఆందోళన అవసరం లేదని హైదరాబాద్ సంయుక్త పోలీస్ కమిషనర్(ట్రాఫిక్) వి.రవీందర్ తెలిపారు. మరింత అవగాహన కల్పించేందుకు కొద్దిరోజుల పాటు వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అంశాలపైనే పాయింట్లు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కొన్నింటికి తాత్కాలికంగా మినహాయింపు ఇస్తున్నామన్నారు. పాయింట్ల లెక్కింపు, వాహనచోదక అనుమతి పత్రాల(డ్రైవింగ్ లైసెన్సు) రద్దుపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని వివరించారు. 'రహదారులు సరిగ్గాలేవు.. పార్కింగ్ స్థలాలు లేవు.. సరైన మార్గసూచీలు లేవు.. పాయింట్లు ఎందుకు?' అంటూ ప్రచారం చేస్తున్నారని, వ్యక్తిగత భద్రతకు, ఈ అంశాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. పాయింట్ల కారణంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుందన్న అవగాహనతో శిరస్త్రాణాలను కొన్నారని, గతవారం రోజుల్లో శిరస్త్రాణం ధరించే వారి సంఖ్య 10శాతం పెరిగిందని వివరించారు.

*వాహన సంబంధ ఉల్లంఘనలకు ఉపశమనం*

✦ వాహనాలకు బీమా ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా.. గడువు ముగిసినా కాలుష్య ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా..

✦ సరకు రవాణా వాహనాలకు అటూ, ఇటూ లోడు ఉన్నా, వాహనాలను రహదారులపై నిలిపి ఉంచి చోదకులు పక్కకు వెళ్లినా..

*ఈ ఉల్లంఘనలకే పాయింట్లు..*

✦ ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం, కారు నడిపేవారు సీటుబెల్టు ధరించకపోతే జరిమానాతో పాటు పాయింట్ల లెక్కింపు

✦ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడపడం

✦ అపసవ్య దిశలో వాహనాలు నడపడం, ద్విచక్రవాహనంపై ప్రమాదకరంగా ముగ్గురు, నలుగురు వెళ్లడం



# క్షేత్రస్థాయి వాస్తవాలను ఆకళింపు చేసుకోండి

- కలెక్టర్లకు మోదీ సూచన

**దిల్లీ:** క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను ఆకళింపు చేసుకోవాలని కలెక్టర్లకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో వైద్యసేవల స్థితిపై అవగాహన పెంచుకోవాలని వారికి సూచించారు. 'ఆధునిక భారత్ - మంతన్' పేరుతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి కలెక్టర్లతో బుధవారం మోదీ ముచ్చటించారు. క్షేత్రస్థాయిలో కలెక్టర్లు ఎంత ఎక్కువగా పర్యటిస్తే.. దస్త్రాల విషయంలో అంత చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించగలరని వ్యాఖ్యానించారు. స్వచ్ఛభారత్, జీఎస్‌టీ, ఎల్‌ఈడీ బల్బులు, భీమ్ యాప్ వంటి వాటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను మోదీ కోరారు. 'పేదల బాగు కోసం ఈ రోజు ఏం చేశామ'ని రోజూ తమనుతాము ప్రశ్నించుకోవాలని.. వారి సమస్యలను శ్రద్ధగా వినాలని అన్నారు. జిల్లాల్లో అభివృద్ధి అనేది 'రిలే పరుగు' పోటీలాంటిదని.. అభివృద్ధి 'బ్యాటన్' ఒక కలెక్టర్ నుంచి మరొకరి చేతుల్లోకి విజయవంతంగా మారినప్పుడే గెలుపు సాధ్యమవుతుందని చెప్పారు. 2022కల్లా తమ జిల్లాలు ఏ స్థితిలో ఉండాలో కలెక్టర్లు ఇప్పుడే నిర్ణయించుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి, కుటుంబం, సంస్థ ఇలా 2022 కోసం లక్ష్యాలను నిర్దేశించుకుని.. వాటిని సాధించేందుకు కృషి చేయాలని ప్రభుత్వం కోరుతోందని అన్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన 100 జిల్లాల్లో ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగుపడితే.. దేశ అభివృద్ధి సూచీలకు గొప్ప ఊతం లభిస్తుందని చెప్పారు. సహోద్యోగులు, మేధావులు, విద్యార్థుల సాయం తీసుకుని.. ఆగస్టు 15లోపు జిల్లా కోసం దార్శనిక పత్రాన్ని రూపొందించాలని కలెక్టర్లను మోదీ కోరారు. 2022కల్లా సాధించగలిగే 10 నుంచి 15 లక్ష్యాలను ఇందులో చేర్చాలని సూచించారు. 'సంకల్ప్ సే సిద్ధి' కార్యక్రమానికి సంబంధించిన సమాచారం కోసం ఏర్పాటు చేసిన న్యూఇండియా.ఇన్ వెబ్‌సైట్ గురించి ఆయన కలెక్టర్లకు వివరించారు.

# నిర్మాణ పనులు నిరాటంకంగా సాగాలి

- ఏజెన్సీలకు జీఎస్టీపై అవగాహన కల్పించాలి
- సమీక్షలో అధికారులకు సీఎస్ ఆదేశాలు

**ఈనాడు, హైదరాబాద్:** జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన వస్తు,సేవల పన్ను(జీఎస్టీ)పై అన్ని శాఖలకు, ఏజెన్సీలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు. జీఎస్టీ వల్ల అభివృద్ధి కార్యక్రమాలు, పనుల వేగం తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జీఎస్టీపై అవగాహన, అభివృద్ధి పనులపై దాని ప్రభావం అంశాలపై బుధవారం ఆయన సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్కే జోషి, సురేష్ చందా, చిత్రా రామచంద్రన్, బీపీ ఆచార్య, బీఆర్ మీనా ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. రాష్ట్రంలో భారీఎత్తున చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. జీఎస్‌టీ అమలుతో ఈ పనులపై పడే ప్రభావం గురించి ఆయా శాఖలు అంచనా వేయాలని, దానికి సంబంధించిన నియమ నిబంధనలను జారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం మెమోను జారీ చేసిందని, దాని ప్రకారం నడుచుకోవాలన్నారు. ఎక్కడా పనులు ఆగకుండా, ఇంజినీరింగు అధికారులు సంబంధిత ఏజెన్సీలతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాట్, జీఎస్టీల మధ్య తేడాలపై ముఖ్యకార్యదర్శి సోమేష్‌కుమార్ అధికారులకు అవగాహన కల్పించారు.

## గులాబీ కూలీపై విచారణ జరపాలి: రేవంత్‌రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్:** గత ఏప్రిల్‌లో తెరాస సభ నిర్వహణ కోసం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు గులాబీ కూలీ కార్యక్రమం పేరుతో అనేక సంస్థల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేశారని దీనిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం సీబీఐకీ, ఏసీబీకి, కేంద్ర హోంశాఖ, ఎన్నికల కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. గులాబీ కూలీ పేరుతో సాగించిన వసూళ్లకు సంబంధించిన పత్రికా క్లిప్పింగులు, వీడియోలను ఆయన ఫిర్యాదుతో సాక్ష్యాలుగా పంపారు.

## 14 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగులు

**ఈనాడు, హైదరాబాద్:** వెయిటింగ్‌లో ఉన్న 14 మంది డిప్యూటీ కలెక్టర్లకు తెలంగాణ ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి వివిధ ప్రభుత్వ విభాగాల్లో బాధ్యతలు అప్పగించారు. సర్వశిక్ష అభియాన్‌లో అదనపు ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న ప్రత్యేక గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు డిప్యూటేషన్‌ను 2018 మార్చి 9 వరకు పొడిగించారు. స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి డిప్యూటేషన్‌ను 2018 మే 10 వరకు అనుమతించారు.



ఈనాడు


## న్యాయ సేవల్లో నాణ్యత కోసం...

ఏ దేశ ప్రగతికైనా సశక్త సమర్థ న్యాయవ్యవస్థ కీలక ఆలంబన కాగలుగుతుంది. మరికొన్నాళ్లలో డెబ్బయ్యేళ్ల మైలురాయి దాటనున్న స్వతంత్ర భారతావనిలో- నేటి అవసరాలకు దీటుగా న్యాయపాలికను తీర్చిదిద్దాలన్న సంకల్పానికి గట్టిసవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. 'క్రియాశీల, సమర్థ న్యాయవ్యవస్థ లేకుండా ఏ దేశమూ పురోగమించ లేదు' అంటూ దిగువ కోర్టుల్లో న్యాయాధికారుల నియామకానికి కేంద్రీకృత వ్యవస్థ ఉంటే మంచిదని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టీకరించింది. అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు ప్రతిపాదనకు ఎదురుగాలి జోరెత్తిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. వైద్యవిద్యా కోర్సులకు జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షగా సీబీఎస్ఈ నిర్వహిస్తున్న 'నీట్' తరహాలో, జిల్లాస్థాయి న్యాయాధికారుల నియామకాలకు అర్హుల్ని నిర్ణయించే ఏకరూప పరీక్షను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించేచే బాగుంటుందన్నది ఆ ప్రతిపాదన సారాంశం. కేంద్ర న్యాయశాఖ కార్యదర్శి స్నేహలతా శ్రీవాస్తవ సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్‌కు రాసిన లేఖను విచారణకు స్వీకరించిన ధర్మాసనం- దానికి అనుకూలంగా స్పందించడం గమనార్హం. దేశవ్యాప్తంగా 620 జిల్లా కోర్టులున్నాయి. హైకోర్టులు, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లను సంప్రతించి గవర్నర్ దిగువ న్యాయాధికారుల నియామకాల్ని చేపట్టాలని నిబంధనలు ఉద్ఘోషిస్తున్నాయి. మోదీ సర్కారు ప్రతిపాదిస్తున్న కేంద్రీకృత పరీక్ష విధానానికి 'సుప్రీం' మద్దతు పలికి, అమలుకు సిద్ధపడితే- తమ పాలనాపర పట్టునుంచి దిగువ కోర్టులు జారిపోతాయని హైకోర్టులు, సమాఖ్య స్ఫూర్తి కదలబారిపోతుందని రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి. ఆ భయాందోళనలు అర్థరహితమంటున్న సుప్రీంకోర్టు- వాటి రాజ్యాంగబద్ధ హక్కుల విషయంలో ఏమాత్రం జోక్యం చేసుకోకుండానే నాణ్యమైన వృత్తినిపుణులను ఎంపిక చేసి పెట్టడానికే తమ చొరవ పరిమితమవుతుందని భరోసా ఇస్తోంది. ఇక ఎవరైనా అభ్యంతర పెట్టాల్సింది ఏముంది?

జిల్లా జడ్జిల నియామక పరీక్ష (డిజ్యూరీ) ద్వారా న్యాయాధికారుల పదవులకు కేవలం అర్హుల్ని గుర్తిస్తారు. ఖాళీల భర్తీ, నియామక ప్రక్రియ అంతా రాజ్యాంగంలోని 233 అధికరణ పేర్కొన్నట్లు ఆయా హైకోర్టుల ద్వారానే జరుగుతుందని సీనియర్ న్యాయవాది అరవింద్ దతర్ సుప్రీంకోర్టుకు సమర్పించిన విషయ సూచీ పత్రం నివేదిస్తోంది. కేంద్ర సివిల్ సర్వీసులకు ప్రతి సంవత్సరం అత్యంత సమర్థులైన అభ్యర్థులు పోటీపడుతున్న వైనాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి కేంద్రీకృత ఎంపిక యంత్రాంగం కొలువుతీరితే న్యాయసేవల్లోకీ ప్రతిభాసంపన్నులు వస్తారని, వారి నుంచి మెరికల్ని ఎంచుకొనే వీలుంటుందని ఆ పత్రం ఆశావహంగా స్పందించింది. దేశవ్యాప్తంగా జిల్లా, సబార్డినేట్ కోర్టులకు మంజూరైన న్యాయాధికార పదవుల సంఖ్య 21,372; ప్రస్తుతం భర్తీ అయినవి 16,500 పైచిలుకు! ఉన్న ఖాళీల్లో పాతిక శాతం దాకా జిల్లా జడ్జి పదవులు ఉంటాయనుకొంటే, నిర్దిష్టకాలంలో క్రమం తప్పక నిర్వహించే కేంద్రీకృత పరీక్ష ద్వారా మెరికల్ని గుర్తిస్తే, హైకోర్టులే మౌఖిక పరీక్షలు నిర్వహించి సజావుగా నియామకాలు జరుపుకొనేలా వీలుంటుందన్నది మేలిమి ఆలోచన. కేంద్రీకృత పరీక్ష విధానం- ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల్ని ఏ మాత్రం మార్చదని, అదే సమయంలో ఖాళీల భర్తీ, సర్వీసు నిబంధనల క్రమబద్ధీకరణలో రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించబోదని ఆ పత్రం నిర్దేశించింది. స్థానిక భాష, పద్ధతులు తెలిసి ఉండాలన్న నిబంధనలకు, ఆయా రాష్ట్రాల్లోని రిజర్వేషన్లకూ జాతీయ పరీక్ష ఏ విధంగానూ అవరోధం కాబోదన్న విశ్వాసం సంపూర్ణంగా ఉండబట్టే సుప్రీంకోర్టు సైతం తాజా చొరవకు సై అంటోంది. దానిపై ఏకాభిప్రాయం కుదిరితే సరే, లేకున్నా తనంతట తానే విస్పష్ట ఆదేశాలతో కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడతానంటున్న సుప్రీంకోర్టు- భయసందేహాల నివృత్తికి ప్రాధాన్యమిస్తూ ముందడుగేయాలి!

దేశంలో అత్యున్నత ప్రమాణాలతో 18 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు ఏర్పాటైనా వాటిలో సుశిక్షితులైనవారు కోర్టుల్లో స్వతంత్ర న్యాయవాదులుగా పనిచేయాలని అనుకోవడం లేదని, ఫలితంగా ఆయా విద్యా సంస్థల స్థాపిత లక్ష్యం పక్కదారి పట్టిందని 'సుప్రీం' ప్రధాన న్యాయమూర్తిగా టి.ఎస్.ఠాకూర్ నిరుడు డిసెంబరులో వాపోయారు. ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు లేదా సంబంధిత హైకోర్టులు పరీక్షలు నిర్వహిస్తూ న్యాయాధికారుల ఎంపిక ప్రక్రియ సాగిస్తున్నా- ప్రతిభావ్యుత్పన్నతపరంగా పెదవి విరుపులు తప్పడం లేదు. దేశంలో పెండింగులో ఉన్న మొత్తం కేసుల్లో రెండుకోట్ల 70లక్షలదాకా జిల్లాకోర్టుల్లోనే పోగుపడ్డాయని, వాటిలో పదిశాతం పదేళ్లకుపైగా మగ్గుతున్నాయని తాజా గణాంకాలు చాటుతున్నాయి. ప్రతి న్యాయాధికారి చెంతన సగటున 1,350 కేసులు పెండింగులో ఉన్నాయని, ఆ రకంగా నెలకు 43 వ్యాజ్యాలే పరిష్కారమవుతున్నాయంటున్న వివరాలు- కొత్తవాటి తాకిడి పరిష్కార వేగాన్ని దాటిపోయిందని వెల్లడిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో కొత్తగా 15 వేలమంది న్యాయాధికారుల నియామకాల ద్వారా 'పెండింగ్ సమస్య'ను సమర్థంగా పరిష్కరించుకునే వీలుందని 'సుప్రీం' నివేదిక ఎలుగెత్తుతున్నా- దిగువ న్యాయపాలికలో పనిప్రమాణాలు, వృత్తి నైపుణ్యాలు మెరుగుపడినప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుంది. జాతీయ స్థాయి పరీక్ష సూదంటురాయిలా మెరికల్ని ఆకర్షించగలదంటున్న ఆశాభావంతో సరిపుచ్చుకుండా- అన్ని స్థాయుల్లోనూ బాధ్యత, జవాబుదారీతనాలకు పాదుచేసేలా సరైన సంస్కరణలూ వడివడిగా పట్టాలకెక్కాలి. సత్వర న్యాయాన్ని ప్రజల హక్కుగా నిర్ధారించి, తప్పుడు తీర్పులిచ్చేవారినీ బోనెక్కించేలా నిబంధనలకు సానపట్టి, సశక్త సమర్థ న్యాయపాలికే లక్ష్యంగా అడుగులు కదపాలి!

# ప్రగతికి జవ'జీవ ఇంధనం'!




బొగ్గు, పెట్రోలియం వంటి శిలాజ ఇంధనాలు భూగోళాన్ని నిప్పుల కుంపటిగా మార్చేస్తూ జీవరాశుల మనుగడకు ముప్పు తెస్తున్నాయి. ఈ విపత్తును నివారించాలంటే మనిషి ప్రకృతి వనరులను నిర్మాణాత్మకంగా, సృజనశీలంగా ఉపయోగించుకోవాలి. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయాలను కనుగొనాలి. మోటారు వాహనాలను నడపడానికి డీజిల్ ఇంజిన్‌ను సృష్టించిన జర్మన్ శాస్త్రవేత్త సర్ రుడాల్ఫ్ డీజిల్ ఈ సంగతి ముందే చెప్పడమే కాదు, చేసి చూపించారు కూడా! 1893 ఆగస్టు 10న వేరుసెనగ నూనెను ఇంధనంగా వాడి ఒక ఇంజిన్‌ను పని చేయించారు. భవిష్యత్తులో మోటారు వాహనాలు ఇలాంటి జీవ ఇంధనాలతో నడుస్తాయని సూచించారు. అందుకే ఏటా ఆగస్టు 10నాడు ప్రపంచ జీవ ఇంధన దినోత్సవాన్ని పాటిస్తున్నారు. నేడు ప్రపంచంలో అత్యధిక వృద్ధిరేటు సాధిస్తున్న భారత్ ముమ్ముందు మరింత వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించనుంది. అంటే ఇంధన వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుందన్న మాట. దీనివల్ల పర్యావరణానికి ఎదురయ్యే ముప్పును గ్రహించిన భారత్, కర్బన ఉద్గారాలకు దారితీసే శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించుకొంటానని పారిస్ వాతావరణ సదస్సులో వాగ్దానం చేసింది. ఆ మేరకు 2022 కల్లా ముడిచమురు దిగుమతులను పది శాతం తగ్గించుకోవాలని నిశ్చయించింది. జీవ ఇంధన ఉత్పత్తి, వినియోగాలను ప్రోత్సహిస్తోంది.

### అందుబాటులోకి రానున్న కొత్త వనరులు

పొద్దు తిరుగుడు, సోయా గింజలు, ఆల్గే నుంచి తయారుచేసే ఇంధనమే జీవ డీజిల్. 2015 ఆగస్టులో ఒడిశాలోని తాల్చేర్‌లో మొదలైన జీవడీజిల్ పైలట్ పథకాన్ని తరవాత ఆరు రాష్ట్రాలకు విస్తరించారు. చెరకు, మొక్కజొన్న చొప్ప తదితరాల సెల్యులోజ్‌తో తయారయ్యే ఆల్కహాల్‌ను ఇథనాల్ అంటారు. దీన్ని పెట్రోలు లేదా డీజిల్‌తో కలిపి వాహనాల ఇంజిన్లలో వాడటం ద్వారా చమురు దిగుమతులను తగ్గించవచ్చు. ఇంతవరకు 80 శాతం ఇథనాల్‌ను అమెరికా నుంచే సేకరిస్తున్నాం. అది ప్రధానంగా మొక్కజొన్న నుంచే తయారవుతోంది. 2016లో దేశంలో సగటున 3.3 శాతం ఇథనాల్‌ను పెట్రోలులో కలిపి వాడారు. దీన్ని నాలుగు శాతానికి పెంచాలంటే 120 కోట్ల లీటర్ల జీవ ఇంధనం అవసరమవుతుంది. 2022 కల్లా 10 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోలు తయారు కావాలంటే 450 కోట్ల లీటర్ల ఇథనాల్ కావాలి. దీని తయారీ రూ.23 వేలకోట్ల పరిశ్రమగా ఎదగగలదు. 2016లో భారతదేశంలో రూ.6,000 కోట్లుగా ఉన్న బయో డీజిల్, ఇథనాల్ పరిశ్రమ పరిమాణం 2022నాటికి రూ.50 వేల కోట్లకు, 2040నాటికి రూ.1.25 లక్షల కోట్లకు పెరుగుతుందని కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంచనా. భవిష్యత్తులో 20 శాతం ఇథనాల్ కలిపిన డీజిల్‌ను వాడాలని 2008 నాటి జాతీయ జీవ ఇంధన విధానం లక్షించింది. ఇథనాల్ కోసం చెరకు, మొక్కజొన్న వంటి ఆహార పంటల మీద ఆధారపడకుండా జట్రోఫా వంటి మొక్కలను భారీయెత్తున పెంచాలని తీర్మానించింది. తదనుగుణంగా 14 లక్షల చదరపు కిలోమీటర్ల బంజరు భూముల్లో జట్రోఫా మొక్కలను పెంచాలని ప్రభుత్వం ఆశించినా, ప్రస్తుతం ఈ తరహా మొక్కల సాగు విస్తీర్ణం 10 వేల చ.కి.మీటర్లకు లోపే ఉంది. పెట్రోలులో కలపడానికి ప్రభుత్వం ఆశించినమేర ఇథనాల్ దొరక్కపోవడంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకొనక తప్పడం లేదు. 2016లో 40 కోట్ల లీటర్ల ఇథనాల్ దిగుమతి అయింది. 2018లో 60 కోట్ల లీటర్లను దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇలా చమురు, ఇథనాల్ దిగుమతుల మీద అమూల్య విదేశ మారక ద్రవ్యం ఖర్చయిపోతోంది. దీన్ని నివారించడానికి స్వదేశంలో ఇథనాల్ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

వ్యర్థాల నుంచి జీవ ఇంధన తయారీకి 2019 నాటికల్లా దాదాపు రూ.13 వేలకోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. నుమాలీగఢ్ రిఫైనరీ లిమిటెడ్ సంస్థ రూ.950 కోట్ల పెట్టుబడితో వెదురు వ్యర్థాల నుంచి మూడు లక్షల టన్నుల ఇథనాల్ తయారీకి నిరుడు ప్రతిపాదనలు సమర్పించింది. ప్రజ్ ఇండస్ట్రీస్ జీవ ఇంధన రిఫైనరీ ప్రాజెక్టుపై రూ.3,000 కోట్ల పెట్టుబడి పెట్టడానికి సిద్ధమైంది. ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ. 5,000 కోట్లతో

### 125వ వత్సరంలోకి పంట చమురు

తొమ్మిది రెండో తరం ఇథనాల్ కర్మాగారాలను నిర్మించనున్నాయి. ఇవన్నీ కార్యరూపం ధరించడానికి చాలా సమయం పడుతుంది. అందుకే అయ్యవారు వచ్చేవరకు అమావాస్య ఆగదన్నట్లు, బయోడీజిల్ కర్మాగారాలు ఇథనాల్ కాకుండా ఇతర ముడిసరకుల నుంచి జీవ ఇంధనం తయారుచేస్తున్నాయి. వాడేసిన వంటనూనెలు, జంతువుల కొవ్వు, వంటకు పనికిరాని శాక తైలాలను 0.001 పాళ్లలో డీజిల్‌లో కలుపుతున్నాయి. ఇథనాల్ కొరత ఎంత తీవ్రంగా ఉందో దీన్నిబట్టే తెలుసుకోవచ్చు.

### మార్గాంతరం మిథనాల్!

ప్రభుత్వం ఒకవైపు రవాణా, విద్యుత్ రంగాల అవసరాలు తీర్చడం కోసం ఇథనాల్ పరిశ్రమ వృద్ధికి పాటుపడుతూనే గృహావసరాల కోసం మిథనాల్‌పై దృష్టి సారిస్తోంది. స్వదేశంలో చాలినంత ఉత్పత్తి లేకపోవడంతో చమురుతో పాటు వంటగ్యాస్ అవసరాలు తీరాలన్నా దిగుమతులే శరణ్యం. 2016-17లో భారత్‌లో వంటగ్యాస్ వినియోగం 9.8 శాతం పెరిగి 2.16 కోట్ల టన్నులకు చేరింది. అందులో 1.1 కోట్ల టన్నులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ఈ దిగుమతులకు పశ్చిమాసియా దేశాలే ఆధారం. పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించడంతో వంటగ్యాస్‌కు గిరాకీ మరింత పెరిగిపోయింది. దీన్ని తీర్చడానికి నెలకు పది లక్షల టన్నుల వంటగ్యాస్‌ను సౌదీ అరేబియా, ఖతార్, అబుదాబీ, కువైట్‌ల నుంచి దిగుమతి చేసుకోవలసి వస్తోంది. వచ్చే మూడేళ్లలో ఈ దిగుమతులు దాదాపు 1.7 కోట్ల టన్నులకు చేరనున్నాయి. దీనికి భారీగా విదేశ మారక ద్రవ్యం వెచ్చించాల్సి ఉంటుంది. భారత్ నేడు ముడిచమురు దిగుమతిపై ఏటా ఆరు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.

### వినూత్న పద్ధతులతో మునుముందుకు...

ఈ పరిస్థితుల్లో దిగుమతుల్ని తగ్గించుకోవడానికి అత్యవసరంగా కృషి చేయాలి. బూడిద శాతం ఎక్కువగా ఉండే బొగ్గును, మునిసిపల్ చెత్తను మిథనాల్ గ్యాస్‌గా మార్చి వంటగ్యాస్‌గా ఉపయోగించుకోవాలని నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ సూచిస్తున్నారు. చైనా ఇప్పటికే 15-20 శాతం మిథనాల్‌ను కలిపిన ఇంధనాన్ని ఉపయోగిస్తోంది. మిథనాల్ కాలుష్యకారకం కాదు. పర్యావరణానికి అనుకూలం. ప్రపంచంలో అతిపెద్ద బొగ్గు తవ్వక సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ త్వరలోనే పశ్చిమ్ బంగలో మొట్టమొదటి బొగ్గు ఆధారిత మిథనాల్ ప్లాంట్‌ను నెలకొల్పదలచింది. పశ్చిమ్ బంగ, ఒడిశా, ఝార్ఖండ్‌లలో బూడిద పాలు ఎక్కువగా ఉండే బొగ్గు నిల్వలు విస్తారం. ఈ తరహా బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలు స్వీకరించవు. మిథనాల్ ఉత్పత్తికి ఈ నాసిరకం బొగ్గు బేషైనది. ప్రస్తుతం 60 శాతం వంట గ్యాస్ అవసరాలను విదేశీ దిగుమతులతోనే తీర్చుకుంటున్నామని, అధిక బూడిద బొగ్గుతో మిథనాల్‌ను తయారు చేసి, వంటగ్యాస్‌గా వాడుకుంటే వందల కోట్ల డాలర్లు ఆదా అవుతాయని సారస్వత్ చెబుతున్నారు. గతంలో రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) డైరెక్టర్‌గా పనిచేసిన సారస్వత్, ఇప్పుడు నీతి ఆయోగ్ మిథనాల్ కమిటీకి సారథ్యం వహిస్తున్నారు. బొగ్గు ఆధారంగా మిథనాల్ తయారీకి కర్మాగారాలను నెలకొల్పవలసిందిగా ఎన్‌టీపీసీ, ఆయిల్ ఇండియా వంటి సంస్థలను కోరుతున్నారు. వ్యవసాయ వ్యర్థాలనూ మిథనాల్‌గా మార్చవచ్చునని సూచిస్తున్నారు.

ప్రస్తుతం సౌదీ అరేబియా, ఇరాన్‌ల నుంచి మిథనాల్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. ముమ్ముందు ఇరాన్, ఖతార్‌లలో భారతదేశం సొంతగా కర్మాగారాలను నెలకొల్పి మిథనాల్‌ను తయారుచేయాలని నీతి ఆయోగ్ ప్రతిపాదిస్తోంది. ఇది కూడా దిగుమతి కిందకే వచ్చినా ముడిచమురుకన్నా మిథనాల్ దిగుమతి చాలా చాలా చౌక. ప్రభుత్వం ఆశిస్తున్నట్లు 2022 కల్లా 15 శాతం మిథనాల్‌ను కలిపిన పెట్రోలు, డీజిల్‌ను వాడితే దిగుమతి బిల్లు 800 కోట్ల డాలర్ల మేరకు తగ్గిపోతుంది. స్వదేశంలో చమురు, సహజవాయు ఉత్పత్తి ఆశించిన స్థాయిలో పెరగడం లేదు కాబట్టి బొగ్గు, బయోమాస్‌ల నుంచి మిథనాల్ తయారీయే ఉత్తమం. మిథనాల్‌తోపాటు డైమిథైల్ ఈథర్ (డీఎంఈ) కూడా ఇంధనంగా ఉపయోగపడుతుంది. నేడు ప్రపంచంలో అత్యధికంగా మిథనాల్, డీఎంఈలను ఉత్పత్తి చేస్తున్న దేశం- చైనా. ఈ రంగంలో భారత్ మెల్లగా అడుగులు వేయనారంభించింది. ఇక్కడ అయిదు కర్మాగారాలు మిథనాల్ ఉత్పత్తిలో నిమగ్నమయ్యాయి. ఏదిఏమైనా భూతాప నిరోధానికి ఇథనాల్, మిథనాల్, ఇతర జీవ ఇంధన వనరుల వినియోగాన్ని ఎన్నెన్నో రెట్లు పెంచడం వినా మరో మార్గం లేదు. వీటితోపాటు నేరుగా గాలి నుంచి కర్బనాన్ని పీల్చి భూగర్భంలో నిక్షిప్తం చేయడం గురించీ పరిశోధనలు జరపాలి. ప్రస్తుతం మానవాళి ఏటా 800 కోట్ల టన్నుల కర్బనాన్ని వాతావరణంలోకి వెదజల్లుతోంది. దీన్ని భారీగా తగ్గించకపోతే జీవజాతుల మనుగడకే ముప్పు. కాబట్టి జీవ ఇంధన తయారీకి వినూత్న పద్ధతులను కనుగొని వేగంగా ఆచరించాలి.

– ప్రసాద్

### పరిశోధనలతో పదును



ముడిసరకు ప్రాతిపదికగా జీవ ఇంధనాలను నాలుగు తరగతులు లేదా తరాలుగా వర్గీకరించారు. వీటిలో మొదటి తరం జీవ ఇంధనాలను మొక్కజొన్న, సోయా, పామ్ వంటి ఆహార పంటలు, నూనెల నుంచి తీస్తారు. ఈ తరహా ఇంధనాలపై అధికంగా ఆధారపడటం వల్ల ఆహార ధరలు పెరుగుతున్నాయని, ముమ్ముందు ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, గ్రీన్‌హౌస్ ఉద్గారాలూ పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంకా బయోడీజిల్, బయో ఆల్కహాల్, ఇథనాల్, చెత్తకుంటల నుంచి వెలువడే మీథేన్ వాయువూ తొలితరం జీవ ఇంధనాల కిందకే వస్తాయి. కొయ్యముక్కలు, వ్యవసాయ వ్యర్థాల బయోమాస్‌ను రెండోతరం జీవ ఇంధనాలంటారు. ఈ వ్యర్థాలను సూక్ష్మజీవుల సాయంతో పులియబెట్టి బయోగ్యాస్‌ను తయారుచేసి, జీవఇంధన ద్రవంగా మారుస్తారు. రావి, జొన్న, మొక్కజొన్నలు మరింత నూనె ఇచ్చేలా జన్యుమార్పులు చేయడం, వేగంగా పెరిగే 'ఆల్గే'లను అభివృద్ధి చేయడం ద్వారా మూడోతరం జీవ ఇంధనాలను సృష్టిస్తున్నారు. అధికశక్తి ఇచ్చేలా ప్రత్యేకంగా రూపొందించిన మొక్కల నుంచి నాలుగోతరం జీవ ఇంధనాలు లభించనున్నాయి. జన్యు మార్పిడి ద్వారా ఈ మొక్కల్లో ప్రవేశపెట్టే సూక్ష్మజీవులు వాతావరణం నుంచి బొగ్గుపులుసు వాయువు (సీఓ2)ను పీల్చుకుని నేలలో నిక్షిప్తం చేయాలని శాస్త్రజ్ఞులు ఆశిస్తున్నారు. ఈ మేరకు ప్రయోగాలు ముమ్మరమయ్యాయి.

# మన చదువు... మోత బరువు!

ఆరో తరగతి చదివే ఓ బాలికను పద్నాలుగు కేజీల బడిసంచి పొట్టన పెట్టుకుంది! బండెడు పుస్తకాల మోతబరువుకు తాళలేక, బడి మెట్ల నుంచి జారిపడిన ఆ పాప తిరిగి లేవనే లేదు. దిల్లీలో నాలుగేళ్లనాటి ఆ దుర్ఘటన, ఇప్పటికీ అందరి గుండెల్ని పిండేస్తూనే ఉంది. నర్సరీ, కేజీ (కిండర్ గార్టెన్), ఒకటో తరగతి మొదలుకొని పిల్లలందరికీ తప్పని పెనుభారమే బడిసంచి! ఆ బరువే శారీరక-మానసిక వ్యాధులు, బాధలకు దారితీసి, చివరికి వారి పాలిట ప్రాణాంతకంగా పరిణమిస్తోంది. దేశవ్యాప్తంగా గల 15లక్షల పాఠశాలల్లో దాదాపు 20కోట్లమంది బాలబాలికలు చదువుకుంటున్నారు. రొడ్డకొట్టుడు చదువులు నిత్యమూ వారితో కిలోలకొద్దీ పుస్తకాలు మోయిస్తున్నాయి. వెన్నునొప్పి, భుజాలు లాగడం, కీళ్లు పట్టేయడం, కండరాలు బిగుసుకుపోవడం, విపరీతమైన ఒత్తిడి, వీటన్నింటికీ మించి గుండె దడ, శ్వాసకోశ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలెన్నో పసిప్రాణాల్ని పట్టిపీడిస్తున్నాయి. రోజూ బరువులు మోసి, క్రమేణా వెన్నుపూస వంగిపోయి, చివరికి గూని లక్షణాలూ దాపురిస్తున్నాయి. సంచుల భారం మోయలేని పసిబిడ్డలు వంగిపోతూ కుంగిపోతూ అడుగులో అడుగు వేసుకుంటూ బడికి వెళ్లివచ్చే పరమ దుర్భర స్థితి ఒక్క మనదేశంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకూ సంబంధించి- తెలంగాణలోని 26వేల బడుల్లో 28.2 లక్షలమంది, ఆంధ్రప్రదేశ్‌లోని 43వేల పాఠశాలల్లో 37.4 లక్షలమంది పిల్లలున్నారు. బడిపిల్లలు మోసే పుస్తకాల సంచుల భారం, వారి బరువులో పదిశాతం మించరాదన్న నిబంధనా ఇప్పటిది కాదు. దానితో పాటు అనేక నిబంధనలున్న 'స్కూల్‌బ్యాగ్ చట్టం' రూపొంది ఇప్పటికి దశాబ్దం దాటింది. ఆ మాటకొస్తే- ఇతర దేశాలతో పోలిస్తే ఇండియాలోనే బడిసంచుల బరువు చాలా ఎక్కువని, దాన్ని గణనీయంగా తగ్గిస్తే తప్ప పరిస్థితి అదుపులోకి రాదని యశ్‌పాల్ ఆధ్వర్యంలోని కమిటీ పాతికేళ్లక్రితమే తేల్చిచెప్పింది. 'బడిసంచుల సమస్య' ఇప్పుడు మళ్లీ తెరమీదకొచ్చింది. కనీసం ఇప్పటికైనా ఊపందుకోవాల్సింది చర్యలే కానీ, చర్చలు కాదు!

### నిఘా మాటేమిటి?

బడిసంచుల బెడద తొలగేలా విభిన్న పథకాన్ని రూపొందిస్తామని ఏడాది క్రితం ప్రకటించిన కేంద్రం, డిజిటల్ విధానాల అమలుపైనే చూపు సారించింది. పిల్లలపై నానాటికీ పెరుగుతున్న పుస్తకాల భారాన్ని, బడిసంచుల బరువును తగ్గించేందుకు అనువుగా పలు ప్రతిపాదనల్ని అది పరిశీలించింది. అందులో భాగంగా, రెండో తరగతిదాకా బాలలకు అసలు బడిసంచులే ఉండకూడదని కేంద్రీయ మాధ్యమిక విద్యామండలి అనుబంధ పాఠశాలలకు ప్రభుత్వం సూచించింది. ఎనిమిదో తరగతి వరకైనా విద్యార్థులకు పుస్తకాల మోత తగ్గేలా చర్యలు చేపట్టాలని జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలిని పురమాయించింది. మరో అడుగు ముందుకేసిన రెండు తెలుగు రాష్ట్రాలూ- పుస్తకాల సంచుల మోతకు కళ్లెం బిగించే ప్రయత్నాలైతే ఆరంభించాయి. పాఠ్యప్రణాళిక మొత్తాన్నీ 'ట్యాబ్'లకు ఎక్కించడం ద్వారా, పుస్తకమే లేని విధానంపై మొగ్గు చూపుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతోంది. మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల సహకారంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తరిస్తామని, ఆ తరహా విద్యాబోధన వల్ల పిల్లలపై ఇక బడిసంచుల భారం ఉండబోదని భరోసా ఇస్తోంది. పుస్తకాల సంచుల గరిష్ఠ బరువు ఏ తరగతికి ఎంత ఉండాలో స్పష్టంచేస్తూ, తెలంగాణ పాఠశాలవిద్యా శాఖ ఇటీవల కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది.



### అపాయంలో బడిప్రాయం

బడిసంచుల బరువు తగ్గింపుపై ఇదివరకే ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాల అమలు తీరును సైతం కూలంకషంగా సమీక్షిస్తామంటోంది. నిజానికి డిజిటల్, హైటెక్ పేరిట కొనసాగుతున్న పాఠశాలల విద్యార్థులకూ సంచుల మోత తప్పడం లేదని ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. నిఘా సంఘాల ప్రసక్తే లేకుండా బడి సంచుల బరువు తగ్గింపు ఎలా సాధ్యమని బాలల హక్కుల పరిరక్షణ సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. ఎందరు ఎంతగా మొత్తుకుంటున్నా, పాలకులు ఏళ్లతరబడి పెడచెవిన పెట్టడమే పరిస్థితిని ఇంతవరకు తెచ్చింది.

బడిసంచుల చట్టం నిబంధనల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహారాష్ట్రలోని ఓ సామాజిక సేవాసంస్థ గతంలోనే కోర్టుకెక్కింది. 'వెన్నుపోటు'ను బాలలు ఇంకా ఎంతకాలం భరించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ముంబయి హైకోర్టు అప్పట్లోనే నిలదీసింది. ఒక్క మహారాష్ట్రలోనే కాదు- దేశ రాజధానితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో; కర్ణాటక, తమిళనాడు, కేరళ, బిహార్ వంటి చోట్లా పుస్తకాల మోత బాలల వెన్ను విరిచేస్తోంది. బరువు తగ్గింపు నిర్ణయాలు కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని కొన్ని విద్యాలయాల్లో కొంతవరకు అమలవుతున్నాయి. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలన్నింటిలోనూ బరువు చదువులే! ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల బాలలు 12 కిలోలు; ఆ తరవాతి తరగతులవారు 17 కిలోలు గరిష్ఠంగా మోయాల్సి వస్తోంది. పలు పాఠశాలలు కాసుల కక్కుర్తితో వ్యవహరిస్తూ, ఇష్టానుసారం పాఠ్య-నోటు పుస్తకాల్ని అంటగడుతున్నాయి. అందుకే ఇకనుంచి ఒకటో తరగతికి పుస్తకాల సంచి బరువు ఒక టిన్నర కిలోలకు మించకూడదని తెలంగాణ సర్కారు సరికొత్తగా నిర్దేశించింది. పదో తరగతికి ఆ గరిష్ఠ పరిమితి అయిదు కిలోలు. పిల్లలందరూ రోజూ అన్ని పుస్తకాల్నీ మోసుకువెళ్లాల్సిన పనే ఉండకూడదు. ఎప్పుడు ఏ పుస్తకాలు తేవాలో వారికి ఉపాధ్యాయులు ముందుగానే తెలియజేయాలి. బరువును సరిసమానంగా పంచే విధంగా, వెడల్పు పట్టీలు గల సంచులనే ఎంపిక చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించాలి. సంచులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో తనిఖీల ద్వారా నిర్ధారించాలి. ఇటువంటి నిబంధనలు లెక్కకు మిక్కిలి ఉన్నప్పటికీ, ఇవి ఎంతవరకు ఆచరణీయాలన్నదే పెద్ద ప్రశ్న!

నియమ నిబంధనలు అనుసరించని పాఠశాలలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే చర్యలేమిటి? క్రిమినల్ కేసుల నమోదు, ఆయా బడుల గుర్తింపు రద్దు వంటివి ఏ ఏ సందర్భాల్లో చేపడతారు? వీటిపై ఇప్పటికీ ఓ స్పష్టత లేదు. పుస్తకాల సంచుల బరువుపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు ఏ మేరకు అవగాహన కల్పించగలరన్నదీ ప్రశ్నార్థకమే. రెండు లేదా మూడు నెలలకు ఓసారి బడి సంచుల తనిఖీ సాగాలన్న నిబంధన ఉన్నా, దాని అమలుకు సరిపడా యంత్రాంగం అనేక చోట్ల లేదు. అవసరమైన పుస్తకాల్ని తరగతి గదుల్లోనే భద్రపరచుకొనేలా, 'లాకర్' సదుపాయాల్ని ఆయా పాఠశాలలే కల్పించాలంటున్నారు. అటువంటి బడులు దేశంలో ఎన్ని ఉన్నాయో, వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. పలు పాఠశాలలకు నల్లబోర్డులే కరవైన పరిస్థితుల్లో- పిల్లల పుస్తకాలకు ఎక్కడికక్కడ విడివిడిగా లాకర్ల ఏర్పాటు సులభసాధ్యమేనా? అలాగే అమెరికా, జర్మనీ వంటి దేశాల మాదిరిగా బడిపిల్లలకు ఈ-పుస్తకాలు, ఐ-పాడ్ సదుపాయాల కల్పననూ మనదేశంలో ఇప్పుడిప్పుడే ఊహించలేం.

### ఆచరణీయ మార్గాలెన్నో...

నిధుల లభ్యత, స్థల విస్తీర్ణం, నిర్వహణ సామర్థ్యం, పర్యవేక్షక యంత్రాంగాన్ని అనుసరించే ఏ పాఠశాలలోనైనా ఏర్పాట్లు ఉంటాయి. అత్యాధునిక సాంకేతికతను విద్యారంగానికి జోడించిన అమెరికా- బడిపిల్లల ఆరోగ్య పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. అమెరికన్ ఫిజికల్ థెరపీ అసోసియేషన్, అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ వంటి సంస్థల సూచనలు, సలహాల్ని అక్కడి విద్యాసంస్థలు తు.చ. తప్పక అనుసరిస్తున్నాయి. సంచుల బరువులు పిల్లల్లో శాశ్వత అంగవైకల్యానికి దారితీస్తాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి సంస్థలు లోగడే హెచ్చరించినా, మన ప్రభుత్వాల్లో కదలిక లేదు. చిమ్మచీకట్లో చిరుదీపంలా- బడి పుస్తకాల ఉచిత రవాణా ద్వారా సమస్య తీవ్రతను తగ్గించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ ప్రయత్నిస్తోంది. అదే విధానాన్ని మనదేశంలోనూ అందిపుచ్చుకొని, కేరళలోని కొన్ని ప్రాథమిక పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. వారంలో ఒకరోజును 'నో బ్యాగ్స్ డే'గా ప్రకటించి, కర్ణాటక, ఉత్తర్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలూ బాలల బడిసంచుల మోత బెడదను ఎంతో కొంత తగ్గించగలుగుతున్నాయి. వీటన్నింటి స్ఫూర్తికిరణాలు ఇతర రాష్ట్రాలపైనా ప్రసరించినప్పుడే- బాలల భవితకు భద్రత, భరోసా!

– శరత్

# సుఖమయ జీవితం

'మమ సుఖం తవ సుఖం, తవ దుఃఖం మమ దుఃఖం'- నా సుఖం నీది, నీ దుఃఖం నాది... అనేది ఆత్మీయ బంధాలకు ఒక ఉత్తమ నిర్వచనం. అది కేవలం మాటలకే పరిమితం కాకూడదు.

ఉపనిషత్తులు ఆత్మల ఆవిర్భావం గురించి వివరించాయి. 'మహోజ్జ్వలమైన పరమాత్మ దివ్యతేజం నుంచి విడిపోయిన రేణువులే ఆత్మలు' అని అవి నిర్వచించాయి. అందుకే, యోగదృష్టికి ఆత్మల రాకపోకలు మిణుగురుల్లా దర్శనమిస్తాయంటారు.

ఆత్మ అసలు రూపం ఏమిటి? అది- అత్యంత సూక్ష్మంగా ఉండే ఓ అణుదీపం! వేదాంతులు పరమాత్మను 'అణువులో అణువు, మహత్తులో మహత్తు'గా అభివర్ణిస్తారు. వారు పరమాత్మను అలా భావించడంలో అర్థం- ఆయన దివ్య లక్షణాలు ఆత్మలోనూ సంపూర్ణంగా ఉన్నాయనే! అది నిజం కాకుంటే, ఇతర జీవుల్లా పుట్టుక నుంచి అంతరించే దాకా ఎలాంటి మార్పూ లేకుండా అదే శరీరం, అవే లక్షణాలు మనిషికి ఉండేవి.


క్రమ వికాస గతిని పొందే అవకాశాన్ని మనిషికి పరమాత్మ అనుగ్రహించాడు. మనిషి నుంచి మనీషి కావడమే ఒక ఉత్తమ అవకాశం. ఆధ్యాత్మికంగా అంచెలంచెలుగా ఎదిగే మనిషి ఆ తరవాత దైవత్వాన్ని సాధించగలడు. లోకంలో అటువంటి సదవకాశం మనిషికే తప్ప, పశుపక్ష్యాదులకు లేదు.

అక్షరజ్ఞానం అసలే లేనివారికి, పండితులకు గల తేడా మనకు స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. అలాగే ఆధ్యాత్మిక జీవితాన్ని ఆశ్రయించినవారికి, ఇతరులకు మధ్య అంతరం ప్రస్ఫుటంగా అవగతమవుతుంది.

మన చుట్టూ గలవారిలోనే వివిధ స్థాయుల వ్యక్తులను చూస్తుంటాం. వారందరూ మనుషులే. కొందరు సౌందర్యవంతులు, మరికొందరు గుణవంతులు. కొందరు ధనికులు, మరికొందరు పేదవారు. కొందరు ధీరులు, కొందరు భీరువులు. కొందరు ఆస్తికులు, కొందరు నాస్తికులు. కొందరు జ్ఞానవంతులు, మరికొందరు మూర్ఖులు. అలా లోకంలో ఎన్నెన్నో తేడాలు ఉంటాయి.

ఆత్మ తాను ప్రవేశించే దేహంలోనే జీవచైతన్యం నశించే వరకు ఉంటుంది. అందువల్ల ఆత్మకు దేహం 'అద్దె ఇల్లు వంటిది' అని ఆధ్యాత్మికవాదులు చెబుతారు. విద్యుత్తు ప్రసరించడం వల్ల వివిధ పరికరాలకు చైతన్యం కలుగుతుంది. అలాగే ఆత్మ కూడా దేహాలకు జీవచైతన్యాన్ని ప్రసాదిస్తుంది.

ఆత్మ అనేది దేహానికి యజమాని. ఉపనిషత్తులు చెబుతున్న మాట అది. ఆ యజమాని ఎంతో సాత్వికుడు. ఎప్పుడూ ఎన్నడూ ఎవరిమీదా అధికారం చలాయించడు.



అంతర్వాణి

దేహాన్ని ఆశ్రయించి ఉండే మనసు, బుద్ధి, పంచేంద్రియాలు వంటి శక్తులన్నీ ఆత్మకు సేవకులుగా మెలగాలి. అవి అలా ఉన్నప్పుడే, మనిషి అతి సులభంగా తన జీవిత కాలంలో ఉన్నత శిఖరాల్ని అధిరోహించగలడు. అలా కానప్పుడు, వైకుంఠపాళి వంటి ప్రాపంచిక వ్యవహారాల్లో అతడు తలమునకలవుతుంటాడు. పడుతూ లేస్తూ, సుఖమయ జీవితం అంటే ఏమిటో తెలియని స్థితిలో అల్లాడుతూ జీవన యాత్ర సాగిస్తుంటాడు. అంతేకాదు- సిరిసంపదలు, పేరుప్రతిష్ఠల కోసం అనైతిక మార్గాల వెంట మనిషి పరుగులు తీస్తుంటాడు. పర్యవసానంగా చివరికి అతడు దుఃఖమయ జీవితాన్నే గడపాల్సి వస్తుంది.

సుఖమయ జీవితం దేహానికి సంబంధించిందని కొందరు పొరపడతారు. కాదు. ఆ జీవితం మనసుకు, బుద్ధికి సంబంధించింది కూడా కాదు. అది కేవలం ఆత్మకు సంబంధించింది. ఆత్మసుఖమే అసలు సుఖం. అది ప్రాపంచిక సుఖాలన్నింటికీ అతీతమైనది.

ఆత్మకు కులమతాలు ఉండవు. అనంతమైన ఆనంద భావనే ఆత్మ లక్షణం. ఒక ఆత్మ మరొక ఆత్మకు సేవలు చేసేందుకు తహతహలాడుతుంటుంది. అటువంటి ఆత్మ బోధల్లో ఏ ఒక్కటీ మానవుడు వినలేకపోతున్నాడు. అన్ని జీవుల్లోనూ పరమాత్మకు ఆత్మ ప్రతినిధిగా ఉంటుందని గ్రహించలేని స్థితి అతడిది!

ప్రతి వ్యక్తీ ఇతరుల దుఃఖాన్ని తనదిగా పరిగణించాలి. తన సుఖాన్ని ఇతరులదిగా భావించాలి. అటువంటి ఆత్మబంధాన్ని అతడు పెంచుకోవాలి. అప్పుడే సుఖమయ జీవితం అంటే ఏమిటో పూర్తిగా అర్థమవుతుంది!

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

# నేరెళ్ల బాధితులకు వరంగల్ డాక్టర్లతో వైద్యం

- వైద్యుల సూచనల మేరకు అవసరమైతే నిమ్స్‌కు తరలించండి
- గాయాల తీవ్రత, కోర్టు ఆదేశాల అమలు తీరుపైనా నివేదిక ఇవ్వండి
- హోంశాఖ ముఖ్యకార్యదర్శికి ఉమ్మడి హైకోర్టు ఆదేశం

ఈనాడు - హైదరాబాద్

సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రాపురం గ్రామాల్లో పోలీసుల చిత్ర హింసలతో తీవ్రంగా గాయపడిన గ్రామస్థులకు వరంగల్ జిల్లా ఎంజీఎం ఆస్పత్రి నుంచి ఇద్దరు వైద్యులను పంపి మెరుగైన వైద్యసేవలు అందించాలని గురువారం ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు గ్రామస్థులను వైద్యులు పరీక్షించి గాయాల తీవ్రతను తెలుసుకోవాలని సూచించింది. అవసరమైతే బాధితులను నిమ్స్‌కు తరలించాలని తెలంగాణ హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. నేరెళ్ల దళితులపై దాడి సంఘటనపై దర్యాప్తును సీబీఐతోగానీ, ప్రత్యేక దర్యాప్తు బృందంతో కాని చేయించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారణ చేపట్టాలన్న అభ్యర్థన మేరకు మధ్యాహ్నం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపిస్తూ తంగళ్లపల్లి వాగు నుంచి రోజుకు దాదాపు 200 వరకు ఇసుక లారీలు నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాల ద్వారా వెళ్తుంటాయన్నారు. ఇటీవల ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల నేరెళ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందడంతో, గ్రామస్థులు ఆందోళనకు దిగారన్నారు. దీంతో జులై 4న రాత్రి 11 గంటలు దాటాక సాధారణ దుస్తుల్లో వచ్చిన పోలీసులు నేరెళ్ల, జిల్లెల, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన 8 మందిని తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ పద్ధతులను ప్రయోగించారని, రబ్బరు లాఠీలతో కొట్టడంతోపాటు కరెంట్ షాక్ ఇచ్చి చిత్రహింసలకు గురి చేశారన్నారు. మర్మాంగాలను తీవ్రంగా గాయపరచడంతో పునరుత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. జిల్లా ఎస్పీ విశ్వజిత్ స్వయంగా బాధితులను కొట్టారన్నారు. ఈ విషయాన్ని బయటికి వెల్లడిస్తే కుటుంబ సభ్యులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని బెదిరించారని కోర్టు దృష్టికి తెచ్చారు.

### గ్రామస్థుల ఆందోళనతో కోర్టులో హాజరు

పోలీసులు జులై 4న గ్రామస్థులను తీసుకెళ్లినప్పటికీ కోర్టులో హాజరుపరచలేదని, చివరికి ఆందోళనకు దిగడంతో జులై 8న కోర్టులో హాజరపరచారని న్యాయవాది చెప్పారు. కోర్టు వారిని రిమాండ్‌కు ఆదేశించిందని, అయితే గాయాలకు సంబంధించి వైద్యుల ధ్రువీకరణ ఇస్తేనే అనుమతిస్తామని జైలు సూపరింటెండెంట్ చెప్పడంతో పోలీసులు డాక్టర్ సర్టిఫికెట్ ఇప్పించారన్నారు. గాయాల తీవ్రత నేపథ్యంలో వైద్యులు కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి పంపి చికిత్స అందించారన్నారు. తరువాత వేములవాడ విడిచి వెళ్లరాదంటూ షరతులతో కూడిన బెయిలు మంజూరైందని చెప్పారు. దీంతో బాధితుల్లో ఆరుగురు అక్కడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. దీనిపై అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గాయాలకు సంబంధించి పిటిషనర్లు తీవ్ర ఆరోపణలు చేస్తున్నందున వారికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ముందు ఎంజీఎం సీనియర్ డాక్టర్లు ఇద్దరిని బాధితుల వద్దకు పంపి గాయాల తీవ్రతను నమోదు చేయాలని, మెరుగైన వైద్యం అవసరమని భావిస్తే హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించాలని పేర్కొంది. బాధితుల గాయాల తీవ్రతపై నివేదికను సమర్పించాలని వైద్యులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగా చేపట్టిన చర్యలపై పూర్తిస్థాయిలో నివేదికను కోర్టుముందుంచాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేసి తదుపరి విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది.

## మూడుచింతలపల్లికి రూ.28.71 కోట్లు విడుదల

**ఈనాడు, హైదరాబాద్:** శామీర్‌పేట మండలం మూడు చింతలపల్లి, లింగాపూర్ తండాల్లో అభివృద్ధి పనులకు రూ.29.29 కోట్లను విడుదల చేస్తూ ప్రణాళికాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం కేసీఆర్ మంగళవారం మూడుచింతలపల్లిలో గ్రామసభ నిర్వహించి అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మూడుచింతలపల్లికి రూ.28.71 కోట్లు, లింగాపూర్ తండాకు రూ.58 లక్షలు విడుదల చేస్తూ ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య ఉత్తర్వులు జారీచేశారు.







## 15 టీఎంసీలు విడుదల చేయండి..

### కర్ణాటక మంత్రిని కలిసిన తెలంగాణ అధికారులు

**ఈనాడు, హైదరాబాద్:** తాగునీటి సమస్య దృష్ట్యా 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు కర్ణాటక జలవనరుల శాఖ మంత్రి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంత్రి హరీశ్‌రావు రాసిన లేఖను తీసుకెళ్లిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు సీఈ సునీల్ నేతృత్వంలోని బృందం బెంగళూరులో కర్ణాటక మంత్రి పాటిల్‌ను కలిసి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం పూర్తిగా పడిపోవడం, హైదరాబాద్‌తో పాటు నల్గొండ జిల్లాకు తాగునీటి ఇబ్బందిని పరిగణనలోకి తీసుకొని నారాయణపూర్ నుంచి 15 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి కర్ణాటక జలభాగ్యనిగమ ఎండీతో చర్చించాలని సూచించారు. మంత్రి సూచన మేరకు ఎండీ అంజుం ఫర్వేజ్‌తో సాగర్ సీఈ చర్చించారు. గురువారం జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శితో కూడా సమావేశం కానున్నారు. మరోవైపు తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి కూడా కర్ణాటక జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శితో ఫోన్లో మాట్లాడారు.

## ఆర్డీఎస్ పనులపై చర్చిద్దాం

### కర్ణాటక, ఏపీ మంత్రులకు హరీశ్ లేఖ

రాజోలిబండ నీటి మళ్లింపు(ఆర్డీఎస్) పథకం ఆధునికీకరణ పనులపై సమావేశమై చర్చిద్దామని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రులు పాటిల్, ఉమామహేశ్వరరావులకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం లేఖ రాశారు. ఎగువన మొదటి ప్యాకేజీ పనులు సరిగా జరగడం లేదని, దీనిపై చర్చించడానికి హైదరాబాద్ రావాలని, కుదరకపోతే బెంగళూరులో అయినా సమావేశమవుదామని కర్ణాటక మంత్రికి సూచించారు. సీఈల స్థాయిలో జరిగిన సమావేశాలు ఫలితమివ్వనందున ఈ నెలాఖరులో సమావేశమవుదామని ప్రతిపాదించారు.

## ఎస్సారెస్పీ ఆధునికీకరణకు రూ.863.77 కోట్లు

**ఈనాడు, హైదరాబాద్:** శ్రీరాంసాగర్ ఆధునికీకరణ పనులకు రూ.863.77 కోట్లతో ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకతీయ కాలువ 284 కి.మీ.ల ఆధునికీకరణకు రూ.385.56 కోట్లు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతుకు రూ.356.13 కోట్లు కేటాయించారు. లక్ష్మి కాలువకు రూ.20.44 కోట్లు, సరస్వతి కాలువకు రూ.49.30 కోట్లు, సదర్‌మఠ్‌కు రూ.21 కోట్లు, శ్రీరాంసాగర్, దిగువమానేరు డ్యాంల నిర్వహణకు రూ.31.32 కోట్లు కేటాయించారు. 13.7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడం లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సోనియాగాంధీతో పొన్నాల భేటీ

**ఈనాడు, దిల్లీ:** సోనియాగాంధీతో టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య భేటీ అయ్యారు. బుధవారం పార్లమెంటులో ఆమెతో భేటీ అయిన పొన్నాల తెలంగాణలో తాజా పరిస్థితులపై చర్చించారు. టీపీసీసీ నూతన ఇన్‌ఛార్జి ఆర్‌సీ కుంతియా త్వరలో తెలంగాణలో పర్యటన అంశాలు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై మాట్లాడారు.

## హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

- అణగారిన వర్గాలకు అండగా ఉంటాం
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి



గాంధీ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లు రవి

**ఈనాడు, హైదరాబాద్:** కేంద్రంలో భాజపా.. రాష్ట్రంలో తెరాస మానవ హక్కులను కాలరాస్తున్నాయని. . దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై నిత్యం దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. అణగారిన వర్గాలకు అండగా ఉంటూ వారికి న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ్ కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు షబ్బీర్‌అలీ, మల్లురవి, కోదండరెడ్డి, జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఉత్తమ్ విలేఖరులతో మాట్లాడారు. దేశంలో మతతత్వం, నిరంకుశత్వం పెరిగిపోయిందని ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా పార్లమెంట్‌లో ప్రధాని చేసిన ప్రసంగంలో నెహ్రూ పేరును ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. చరిత్రలో అంశాలను పరిశీలిస్తే ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభలు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి అనుకూలంగా పనిచేశాయన్నారు. బ్రిటీష్‌కు అనుకూలంగా పనిచేసిన వారిని ఇప్పుడు స్వాతంత్ర్యం కోసం పనిచేసిన వారిగా పొగుడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని విస్మరిస్తున్నారన్నారు.

### పటేల్ విజయం.. భాజపాకు చెంపపెట్టు: మల్లురవి

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్ విజయం సాధించడంతో బుధవారం గాంధీభవన్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. గుజరాత్‌లో ప్రజాస్వామ్యం విజయం సాధించిందని పటేల్ గెలుపు భాజపాకు చెంపపెట్టులాంటిదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు.

## రూ.200 కోట్లతో గిరిజనులకు స్వయం ఉపాధి

### ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు వెల్లడి

**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణలో గిరిజనులకు రూ.224.20 కోట్లతో స్వయం ఉపాధి పథకాలు అమలు చేయనున్నామని గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పథకాలకు దరఖాస్తు ప్రక్రియ మొదలైందని, రెండు రోజుల్లో ఆన్‌లైన్ సదుపాయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గిరిజన యువత స్వయం ఉపాధి కోసం సెప్టెంబరు 15వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి కింద 19713 మంది గిరిజన యువతకు లబ్ధి చేకూరనుందన్నారు. ఐటీడీఏల పరిధి జిల్లాల్లో స్వయం ఉపాధి పథకాల అమలు బాధ్యతను ప్రాజెక్టు అధికారికి అప్పగించామని తెలిపారు. మిగతా జిల్లాల్లో సంబంధిత జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు అమలు చేస్తారని వెల్లడించారు. నవంబరు 15 నాటికి యూనిట్లన్నీ స్థాపించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బ్యాంకుల అనుసంధానంతో పథకాలు అమలవుతాయన్నారు. రూ.112కోట్ల ఖర్చుతో గిరిజన భూములను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

## తుమ్మలను పరామర్శించిన గవర్నర్

అస్వస్థత నుంచి కోలుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గవర్నర్ నరసింహన్ పరామర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన తుమ్మల నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్‌గా తిరుమల్‌రెడ్డి!

**ఈనాడు, హైదరాబాద్:** ఆహార భద్రతా చట్టంలో నిర్దేశించిన మేరకు తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్మన్‌తోపాటు మరో ఐదుగురు సభ్యులను నియమించింది. కమిషన్ ఛైర్మన్‌గా తిరుమలరెడ్డిని నియమించింది. సభ్యులుగా ఓరుగంటి ఆనంద్, బానోతు సంగూల్, గోవర్దనరెడ్డి, రంగినేని శారద, ఎం.భారతిలను సభ్యులుగా నియమించింది. ఐదేళ్లపాటు వారు పదవిలో ఉంటారు.

## రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోంది

- భట్టివిక్రమార్క విమర్శ

**దమ్మపేట, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్‌లో ఒప్పంద కార్మికుడు నాగేశ్వరరావు ఆత్మహత్య సంఘటనపై ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అఖిలపక్ష నాయకులను పోలీసులు బుధవారం అరెస్టు చేసి దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, ఇతరులను భట్టి పరామర్శించారు. అనంతరం విలేకర్లతో భట్టి మాట్లాడుతూ..రాష్ట్రంలో కార్మికులు, రైతులు, దళిత, బలహీన వర్గాలవారు దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. నాగేశ్వరరావు 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా, విలీనంలో చోటు దక్కకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఆ కార్మికుడి పక్షాన పోరాడుతున్న నాయకులకు అరెస్టు చేయడం దారుణమన్నారు. విలీనం కాని ఒప్పంద కార్మికుల పక్షాల జరిగే పోరాటానికి తమ పార్టీ మద్దతు తెలుపుతుందని ప్రకటించారు.

## కేటీఆర్ బామ్మర్దినంటూ వేధింపులు

- రక్షణ కల్పించాలంటూ హెచ్చార్సీని ఆశ్రయించిన బాధితులు
- నివేదిక సమర్పించాలని మాదాపూర్ ఏసీపీకి నోటీసులు



ఫిర్యాదుచేసిన బాధితులు సాయిచరణ్, అభిషేక్, న్యాయవాదులు

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ బామ్మర్దినంటూ ఓ వ్యక్తి వేధిస్తున్నాడని రాయదుర్గంలోని ఎటర్నల్ క్వెస్ట్‌ఐటీ సర్వీసెస్ సంస్థ భాగస్వాములు బోయిళ్ల సాయిచరణ్(నెల్లూరు), అరటోలు అభిషేక్ (మార్కాపురం)లు రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌ను బుధవారం ఆశ్రయించారు. తమ కంపెనీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు డబ్బులను డిమాండ్ చేస్తూ.. తమను వేధింపులకు గురిచేస్తున్న ఆ వ్యక్తి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. విచారణకు స్వీకరించిన కమిషన్ అక్టోబరు 4లోపు సమగ్ర నివేదిక సమర్పించాలని మాదాపూర్ ఏసీపీకి నోటీసులు జారీ చేసింది. తమ ప్రాజెక్టు మేనేజర్ వంశీధర్ సహకారంతో ఒక ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నామని, నెట్‌వర్కింగ్ అడ్మినిస్ట్రేటర్‌గా వెంకటస్వాయి, అవినాష్‌ను నియమించుకున్నామని బాధితులు వివరించారు. ఇరువురి మధ్య తరచూ గొడవలు జరిగేవని, కొంత కాలంగా కంపెనీ కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్నారు. ఈ క్రమంలో వంశీకృష్ణారావు ముతినేని అలియాస్ వంశీరావు అనే వ్యక్తి ఫోన్‌చేసి అసభ్యపదజాలంతో మాట్లాడటంతో పాటు తాను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బామ్మర్దినంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని, ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదంటూ దూషించాడని చెప్పారు. జీతాలు త్వరలో చెల్లిస్తామని చెబుతున్నా వినిపించుకోకుండా ఇటీవల పోలీసు సైరన్‌తో ఉన్న కారు(ఏపీ29డిఎస్ 00005)లో కార్యాలయంలోకి దూసుకొచ్చి రాయదుర్గం పోలీసు ఠాణాకు తీసుకెళ్లాడని పేర్కొన్నారు. అక్కడ పోలీసులతో బెదిరింపచేశాడని, అక్కడినుంచి తన కారులోనే తీసుకెళుతూ తుపాకి గురిపెట్టి తాను చెప్పింది వినకపోతే చంపేస్తానంటూ బెదిరించి రోడ్డుపై వదిలి వెళ్లిపోయాడని బాధితులు వివరించారు. తమకు రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు.

# రహదారి వనాలు!



సిద్దిపేట జిల్లా కోమటిబండ గ్రామంలో రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు

- సిద్దిపేట జిల్లాలో భారీగా అవెన్యూ ప్లాంటేషన్
- 400 గ్రామాలు.. 1,200 కిమీ మేర రహదారికి ఇరువైపులా మొక్కలు

ఈనాడు – హైదరాబాద్

రహదారి మార్గాల్లో పచ్చదనంతోపాటు ప్రయాణంలో ఆహ్లాదాన్ని కలిగించే అవెన్యూ ప్లాంటేషన్ పంచాయతీ రహదారి మార్గాల్లోనూ ప్రారంభమైంది. తెలంగాణలో మొట్టమొదటిసారిగా సిద్దిపేట జిల్లాలో మొత్తం అన్ని గ్రామాల్లో దీన్ని చేపడుతున్నారు. దీనికింద నాలుగు వందల గ్రామాల్లో పన్నెండు వందల కిలోమీటర్ల మేర మొక్కలు నాటుతున్నారు. మొత్తంగా సుమారు 4.80 లక్షల మొక్కలను మార్చి నాటికి నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

### ఒక్కో ఊరికి మూడు కిలోమీటర్లు

ఊర్లోకి అడుగుపెట్టగానే పచ్చదనం కన్పించేలా గ్రామానికి ఈ చివర నుంచి ఆ చివర వరకు మొక్కలు నాటనున్నారు. సగటున ఒక్కో ఊరి పరిధిలో మూడు కిలోమీటర్ల అవెన్యూ ప్లాంటేషన్ రానుందని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. రంగురంగుల పూలతో కన్పించే గుల్‌మోహర్, మహాఘని, తబూబియా వంటి రకాలతోపాటు సురాయి, కదంబ, రావి, వేప మొక్కలను నాటుతున్నారు. సిద్దిపేట జిల్లాలో మొత్తం 1,200 కిమీ రహదారుల్ని ఎంపిక చేయగా అటవీశాఖ రెండొందల కిలోమీటర్ల పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్ మొదలుపెట్టింది. మరో వెయ్యి కిలోమీటర్ల రహదారులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు దీన్ని చేపడుతోంది. గ్రామీణ రహదారులూ పచ్చదనంతో కళకళలాడేలా ఒక్కో కిలోమీటర్ రహదారికి సగటున 400 మొక్కలు నాటుతున్నట్లు అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు.

### మొక్కల సంరక్షణకు బాధ్యులు

నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక కమిటీలను నియమిస్తున్నారు. పంచాయతీయ కార్యదర్శి, ఉపాధ్యాయుడు, పంచాయతీ సభ్యుడు.. ఇలా ఎనిమిది, తొమ్మిది మందితో కూడిన బృందానికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 50 శాతం వరకు మొక్కలు నాటినట్లు సమాచారం. అటవీశాఖ నిధులతోపాటు ప్రధానంగా ఉపాధి హామీ పథకం కింద ఈ మొక్కలు నాటడం, వాటి నిర్వహణ పనులు చేపడుతున్నారు.

## నిరసనలకు ధర్నాచౌక్‌ను ఎందుకు అనుమతించడంలేదు?

• రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్, ధర్నా చౌక్ వద్ద బహిరంగ సభలు, నిరాహార దీక్షలు, ఊరేగింపుల తదితర నిరసన కార్యక్రమాలకు అనుమతించకపోవడంపై వివరణ ఇవ్వాలని ఉమ్మడి హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఇందిరా పార్క్, ధర్నా చౌక్‌వద్ద నిరసన కార్యక్రమాలకు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాలకు అనుమతించకపోవడం రాజ్యాంగవిరుద్ధమన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ నిరసన వ్యక్తం చేసే హక్కు అందరికీ ఉందని, ఇతరులకు ఇబ్బందులేకుండా, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎవరైనా చేపట్టవచ్చని తెలిపింది. అయితే నిర్దిష్ట ప్రాంతంలోనే నిరసన కార్యక్రమాలకు అనుమతించాలని ప్రభుత్వాన్ని ఎలా ఆదేశించగలమని, దీనికి సంబంధించి చట్టంలో ఏమైనా నిబంధనలున్నాయేమో చెప్పాలంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమాలకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ప్రస్తుతం శంషాబాద్, శామీర్‌పేట, జవహర్‌నగర్, మేడిపల్లి వంటి నగర శివార్లలో నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి అనుమతించలేదని పిటిషనర్ చెబుతున్నారు. 40 కిలోమీటర్ల దూరం వెళ్లి నిరసన వ్యక్తం చేయడం ఎలా సాధ్యమవుతుందన్నారు. ఈ దశలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.శరత్‌కుమార్ జోక్యం చేసుకుంటూ ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలోనే ఇక్కడ నిరసనలకు అనుమతించారని, ప్రస్తుతం రాష్ట్ర విభజన జరిగి ఇంకా చిన్నదైనప్పుడు ట్రాఫిక్ అంతరాయం అనడం సరికాదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## మాదకద్రవ్యాల సరఫరాపై సమాచారం లేదు

• కేంద్రహోంశాఖ వెల్లడి

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్‌లోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లక్ష్యంగా మాదకద్రవ్యాల (డ్రగ్స్) సరఫరా చేస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం అందలేదని కేంద్రహోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో తెదేపా సభ్యులు దేవేందర్ గౌడ్, సీఎం రమేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. విదేశాల నుంచి భారత్‌కు ఎల్‌ఎస్‌డీ, ఎండీఎంఏ సరఫరా అవుతున్నట్లు కూడా ఎలాంటి నివేదికలు లేవన్నారు. 2005-12 మధ్యకాలంలో డ్రగ్స్ నియంత్రణ కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.79.43 లక్షల సాయం అందించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఇలాంటి ఆర్థికసాయం పొందడానికి సంస్థాగతమైన యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామని, ఇంతవరకూ అలాంటిదేమీ ఏర్పాటు చేయలేదని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను అరికట్టడానికి అనుమానాస్పద మార్గాల్లో నిఘా పెంచినట్లు చెప్పారు. అంతర్జాతీయంగా వివిధ దేశాలతో డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొని అందుకు అనుగుణంగా నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

### పసుపు బోర్డుకోసం ప్రతిపాదనలే రాలేదు

పసుపు బోర్డు ఏర్పాటు కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇంతవరకూ తమకు ప్రతిపాదనలే అందలేదని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. తెరాస సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ బుధవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు.

# ఆ అధికారం ప్రభుత్వానికుంది

- పోస్టులన్నీ మహిళా అభ్యర్థులతో భర్తీ చేయొచ్చు
- గురుకుల పోస్టులపై సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: బాలికలు, మహిళా విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులన్నింటినీ మహిళా అభ్యర్థులతో భర్తీ చేసే అధికారం తెలంగాణ సర్కారుకు ఉందని ఉమ్మడి హైకోర్టు స్పష్టంచేసింది. గతంలో ఇలాంటి వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు ఇలాగే తీర్పులిచ్చిందని గుర్తుచేసింది. మహిళా సాధికారిత మరింత సాధించే దిశగా మహిళలతో పోస్టులను భర్తీ చేసేందుకు అధికరణ 15(3) ప్రభుత్వాలకు వెసులుబాటు కల్పిస్తుందని తెలిపింది. రాష్ట్రంలోని సాంఘిక, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ గురుకుల బాలికలు, మహిళా విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం పోస్టులను మహిళా అభ్యర్థులతో భర్తీ చేసేందుకు వీలు కల్పిస్తూ 2016 జూన్ 4న తెలంగాణ సాధారణ పరిపాలన శాఖ జీవో 1274ను జారీచేసింది. ఈ జీవో అమలును నిలుపుదల చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులపై తెలంగాణ సర్కారు ధర్మాసనం ముందు అప్పీలు దాఖలు చేసింది. ఇటీవల సింగిల్ జడ్జి ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. తాజాగా బుధవారం సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం రద్దు చేసింది. గురుకులాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియను కొనసాగించొచ్చని, ఆ నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని తేల్చిచెప్పింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. బుధవారం జరిగిన విచారణలో తెలంగాణ ఏజీ డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మహిళా అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేసేలా విధానపరమైన నిర్ణయం తీసుకొనే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు దాఖలు చేసిన పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఏడు వేల పోస్టులను కేవలం మహిళలతో భర్తీ చేయడం పురుష అభ్యర్థుల పట్ల వివక్షత చూపడమేనన్నారు. 'షీ టీమ్స్'లో సైతం పురుషులకు స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఒకరిద్దరి కోసం నియామకాల ప్రక్రియను నిలువరించలేమంది. సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేస్తూ.. సర్కారు దాఖలు చేసిన అప్పీళ్లను పరిష్కరించింది. అంతిమంగా పిటిషనర్లు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాల్లో విజయం సాధిస్తే వారికి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించే అవకాశం ఉందని పేర్కొంది. ధర్మాసనం ఉత్తర్వుల నేపథ్యంలో సింగిల్ జడ్జి వద్ద ఉన్న వ్యాజ్యాలపై తుది విచారణ జరగాల్సి ఉంటుంది.

## డీఎస్సీ ప్రకటనపై అయోమయం

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామకాల ప్రకటన జారీపై తెలంగాణ ప్రభుత్వం అయోమయంలో పడింది. ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాల్సింది డీఈఓలే కాబట్టి కొత్త జిల్లాల ప్రకారమే నియామకాలు జరపాలని ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ, న్యాయ శాఖ నుంచి కొద్ది రోజుల క్రితం స్పష్టత తీసుకుంది. అదే విషయాన్ని సుప్రీం కోర్టుకు కూడా తెలిపింది. మొత్తం 8,792 ఖాళీలను భర్తీ చేసేందుకు సెప్టెంబరు 11 వరకు గడువు కావాలని అడగడం... సుప్రీం కోర్టు అంగీకరించడం తెలిసిందే. కొత్త జిల్లాల ప్రకారం అయితే కేవలం కొన్ని జిల్లాల్లోనే ఎక్కువ ఖాళీలు ఉంటాయని... 2015లో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక శాతం మంది పట్టణ, నగరాలకు, వాటికి దగ్గరున్న ప్రాంతాలకు బదిలీ అయ్యారని అభ్యర్థులు చెబుతున్నారు. కొత్త జిల్లాల ప్రకారం ప్రకటన జారీ అయితే న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పదంటున్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సైతం రెండ్రోజుల క్రితం కొత్త జిల్లాలపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇంకా ఇవ్వనందున ఈనెల 11న సమావేశం డీఎస్సీ నిర్వహణపై చర్చిస్తామని నిరుద్యోగ అభ్యర్థులకు తెలిపారు. మొత్తానికి డీఎస్సీ ప్రకటన జారీ ఆలస్యమయ్యే అవకాశం ఎక్కువగా ఉంది.

### 17న చివరి విడత ఎంసెట్ బైపీసీ కౌన్సెలింగ్

ఇంటర్ బైపీసీ విద్యార్థులు బీఫార్మసీ, ఫార్మా డి, బీటెక్ బయోటెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 17న తుది ఎంసెట్ బైపీసీ విడత కౌన్సెలింగ్ జరగనుంది. ఆరోజు ధ్రువపత్రాల పరిశీలన చేస్తారు. ఈనెల 17, 18న ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 20న సీట్లు కేటాయిస్తారు.

## డిమాండ్లు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉద్ధృతం: ఈసీఏఎన్ఎంలు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో సేవలందిస్తున్న ఈసీఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఈసీఏఎన్ఎంలు బుధవారం కోఠిలో సమావేశమయ్యారు. వీరంతా రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏఎన్ఎంలు ఓఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. అక్కడికి పోలీసులు చేరుకోవడంతో వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రసన్న మాట్లాడుతూ ఈ నెల 16వరకు చూస్తామని అప్పటికీ న్యాయం జరగకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామన్నారు.

## లైసెన్సుతోపాటు మొక్క ఉచితం

ఈనాడు, వరంగల్ : వరంగల్ రవాణా కార్యాలయంలో హరితహారాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల రిజిస్ట్రేషన్ తదితర సేవల కోసం కార్యాలయానికి వచ్చే వారికి ఒక్కో మొక్కను బహూకరిస్తున్నారు. ఈ వినూత్న ఆలోచనకు నాంది పలికారు జిల్లా రవాణాధికారి శివలింగయ్య. ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటుచేసి పది వేల మొక్కలను అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు 9000 మొక్కలను పంపిణీ చేశారు. మరో వెయ్యి మొక్కలను ఈనెల 12లోగా ఇవ్వనున్నారు.



లైసెన్సు పొందిన ఒక వ్యక్తికి మొక్కను అందజేస్తున్న డీటీసీ శివలింగయ్య

## విద్యుత్తు ఇంజినీర్ల నియామకం కేసు

● తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో విద్యుత్తు సంస్థల ఇంజినీర్ల నియామకంలో అర్హులైన వారు ఉద్యోగాలకు రాని కారణంగా తదుపరి మెరిట్ జాబితాతో ఖాళీలను భర్తీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. బుధవారం జస్టిస్ మదన్.బి.లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసు విచారణ చేపట్టింది. కొత్త నోటిఫికేషన్ వెలువరించాలంటూ హైకోర్టును ఆశ్రయించిన వారి తరఫున సీనియర్ న్యాయవాది ఏడీఎన్ రావు వాదనలు వినిపిస్తూ.. వెయిటింగ్‌లిస్ట్ జాబితా ఉండదని ప్రభుత్వం నోటిఫికేషన్‌లోనే స్పష్టం చేసిందని తెలిపారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, న్యాయవాది శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. దరఖాస్తు ధ్రువీకరణకు పిలిచినపుడు అభ్యర్థి రాని పక్షంలో తదుపరి వారితో ఉద్యోగాన్ని భర్తీ చేయొచ్చని తెలిపారు. ఒక్కో అభ్యర్థి నాలుగేసి పోస్టులకు ఎంపికయ్యారంటూ ఆ వివరాలను సమర్పించారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు తెలిపింది.

## న్యాయవాది శివరామశాస్త్రికి హైకోర్టు నివాళి

ఈనాడు, హైదరాబాద్: ఇటీవల మృతిచెందిన సీనియర్ న్యాయవాది వై.శివరామశాస్త్రికి బుధవారం హైకోర్టు ఘన నివాళి అర్పించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, తెలంగాణ అడ్వొకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాశ్‌రెడ్డి, ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ శివరామశాస్త్రి సేవలను కొనియాడారు. బుధవారం హైకోర్టు ఏసీజే రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని అందరు న్యాయమూర్తులు, పలువురు న్యాయవాదులు మొదటి కోర్టు హాలులో సమావేశమై రెండు నిముషాలు మౌనం పాటించారు.

# ఎంపీసీ విద్యార్థులకు చేజారిన అవకాశం

- వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ సీట్లు ఇవ్వాలన్న ఐసీఏఆర్
- తెలుగు రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల్లో అర్హత కల్పించలేదు
- మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో చేరుతున్న ఇక్కడి విద్యార్థులు

ఈనాడు – హైదరాబాద్

ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూపుతో ఉత్తీర్ణులైన 3 లక్షల మంది విద్యార్థులకు తెలుగు రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ కోర్సుల్లో చేరే సువర్ణావకాశం ఈ ఏడాది చేజారింది. ఈ రెండు రాష్ట్రాల వర్సిటీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎంపీసీ విద్యార్థులకు ఈ సీట్ల ప్రవేశార్హత కల్పించే ఎంసెట్ రాయలేకపోయారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల్లోని అనేక రకాల డిగ్రీ కోర్సుల్లో ఈ ఏడాది నుంచే ఎంపీసీ గ్రూపు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ, ఇంజినీరింగు డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు వేర్వేరు ఎంసెట్‌లున్నాయనే సాకుతో ఎంపీసీ విద్యార్థులను పట్టించుకోలేదు. ఈ గ్రూపు తెలుగు విద్యార్థులను ఇప్పుడు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల ప్రైవేటు కాలేజీలు లక్షలాది రూపాయల డొనేషన్లు కట్టి చేర్చుకుంటున్నాయి. మహారాష్ట్రలో 4 వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా పలు ప్రైవేటు కాలేజీలున్నాయి. ఇవి తెలంగాణకు ఆనుకుని ఔరంగాబాద్, నాందేడ్, పర్బనీ తదితర ప్రాంతాల్లో ఉండటం వల్ల ఇక్కడి విద్యార్థులు అధికంగా ఫీజులు కట్టి చేరడానికి సిద్ధపడుతున్నారు.

### ఐసీఏఆర్ కోటాలోనూ వస్తున్నారు...

వ్యవసాయ, ఉద్యాన డిగ్రీకోర్సుల సీట్లలో 85 శాతం మాత్రమే రాష్ట్ర వర్సిటీలు స్థానిక కోటాలో భర్తీ చేయాలి. మిగిలిన 15 శాతం కోటా సీట్లు దేశవ్యాప్తంగా ఎక్కడి విద్యార్థులైనా వచ్చి చేరవచ్చు. ఈ 15 శాతం కోటా సీట్ల భర్తీకి 'భారత వ్యవసాయ పరిశోధనా మండలి'(ఐసీఏఆర్) ఏటా దేశవ్యాప్తంగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా వారు కోరుకున్న రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీట్లు కేటాయిస్తుంది. ఈ విద్యా సంవత్సరానికి ఈ కోటా సీట్లను సైతం ఎంపీసీ విద్యార్థులకు ప్రవేశార్హతను ఐసీఏఆర్ కల్పించింది. ఎంపీసీ, బైపీసీలతో పాటు ఎంబైపీసీ గ్రూపు చదివినవారు ఎవరైనా ఐసీఏఆర్ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు వస్తే ఈ 15 శాతం కోటాలో సీట్లు ఇస్తున్నారు. ఒకవేళ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎంపీసీ గ్రూపు విద్యార్థులు ఈ పరీక్ష రాసి ఉంటే వారికి వ్యవసాయ, ఉద్యాన డిగ్రీల్లో సీట్లు రెండు రాష్ట్రాల వర్సిటీలు ఇవ్వాల్సిందే. కానీ మిగిలిన 85 శాతం కోటాకు మాత్రం అర్హత లేదని చేర్చుకోవడం లేదు.

### వచ్చే ఏడాది నుంచి పరిశీలిస్తాం

– ప్రవీణ్‌రావు, ఉప కులపతి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ

ఎంపీసీ విద్యార్థులకు సీట్లు ఇవ్వమని ఐసీఏఆర్ చెప్పిన మాట వాస్తవమే. కానీ దీని అమలుకు అనేక సాంకేతిక సమస్యలున్నాయి. వీటిని అధిగమించి వచ్చే ఏడాది నుంచి ఇవ్వడానికి పరిశీలిస్తున్నాము.

### ఈ ఏడాది ఇవ్వలేదు

– టీవీ సత్యనారాయణ, రిజిస్ట్రార్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ, ఏపీ

ఎంపీసీ విద్యార్థులకు సీట్లు ఇవ్వడానికి ఈ ఏడాది మేం సిద్ధం కాలేదు. ఈ విషయం గురించి ఐసీఏఆర్ నుంచి సమాచారం వచ్చింది. మా వర్సిటీ అకడమిక్ కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## ప్రైవేటు కేంద్రాల్లోనూ ఉద్యోగులకు ఎంఆర్ఐ, సీటీ స్కాన్

టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు కేంద్రాల్లోనూ ప్రభుత్వ ఉద్యోగులు ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి ముఖ్యమైన పరీక్షలు చేయించుకోవడానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ అంగీకరించినట్టు టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో మాత్రమే ఈ సదుపాయం ఉండడంతో ఉద్యోగులు, పింఛనుదారులు చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. బుధవారమిక్కడ ఆయన తివారీని కలిసి ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఉద్యోగుల వైద్య పరీక్షల కోసం గతంలో ప్రకటించినట్లుగా మిగతా 12 కేంద్రాలనూ నెలకొల్పాలని కోరామని రవీందర్‌రెడ్డి చెప్పారు. భార్య, భర్తలను ఒకే చోటుకు బదిలీ చేసే ప్రక్రియకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖలో దాదాపు 150 దస్త్రాలు అపరిష్కృతంగా ఉన్న విషయాన్ని తివారీ దృష్టికి తీసుకెళ్లామని.. వాటిపై వెంటనే నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు. రవీందర్‌రెడ్డితో టీఎన్జీవో ప్రతినిధులు మామిళ్ల రాజేందర్, రమాదేవి, కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

## సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యమివ్వాలి

రైల్వేబోర్డు ఛైర్మన్ మిత్తల్

ఈనాడు, హైదరాబాద్: రైళ్ల రాకపోకల్లో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా మరింతగా దృష్టి సారించాలని, నిర్వహణలో భద్రతపరమైన చర్యలపై ఆకస్మిక తనిఖీలు జరపాలని రైల్వేబోర్డు ఛైర్మన్ ఏకే మిత్తల్ ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వేజోన్ల జనరల్ మేనేజర్ల(జీఎం)తో మిత్తల్ బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. దక్షిణమధ్యరైల్వే జోన్ నుంచి జీఎం వినోద్‌కుమార్‌యాదవ్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. సురక్షిత ప్రయాణాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా చూడాలని, మిత్తల్ సూచించారు.

# బాసర ఘటనలో బాధ్యుల సస్పెన్షన్

● ఈనాడు కథనానికి స్పందన


బాసర న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా బాసర జ్ఞానసరస్వతీ ఆలయం నుంచి ఉత్సవమూర్తిని తీసుకెళ్లి దేవరకొండలో అక్షరాభ్యాసాలు నిర్వహించిన ఘటనలో బాధ్యులపై దేవాదాయశాఖ కొరడా ఝుళిపించింది. ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్, సప్తశతి పారాయణదారు ప్రణవ్‌శర్మను దేవాదాయశాఖ విధుల నుంచి తొలగించింది. బాసర ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి బుధవారం బాసరలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేవరకొండలో అక్షరాభ్యాసాలు నిర్వహించినట్లు, అమ్మవారి ఉత్సవమూర్తిని తీసుకువెళ్లినట్లు దేవాదాయశాఖ విచారణలో తేలిందన్నారు. ఈనాడు ప్రధాన సంచికలో 'జ్ఞాన సరస్వతీని ఊరు దాటించారు' శీర్షికన ప్రచురితమైన కథనం మేరకు ఘటనపై ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి విచారణ నిర్వహించి సంబంధిత ఉద్యోగుల వాంగ్మూలాలు, ఈనాడులో వచ్చిన చిత్రాలు, వివరాలతో సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగా దేవాదాయశాఖ కమిషనర్ శివశంకర్ బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

**ఉత్సవమూర్తి గల్లంతుపై పోలీసులకు ఫిర్యాదు:** జూలై 28న ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్ ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తిని తీసుకెళ్లారు. తిరిగి ఆలయానికి అప్పజెప్పే సమయంలో సిబ్బంది ఉత్సవమూర్తిని స్వీకరించలేదు. దీంతో ఎక్కడో దాచిపెట్టారు. ఘటనలో తన ప్రమేయం లేదని చెప్పటానికి విగ్రహం విషయంలో ప్రధాన అర్చకుడు గోప్యత పాటించారు. చివరకు ఉత్సవమూర్తి తన బీరువాలో ఉందని బుధవారం మీడియాకు వెల్లడించారు. విషయం అధికారికంగా ఆలయానికి వెల్లడించకపోవటంతో ఆలయ ఈవో ఆదేశాల మేరకు ఆలయ పర్యవేక్షకుడు సాయిలు ఉత్సవమూర్తి ఆచూకీ తెలియటం లేదని, సంజీవ్‌కుమార్, ప్రణవ్‌శర్మ బాధ్యులుగా పేర్కొంటూ బాసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ముథోల్ సీఐ రఘుపతి ఆలయానికి వచ్చి విచారణ నిర్వహించారు.

# అలిపిరిలో మరోసారి కలకలం

- తుపాకి, బులెట్లు స్వాధీనం
- మహారాష్ట్రకు చెందిన వారివిగా గుర్తింపు

తిరుపతి, న్యూస్‌టుడే: తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రంలో బుధవారం మరోసారి కలకలం రేగింది. గత వారం మహారాష్ట్రకు చెందిన భక్తుడి నుంచి పిస్టల్, మూడు రకాల 14 రౌండ్ల బులెట్లను స్వాధీనం చేసుకోగా.. బుధవారం అదే రాష్ట్రానికి చెందిన మరో కుటుంబం నుంచి తుపాకీ, 14 బులెట్లను స్వాధీనం చేసుకున్నారు. వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు మహారాష్ట్రకు చెందిన వారి నుంచి తుపాకి, బులెట్లు దొరకడం అనుమానాలకు తావిస్తోంది. బుధవారం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద తితిదే విజిలెన్స్, ఎస్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా.. మహారాష్ట్రకు చెందిన సుధాకర్ తన భార్య, కుమారుడితో వాహనంలో వచ్చారు. వాహనాన్ని తనిఖీ చేయడానికి యత్నించిన సిబ్బందికి వారు సహకరించలేదు. దీంతో అనుమానం వచ్చి తనిఖీలు నిర్వహించారు. వాహనంలో డ్రైవర్ సీటు కవర్ లోపల చేతిగుడ్డలో చుట్టి దాచి ఉంచిన ఆరు బులెట్లు నింపిన ఒక రైఫిల్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న తితిదే సీవీఎస్‌వో రవికృష్ణ కేంద్రం వద్దకు చేరుకుని సుధాకర్ కుటుంబ సభ్యులను విచారించారు. తుపాకీ, బులెట్లకు మహారాష్ట్రకు చెందిన లైసెన్స్ ఉందని, వీరు ఇతర రాష్ట్రాలకు తీసుకొచ్చి తప్పిదం చేశారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో సుధాకర్ కుమారుడు మరుగుదొడ్డికి వెళుతున్నట్లు చెప్పి గరుడా కూడలిలోని పాత చెక్‌పాయింట్ మార్గంలో చెత్తకుప్ప వద్ద చేతిగుడ్డలో చుట్టి ఒక వస్తువును వేశారు. దీన్ని గమనించిన ఓ సాధువు వెళ్లి చూడగా అందులో 8 బుల్లెట్లు ఉన్నాయి. వాటిని అక్కడే ఉన్న దాసు అనే సిబ్బంది సహాయంతో అలిపిరి ఏవీఎస్‌వో గంగరాజుకు అప్పగించారు. ఉదయం పట్టుబడిన బుల్లెట్ల లాట్ నెంబరు, మధ్యాహ్నం పట్టుబడిన లాట్ నెంబరు ఒకే సంఖ్య కావడం, సీసీ టీవీలో సుధాకర్ కుమారుడు అక్కడకు వెళ్లడం చూసి వారివే అని నిర్ధారించుకున్నారు. విచారణ నిమిత్తం తిరుమల టూటౌన్ పోలీసులకు కేసును అప్పగిస్తున్నట్లు తెలిపారు.





| NIT నెం. | పని పేరు | అంచనా మొత్తము/ECV | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేదీ/ చివరి తేదీ & సమయాలు | అధికారి పేరు, చిరునామా & సెల్ నెం. |
|---|---|---|---|---|
| GHMC/MKJ/E/TN/ 2017-18/11 | [illegible] UGD-08 ... | 175.85 లక్షలు | 11.08.17 సా. 4.00 గం./ 19.08.17 సా. 4.30 గం. | GHMC/MKJ/E.E.డివిజన్–28 సెల్ నెం. 9989930374 |
| 35/EE-14/GHMC, DB/2017-18 | GHMC [illegible] | 54.40 లక్షలు | 10.08.17 ఉ. 10.30 గం./ 11.08.17 మ. 3.30 గం. | E.E. డివిజన్.14, GHMC ఫోన్ నెం. 04024740213 |
| GHMC/MKJ/E/TN/ 2017-18/12 | [illegible] | 18.40 లక్షలు | 10.08.17 సా. 4.00 గం./ 17.08.17 సా. 4.30 గం. | GHMC/MKJ/E.E.డివిజన్–28 సెల్ నెం. 9989930374 |
| 29/EE/Div.8(4C)/SZ/ GHMC/2017-18 | CC రోడ్డు వేయుట పనులు | 3.30 లక్షలు | 11.08.17 ఉ. 10.30 గం./ 16.08.17 సా. 4.00 గం. | E.E. డివిజన్-8(4C) SZ, GHMC సెల్ నెం. 7331189763 |
| 14/EE(SWM & T) /GHMC/2017-18 | 2017-18 [illegible] | [illegible] | 10.08.17 ఉ. 11.00 గం./ 16.08.17 మ. 2.00 గం. | O/o. EE (SWM&TR) GHMC సెల్ నెం. 9989930394 |

# వసుంధర

'ఒక్కోసారి జీవితం అంటే ఇదేనా అనిపిస్తుంది. కాస్త ఓర్పుకోగలిగితే.. కష్టాలని తట్టుకోగలిగితే.. ఈ జీవితం ఎంత అద్భుతంగా ఉందో కదా! అనీ అనిపిస్తుంది. ఆ మొదటి అనుభవానికీ, రెండోదానికీ మధ్య ఉన్న తేడా.. విజయమే!' అంటారు దాసరి అరుణ.

'గ్రీన్ టెక్' పేరుతో పర్యావరణహిత ప్లాస్టిక్ ముడిసరకుని పెద్దస్థాయి ఉత్పత్తి సంస్థలకి సరఫరా చేస్తుంటారామె. ప్లాస్టిక్ వల్ల ఏర్పడే కాలుష్యంపై ఓ మామూలు గృహిణిగా ఆమెలో ఏర్పడ్డ బాధ.. ఇంతపెద్ద పరిశ్రమకి బీజం వేసింది. ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే..



## ఆ ప్లాస్టిక్ సీసాలే... ఆలోచన మార్చాయి!

'నడిచే దారి ఎప్పుడూ పూల బాట కాదు. ముళ్లుంటాయి రాళ్లుంటాయి. వాటిని దాటుకుంటూ నడవడం అలవాటు చేసుకుంటేనే గమ్యం చేరగలుగుతాము. అలా కాకుండా భయపడుతూ కూర్చుంటే అక్కడే ఉండిపోతాం..!' - ఇలా ఎప్పటికప్పుడు నాకు నేను చెప్పుకుంటూ ఉండటం వల్లే సవాళ్లెన్ని ఎదురైనా అనుకున్న లక్ష్యం చేరుకోగలిగాను. నేను పుట్టిపెరిగిందంతా సికింద్రాబాద్‌లోనే. ఎంబీఏ హెచ్ఆర్ మొదటి ఏడాదిలో ఉన్నప్పుడే నాకు పెళ్లయ్యింది. మా వారు మార్కెట్ రీసెర్చర్‌గా పనిచేస్తున్నారు. పెళ్లైన నాలుగేళ్లకే ఇద్దరు పిల్లలు. దాంతో ఉద్యోగం చేయలేకపోయాను. కానీ ఎంబీఏ చదివి ఖాళీగా ఉండిపోతున్నాననే బాధ వేధిస్తుండేది. మా వారు 'నీకు నచ్చింది చెయ్. నిన్ను కాదన్నదెవరూ?!' అని వెన్నుతట్టినా ఏం చేయాలో తోచేది కాదు. ఓ సారి నేను రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ప్రయాణికులు వాడిపాడేసిన ప్లాస్టిక్ నీళ్ల సీసాలను యథాలాపంగా చూశా. రోజూ ఇలా ఎన్ని ఖాళీ బాటిళ్లు వస్తున్నాయో! వీటిని అలానే పడేయటం వల్ల మానవాళికి ఎంత ప్రమాదం!! అనిపించింది. వాటిని మరో మార్గంలో అయినా ఉపయోగించొచ్చా.. లేదా రీసైకిల్ చేయొచ్చా? అనే ఆలోచనలు నాలో మొదలయ్యాయి. ఖాళీగా ఉంటున్న నాకు ఓ వ్యాపకం దొరికింది! ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఏర్పడే కాలుష్యాన్ని నివారించేలా ఏదైనా ప్రాజెక్ట్ ప్రారంభిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో రోజూ అంతర్జాలంలో వెతికేదాన్ని. ఈ శోధన ఒక్కరోజుతో పూర్తవ్వలేదు.. ఐదేళ్లు పట్టింది!

### అంత పెట్టుబడా?!

ఆ తరవాత ఒకటికాదు మూడు ఆలోచనలు తట్టాయి! మనం నిత్యం చూస్తున్న పెట్‌బాటిల్ రీసైక్లింగ్ యూనిట్ అందులో ఒకటి. అతి సన్నటి ప్లాస్టిక్ కవర్ల తయారీ కోసం మల్టీలేయర్ సిల్లమ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఇంకొకటి. మూడోది, పాత ప్లాస్టిక్‌ని రీసైక్లింగ్ చేసి గ్రాన్యువల్స్‌గా మార్చి అమ్మడం. మొదటి రెండు ఆలోచనలకీ పెట్టుబడి కోటి రూపాయలకు పైగా అవుతుందని తెలిసింది! ఆ మొత్తానికి కనీసం ఇరవై ఐదుశాతం మూలధనం నేనే చూసుకోవాలి. నాకు అది సాధ్యం కాదు. ఇక మిగిలింది చివరిది 'ప్లాస్టిక్ గ్రాన్యువల్స్'! అది ఎలా చేయాలబ్బా.. అనుకున్నప్పుడు సీపెట్(సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ టెక్నాలజీ) గురించి తెలిసింది. అక్కడ శిక్షణ తీసుకున్నాకే నా ఆలోచనలకి తుది రూపొచ్చింది. అసలు ప్లాస్టిక్ ఎన్నిరకాలు? ఏ రకాలని రీసైక్లింగ్ చేయగలం? ఏవి పర్యావరణానికి హానికరం? వాటి కాలుష్య స్థాయిని ఎలా పరీక్షించాలి? ఇలా చాలా విషయాలే తెలుసుకున్నా. కానీ కేవలం అవగాహనతో వ్యాపారం ప్రారంభించలేను కదా!

### నాలుగు నెలలు తిరిగా...

పరిశ్రమ ప్రారంభించేందుకు కావాల్సిన ఆర్థిక వనరులు సేకరించే పనిలోపడ్డా. ఎమ్ఎస్ఎమ్ఈ(సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ) కేంద్రానికి వెళ్లి ప్లాస్టిక్ రీసైక్లింగ్ సంస్థల దగ్గరకు వివరాలు తెలుసుకునేదాన్ని. అవెలా పనిచేస్తున్నాయో స్వయంగా తెలుసుకునేదాన్ని. ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసుకున్నాను. రుణాల కోసం బ్యాంకుల ముందువాలాను. అవి ఒక పట్టాన నమ్మవు కదా! 'ఆడపిల్లవు నీకిలాంటి వ్యాపారమేంటీ!' అన్నారు. 'సొంత స్థలం లేదు. లీజుకు తీసుకోవాలంటే కూడా బోలెడు ఇబ్బందులు. 'ఇంత రుణం తీసుకుంటున్నావు... నీకేం అనుభవం ఉంది మరీ?' అని ప్రశ్నించారు. అనుభవం కావాలంటే ముందు అవకాశం ఇవ్వాలికదా...! నేను నా ఆలోచనలూ ఎంత శక్తిమంతమైనవో వారికి సూటిగా, స్పష్టంగా చెప్పగలిగాను. ఎట్టకేలకు నలభైఐదు లక్షల రూపాయలు రుణంగా ఇచ్చారు. మా ప్రాజెక్ట్ ఖర్చేమో డెబ్భై లక్షల రూపాయలు! మిగతా డబ్బు కోసం ఉన్న బంగారం మొత్తం తాకట్టు పెట్టాను. ఆ డబ్బుతో మిషన్లు కొన్నా!

### ఇబ్బందులెన్నో...

వృథాగా మిగిలిన ప్లాస్టిక్ పైపుల్లాంటివాటిని రీసైక్లింగ్ చేసి.. అతిచిన్నపాటి ప్లాస్టిక్ ముక్కలు(గ్రాన్యువల్స్)గా తయారుచేయాలన్నదే నా లక్ష్యం. ఆ పని ప్రారంభించాలంటే.. ముందు నైపుణ్యం ఉన్న పనివాళ్లు అవసరం. చాలా ప్రయత్నించాక ఓ ఆపరేటర్ దొరికాడు. కానీ మాకు ముడిసరకు.. ప్లాస్టిక్ వ్యర్థాలు ఆశించినంత మేరకు దొరకడం గగనమయ్యేది. పైగా వాటిని రుణాలపై ఇవ్వరు. డబ్బు ఇచ్చి తీసుకోవాల్సిందే(క్యాష్ అండ్ క్యారీ!). కానీ వాటి ద్వారా నేను చేసిన గ్రాన్యువల్స్ మాత్రం రుణ ప్రాతిపదికన ఇవ్వాలి! అందువల్ల డబ్బు చేతిలో మిగిలేది కాదు. చూస్తుండగానే మూలధనం కాస్తా కరిగిపోయింది. అప్పుల ఒత్తిడి మొదలైంది. ఒక చోట తెచ్చిన రుణాన్ని తీర్చడానికి మరో చోట అప్పు చేయడం వాటిని సర్దిపెట్టడానికి మరోచోటకి.. ఇలా ఏడాది పాటు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా!



### ఫలితాన్నిచ్చాయి..

ఇన్ని కష్టాలు పడ్డాను కాస్త ఓర్చుకుంటే నేను గాడిన పడటమే కాదు నలుగురికీ సాయం చేయగలుగుతాను! అని నాకు నేను పదేపదే సర్దిచెప్పుకున్నా. అవకాశాలు క్రమంగా పెరిగాయి. మేం పాటించే నాణ్యతా ప్రమాణాలు చక్కటి ఫలితాలిచ్చాయి. సరకు కొన్నవారు మళ్లీ మళ్లీ రావడం వచ్చారు. స్క్రాప్ కొనుగోలుకి కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా సరకు తెప్పించుకోవడం మొదలుపెట్టాం. మొదటి ఏడాది డెబ్భైలక్షల టర్నోవర్ చేశాం. ఆపై నెమ్మదిగా లాభాల బాట పట్టాం. మేం తయారుచేసే గ్రాన్యువల్స్‌ని వందకు పైగా సంస్థలకు సరఫరా చేస్తున్నాం. పైపులూ తయారుచేస్తున్నాం. ఇప్పుడు చర్లపల్లితోపాటు షాద్‌నగర్‌లోనూ మరో యూనిట్ ప్రారంభించాను. ఒక్కో యూనిట్‌లో పదిహేను మంది ఉద్యోగులున్నారు. ఇది చాలదూ కష్టపడితే ఫలితం దక్కుతుందని నేను మరింతగా నమ్మడానికి..!

– స్వాతి కొరపాటి

## ఆలివ్‌నూనెతో తాజాగా

అందంగా, ఆరోగ్యంగా మెరిసిపోవాలని ఎవరికి మాత్రం ఉండదు. ఇందుకోసం అదేపనిగా రకరకాల పూతలు వేసుకోవాల్సిన అవసరంలేదు. మన రోజువారీ చర్మసంరక్షణలోనే చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే చాలు. మెరిసిపోవచ్చు..



● స్నానం చేసే నీటిలో రెండు చుక్కల ఆలివ్ నూనె వేసుకుని చూడండి. మీ శరీరానికి తేమ అంది చర్మం చూడ్డానికి ఎంతో ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఇలా చేస్తే స్నానం తర్వాత ప్రత్యేకించి మాయిశ్చరైజర్ రాయాల్సిన అవసరం కూడా ఉండదు.

● మృతకణాలు తొలగించుకోవడానికి ఎంతో ఖరీదు పెట్టి క్లెన్సర్లు కొంటున్నారా? అవసరం లేదు. కొబ్బరి నూనె, ఆలివ్‌నూనెల మిశ్రమానికి మించిన క్లెన్సర్ మరొకటి లేదంటున్నారు సౌందర్య నిపుణులు. ఈ మిశ్రమంలో కొద్దిగా చక్కెర కానీ, బ్రౌన్‌షుగర్ కానీ వేసుకుని మెడ, మోచేతులూ, ముఖం, పెదాలకు రాసుకుంటే మృతకణాలు పోవడంతోపాటూ... చర్మం తేమతో నిగనిగలాడుతుంది.

● చర్మ రంధ్రాలు పెద్దగా తెరుచుకున్నట్టు కనిపిస్తున్నాయా... గుడ్డులోని తెల్లసొనలో కొద్దిగా మొక్కజొన్న పిండి కలిపి దాన్ని సమస్య ఉన్నచోట పూతలా వేసుకోవాలి. ఇది పూర్తిగా ఆరిపోయాక కడిగేయాలి. ఇలా తరచూ చేయడం వల్ల సమస్య అదుపులోకి వస్తుంది.

● నాణ్యమైన క్రీం రాసుకున్నా కూడా కొన్నిసార్లు చర్మంలో మెరుపు ఉండదు. అలాంటప్పుడు బంగాళాదుంప తొక్క ఉడికించిన నీటిని ముఖానికి రాసుకుని చూడండి. మార్పు కనిపిస్తుంది.

## 20ల్లో పరుగూ... సైకిల్!

అన్ని వయసుల వారూ ఒక్కోరకమైన వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఇంతకీ ఏ వయసు వారు ఎలాంటివి చేస్తే మంచిదో చూద్దాం.

**ఇరవైల్లో :** వారంలో 45 నిమిషాలు చొప్పున మూడు రోజులు తప్పనిసరిగా గుండెకు సంబంధించిన వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరుగూ, నడకా, సైకిలు తొక్కడం వంటివి అందులో కొన్ని. అలాగే వీటన్నింటితోపాటూ అప్పుడప్పుడూ డంబెల్స్‌ని ఎత్తడం వంటివి చేయడం వల్ల కూడా కండరాలు దృఢంగా మారతాయి.

**ముప్పైల్లో :** వారంలో రెండు రోజులు అంటే రోజుమార్చి రోజు కనీసం ఇరవై నుంచి ఇరవైఅయిదు నిమిషాలు వ్యాయామం చేయాలి. అందులో పావుగంట పాటూ వేగంగా నడవడం తప్పనిసరిగా ఉండాలి. ఇవి కాకుండా భుజాలు బలంగా ఉండే వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది



**నలభైల్లో :** ఈ వయసు వారు కూడా గుండెకు సంబంధించిన వ్యాయామాలు చేయాలి కానీ.. మితిమీరి చేయకూడదు. ముఖ్యంగా పరుగూ, సైకిలు తొక్కడం లాంటివి అతిగా చేయకూడదు. కానీ నడకకు ప్రాధాన్యం ఇవ్వొచ్చు. రోజూ అరగంట నుంచి నలభైఅయిదు నిమిషాలు నడిచినా చాలు. మోకాళ్ల నొప్పులూ, వెన్నెముక సమస్యలూ, నడుము నొప్పి రాకుండా ఉంటాయి. అలాగే తక్కువ బరువున్న డంబెల్స్‌ని ఎత్తడం వల్ల కూడా వెన్నెముక సంబంధిత సమస్యలు బాధించవు.

## పోషకాల ఉల్లికాడలు!

ఈ కాలంలో ఉల్లికాడలు ఎక్కువగా దొరుకుతాయి. సూప్‌లూ, ఫ్రైడ్‌రైస్, మంచూరియా లాంటివాటిల్లో వీటిని ఎక్కువగా వేయడం తెలిసిందే. మరి వాటివల్ల కలిగే లాభాలేంటో కూడా తెలుసుకోవాలిగా...

సాధారణంగా మనకు రోజువారీ ఆహారం నుంచి లభించని కొన్ని ఖనిజాలు ఈ ఉల్లికాడల నుంచి తేలిగ్గా అందుతాయి. ముఖ్యంగా రాగి, మెగ్నీషియం, పొటాషియం, క్రోమియం, మాంగనీస్‌లతోపాటూ బి విటమిన్లు ఇందులో సమృద్ధిగా ఉంటాయి. దీనిలో ఉండే అల్లీప్రొపైల్‌డైసల్ఫైడ్ గుండె జబ్బులు రాకుండా నివారిస్తుంది. వీటినుంచి అందే సల్ఫర్ అధికరక్తపోటు సమస్యను అదుపులో ఉంచుతుంది.

◆ మధుమేహం ఉన్నవారు ఉల్లికాడల్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. కారణం దీన్నుంచి అందే క్రోమియంతోపాటూ అల్లీప్రొపైల్‌డైసల్ఫైడ్ రక్తంలోని చక్కెర స్థాయుల్ని క్రమబద్ధీకరించడమే.

◆ దగ్గు, జలుబుతో బాధపడేవారు ఉల్లికాడలతో వండిన వంటలు తింటే తక్షణ ఉపశమనం అందుతుంది. అజీర్తి సమస్యలు కూడా తగ్గుతాయి. అలాగే ఉబ్బసం, కంటి సమస్యలతో బాధపడేవారూ దీన్ని తప్పనిసరిగా తీసుకోవాలి.



◆ తరచూ ఉల్లికాడలు తినడం వల్ల శరీరానికి అల్లిసిన్ అనే పోషకం అందుతుంది. అది వృద్ధాప్య ఛాయలు రాకుండా చర్మాన్ని కాపాడి.. ఆరోగ్యంగా ఉంచుతుంది.

## సిగ సింగారం

ఎప్పుడూ ఒకేరకం జడ వేసుకోవడం అంటే ఎవరికైనా విసుగే. సమయం ఎక్కువ పట్టేయడం... సరిగ్గా కుదరకపోవడం.. ఇలాంటివెన్నో సమస్యలు. కానీ అవేవీ లేకుండానే పూలమాల తరహాలో ఈసారి వేసుకుని చూద్దామా.



## జడా...పూలమాలా!



1

● ముందుగా జుట్టుని వెనక్కి దువ్వుకుని రబ్బరు బ్యాండు పెట్టుకోవాలి. ఇప్పుడు రెండువైపుల నుంచీ రెండు సన్నని పాయలు తీసుకోవాలి. ఎడమవైపు పాయని మెలితిప్పి చిత్రంలో చూపించినట్టుగా రబ్బరు బ్యాండులోంచి దూర్చి ఇవతలకు తీయాలి. ఇప్పుడు కుడివైపు పాయని కూడా తీసుకుని ఇదేవిధంగా చేసుకోవాలి.




2

● ఇప్పుడు మొదట రబ్బరు బ్యాండు పెట్టిన చోటనుంచి కాస్త అడుగున మళ్లీ జుట్టంతా కలిపి రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. మళ్లీ ఇందాకటిలానే కూడా ఎడమవైపు నుంచీ, కుడివైపు నుంచీ చెరోరెండు పాయలని తీసుకుని మెలితిప్పుతూ రెండో రబ్బరుబ్యాండులోంచి ఇవతలకు తీయాలి.



3

● ఇలా మిగిలిన జుట్టుకు మళ్లీ రబ్బరుబ్యాండ్లు పెట్టుకుంటూ.. పాయల్ని అందులోంచి దూరుస్తూ ఇవతలకు తీయాల్సి ఉంటుంది. చివరగా మిగిలిన జుట్టును వదిలేస్తే సరిపోతుంది.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

## నజరానా

రెండు చెంచాల వాము వేయించి మెత్తగా దంచి బెల్లంతో కలిపి... తీసుకుంటే జలుబూ, ముక్కుదిబ్బడా ఇట్టే తగ్గుతుంది.

## మేనత్తలకి న్యాయం జరిగేదెలా?

? మా తాతగారు తన పేరు మీద 1965లో వందగజాల స్థలం కొన్నారు. ఆ స్థలంలో మా నాన్నా, చిన్నాన్న ఇల్లుకట్టుకుని ఉంటున్నారు. తాతయ్యకి వీళ్లిద్దరు కాకుండా నలుగురు కూతుళ్లున్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. వాళ్లెప్పుడూ తాతయ్య ఆస్తి గురించి అడగలేదు. తాతయ్య 2009లో చనిపోయేటప్పుడు ఆ స్థలాన్ని ఎవరిపేరుమీదా రాయలేదు. ఆ ఇల్లు కట్టినప్పటి నుంచి నాన్నా, చిన్నాన్నే పన్ను కడుతూ వస్తున్నారు. అయితే ఇంటిపన్ను వేరుచేయడం కోసం నాన్నా, చిన్నాన్న పేర్ల మీద(మేం తప్ప తాతయ్యకి ఎవరూ వారసులు లేరు అని) దస్తావేజులు సృష్టించారు. మేం కాస్త పెద్దయ్యాక 'మీ ఇద్దరూ అత్తయ్యలకి అన్యాయం చేశారు. మీరు మాత్రమే వారసులని చెప్పడం తప్పు!' అనడం మొదలుపెట్టాం. వాళ్లూ తప్పు తెలుసుకుని పత్రాలు మారుస్తామంటున్నారు. ఇప్పుడు ఈ తాజా పత్రాలని మాత్రం మారిస్తే సరిపోతుందా? పాతపత్రాల్లోనూ మార్చాలా? అసలు ఇలా మార్చడానికి చాలా ఎక్కువ ఖర్చవుతుందని భయంగా ఉంది. అసలు వీటిని ఎలా మార్చుకోవాలి? ఈ ఆస్తిపై మా అత్తయ్య వాళ్లకి హక్కుంటుందా? చెప్పగలరు.


- ఓ సోదరి



లాయర్ వసుంధర
జి. వరలక్ష్మి
న్యాయవాది

✔ ఓ స్త్రీగా, అత్తయ్యలకి మోసం జరగకూడదని.. సొంత తండ్రినే వ్యతిరేకిస్తున్న మీ తీరు చూస్తే ముచ్చటేస్తోంది. మీ ప్రశ్నలో 1965లోనే తాతయ్య ఈ స్థలం కొన్నారని ఉంది కాబట్టి ఇది ఆయన స్వార్జితం. హిందూ వారసత్వ చట్టం 1956 ప్రకారం ఓ వ్యక్తి తాను సొంతంగా సంపాదించుకున్న ఆస్తిని, తాను బతికున్న కాలంలో, ఎవరికైనా రాయొచ్చు. ఫలానా వారికే చెందాలని వీలునామా కూడా రాసుకోవచ్చు. తాతయ్య 2009లో చనిపోయారంటున్నారు. మీ నాన్నా, బాబాయి అంతకుముందే ఆ స్థలంలో ఇల్లుకట్టుకున్నారు. అంటే, మీ తాతయ్య బతికున్నప్పుడే ఆస్తి పంపకం జరిగిందన్నమాట. అలా పంచినప్పుడు మీ అత్తయ్యలు తమకీ ఆస్తి కావాలని అడిగినట్లు లేరు. కాబట్టి, పంపకం ఆ ఇద్దరి మధ్యే జరిగిపోయింది. ఇకపై మీ మేనత్తలు దాన్ని ప్రశ్నించడానికి అవకాశం లేదా? దీనిపై స్పష్టత రావాలంటే హిందూ వారసత్వ చట్టం 1956కి తీసుకువచ్చిన రెండు సవరణల గురించి చూడాలి. ముఖ్యంగా 1986లో తీసుకొచ్చిన సవరణ(సెక్షన్ 29ఏ) చట్టం. ఉదాహరణకి ఓ వ్యక్తికి పిత్రార్జిత ఆస్తి ఉందనుకుందాం. 1986కి ముందువరకూ ఆయన బతికున్నంత కాలం ఆడపిల్లకి ఆస్తి హక్కు ఉండేది కాదు. ఆయన (ఏ వీలునామా రాయకుండా చనిపోతేనే) హక్కుండేది. ఆయన బతికి ఉంటే మగపిల్లలు మాత్రమే వారసులు. కానీ 1986నాటి సవరణ చట్టం.. తండ్రి బతికుండగా కొడుకులకి పిత్రార్జిత ఆస్తిపై ఎంత హక్కుందో కూతుళ్లకి అంతే సమానమైన హక్కు కల్పించింది. స్త్రీలుగా మనం కొన్ని కాలాలపాటు కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిన గొప్ప సవరణ అది! 2005లో దీనికే మరో సవరణ కూడా వచ్చింది. దీని ప్రకారం స్వార్జిత, సమష్టి ఆస్తిపైనా కూతుళ్లకి హక్కు కల్పించింది. కాకపోతే సదరు ఆస్తి ఉన్న వ్యక్తి 2005 నాటికి బతికి ఉండాలి! దీని ప్రకారం, మీ మేనత్తలు 2009కి ముందు ఎప్పుడు ఆస్తి గురించి అడిగినా వాళ్లకి అన్ని హక్కులూ ఉండేవి. వాళ్లలా చేయలేదు. కాబట్టి, ఇప్పుడిక వాళ్లకి ఆ హక్కు లేదనే చెప్పాలి. కానీ, మీ నాన్నా, బాబాయి ఒప్పుకుంటే వాళ్లకి ఆస్తి పంచే అవకాశం ఉంది. ఇందుకోసం పాత రిజిస్ట్రేషన్‌ని క్యాన్సిల్ చేసుకుని.. ఆ నలుగురికి భాగాలు పంచుతూ కొత్తగా రిజిస్టర్ చేయాలి. ఇంకోదారి కూడా ఉంది. మీ అత్తయ్యలని ఆస్తిపై వాటా కోరుతూ కోర్టుకి వెళ్లమనొచ్చు. అప్పుడు మీ నాన్నా, బాబాయి రాజీపడ్డట్టు ఒప్పుకుంటే న్యాయస్థానం ద్వారా ఆస్తిని ఆరుభాగాలు చేసుకున్నట్టు డిక్రీ పొందవచ్చు. పంచాక ఎవరిపేరు మీద వాళ్లు మ్యుటేషన్ చేసుకుంటే సరిపోతుంది. ఇదివరకే తప్పుడు సమాచారంతో రిజిస్ట్రేషన్ చేశారుకాబట్టి అందరూ కలిసి ఇప్పుడు ఫ్యామిలీ సెటిల్‌మెంట్ డీడ్ రాసుకోవచ్చు. అందులో మీ నాన్నా, బాబాయి మధ్య జరిగిన పాత పంపకం గురించి కేవలం ప్రస్తావిస్తే సరిపోతుంది!

## బంగారం వెండి



9న ముగింపు-క్రితం

| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | ------- | ------- | 29,400 | 29,400 |
| ఆర్నమెంట్ | ------- | ------- | 27,400 | 27,300 |
| వెండి (కిలో) | ------- | ------- | 38,600 | 38,600 |

| | ప్రొద్దుటూరు | | రాజమండ్రి | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 29,500 | 29,500 | 29,170 | 29,060 |
| ఆర్నమెంట్ | 27,370 | 27,280 | 27,270 | 27,170 |
| వెండి (కిలో) | 39,000 | 38,500 | 38,500 | 38,400 |

| | విశాఖపట్నం | | తమిళనాడు | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 29,540 | 29,460 | ------- | ------- |
| ఆర్నమెంట్ | 27,180 | 27,100 | 2,727 | 2,717 గ్రా |
| వెండి (కిలో) | 39,500 | 39,500 | 41.10 | 40.00 గ్రా |

## బూట్ల దుర్వాసనా...

బూట్ల నుంచి ఎక్కువగా దుర్వాసన వస్తోందా... మన వంటింట్లో అందుబాటులో ఉండే నిమ్మతొక్కలూ, వంటసోడాతోనే ఆ సమస్యని వదిలించేయండి. అదెలాగంటే...

◆ బూట్ల నుంచి చెమట దుర్వాసన వస్తోంటే వాటిలో కొద్దిగా వంటసోడా చల్లి రాత్రంతా అలా వదిలేయండి. ఇది చెమటనూ, దుర్వాసనను పీల్చేస్తుంది. కాఫీ పొడిని, వంటసోడాను కలిపి ఒక చిన్న పొట్లంలా చుట్టి బూట్లలో ఉంచినా తెల్లారేసరికి దుర్వాసన పోతుంది.

◆ నిమ్మరసంలో కొద్దిగా గులాబీనీటిని కలిపి బూట్లపై చల్లినా వాటినుంచి వచ్చే దుర్వాసనను వదిలించొచ్చు. లేదంటే అరకప్పు నీటిలో పావుకప్పు వెనిగర్ కలిపి బూట్లపై చల్లండి. ఇలా వారానికి ఒకసారి చేయడం వల్ల దుర్వాసన సమస్యే ఉండదు.

◆ నారింజా, నిమ్మా, బత్తాయి పళ్ల తొక్కలను బూట్లలో రాత్రంతా ఉంచినా ఉదయానికల్లా వాటిలో ఉండే దుర్వాసన తొలగిపోతుంది. రోజు విడిచి రోజు చేయడం ఇలా చేసినా చాలు.

◆ బూట్లలో తేమవల్ల వచ్చే దుర్వాసనను ఉప్పుతో తొలగించవచ్చు. రెండుమూడు రోజులకోసారి వాటిపై కాస్త ఉప్పు చల్లి కాసేపయ్యాక దులిపేయాలి.



◆ షూలలో ఉండే తేమా, దుర్వాసనల వల్ల హానికర బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీన్ని పోగొట్టాలంటే వాటిని విప్పిన తరవాత చిన్నచిన్న కాగితపు ఉండల్ని బూట్లలో ఉంచి.. వెలుతురు తగిలే ప్రదేశంలో పెట్టాలి.

| సెన్సెక్స్ | నిఫ్టీ | రూపాయి | బంగారం | వెండి | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| ▼216 | ▼71 | 63.84 ▼ 21 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | 28,730 ▲ రూ.లలో 140 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) | 37,875 ▲ రూ.లలో 600 (ముంబయిలో కిలో) | 52.50 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో) |
| 31798 | 9908 | | | | |

### ప్రధాన ప్రపంచ మార్కెట్లు

| సూచీ | ముగింపు | లాభం/నష్టం |
|---|---|---|
| డోజోన్స్ | 22,008 | -77 |
| నాస్‌డాక్ | 6,339 | -32 |
| నిక్కీ 225 (జపాన్) | 19,739 | -257 |
| హాంగ్‌సెంగ్ (హాంకాంగ్) | 27,757 | -98 |
| షాంఘై(చైనా) | 3,276 | -06 |
| ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్) | 7,498 | -45 |
| డాక్స్ (జర్మనీ) | 12,154 | -138 |

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


### విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలరు | 58.02 | 67.29 |
| పౌండ్ స్టెర్లింగ్ | 75.30 | 87.37 |
| యూరో | 68.08 | 78.96 |
| జపనీస్ యెన్/100 | 52.81 | 61.23 |
| ఆస్ట్రేలియా డాలరు | 45.67 | 52.85 |
| సింగపూర్ డాలరు | 42.54 | 50.40 |
| థాయ్ బాత్/100 | 174.32 | 208.47 |
| బహ్రెయిన్ దీనార్ | 157.23 | 180.08 |
| కువైట్ దీనార్ | 174.60 | 217.50 |
| ఒమన్ రియాల్ | 153.85 | 176.06 |
| యూఏఈ దిర్హమ్ | 15.80 | 18.46 |
| మలేషియా రింగిట్ | 13.25 | 16.29 |
| చైనీస్ యువాన్ | 06.74 | 10.92 |




### బుధవారం నిఫ్టీ కదలికలు




# మావి డొల్ల కంపెనీలంటారా?

● నిబంధనలు పాటిస్తున్నాం ● శాట్‌కెళ్లిన జేకుమార్, పార్శ్వనాథ్

● నిజాయతీ నిరూపించుకుంటే నిషేధం ఎత్తివేత: సెబీ



**ముంబయి:** అనుమానిత డొల్ల కంపెనీలుగా సెబీ వర్గీకరించడాన్ని సవాలు చేస్తూ జేకుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, పార్శ్వనాథ్ డెవలపర్స్ సహా కొన్ని కంపెనీలు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్(శాట్)కు వెళ్లాయి. తమ వ్యాపారాలన్నీ చట్టబద్ధంగానే ఉన్నాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి. ప్రభుత్వం 331 కంపెనీలను 'అనుమానిత డొల్ల కంపెనీలు'గా సెబీకి సమాచారం అందిన సంగతి తెలిసిందే. మరికొన్ని కంపెనీలు సైతం సెబీ వర్గీకరణను సవాలు చేయవచ్చనే అంచనాలున్నాయి. ట్రేడింగ్ నిబంధనలపై స్టే ఇవ్వాల్సిందిగా శాట్ కెళ్లిన కంపెనీలు కోరుతున్నాయి. అన్ని నిబంధనలను పాటిస్తున్నామని.. షెల్ కంపెనీలుగా వర్గీకరించడంపై ఆందోళన చెందుతున్నామంటూ.. వార్షిక నివేదికలను, ఇతరత్రా పత్రాలను కంపెనీలు శాట్‌కు దాఖలు చేశాయి. 'మా కంపెనీలు డొల్ల సంస్థలు కావు. అన్ని వ్యాపారాలనూ చట్టానికి లోబడే చేస్తున్నామ'ని జేకుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్‌లు తెలిపాయి. సెబీ ఆదేశాల ప్రకారం.. ఈ 331 కంపెనీల షేర్ల ట్రేడింగ్ నెలలో మొదటి సోమవారం మాత్రమే జరుగుతుంది. వీటిపై స్వతంత్ర ఆడిట్ జరపాల్సి ఉంటుంది. ఆయా కంపెనీలు తమ వ్యాపారాల్లో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోలేదని నిరూపించుకుంటే నిషేధం ఎత్తివేస్తామని సెబీ స్పష్టం చేసింది.

**ముందే దర్యాప్తు ఎందుకు చేయలేదు: శాట్**

సర్క్యులర్‌ను జారీ చేయడానికి ముందు ఈ అంశంపై ఎందుకు దర్యాప్తు చేయలేదని సెబీని ట్రైబ్యునల్ ప్రశ్నించగా.. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి సమాచారం అందిందని.. వెంటనే దర్యాప్తు చేపట్టవలసిందిగా ఎక్స్ఛేంజీలకు సూచించామని సెబీ తెలిపింది. అయితే జూన్ 9నే ఈ జాబితాను సెబీ అందుకున్నట్లు.. సర్క్యులర్ ఆగస్టు 7న జారీ అయిందని.. ఈ మధ్య సమయంలో దర్యాప్తు ఏమైనా చేశారా అని శాట్ ప్రశ్నించింది. దీనికి నేటి విచారణలో సెబీ సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.

'మేం శాట్ ముందు అప్పీలు చేశాం. సెబీ ఆదేశాలను పక్కనపెట్టమని కోరాం. మాది డొల్ల కంపెనీ కాదు. ఎటువంటి పన్నూ ఎగవేయలేదు. నిబంధనలన్నీ పాటిస్తూనే ఉన్నామ'ని పార్శ్వనాథ్ డెవలపర్స్ ఛైర్మన్ ప్రదీప్ జైన్ పేర్కొన్నారు.

**మిగిలిన అయిదింటిపైనా కొరడా: బీఎస్ఈ**

సెబీ ప్రకటించిన 331 అనుమానిత డొల్ల కంపెనీల్లో ఇప్పటికే 164 కంపెనీల్లో ట్రేడింగ్‌ను వివిధ కారణాల వల్ల బీఎస్ఈ నిలిపివేసింది. మిగిలిన 167 కంపెనీల్లో 162 సంస్థలపై ట్రేడింగ్ ఆంక్షలను మంగళవారం విధించగా.. మిగిలిన అయిదింటిపైనా బుధవారం ఆంక్షలను అమలు చేసింది. 331 అనుమానిత డొల్ల కంపెనీల్లో కేవలం 48 కంపెనీలే తమ ఎక్స్ఛేంజీలో నమోదై ఉన్నాయని ఎన్ఎస్ఈ తెలిపింది. ఈ 48లోనూ పది కంపెనీల్లో సెబీ జాబితా వెలువడకముందే ట్రేడింగ్ నిలిచిపోయి ఉందని వివరించింది.

## ఆర్థిక ఫలితాలు

### ● టాటా మోటార్స్

**దిల్లీ:** ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో టాటా మోటార్స్ నికర లాభం 41.54% వృద్ధితో రూ.3,199.93 కోట్లకు చేరింది. జేఎల్ఆర్ పింఛను పథకాల్లో చేసిన మార్పుల కారణంగా వచ్చిన లాభాలు ఇందుకు దోహదం చేశాయని చెప్పాలి. ఆదాయం ఈ ఏప్రిల్-జూన్‌లో రూ.59,818.22 కోట్లకే పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో వచ్చిన ఆదాయం రూ.66,165.89 కోట్లతో పోలిస్తే ఇది 9.59 శాతం తక్కువ. ఏకీకృత పద్ధతిన 2016-17 ఏప్రిల్-జూన్‌లో రూ.25.75 కోట్ల లాభం రాగా.. 2017-18 ఏప్రిల్-జూన్‌లో రూ.467.05 కోట్ల నష్టం వాటిల్లింది. ఆదాయం 9.26% తగ్గి రూ.10,375.32 కోట్లకు పరిమితమైంది.

### ● అరబిందో ఫార్మా

**ఈనాడు, హైదరాబాద్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అరబిందో ఫార్మా నికర లాభం 11.4% తగ్గి రూ.585 కోట్ల నుంచి రూ.518.5 కోట్లకు చేరింది. ఆదాయం కూడా 2.3 శాతం క్షీణించింది. 2016, జూన్‌తో ముగిసిన 3 నెలల్లో రూ.3,766.6 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా.. ఈ ఏడాది ఇదే కాలానికి రూ.3,678.7 కోట్లకు పరిమితమైంది. అమెరికాలో ఫార్ములేషన్ల విక్రయాలు 0.5 శాతం తగ్గి రూ.1,703.9 కోట్ల నుంచి రూ.1,694.9 కోట్లకు చేరాయి. ఐరోపాలో విక్రయాలు (ఫార్ములేషన్లు) మాత్రం 10.4% వృద్ధితో రూ.831.2 కోట్ల నుంచి రూ.917.6 కోట్లకు పెరిగాయి.. 2017, జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో 13 ఏఎన్‌డీఏలను కంపెనీ దాఖలు చేసింది.

### ● ఎన్ఎండీసీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి ఎన్ఎండీసీ ఆదాయం, నికర లాభం ఆకర్షణీయంగా పెరిగాయి. 2017, జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.969.20 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.711.34 కోట్లతో పోలిస్తే 36.24 శాతం పెరిగిందని కంపెనీ వెల్లడించింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,065.82 కోట్ల నుంచి 43 శాతం పైగా వృద్ధితో రూ.2,970.13 కోట్లకు చేరింది.

### ● నాగార్జున ఫెర్టిలైజర్స్

నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ నికర నష్టం తగ్గింది. 2016, జూన్‌తో ముగిసిన 3 నెలలకు స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.37.33 కోట్ల నష్టాన్ని చవి చూడగా.. ఈ ఏడాది ఇదే కాలానికి నష్టం రూ.4.68 కోట్లకు పరిమితమైనట్లు కంపెనీ వెల్లడించింది. సమీక్ష త్రైమాసికానికి ఆదాయం రూ.646.62 కోట్ల నుంచి రూ.880.26 కోట్లకు పెరిగింది.

### ● నవ భారత్ వెంచర్స్

ఏప్రిల్- జూన్‌లో నవ భారత్ వెంచర్స్ ఏకీకృత నికర లాభం 28.72 శాతం తగ్గి రూ.19.09 కోట్లకు చేరింది. ఆదాయం 13% వృద్ధితో రూ.321.47 కోట్ల నుంచి రూ.363.56 కోట్లకు చేరింది. స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.291.32 కోట్ల ఆదాయంపై రూ.21.88 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. దేశీయ విద్యుత్ రంగం కష్టకాలంలో ఉన్నందున కంపెనీకి చెందిన దేశీయ వ్యాపారం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని కంపెనీ వివరించింది.

# వదలని నష్టాలు

● మూడు వారాల కనిష్ఠానికి సెన్సెక్స్ ● ఔషధ, వాహన షేర్లు డీలా



**సమీక్ష**

మార్కెట్లను నష్టకష్టాలు వదల్లేదు. డొల్ల కంపెనీలుగా అనుమానిస్తూ పలు సంస్థలపై సెబీ చేపట్టిన చర్యలు మదుపర్ల ఆందోళనలను పెంచాయి. ఫలితంగా వరుసగా మూడో రోజూ సూచీలు డీలాపడ్డాయి. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య తాజా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు బలహీనపడటం ఇందుకు తోడైంది. ఔషధ, వాహన షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడం సైతం ప్రతికూల ప్రభావం చూపింది.

**32000 దిగువకు:** సెన్సెక్స్ ఉదయం 31926.14 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆద్యంతం నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఒకానొకదశలో 31,731.91 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. చివరకు 216.35 పాయింట్ల నష్టంతో 31,797.84 దగ్గర ముగిసింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 527.57 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ సైతం 70.50 పాయింట్లు కోల్పోయి 9,908.05 వద్ద స్థిరపడింది.

**సన్‌ఫార్మా డీలా:** అనుబంధ సంస్థ టారో ఫార్మా బలహీన త్రైమాసిక ఫలితాలను నమోదు చేయడంతో సన్ ఫార్మా షేరు విలవిలలాడింది. 5.13 శాతం నష్టంతో రూ.474.75 వద్ద స్థిరపడింది. ఫలితాలు నిరాశపరచడంతో టాటా కెమికల్స్ షేరు 3.29% నష్టంతో రూ.577.10 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 23 డీలాపడ్డాయి. అదానీ పోర్ట్స్ 4.12%, టాటా మోటార్స్ 3.17%, సిప్లా 2.83%, బజాజ్ ఆటో 2.77%, డాక్టర్ రెడ్డీస్ 2.62%, లుపిన్ 2.16%, యాక్సిస్ బ్యాంక్ 2.13%, టాటా స్టీల్ 1.75%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.36%, ఎల్ అండ్ టీ 1.26%, మారుతీ సుజుకీ 1.12%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.85% చొప్పున నష్టపోయాయి. మరోవైపు ఎన్‌టీపీసీ షేరు 1.25 శాతం పెరగగా.. ఓఎన్‌జీసీ 0.98%, ఏషియన్ పెయింట్స్ 0.84%, హెచ్‌డీఎఫ్‌సీ 0.63%లు రాణించిన వాటిలో ఉన్నాయి.

## నేటి మార్కెట్

సూచీల బలహీనతలు కొనసాగొచ్చు. అనుమానిత డొల్ల కంపెనీలపై సెబీ చర్యలు చేపట్టిన నేపథ్యంలో సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో మదుపర్లు ఆచితూచి అడుగేసే అవకాశం ఉంది. అప్రమత్తత పాటించొచ్చని భావిస్తున్నారు. అణు సామర్థ్యాలపై అమెరికా, ఉత్తర కొరియాలు పరస్పరం హెచ్చరించుకోవడం అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. వీటి తదుపరి పరిణామాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. బుధవారం మార్కెట్లు ముగిసిన అనంతరం వెలువడిన ఐషర్ మోటార్స్, అరబిందో ఫార్మాల ఫలితాల ప్రభావం నేడు వాటి షేర్లపై ఉండొచ్చు. నిఫ్టీ 50 కంపెనీల్లో నేడు గెయిల్ ఫలితాలు ప్రకటించనుంది. నిఫ్టీకి 10090-10120 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు. 9500- 9770 పాయింట్ల శ్రేణిలో మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## హెచ్‌పీసీఎల్.. ప్రభుత్వ అధీనంలోనే!

**దిల్లీ:** హెచ్‌పీసీఎల్‌లో తనకున్న 51.11%వాటాను ఓఎన్‌జీసీకి విక్రయించేందుకు రూపొందించిన మార్గదర్శకాలలో ప్రభుత్వం మార్పు చేసినట్లు తెలుస్తోంది. హెచ్‌పీసీఎల్‌లో వాటా విక్రయంతో పాటు యాజమాన్య నియంత్రణ బదిలీకి గత నెల 19న ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేంద్ర మంత్రివర్గ సంఘం సూత్రప్రాయ అనుమతులిచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం నుంచి ఓఎన్‌జీసీకి యాజమాన్య నియంత్రణ బదిలీ చేస్తే, సెబీ నిబంధనల ప్రకారం మరో 26% వాటాను మైనార్టీ వాటాదార్ల దగ్గర నుంచి ఓఎన్‌జీసీ ఓపెన్ ఆఫర్ పద్ధతిలో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితి తప్పించేందుకు ప్రభుత్వం నిబంధనలను సవరించిందని ఓ అధికారి తెలిపారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్య నియంత్రణ భారత ప్రభుత్వం చేతిలోనే కొనసాగేలా మార్పు చేసిందని పేర్కొన్నారు.

## ల్యాంకో దివాలా ప్రక్రియ ప్రారంభం

**ఈనాడు, హైదరాబాద్:** ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెసొల్యూషన్ ప్రాసెస్) ప్రారంభమైంది. రుణదాతల్లో ఒకటైన ఐడీబీఐ బ్యాంకు దాఖలు చేసిన పిటిషన్‌కు అనుగుణంగా జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దివాలా పరిష్కార ప్రక్రియను చేపట్టడానికి సవన్ గోడియావాలాను మధ్యంతర పరిష్కార నిపుణుడిగా (ఇంటీరిమ్ రిసొల్యూషన్ ప్రొఫెషనల్-ఐఆర్‌పీ) ట్రైబ్యునల్ నియమించింది. ఎన్‌సీఎల్‌టీ ఆదేశాల నేపథ్యంలో కంపెనీ బోర్డు అధికారాలు రద్దవుతాయి. ఆగస్టు 11న జరగాల్సిన ల్యాంకో బోర్డు సమావేశం కూడా నిలిచిపోయింది. ల్యాంకోకు దాదాపు రూ.44,000 కోట్ల రుణ భారం ఉంది.

## నేటి బోర్డు సమావేశాలు

★ హెరిటేజ్ ఫుడ్స్ ★ లారస్ ల్యాబ్స్ ★ పెట్రోనెట్ ★ గెయిల్ ★ యూనియన్ బ్యాంక్ ★ మదర్సన్ సుమీ ★ అదానీ ట్రాన్స్‌మిషన్ ★ పెన్నార్ ఇంజినీర్డ్ ★ భారత్ ఫోర్జ్ ★ ఎస్ఎంఎల్ ఇసుజు ★ షిప్పింగ్ కార్పొరేషన్ ★ జైడస్ వెల్‌నెస్ ★ సింఫనీ ★ వెంకీస్ ★ పంజ్ లాయిడ్ ★ శ్రీకాళహస్తి పైప్స్ ★ డెక్కన్ సిమెంట్స్ ★ యునైటెడ్ బ్రూవరీస్ ★ మోయిల్ ★ బాంబే డైయింగ్

## మార్కెట్ కబుర్లు

✦ **సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్** షేర్లు నేడు స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదుకానున్నాయి.

✦ **జెట్ ఎయిర్‌వేస్** ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా (సీఈఓ) వినయ్ దుబే నియమితులయ్యారు.

✦ **న్యూ ఇండియా అష్యూరెన్స్** పబ్లిక్ ఇష్యూకు వెళ్తోంది. ఇందుకుగాను సెబీకి దరఖాస్తు పత్రాలు సమర్పించింది.

✦ వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన **నెట్‌లింక్స్** సంప్రదాయేతర ఇంధన రంగంలోకి అడుగు పెట్టింది. 12 మెగా వాట్ల సంప్రదాయేతర విద్యుత్ ప్రాజెక్టులను నిర్మిస్తున్న శ్రీవెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్ట్స్‌లో 51 శాతం వాటా సొంతం చేసుకుంది

## ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)


| కంపెనీ | నికర లాభం/(నష్టం) 2017–18 | నికర లాభం/(నష్టం) 2016–17 | మొత్తం ఆదాయం 2017–18 | మొత్తం ఆదాయం 2016–17 |
|---|---|---|---|---|
| పీటీసీ ఇండియా | 79.21 | 67.45 | 300.64 | 271.27 |
| మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ | 66.58 | 107.12 | 2,560 | -- -- |
| నాల్కో | 129 | 135 | 1,997.43 | 1,799.72 |
| బేయర్ క్రాప్‌సైన్స్ | 111.70 | 131.20 | 753.40 | 874.80 |
| ఇన్‌సెక్టిసైడ్స్ | 30.50 | 18.22 | 345.62 | 298 |
| పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ | 25.37 | 53.35 | 2,062.57 | 2,279.11 |
| దీపక్ నైట్రేట్ | 20.10 | 15.20 | 361.63 | 339.39 |
| ఎంఎంటీసీ | 18.13 | (7.01) | 6,344.79 | 2,806.72 |
| ఐనాక్స్ విండ్ (కన్సా) | (39.02) | 11.82 | 116.68 | 455.65 |
| సిటీ యూనియన్ బ్యాంక్ | 140.32 | 123.52 | 960.86 | 883.30 |
| జిందాల్ స్టెయిన్‌లెస్ | 41.50 | (78.21) | 2,203.86 | 2,157.08 |
| అజంతా ఫార్మా (కన్సా) | 94.79 | 119.55 | 473.12 | 475.90 |
| ఎన్‌హెచ్‌పీసీ | 862.66 | 857.82 | 2,432.77 | 2,360.06 |
| థామస్ కుక్ (కన్సా) | 68.24 | 62.01 | 2,784.13 | 2,505.16 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 87.71 | (741.36) | 11,106.61 | 10,664.36 |

## హిందాల్కో



రూ.237.70 వద్ద ప్రారంభమై రూ.237.40-243.20 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.234.90తో పోలిస్తే రూ.4.55 (1.94%) లాభంతో రూ.239.45 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 1,28,43,982.

## అరబిందో ఫార్మా




రూ.725 వద్ద మొదలై రూ.675.80-725.40 మధ్య చలించి, కిృతం ముగింపు రూ.726.30తో పోలిస్తే రూ.42.70 (5.88%) నష్టంతో రూ.683.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 54,12,591.

| 52 వారాల గరిష్ఠం (రూ.లలో) | | 52 వారాల కనిష్ఠం (రూ.లలో) | |
|---|---|---|---|
| ఇంద్రప్రస్థ గ్యాస్ | 1,282.50 | అజంతా ఫార్మా | 1,151.10 |
| జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్ | 1,355.75 | క్రిసిల్ | 1,836.00 |
| మహానగర్ గ్యాస్ | 1,089.25 | ఆస్ట్రాజెనికా ఫార్మా | 887.50 |
| రిలయన్స్ క్యాపిటల్ | 818.50 | కేంబ్రిడ్జ్ టెక్నాలజీ | 69.20 |
| బిర్లా కార్పొరేషన్ | 972.95 | బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్ | 3,933.05 |
| షిప్పింగ్ కార్పొరేషన్ | 92.50 | బీఎఫ్ యుటిలిటీస్ | 343.65 |

### ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

| తేదీ | విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు | అమ్మకాలు | నికరం | దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు | అమ్మకాలు | నికరం |
|---|---|---|---|---|---|---|
| 09/08 | 3,238 | 4,080 | -842 | 2,886 | 2,333 | 553 |
| 08/08 | 6,246 | 4,706 | 1,540 | 3,152 | 2,353 | 799 |
| 07/08 | 3,790 | 3,989 | -199 | 2,572 | 2,264 | 308 |
| 03/08 | 5,534 | 5,510 | 24 | 3,069 | 3,458 | -389 |
| 02/08 | 4,062 | 3,588 | 474 | 2,671 | 2,904 | -233 |

### 9వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 330 | విశాఖపట్నం | 345 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 3.95 | వరంగల్ | 332 |
| బెంగళూరు | 365 | చిత్తూరు | 365 |
| 10న | | చెన్నై | 372 |
| విజయవాడ/గోదావరి | 340 | నమక్కల్ | 365 |

## ఎన్ఎస్ఈ

**బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)**

### నిఫ్టీ 50

ACC 1819.50 (1812.15) 299512
ADANI PORT & 397.25 (414.80) 3603960
AMBUJA CEMEN 273.20 (274.15) 949202
ASIAN PAINTS 1155.55 (1147.35) 530763
AUROBIND PHA 683.60 (726.30) 5412591
AXIS BANK LT 486.95 (499.45) 7169705
BAJAJ AUTO L 2831.15 (2911.60) 305248
BANK OFBAROD 155.20 (156.55) 7541485
BHARTI AIRTE 416.05 (417.80) 1226554
BHARTI INFRA 381.70 (383.60) 2750683
BOSCH LTD 24032.00 (24189.40) 9346
BPCL 495.95 (505.05) 3120575
CIPLA 561.85 (578.60) 1801630
COAL INDIA L 242.50 (245.05) 1801736
DR. REDDYS 2048.35 (2095.65) 1124987
EICHER MOTOR 31489.10 (32120.85) 63895
GAIL 382.20 (386.75) 1761931
HCL TECH 878.75 (882.00) 535846
HDFC 1731.65 (1719.90) 1817847
HDFC BANK 1764.45 (1777.90) 817514
HERO MOTOCOR 3883.75 (3913.40) 343296
HINDALCO IND 239.45 (234.90) 12844802
HINDUSTAN UN 1185.35 (1191.00) 833002
ICICI BANK 290.60 (295.50) 12959158
INDIABULLS H 1159.00 (1195.80) 776497
INDIAN OIL 414.05 (413.25) 6253452
INDUSINDBANK 1637.25 (1638.65) 530640
INFOSYS LTD 969.35 (963.85) 1961205
ITC 272.85 (274.15) 9910187
KOTAK MAHIND 992.40 (987.70) 1131399
LARSEN & TOU 1153.90 (1171.20) 1439328
LUPIN 952.95 (974.50) 1347325
M&M 1392.30 (1400.00) 771111
MARUTI SUZIK 7661.60 (7755.90) 285089
NTPC LTD 173.65 (171.15) 2707378
ONGC 165.70 (164.00) 5908883
POWER GRID C 221.90 (222.90) 2572746
RELIANCE IND 1598.80 (1602.55) 2385643
SBI 302.30 (303.65) 15852734
SUN PHARMA 474.35 (500.35) 11025555
TATA CONSULT 2512.00 (2503.05) 496473
TATA MOT DVR 242.25 (248.45) 1542621
TATA MOTORS 416.05 (430.00) 10849567
TATA POWER 77.80 (78.25) 2107243
TATA STEEL L 605.05 (616.45) 5202611
TECH MAHINDR 393.85 (398.25) 1135609
ULTRATECH 3997.85 (4056.70) 141670
VEDANTA LIMI 300.20 (297.70) 12367142
WIPRO 286.50 (287.40) 1089850
YES BANK LTD 1741.55 (1763.55) 1982487
ZEE ENTERTAI 540.00 (539.95) 2995580

### నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1386.35 (1391.75) 37418
ASHOK LEYLAN 109.60 (112.10) 7762163
BAJAJ FINANC 1697.70 (1779.80) 1899560
BAJAJ FINSER 5121.90 (5336.10) 225019
BEL 179.25 (181.85) 2189063
BHEL 133.00 (134.65) 2747975
BRITANNIA 4058.90 (4072.35) 174011
CADILA HEALT 485.45 (530.00) 2411629
COLGATE PALM 1056.75 (1066.85) 215316
CONTAINER 1168.85 (1168.55) 229607
CUMMINS INDI 904.35 (936.30) 297528
DABUR INDIA 310.50 (314.95) 643371
DIVIS LAB 639.05 (673.70) 1428857
DLF LIMITED 178.85 (178.60) 13187103
EMAMI LIMITE 1128.65 (1150.25) 202476
GLAXOSMI CON 5409.85 (5541.50) 13258
GLAXOSMI PHA 2392.10 (2380.00) 10473
GLENMARK PHA 645.45 (668.25) 966191
GODREJ CONSU 921.80 (946.80) 312418
HAVELLS INDI 497.95 (485.15) 1568312
HINDUSTAN ZI 286.65 (284.65) 1873275
HPCL 429.65 (436.15) 7655580
ICICI PRU LI 425.75 (433.65) 596726
IDEA CELLULR 91.05 (91.65) 5140576
INTERGLOBE A 1303.35 (1295.50) 707728
JSW STEEL LT 230.45 (230.85) 3591242
LIC HOUS.FIN 676.90 (681.10) 907035
MARICO LIMIT 325.70 (333.95) 2275048
MCDOWELL 2535.95 (2548.20) 214981
MOTHERSON 329.05 (336.65) 1363385
NHPC LTD 30.85 (31.25) 4604984
NMDC LTD 126.15 (127.65) 6002339
OIL INDIA 282.05 (282.35) 279146
ORACLE FIN S 3552.90 (3568.60) 11350
P&G HYG&HEAL 8104.30 (8087.05) 3895
PETRONET LNG 207.45 (211.35) 1371273
PIDILITE IND 795.25 (810.30) 401181
PIRAMAL ENTE 2851.55 (2919.15) 116565
PNB 148.30 (148.80) 7478797
POWER FIN CO 134.10 (135.65) 5511396
RURAL ELEC C 175.25 (179.05) 4800505
SAIL 61.45 (62.95) 4534693
SHREE CEMENT 17945.95 (17767.65) 11297
SHRIRAM TRAN 942.75 (970.85) 950776
SIEMENS 1325.75 (1344.45) 156259
SUN TV LTD 705.55 (725.60) 1648664
TITAN IND 619.15 (609.40) 4440491
TORRENT PHAR 1234.70 (1270.20) 124045
UNITED BREWE 832.35 (820.95) 758790
UPL LIMITED 830.50 (863.35) 1211850

### ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 175.80 (179.50) 404459
ADANI ENTERP 124.25 (137.35) 5431633
ADANI POWER 31.55 (31.60) 6873075
ALL BANK 68.85 (69.85) 2537010
AMARA RAJA 805.20 (800.95) 674420
ANANT RAJIND 55.50 (57.10) 2102459
ANDHRA BANK 54.10 (54.25) 2393512
APOLLO HOSPI 1220.55 (1251.05) 238162
APOLLO TYRES 270.25 (280.45) 6919830
APTECH 219.50 (213.25) 973539
BAJAJ ELECT. 319.95 (329.85) 67710
BAJAJ HIND 14.85 (15.30) 5789167
BAJAJ HOLDIN 2554.10 (2540.20) 13820
BALAJI TELE 164.30 (159.60) 851617
BALLARPUR IN 15.00 (15.80) 1513262
BALRAMPUR CH 166.35 (170.10) 1878491
BANK OF MAHA 27.05 (27.05) 112986
BANK OFINDIA 158.45 (152.55) 21791934
BATA INDIA 636.55 (634.25) 720334
BGR ENERGY S 136.55 (140.45) 81076
BHARAT FORGE 1165.75 (1188.65) 743210
BHUSHAN STEE 67.25 (68.95) 479437
BIOCON LTD 339.00 (349.95) 1632080
BOMBAY DYE 78.10 (80.30) 731355
CANARA BANK 343.95 (346.65) 2123888
CEAT LIMITED 1689.60 (1765.00) 1365868
CENTRAL BANK 85.05 (85.90) 396724
CHAMBAL FERT 135.70 (139.75) 1044294
CHENNAI PETR 398.25 (412.05) 3080683
CITY UNIBANK 162.00 (168.25) 1490491
CORPO BANK 50.25 (48.55) 358964
COX & KINGS 271.95 (271.35) 510239
D B REALTY L 36.80 (38.25) 959071
DELTA CORP L 168.85 (168.30) 2156016
DENA BANK 32.50 (32.70) 846278
DHANALAKBANK 35.55 (36.75) 687482
EDELWEISS CA 250.40 (238.15) 6621160
EDUCOMP SOLU 8.00 (8.35) 304194
EID PARRY 307.40 (312.70) 200690
EIH 131.30 (132.95) 38222
ESSAR SHIPPI 25.70 (26.55) 42979
ESTER INDUST 34.35 (35.35) 83374
EXIDE INDUST 207.20 (214.25) 2115378
FEDERAL BANK 108.30 (112.30) 13541654
FINOLEX CABL 490.45 (489.20) 60506
G E SHIP LTD 388.00 (387.70) 76494
GAMMON INDIA 9.05 (9.45) 611750
GAMMON INFRA 4.00 (5.00) 60413545
GATI LIMITED 114.55 (117.55) 298547
GAYATRI PROJ 159.45 (163.90) 18977
GITANJALIGEM 58.70 (60.90) 283940
GMR INFRASTR 16.95 (17.70) 30393631
GODREJ IND 601.90 (629.25) 490316
GRASIM IND 1091.80 (1108.65) 690933
GUJ ALK&CHEM 403.95 (400.15) 91816
HCL INFOSYS 43.60 (45.95) 1027776
HEXA TECH 260.20 (261.40) 648819
HIMACHAL FUT 16.55 (17.40) 5150656
HINDU MOTORS 7.85 (8.00) 176419
HOUSING DEV 57.20 (56.40) 196100277
IDBI 55.95 (55.75) 1960714
IDFC 56.40 (56.90) 3947103
IFCI 24.45 (25.25) 3841906
IL&FS TRANS 83.45 (86.50) 331752
IND SWIFTLAB 35.45 (35.75) 12530
INDBULLS REL 249.40 (253.70) 11715205
INDIA CEM 186.30 (193.20) 4896299
INDIAN BANK 296.20 (300.40) 808081
INDO RAMA SY 29.10 (29.75) 53205
INDRAPRASTHA 1231.00 (1225.10) 894729
IND-SWIFTLTD 8.25 (8.65) 23302
INGERSOLL-R 800.70 (815.20) 8542
IOB 23.95 (24.20) 925890
IPCA LAB 436.95 (454.05) 65931
IRB INFRA DE 211.45 (219.45) 3661501
J&K BANK 79.20 (79.95) 326079
JAI CORP 77.20 (79.20) 571879
JAIN IRRIGAT 99.40 (103.15) 8015979
JAYPEE INFRA 19.80 (20.80) 6549491
JAYSHREE TEA 99.30 (101.25) 66355
JET AIRWAYS 613.70 (630.20) 1480023
JINDAL SAW 92.80 (93.10) 1141120
JINDAL STEEL 135.95 (139.50) 15924281
JK LAKSHMI C 429.45 (440.30) 39928
JK PAPER LIM 93.75 (95.30) 771819
JM FINANCIAL 124.25 (123.40) 1625802
JP ASSOCIATS 25.60 (26.20) 142549932
JSW ENERGY L 70.55 (70.95) 12238707
JUBILANT FOO 1299.20 (1330.80) 1763170
JUBILANT ORG 669.20 (688.10) 231824
JYOTHY LABS 374.15 (382.20) 18745

## ఘనం (+)

| నిఫ్టీ | 9న | మార్పు % |
|---|---|---|
| HINDALCO | 239.45 | 1.94 |
| NTPC | 173.65 | 1.46 |
| ONGC | 165.70 | 1.04 |
| VEDANTA | 300.20 | 0.84 |
| ASIAN PAINTS | 1155.55 | 0.71 |
| HDFC | 1731.65 | 0.68 |
| INFOSYS | 969.35 | 0.57 |

## గ్రహణం (-)

| నిఫ్టీ | 9న | మార్పు % |
|---|---|---|
| AUROBINDO PHA | 683.60 | -5.88 |
| SUN PHARMA | 474.35 | -5.20 |
| ADANI PORT | 397.25 | -4.23 |
| TATA MOTORS | 416.05 | -3.24 |
| INDIABULLS HSG | 1159.00 | -3.08 |
| CIPLA | 561.85 | -2.89 |
| BAJAJ AUTO | 2831.15 | -2.76 |

KARNATA BANK 146.40 (150.75) 1877281
KEC INTL LTD 300.50 (297.05) 401772
KOLTE PATIL 155.85 (158.65) 41324
KPIT CUMMINS 116.10 (120.70) 1950166
L&TFIN.HOLD 172.15 (175.40) 4403356
LAK VIL BANK 177.35 (174.45) 426549
M & M FINANC 423.60 (425.55) 2468408
MANAPPURAM G 98.70 (104.35) 6157450
MMTC LIMITED 57.05 (57.80) 414635
MOSER-BEAR 4.80 (4.95) 621321
MPHASIS LTD 581.50 (581.50) 19847
MRPL 134.40 (139.00) 2992806
MTNL 18.50 (18.90) 563634
NCC LIMITED 89.60 (89.20) 5364312
NETWORK18 FI 52.25 (53.20) 413670
NEULAND LAB 1359.60 (1389.75) 3888
NIIT LTD 86.85 (88.20) 670483
NIIT TECHNOL 482.45 (489.20) 365134
OMAXE LTD 202.20 (202.25) 472977
ONMOBILE GLO 58.75 (61.30) 196479
ORIENT PAPER 94.75 (96.65) 216929
ORIENTALBANK 136.05 (136.45) 2169560
PATEL ENGG 75.65 (78.80) 172408
PFIZER 1798.70 (1808.95) 8515
POLARIS SOFT 232.80 (229.90) 159777
POWERTRADING 117.10 (118.65) 2889014
PRAJ IND 73.20 (74.30) 142924
PRISM CEMENT 118.70 (121.05) 156686
PROVOGUE (IN 4.10 (4.10) 60297
PUNJ LLOYD 19.90 (20.50) 1361322
PUNJAB & SIN 50.55 (51.25) 432432
PURAVANKARA 72.10 (74.20) 190375
PVP VENTURES 4.85 (5.10) 203640
PVR LIMITED 1358.00 (1409.65) 228114
RADICO KHAIT 146.40 (147.70) 607934
RAJ OIL MILL 1.35 (1.35) 40935
RAJESH EXPOR 718.40 (738.30) 213274
RALLIS INDIA 238.25 (239.60) 87284
RAMCO IND 240.45 (237.75) 296688
RAMCO SYS 370.70 (380.70) 36058
RAMKY INFRA 87.40 (92.15) 117940
RAYMOND 781.15 (775.80) 715868
RELIANCE CAP 799.50 (786.05) 9824920
RELIANCE COM 22.20 (22.90) 14895690
RELIANCE INF 514.40 (528.30) 2291404
RELIANCE POW 41.25 (41.80) 2658505
ROLTA INDIA 54.55 (55.15) 266560
SAGAR CEMENT 832.10 (830.55) 4422
SAREGAMA 365.90 (379.10) 172300
SHANTHI GEAR 130.50 (133.30) 30109
SHIPPNG CORP 90.60 (88.35) 3370376
SHREE RENUKA 17.80 (18.60) 3830694
SINTEX IND 29.50 (31.75) 49157070
SOBHA DEVELO 373.40 (378.40) 450345
SOUTHINDBANK 27.70 (28.55) 10401206
STERLITE TEC 230.65 (241.10) 1384213
SUJANA METAL 1.80 (1.90) 73661
SUN PHARMA 359.95 (368.10) 302231
SUND FASTNER 384.50 (391.65) 60548
SUZLON ENERG 16.30 (16.65) 55115949
SYND. BANK 69.00 (69.70) 2817195
TATA CHEM 579.05 (596.05) 2197681
TATA COFFEE 122.10 (126.00) 264086
TATA COMMUN 606.95 (628.80) 599884
TATA GLOBAL 162.10 (166.00) 1267995
TATA METALIK 647.25 (671.45) 183026
TATA TELESER 6.95 (7.25) 2324584
THE INDIAN H 126.15 (129.95) 329443
TORRENT POWE 195.50 (197.90) 1416685
TRIVENI ENGG 94.05 (97.30) 4430729
TTK PRESTIGE 6194.05 (6318.05) 5049
TV TODAY NET 228.55 (234.75) 83948
TV18 BROADCA 36.45 (37.80) 3139024
TVS MOTOR 590.70 (595.30) 580251
UCO BANK 31.85 (31.95) 613195
UNION BANK 141.60 (142.40) 3732422
UNITECH 7.85 (8.05) 56793956
UNITED BANK 18.95 (19.05) 439766
USHA MARTIN 20.40 (21.50) 1378192
VADILAL INDU 892.75 (906.75) 62098
VENKYS 2100.15 (2127.90) 89838
V-GUARD IND 179.35 (181.35) 432809
VIJAYA BANK 67.85 (67.00) 898490
VIP 190.05 (191.85) 233820
VOLTAS 527.60 (537.45) 896586
ZEE LEARN LI 41.45 (42.90) 334897
ZUARI GLOBAL 126.95 (128.45) 8501
ZYDUS WELLNE 885.05 (885.30) 3709

## బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 806.15 (827.20) 4631
AMAR RAJA BA 802.45 (801.20) 22164
ANDHRA BANK 54.15 (54.20) 134569
ANDHRA CEMEN 9.06 (9.53) 40786
ANDHRA PAPER 299.70 (300.20) 12307
ANDHRA PETRO 25.60 (26.50) 26871
ANDHRA SUGAR 332.95 (338.50) 9348
ANJANI PORTL 218.80 (224.50) 2660
ASTRA MICROW 126.75 (129.25) 36224
AUROBINDO PH 684.15 (726.55) 550116
AVANTI FEEDS 1703.90 (1760.20) 12763
AVON ORG 5.90 (5.85) 18410
BALAJI AMIN 322.85 (328.20) 1520
BARTRONICS 14.40 (14.75) 10006
BHAGIRA CHEM 165.60 (175.85) 1531
BHAGYA NAG 22.45 (23.10) 7259
BN RATHI SEC 31.85 (33.20) 6447
BRILLIANT SE 7.78 (7.79) 31623
CAMBRIDGE TE 68.60 (69.95) 8420
COMBAT DRUGS 11.71 (11.71) 12290
CONT COFFEE 283.20 (280.55) 13366
COROMAN FERT 424.65 (437.85) 13558
CYIENT LIMIT 524.60 (527.75) 1271
DECCAN CEMEN 1110.55 (1122.60) 1039
DIVI'S LAB 638.90 (673.20) 161515
DR REDDY 2046.65 (2101.70) 114454
FOUR SOFT 91.20 (97.90) 19010
GATI CORPN 114.30 (117.80) 80994
GMR INFRASTR 16.95 (17.70) 2931706
GOLDST INFRA 92.95 (86.85) 105455
GRANULES (I) 116.90 (126.90) 238073
GVK POWER 12.93 (12.70) 4202856
HBL NIFE POW 44.75 (46.15) 36225
HERITAGE FOO 1285.45 (1308.70) 2424
HYD INDUS 1039.75 (1081.20) 4165
IDL INDUSTRS 501.30 (512.60) 4777
ILFS ENGINEE 42.25 (43.55) 19731
IVRCL INFRAS 5.69 (5.87) 502129
KALLAM SPG 28 (26.70) 99286
KAVERI SEED 607.80 (659) 160595
KCP LTD 100.15 (101.40) 18956
LANCO INDUS 362.80 (367.85) 9367
LANCO INFRAT 1.05 (1.10) 934938
LAURUS LABS 552.50 (573.70) 6973
MADHUCON PRO 29.95 (31) 41437
MEGA SOFT 14.75 (15.10) 38692
MIC ELECTRON 7.75 (7.93) 113045
MOLDTK PLA 275.10 (281.80) 2771
NAGARJAGRICH 33.70 (35.40) 79466
NATCO PHARMA 830.60 (925.25) 117366
NAVA BH VENT 125.65 (129.20) 38977
NCC 89.65 (89.15) 941844
NCL IND 207.05 (208.60) 11791
NETTLINX 107.15 (108.80) 3473
NEULAND LAB 1355.60 (1378.80) 139
NIHAR INFO 17 (16.50) 600
NILE 621.55 (625.20) 5853
PANKAJ POLY 10.01 (9.54) 90500
PANYAM CEMEN 60.60 (61.45) 12027
PENNER IND 51.15 (53.20) 47592
PIONEER DIST 231.50 (232.35) 1023
PRISM CEMENT 117.60 (120.20) 20776
PRUDENTL PHA 4.19 (4.39) 162240
RAIN INDUSTR 131.60 (132.90) 423236
SAMKRG PIST 263.10 (288.05) 31026
SATVAH. ISPA 40.75 (41.80) 5552
SMS PHARMA 73.55 (75.75) 8688
SPHERE GLOBA 50.55 (52.35) 1682
SREE RAYAL A 28.20 (29.60) 294754
STEEL EXCHAN 82.85 (84.40) 59117
SUJANA METAL 1.76 (1.85) 49672
SUJANA TOWER 4.20 (4.20) 10900
SUJANA UNIVE 1.01 (1.05) 133337
SURANA TELE 4.80 (4.71) 33650
SURYALAKSH.C 103.75 (104.70) 1800
SUVEN PHARMA 164.65 (165.20) 28393
TAJ GVK HOTE 162.25 (162.85) 5408
TANLA 33.15 (33.90) 62014
TERA SOFTWAR 66.10 (69.65) 9384
VICEROY HOTE 18.30 (19.25) 53622
VIJAY TEXTIL 60.90 (60.30) 26967
VIMTA LABS 135.30 (136.40) 5159
VISAKA IND 459.85 (475.20) 8484
VIVIMED LABS 116.55 (118.65) 134928
VST INDUS 2798.20 (2931.05) 212
YBRANT DIGIT 6.81 (6.97) 35723
ZENTECH 54.05 (55.20) 8282

GH

## ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.1.90 లక్షల కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) ఏప్రిల్- జులై నెలల్లో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.1.90 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో జరిగిన వసూళ్ల కంటే ఈ మొత్తం 19.1% ఎక్కువ. బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యంలో 19.5% ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో సాధించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. వ్యక్తిగత ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్నులు ఉండే ప్రత్యక్ష పన్నుల వసూళ్లు స్థిరమైన వృద్ధి నమోదు చేశాయని వెల్లడించింది. కార్పొరేట్ ఆదాయ పన్ను 7.2 శాతం, వ్యక్తిగత ఆదాయ పన్ను (సెక్యూరిటీల లావాదేవీ పన్ను కలిపి) 17.5 శాతం చొప్పున పెరిగాయి.

ఈనాడు బిజినెస్

## ఫోర్బ్స్ వినూత్న కంపెనీల జాబితాలో భారత సంస్థలు

దిల్లీ: ఫోర్బ్స్ 100 వినూత్న కంపెనీల జాబితాలో భారత కంపెనీలు మూడింటికి చోటు దక్కింది. హిందుస్థాన్ యూనీలీవర్(7), ఏషియన్ పెయింట్స్(8), భారతీ ఎయిర్‌టెల్(78) ఈ జాబితాలో నిలిచాయి. పది బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ, ఏడు సంవత్సరాల ఆర్థిక సమాచారం కలిగిన కంపెనీలను పరిశీలించి 'ప్రపంచ వినూత్న కంపెనీల జాబితా'లో చోటుకల్పిస్తారు. వీటిలో సేల్స్ ఫోర్స్ డాట్ కామ్, టెస్లా మోటార్స్ వరుసగా మొదటి, రెండో స్థానాల్లో నిలవగా, అమెజాన్ డాట్ కామ్ (3), షాంఘై రాస్ బ్లడ్ ప్రోడక్ట్స్ (4), నెట్‌ఫ్లిక్స్ (5) తరవాత స్థానాల్లో ఉన్నాయి.

# సైబర్ భద్రతలో భారీ ఉద్యోగావకాశాలు

**● 2025 నాటికి 10 లక్షల ఉద్యోగాలు ● పెద్దఎత్తున కంపెనీల పెట్టుబడులు**

**● ప్రత్యేక వ్యూహాలు, ప్రణాళికలు, బోర్డుల్లో చర్చలు ● ప్రతి మంత్రిత్వ శాఖలో సైబర్ సెక్యూరిటీ అధికారి**

ఈనాడు - హైదరాబాద్



**ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడుల భయం పెరిగిపోతోంది. యాప్‌లు, మొబైల్, క్లౌడ్ కంప్యూటింగ్ విస్తరిస్తుండడంతో సైబర్ భద్రత కీలకంగా మారింది. ఈ విభాగంలో కంపెనీలు, ప్రభుత్వం, సాఫ్ట్‌వేర్ పరిశ్రమ, నియంత్రణ సంస్థలు కలిసి పని చేస్తున్నాయని డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) రమా వేదశ్రీ తెలిపారు. సైబర్ భద్రతపై నాస్‌కామ్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె ఇక్కడకు వచ్చారు. డేటా భద్రత, సైబర్ రక్షణ కోసం దాదాపు దశాబ్దం క్రితం డీఎస్‌సీఐను నాస్‌కామ్ ఏర్పాటు చేసింది. ఈ రంగంలో నైపుణ్యాల కొరత, ఉద్యోగ అవకాశాలు, సైబర్ భద్రతకు కంపెనీలు అనుసరిస్తున్న వ్యూహాలు మొదలైన వాటిపై ఆమె 'ఈనాడు'తో ముచ్చటించారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలివీ..**

**? సైబర్ భద్రతలో ఉద్యోగావకాశాలు బాగా ఉన్నాయంటున్నారు. నిజమేనా**

సైబర్ భద్రతలో ప్రభుత్వం, కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దేశీయ ఐటీ పరిశ్రమ ఇందుకోసం ప్రత్యేక ఉత్పత్తులు, సొల్యూషన్లపై దృష్టి కేంద్రీకరిస్తోంది. పెద్ద, పెద్ద ఐటీ కంపెనీలు అంతర్జాతీయంగా ఈ సేవలు అందిస్తున్నాయి. దేశ, అంతర్జాతీయ ఖాతాదారుల (కంపెనీలు) కోసం సెక్యూరిటీ కార్యకలాపాల కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. సైబర్ భద్రతా రంగంలో పెద్ద ఐటీ కంపెనీలు వేళ్లూనుకుంటే, ఈ విభాగంలో మరింత మంది నిపుణులను పెంచుకోవడానికి ప్రయత్నిస్తాయి. సొంత అవసరాల కోసం వెల్స్ ఫార్గో, డాయిష్ బ్యాంకుల వంటి అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. అంతర్జాతీయ కంపెనీలు సెక్యూరిటీ కార్యకలాపాలు, సొల్యూషన్లకు భారత్‌ను కేంద్రంగా భావిస్తున్నాయి. బ్యాంకింగ్, ఇంధనం వంటి రంగాల్లోని కంపెనీలు, సేవల వినియోగ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రతి మంత్రిత్వ శాఖకు ఒక ముఖ్య సమాచార భద్రతా అధికారి (సీఐఎస్ఓ) ఉండాలని ఇటీవల కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసింది. దాదాపు అన్ని కంపెనీలు ఈ నియామకాలు జరిపాయి. ఈ విభాగంలో ఉద్యోగ అవకాశాలు అధికంగా లభిస్తాయి. నాస్‌కామ్ సైబర్ భద్రతా కార్యచరణ బృందం అంచనా ప్రకారం 2016 చివరి నాటికి 1.5 లక్షల మంది ఈ రంగ నిపుణులు ఉన్నారు. 2025 నాటికి 10 లక్షల మంది నిపుణులు ఈ రంగంలో పని చేయగలరని భావిస్తున్నాం.

**? సైబర్ భద్రతా విభాగం వృద్ధిరేటు ఎలా ఉంది**

దేశీయ సైబర్ భద్రతా పరిశ్రమ విలువ 4.2 బిలియన్ డాలర్లు. ఇందులో 1.6 బిలియన్ డాలర్లు దేశీయ విపణి నుంచి లభిస్తోంది. 2025 నాటికి ఇది 35 బిలియన్ డాలర్లకు (రూ.2.25 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా వేస్తున్నాం. అప్పటికి మొత్తం ఐటీ పరిశ్రమ ఆదాయంలో సైబర్ భద్రత వాటా 10 శాతానికి చేరొచ్చు.

**? నైపుణ్యాల కొరతను ఏ విధంగా అధిగమించాలి**

అధిక శాతం విద్యా సంస్థల్లో డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేషన్ స్థాయిల్లో సైబర్ భద్రతా నైపుణ్యాలు బోధించే కోర్సులు లేవు. నైపుణ్యాలను పెంచడానికి డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ) కృషి చేస్తోంది. సెక్యూరిటీ కేంద్రం కార్యకలాపాల నిపుణులు, అప్లికేషన్ సెక్యూరిటీ ప్రత్యేక నిపుణులు, విశ్లేషణ నిపుణుడు వంటి కొత్త ఉద్యోగాలను ప్రవేశపెట్టింది. వీటికి విద్యార్హతలు, పాఠ్యాంశాలు మొదలైన వాటిని రూపొందించింది. వీటిని బోధించడానికి అధ్యాపకులకు శిక్షణ ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని అనేక విద్యా సంస్థలు ఈ కోర్సులు ప్రవేశపెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి.

**? ఈ రంగంలో అంకుర కంపెనీల వ్యవస్థ ఎలా ఉంది**

దాదాపు 100 ఉత్పత్తి (ప్రొడక్ట్), అంకుర కంపెనీలు ఈ రంగంలో ఉన్నాయి. ఏడాదిలో సైబర్ భద్రతా రంగంలో ఉత్పత్తి, అంకుర కంపెనీలు రెట్టింపు అయ్యాయి. ఈ సంస్థలు ప్రధానంగా 10 విభాగాల్లో సైబర్ భద్రతకు అవసరమైన సొల్యూషన్లు అభివృద్ధి చేస్తున్నాయి. ఈ రంగంలోని అంకుర సంస్థలకు సిరీస్ ఎ, బి నిధులు లభిస్తున్నాయి. అనేక వెంచర్ కేపిటలిస్టులు సైబర్ భద్రతలోని అంకుర కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**ఈనాడు ఇంటర్వ్యూ — డీఎస్‌సీఐ సీఈఓ రమా వేదశ్రీ**

**? కార్పొరేట్ కంపెనీల్లో సైబర్ భద్రత వ్యూహాలు ఎలా ఉన్నాయ్**

కీలక మౌలిక సదుపాయాల కంపెనీలన్నీ సైబర్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. సైబర్ దాడుల నుంచి రక్షణ కల్పించే వ్యవస్థలు, నిపుణులపై పెట్టుబడులు పెడుతున్నాయి. ముప్పును ముందుగానే కనిపెట్టడంపై (థ్రెట్ ఇంటెలిజెన్స్) దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. అనేక పెద్ద కంపెనీల్లో బోర్డులు తరచూ సైబర్ భద్రత చర్యలు, వ్యూహం, రిస్క్ మొదలైన వాటిపై సమీక్షలు నిర్వహిస్తున్నాయి. చాలా కంపెనీలు సైబర్ దాడులు జరిగితే వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలను (ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్) తయారు చేసుకుంటున్నాయి.

**? సైబర్ భద్రత పెంచడానికి డీఎస్‌సీఐ ఎటువంటి చర్యలు తీసుకుంటోంది**

నాస్‌కామ్‌తో కలిసి పూర్తి స్థాయి నైపుణ్యాలు అభివృద్ధి చేయడంపై డీఎస్‌సీఐ కృషి చేస్తోంది. నేషనల్ టెక్నాలజీ రిపాజిటరీపై పని చేస్తున్నాం. ఇది విద్యా సంస్థలు, పరిశ్రమ, ప్రభుత్వం వద్ద సైబర్ సెక్యూరిటీ పరంగా ఉన్న ప్రత్యేక సామర్థ్యాలను ఒక గొడుగు కిందకు తీసుకువస్తుంది. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల భద్రత అలయన్స్, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో చేపడుతున్నాం.

**? డిజిటల్ చెల్లింపుల భద్రత అలయన్స్ గురించి వివరిస్తారా**

దేశంలో డిజిటల్ చెల్లింపులు ఊపందుకుంటున్నాయి. ఇందులో బ్యాంకులు, ఫైనాన్స్ టెక్నాలజీ కంపెనీలు, ఐటీ కంపెనీలు, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ వంటి సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. భాగస్వాములను ఒక వేదిక పైకి తీసుకువచ్చి డిజిటల్ చెల్లింపులు, సైబర్ సెక్యూరిటీ అంశాలను సమీక్షించి ప్రభుత్వం, నియంత్రణ సంస్థల దృష్టికి తీసుకురావడం, నియంత్రణ, విధి విధానాలను తీసుకురావడం ఈ అలయన్స్ ఉద్దేశం. అలయన్స్ తొలి సమావేశం సెప్టెంబరులో జరిగే వీలుంది. డిజిటల్ చెల్లింపులు చేయాలంటే.. నమ్మకం, హామీ చాలా ముఖ్యం. డేటా రక్షణకు కఠిన నిబంధనలు ఉండాలి.

**? బ్యాంకింగ్ రంగంలో సైబర్ భద్రత ఎలా ఉంది**

బ్యాంకింగ్ రంగానికి రిస్క్ ఎక్కువ. అందుకే బ్యాంకులకు గత ఏడాదే రిజర్వు బ్యాంకు సైబర్ భద్రత నియమ నిబంధనలను నిర్దేశించింది. వాటిని అన్ని బ్యాంకులు పాటించాలి. ఫైనాన్షియల్ సర్వీసెస్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ తీసుకురావాలని భావిస్తున్నారు. ఏదైనా సైబర్ దాడి జరిగితే వెంటనే స్పందించడానికి ఇది వీలు కల్పిస్తుంది. చాలా బ్యాంకులు అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ కార్యకలాపాల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి.

## దక్షిణ కొరియా నుంచి భారీగా బంగారం దిగుమతులు

● దిగుమతి సుంకం లేకపోవడం వల్లే

● స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద ప్రభావం



**దిల్లీ:** దక్షిణ కొరియా నుంచి పసిడి దిగుమతులు ఒక్కసారిగా పెరగడంతో వాటి అదుపునకు ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. జులై 1 నుంచి ఆగస్టు 3 మధ్య ఏకంగా 338.6 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.2000 కోట్లు) విలువైన బంగారం దక్షిణ కొరియా నుంచి దిగుమతి అయ్యింది. 2016-17 మొత్తం మీద ఆ దేశం నుంచి వచ్చిన పసిడి దిగుమతుల విలువ 70.46 మిలియన్ డాలర్లు(దాదాపు రూ.440 కోట్లు) మాత్రమే. దక్షిణ కొరియా, భారత్‌ల మధ్య కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) ప్రకారం.. జనవరి 2010 నుంచీ బంగారంపై ప్రాథమిక కస్టమ్ సుంకాన్ని తొలగించారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక, 12.5% దిగుమతి నిరోధక సుంకం కూడా రద్దయింది. ఇపుడు దిగుమతులపై ఏకీకృత జీఎస్‌టీ(ఐజీఎస్‌టీ) కింద 3 శాతం పన్ను మాత్రమే ఉంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలున్న ఇతర దేశాల నుంచి కూడా పసిడి దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆ అధికారి అంచనా వేస్తున్నారు. వీటిని నిరోధించేందుకు 'దిగుమతి చేసుకున్న బంగారాన్ని సంబంధిత అవసరాలకు మాత్రమే ఉపయోగించాలన్న నిబంధన పొందుపరచవచ్చు. భద్రతా సుంకాన్ని వేయొచ్చు. పండుగ సీజను ముందున్న నేపథ్యంలో చట్టంలో లోపాలను సరిదిద్దాల్సి ఉంద'ని ఆ అధికారి తెలిపారు.

## ఈ తేదీల్లో జీఎస్‌టీ రిటర్న్‌లు వేయొచ్చు

నోటిఫై చేసిన ప్రభుత్వం

**దిల్లీ:** వస్తు, సేవల పన్ను విధానం (జీఎస్‌టీ)లో తుది రిటర్న్‌ల దాఖలుకు తేదీలను ప్రభుత్వం నోటిఫై చేసింది. తుది రిటర్న్‌ల కింద వ్యాపారులు జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-2, జీఎస్‌టీఆర్-3 ఫారాలు సమర్పించాల్సి ఉంటుంది. వాస్తవానికి ఈ నెల తుది రిటర్న్‌లను మరుసటి నెల నిర్దేశిత తేదీన దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే జులైలోనే కొత్త పన్ను విధానం అమల్లోకి వచ్చినందున, ఆ నెలతో పాటు ఆగస్టుకు తుది రిటర్న్‌ల దాఖలు నిమిత్తం ప్రభుత్వం మరింత గడువు ఇచ్చింది. ఆ లోపు ఈ రెండు నెలలకు సంబంధించి జీఎస్‌టీఆర్-3బీని వ్యాపారులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందులో సరఫరా, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సహా పన్ను చెల్లింపు వివరాలన్నింటినీ పొందుపరచాల్సి ఉంటుంది. జులై, ఆగస్టు తుది రిటర్న్‌ల దాఖలుకు తేదీలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) ఖరారు చేసింది. ఆ వివరాలు పట్టికలో..

| ఫారం | జులై | ఆగస్టు |
|---|---|---|
| జీఎస్‌టీఆర్-1 | సెప్టెంబరు 1-5 | సెప్టెంబరు 16-20 |
| జీఎస్‌టీఆర్-2 | సెప్టెంబరు 6-10 | సెప్టెంబరు 21-25 |
| జీఎస్‌టీఆర్-3 | సెప్టెంబరు 11-15 | సెప్టెంబరు 26-30 |

# డబ్బంతా అబ్బాయి పరమైంది!

● ఆర్థిక చిక్కుల్లో నాటి 'రేమాండ్' రారాజు

● కోర్టుకు విన్నవించిన న్యాయవాదులు



విజయ్‌పథ్ సింఘానియా

**ముంబయి:** రేమాండ్ సామ్రాజ్యాన్ని స్థాపించి... రెండు దశాబ్దాలకు పైగా పురుషుల దుస్తుల రంగంలో ఆ బ్రాండ్‌ను తిరుగులేకుండా నిలిపిన పారిశ్రామిక దిగ్గజం విజయ్‌పథ్ సింఘానియా(78) ఇప్పుడు డబ్బు కోసం కటకటలాడుతున్నారు. ఇందుకు మూలకారణం తన వంశోద్ధారకుడు... అదేనండీ.. తన కుమారుడు గౌతమ్ సింఘానియా అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంబయిలో సంపన్నుల ప్రాంతంగా పేర్కొనే మలబార్ హిల్స్‌లో ఆయన సొంత స్థలంపై నిర్మించిన 36 అంతస్థుల 'జేకే హౌస్'లో తనకు రావలసిన డ్యూప్లెక్స్ ఇంటి కోసం న్యాయస్థానాన్ని విజయ్‌పథ్ ఆశ్రయించాల్సి వచ్చింది. విజయ్‌పథ్ సింఘానియా ఇప్పుడు ఆర్థికంగా చాలా చిక్కుల్లో ఉన్నారంటూ ఆయన తరఫు న్యాయవాది బుధవారం బొంబాయి హైకోర్టుకు విన్నవించారు. ఉన్న సంపదనంతా కుమారుడికి అప్పగించగా... అతడు మాత్రం తండ్రి నుంచి అంతా లాగేసుకున్నారని తెలిపారు. రేమండ్ సంస్థలో ఉన్న రూ.1000 కోట్ల విలువైన షేర్లన్నిటినీ కూడా విజయ్‌పథ్ తన కుమారుడి పరం చేశారన్నారు. చివరకు విజయ్‌పథ్ సింఘానియా ఇప్పుడు దక్షిణముంబయిలోని గ్రాండ్ పరాడీ సొసైటీలో ఓ అద్దె ఇంట్లో కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఇంత ఆస్తినీ పొందిన గౌతమ్ ఇప్పుడు వృద్ధుడైన తన తండ్రికి కనీసం కారు, డ్రైవర్ లేకుండా చేసేశారని న్యాయస్థానానికి విన్నవించారు.

వాస్తవానికి విజయ్‌పథ్ సింఘానియానే 1960లో 14 అంతస్తుల 'జేకేహౌస్'ను నిర్మించారు. ఆ భవంతిలోని నాలుగు డ్యూప్లెక్స్‌లను 'రేమండ్' అనుబంధ సంస్థ అయిన 'పష్మినా హోల్డింగ్స్'కు అప్పగించారు. ఈలోగా...అంటే 2007లో ఆ 14 అంతస్తుల భవనం స్థానంలో కొత్త నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని రేమండ్ కంపెనీయే నిర్ణయించింది. ఆ మేరకు 36 అంతస్తుల భవంతి నిర్మితమైంది. ఈ విషయమై కుదిరిన ఒప్పందం ప్రకారం విజయ్‌పథ్ సింఘానియా సోదరుడు అజయ్‌పథ్ సింఘానియా భార్య వీణాదేవికి, ఆమె కుమారులైన అనంత్, అక్షయ్‌పథ్ సింఘానియాలకు తలో డ్యూప్లెక్స్ రావలసి ఉంది. అవేవీ కూడా ఆచరణలోకి రాకపోవడంతో వారు కూడా గౌతమ్‌పై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

విజయ్‌పథ్ సింఘానియాకు నెలకు రూ.7లక్షల చొప్పున కంపెనీ నుంచి రావాల్సి ఉందని ఆయన న్యాయవాదులు చెప్పారు. అంతేకాదు, కంపెనీ ఖర్చులతో ఆయనకు ప్రత్యామ్నాయ నివాస వసతి కల్పించాల్సి ఉందన్నారు. ఈ నెల 18 నాటికల్లా దీనిపై సమాధానాన్ని దాఖలు చేయాల్సిందిగా రేమాండ్స్ సంస్థను కోర్టు కోరింది. 22న దీనిపై తదుపరి విచారణ జరుగుతుంది.


# ఆన్‌లైన్ పేమెంట్స్‌లో అతి పెద్ద సంస్థ ఏర్పాటు!

● వరల్డ్‌పేను కొంటున్న వ్యాంటివ్

● విలువ రూ.77,500 కోట్లు

● 146 దేశాలు, 126 కరెన్సీల్లో కార్యకలాపాలు

**లండన్:** ప్రపంచ ఎలక్ట్రానిక్ చెల్లింపు సేవల్లో అతిపెద్ద సంస్థ ఏర్పడనుంది. అమెరికాకు చెందిన కార్డ్ చెల్లింపుల ప్రాసెసింగ్ సంస్థ అయిన వాంటివ్, బ్రిటన్‌కు చెందిన వరల్డ్‌పే ను 12.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.77,500 కోట్ల)కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంది. సంయుక్త సంస్థ స్టాక్‌మార్కెట్ విలువ రూ.1.85 లక్షల కోట్లు (29 బిలియన్ డాలర్లు) ఉంటుందని అంచనా. కొత్త సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకు కూడా ఈ విలీనం ఉపయోగపడుతుందని సంస్థలు భావిస్తున్నాయి. వరల్డ్‌పే ఒకో షేరుకు వ్యాంటివ్ 5.16 డాలర్లు చెల్లించనుంది. వాంటివ్ అధ్యక్షుడు, ముఖ్యకార్య నిర్వహణాధికారి (సీఈఓ) చార్లెస్ డ్రక్కర్ కొత్తగా ఏర్పడే సంస్థ వరల్డ్‌పేకు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సహ సీఈఓగా వ్యవహరించనున్నారు. వరల్డ్‌పే సీఈఓ ఫిలిప్ జాన్సన్ సహ సీఈఓగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కొత్త సంస్థ షేర్లు లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదవుతాయి.



**కొత్త సంస్థ ఇలా..:** కొత్త సంస్థ అమెరికాలోని ఓహియో కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించనుంది. ✦ అంతర్జాతీయ కార్యకలాపాలకు లండన్ కేంద్రంగా ఉండనుంది. ✦ కొత్త సంస్థలో వాంటివ్ వాటా 57 శాతం. వరల్డ్‌పే వాటా 43 శాతం. ✦ నూతన సంస్థ సామర్థ్యం ఏడాదికి 4,000 కోట్ల లావాదేవీలు ✦ 1.5 ట్రిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలు నిర్వహించగలదు ✦ 146 దేశాలు, 126 కరెన్సీల్లో కార్యకలాపాలు.

## ఇంటి నుంచే వినియోగదారులకు సేవలు

● సిబ్బందికి అమెజాన్ అవకాశం

● హైదరాబాద్ సహా 4 నగరాల్లో

**ముంబయి:** ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వాస్తవిక (వర్చువల్) వినియోగదారుల సేవల (వీసీఎస్) నమూనాను భారత్‌లో ప్రవేశపెట్టింది. ఇందులో నైపుణ్యం కలిగిన వ్యక్తులు తమకు నచ్చిన చోట నుంచే పనిచేసే అవకాశం ఉంటుంది. వివిధ కారణాల వల్ల నిత్యం కార్యాలయాలకు హాజరయ్యే అవకాశం లేకున్నా, సేవాకేంద్రాల్లో పని చేయాలనే తపన ఉన్నవారికి ఇది ఉపయోగపడుతుంది. వీసీఎస్ పద్ధతిలో సేవలందించేందుకు నైపుణ్యం కలిగిన వారిని నియమించుకోనున్నట్లు అమెజాన్ వెల్లడించింది. ప్రస్తుతం హైదరాబాద్, పుణె, కోయంబత్తూర్, నోయిడాల్లో వీసీఎస్‌లను కంపెనీ ప్రారంభించింది. ఈ నగరాల్లో ప్రారంభ స్థాయి ఉద్యోగులతో పాటు టీం మేనేజర్లు, గ్రూప్ మేనేజర్ల నియామకాలు చేపడుతున్నట్లు అమెజాన్ తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా చాలా మంది తమ వృత్తి జీవితాన్ని పునఃప్రారంభిస్తారని, ఇంటి నుంచే ఆదాయ ఆర్జనకు అవకాశం కలుగుతుందని అమెజాన్ డైరెక్టర్ ప్రీతి తెలిపారు.

## అంకుర సంస్థలకు ఇజ్రాయెల్ ప్రోత్సాహం

**దేశీయంగా పోటీలు ప్రారంభం**

**దిల్లీ:** ఇజ్రాయెల్‌లో జరిగే అంతర్జాతీయ అంకుర సంస్థల పోటీ 'స్టార్ట్ జేఎల్‌ఎం'లో పాల్గొనే సామర్థ్యం కలిగిన అంకుర సంస్థను ఎంపిక చేసేందుకు, దేశంలో అంకుర సంస్థల మధ్య పోటీని దిల్లీలోని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం ప్రారంభించింది. స్టార్ట్ జేఎల్‌ఎమ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 40 అంకుర సంస్థలు పాల్గొంటాయి. ఈ సంస్థలకు ఇజ్రాయెల్ వెళ్లి, వచ్చేందుకు ఖర్చులన్నీ ఇజ్రాయెల్ భరిస్తుంది. ఇందులో అర్హత సాధించేందుకు నిర్వహిస్తున్న పోటీల్లో సెప్టెంబరు 28న జరిగే తుది ఎంపిక జరుగుతుంది. భారత ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)- ఇజ్రాయెల్ సంయుక్తంగా ఈ ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. తుది దేశీయంగా తుది ఎంపికకు ఖరారైన 5 అంకుర సంస్థలకు, దేశీయంగా ప్రఖ్యాతి గాంచిన ఇంక్యుబేటర్లలో అవకాశం కల్పించాలని డీఎస్‌టీ నిర్ణయించింది.

## అత్యవసరానికి హామీలేని రుణం

'ఫ్లెక్స్‌శాలరీ'ని ప్రారంభించిన వివిఫి అంకురం

**సోమాజిగూడ, న్యూస్‌టుడే:** అత్యవసర సమయంలో వ్యక్తులకు హామీ లేని రుణాన్ని అందించడానికి హైదరాబాద్‌కు చెందిన వివిఫి ఇండియా ఫైనాన్స్ 'ఫ్లెక్స్‌శాలరీ' పేరుతో రుణాలు అందించనుంది. ఆన్‌లైన్‌లో వర్చ్యువల్ హామీలేని వ్యక్తిగత రుణాలను ప్రవేశపెడుతున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిల్ కుమార్ పినపాల తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులు ముందస్తు వేతన రుణాలు పొందొచ్చని చెప్పారు. విస్తరణ కార్యక్రమాలకు రూ.100 కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్లు చెప్పారు. వ్యక్తులు రూ.2,000 నుంచి రూ.2 లక్షల వరకూ రుణాన్ని పొందొచ్చు. రూ.10,000 లోపు వేతనం ఉన్న వారూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. రూ.10,000 రుణానికి 7 రోజులకు రూ.70 వడ్డీ వసూలు చేస్తారని, నమోదైన ఖాతాదారులకైతే తక్కువ ఉంటుందన్నారు.

## విద్యార్థులకు అదనపు బ్యాగేజీ : ఖతార్ ఎయిర్‌వేస్

**దిల్లీ:** భారత్ నుంచి ఐరోపా, కెనడా, అమెరికాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఖతార్ ఎయిర్‌వేస్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. అమెరికా ప్రయాణానికి 23 కిలోల చొప్పున మూడు బ్యాగ్‌లను, ఐరోపా ప్రయాణానికి 40 కిలోల చొప్పున మూడింటిని అనుమతిస్తారు. 2018 మార్చి 31లోపు చేసుకున్న టికెట్ల బుకింగ్‌లపై ఈ ఆఫర్ వర్తిస్తుంది. 2018 డిసెంబరు 31 వరకు ఈ టికెట్లపై ప్రయాణించవచ్చు. విద్యార్థులు తమ ప్రయాణ తేదీని సైతం ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా ఒక్కసారి మార్చుకోవచ్చు. 20 శాతం రాయితీపై అదనపు బ్యాగేజీ తీసుకెళ్లొచ్చని, కొంత మొత్తం చెల్లించి బిజినెస్ క్లాస్‌కు మారొచ్చని ఖతార్ ఎయిర్‌వేస్ వెల్లడించింది.




# దక్షిణాది విపణిలోకి మహీంద్రా చిన్న ట్రాక్టర్ జివో

ధర రూ.4 లక్షలు

**బెంగళూరు:** చిన్న ట్రాక్టర్ 'జివో'ను దక్షిణ భారత విపణిలోకి మహీంద్రా అండ్ మహీంద్రా విడుదల చేసింది. ఉద్యాన పంటలను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించారు. దీని ధరను రూ.4,00,000 (ఎక్స్ షోరూం, కర్ణాటక) నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. నాలుగు చక్రాలకు ఒకేసారి శక్తిని అందించే ఫోర్ వీల్ డ్రైవ్ దీని ప్రత్యేకత. దీనికి 24 అశ్విక సామర్థ్యం (హెచ్‌పీ) కలిగిన ఇంజిన్ అమర్చారు. ట్రాక్టర్ ఎంత దూరం ప్రయాణించింది, ఎంత సేపు పని చేసింది, మైలేజీ వంటి అంశాలను 'మహీంద్రా డీజిసెన్స్' సాంకేతికతతో ఎప్పటికప్పుడు మొబైల్‌పై తెలుసుకోవచ్చు. ఈ ఏడాది అక్టోబరు-డిసెంబరు కాలంలో 20 హెచ్‌పీ ఇంజిన్ కలిగిన టూ వీల్ డ్రైవ్ రకం జివోను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా ఉపాధ్యక్షుడు (వ్యవసాయ పరికరాల మార్కెటింగ్ విభాగం) రవీంద్ర సహానే పేర్కొన్నారు.

**బుధవారం బెంగళూరులో విడుదల చేసిన జివోతో మహీంద్రా అండ్ మహీంద్రా ఉపాధ్యక్షుడు (వ్యవసాయ పరికరాల మార్కెటింగ్ విభాగం) రవీంద్ర సహానే, మరో ఉపాధ్యక్షుడు (అమ్మకాలు) విజయ్ శర్మ**

# ఈనాడు సినిమా

అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ'. ఆయన సరసన తొలిసారిగా భూమి పెడ్నేకర్ నాయికగా నటించింది. నూతన దర్శకుడు శ్రీ నారాయణ్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అక్షయ్‌తో 'బేబీ', 'స్పెషల్ 26' తెరకెక్కించిన నీరజ్ పాండే ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించాడు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ప్రతిష్ఠాత్మక పథకం స్వచ్ఛ భారత్ నేపథ్యంతో ఈ చిత్రం రూపొందడం విశేషం. ఈ చిత్రం స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.



## అది ఇంటి సమస్య కాదు... దేశ సమస్య!



'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ'

శరవేగంగా సినిమాలు చేయడం అక్షయ్ కుమార్ శైలి. ఈ ఏడాది ఇప్పటికే హాస్య ప్రధాన చిత్రం 'జాలీ ఎల్ఎల్‌బీ 2'లో కథానాయకుడిగా నటించి నవ్వులు పూయించారు. 'బేబీ' ప్రీక్వెల్ 'మేరా నామ్ షబానా'లో అతిథి పాత్రలో నటించి మెప్పించారు. తాజాగా రాబోతున్న 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ'లో గ్రామీణ యువకుడిగా కనిపించబోతున్నారు. మరుగుదొడ్ల ఆవశ్యకత తెలిపేలా వినోద ప్రధానంగా ఈ చిత్రం రూపొందింది. కాబోయే భర్త ఇంట్లో మరుగుదొడ్డి లేదన్న కారణంగా పెళ్లిని రద్దుచేసుకుంటున్న మహిళల స్ఫూర్తితో ఈ చిత్ర కథను రూపొందించినట్లు తెలుస్తోంది.



### కథేంటి

కేశవ్ (అక్షయ్ కుమార్), జయ (భూమి పెడ్నేకర్) పక్క పక్క గ్రామాలకు చెందిన యువతీయువకులు. వారిద్దరూ ప్రేమించుకుంటారు. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకుంటారు. అయితే అత్తారింట్లో అడుగుపెట్టిన తొలిరోజే మరుగుదొడ్డి లేదని తెలిసి హతాశురాలవుతుంది జయ. రోజూ బహిర్భూమికి వెళ్తూ ఆత్మగౌరవాన్ని చంపుకోలేనని చెప్పి పుట్టింటికి వచ్చేస్తుంది. దేశంలో ఎంతో మంది మహిళలు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు తెలుసుకుంటాడు కేశవ్. ఇది తన ఇంటి సమస్య కాదు... దేశ సమస్య అని భావించిన కేశవ్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? జయ తిరిగి భర్త ఇంటికి వచ్చిందా? అన్న విషయాలు తెరపై చూడాలి.

### మోదీ ప్రశంసలు

స్వచ్ఛభారత్ పథకంపై అవగాహన కల్పించేలా తెరకెక్కిన ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేయడం విశేషం. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో అక్షయ్ కుమార్ ఉత్సాహంగా పాల్గొని స్ఫూర్తి నింపారు.

### ప్రతిరోజూ చచ్చిపోతున్నారు

"మన దేశాన్ని భారత మాత అని పిలుచుకుంటాం. కానీ ఈ దేశంలో ఇంకా ఎంతో మంది అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు, కూతుళ్లు, భార్యలు కాలకృత్యాల కోసం బహిర్భూమికి వెళ్తూ ప్రతిరోజూ సిగ్గుతో చచ్చిపోతున్నారు. అక్కడే అత్యాచారాలకూ గురవుతున్నారు. ఇది ఆత్మ గౌరవ సమస్య ఒక్కటే కాదు... మహిళల ఆరోగ్య భద్రత, జీవన ప్రమాణాల సమస్య కూడా. దీని గురించి విస్తృత చర్చ జరగాలి. అందుకుఉ నా వంతుగా సినిమాను మాధ్యమంగా ఎంచుకుని 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ' చేశా" అన్నారు అక్షయ్ కుమార్.



బోయపాటి శ్రీను... మాస్ సినిమాకి కేరాఫ్ అడ్రస్. ఆయన సినిమాల్లో హీరోయిజం పతాక స్థాయికి చేరుతుంది. భావోద్వేగాలు పక్కాగా పండిపోతుంటాయి. వాటన్నిటి మధ్యలో ఓ సందేశం. ఎక్కువగా యాక్షన్‌కే పెద్దపీట వేస్తూ సినిమాలు తీసే ఆయన సుదీర్ఘకాలం తర్వాత ఓ ప్రేమకథని తెరకెక్కించాడు. అదే 'జయ జానకి నాయక'. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటించిన ఆ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

## అందరి హృదయాల్ని హత్తుకొనే ప్రయత్నమిది

**ఉన్నట్టుండి ప్రేమకథపై మనసు మళ్లడానికి కారణం?**

కొత్తదనం కోసమే. 'భద్ర' తర్వాత నేను రాసుకొన్న ఓ అందమైన ప్రేమకథ ఇది. భావోద్వేగాలు, యాక్షన్, సంగీతాన్ని జోడించి ఈ సినిమా చేశాం.

**ప్రేమకథ అయినా, మీ మార్క్ యాక్షన్ సన్నివేశాలు మాత్రం పుష్కలంగా ఉన్నట్టున్నాయి కదా?**

మానవీయ కోణాన్నీ, అందులోని భావోద్వేగాల్నీ నేనెప్పటికీ వదిలిపెట్టను. వాటితో ముడిపడే నా సినిమాలో యాక్షన్ ఉంటుంది. నేను ఏ తరహా కథని ఎంచుకొన్నా అందులో నా శైలి యాక్షన్ తప్పనిసరి. 'సింహా', 'లెజెండ్', 'సరైనోడు'... ఇలా వేటికవే భిన్న తరహా కథలు. వాటికి తగిన యాక్షన్‌నే నేను తెరపై చూపించా.

**మరీ ఎక్కువ యాక్షన్ ఉంటే కూడా ప్రేక్షకులకు రుచించదంటారు కదా...**

అది నిజమే. కథ, సన్నివేశాలకి ఎంత అవసరమో అంతే యాక్షన్ ఉండాలి. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకుడు కొట్టు అన్నప్పుడే నా కథానాయకుడు పోరాటానికి దిగుతుంటాడు. అంతే తప్ప పోరాటం కోసం పోరాటంలాగా, పాట కోసం పాటలాగా నా సినిమా ఎప్పుడూ ఉండదు.

**'సరైనోడు'లాంటి విజయం తర్వాత మీరు మరొక స్టార్ కథానాయకుడితో కలిసి సినిమా చేయొచ్చు. కానీ బెల్లంకొండ శ్రీనివాస్‌తోనే సినిమా చేయడానికి ప్రత్యేకమైన కారణమేదైనా ఉందా?**

'సరైనోడు' తర్వాత పెద్ద సినిమాలు చేసే అవకాశాలు వచ్చిన మాట నిజమే. కానీ బెల్లంకొండ శ్రీనివాస్‌తో సినిమా చేస్తానని నేను ఎప్పుడో మాట ఇచ్చా. 2007లోనే నేను ఈ కథ రాసుకొన్నా. అందులో కొన్ని కీలకమైన మార్పులు చేసి ఇప్పుడు తీశా.

**ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఓ కథానాయకుడితో సినిమా తీయడం ఎలాంటి అనుభవాన్నిచ్చింది?**

ఏదో మాట ఇచ్చేశాం, చేసేయాలన్నట్టుగా కాకుండా... ఇదివరకు నేను చేసిన సినిమాలు ఎలా ఉంటాయో, వాటికంటే ఓ మెట్టు పైనే ఉండేలా ఈ సినిమా చేశా. గుండెలమీద చేయి వేసుకొని చెబుతున్న మాట అది. ఎవరికి తగ్గ సినిమా వాళ్లతో తీయడం నాకు బాగా తెలుసు. మైఖేల్ జాక్సన్ దొరికితే డ్యాన్సే వేయిస్తా, మైక్‌టైసన్ దొరికితే బాక్సింగే చేయిస్తాను తప్ప డ్యాన్స్ వేయించను. బెల్లంకొండ శ్రీనివాస్ ఏ ఇమేజ్ లేకుండా ఒక రా మెటీరియల్‌లాగా నాకు దొరికాడు. ఆయనలోని ప్లస్సుల్ని మెరుగుపరుస్తూ, మైనసుల్ని ప్లస్‌లుగా మారుస్తూ ఈ సినిమా చేశా. పాత్ర కోసం 25 నుంచి 30 కేజీలు బరువు పెరిగి, ఆ తర్వాత మళ్లీ 15 కిలోలు తగ్గి నటించాడు. ఇలాంటి ఓ కుర్రాడు మా ఇంట్లోనూ ఉండాలని ప్రేక్షకులకు అనిపించేలా బెల్లంకొండ శ్రీనివాస్ తెరపై కనిపిస్తాడు.

**ఇంతకీ 'జయ జానకి నాయక' కథ ఏమిటి? ఆ కథకి ప్రేరణనిచ్చిన విషయాలేమిటి?**

నా నిజ జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలతో పాటు, మన సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఓ ప్రధాన సమస్య ఈ కథకి ప్రేరణ. 'కష్టం వచ్చిందని జీవితాన్ని వదులుకోం, కానీ ప్రేమకి కష్టం వచ్చిందంటే మాత్రం ప్రేమని వదిలేస్తాం. కానీ నేను వదలను, ఎందుకంటే ప్రేమించాను' అనే కథానాయకుడి సంభాషణతోనే ఈ కథ ముడిపడి ఉంటుంది. ఈ సినిమా చూశాక నిజమైన ప్రేమంటే ఇది అంటారు ప్రేక్షకులు.

**ఈ సినిమాకి నిర్మాణ వ్యయం ఎక్కువైందంటున్నారు...**

వ్యాపారం ఎక్కువే అయింది. నాపైన ప్రేక్షకులకు, పంపిణీదారులకి ఒక అంచనా ఉంటుంది. దానికి తగ్గట్టుగానే నేను సినిమా తీయాలి. సినిమాకి కొబ్బరికాయ కొట్టగానే బయ్యర్లు వచ్చి, ఎంత పెట్టైనా సినిమా తీసుకొంటున్నారంటే అది నాపైన వాళ్లకున్న నమ్మకమే. అదెప్పుడూ వమ్ము కాకూడదనే కష్టపడుతుంటా. ముఖ్యంగా ఈ సినిమా విషయంలో నిర్మాత తపనని మెచ్చుకోవాలి. సంస్థ పేరు నిలిచిపోవాలి అంటూ ఈ సినిమా చేశాడు.

**జగపతిబాబు, శరత్‌కుమార్, వాణి విశ్వనాథ్‌తో పాటు ఇంకా చాలామంది ప్రముఖ తారలు ఉన్నారు. ఆకర్షణగా నిలుస్తారనే వాళ్లని ఎంచుకొన్నారా?**

అలా అనేమీ లేదు. కథకి అంత పరిధి ఉంది. ఇందులో మూడు కుటుంబాలుంటాయి. ప్రతి పాత్ర కూడా బలంగా ఉంటుంది. ఎస్తేర్, ధన్య బాలకృష్ణన్‌లతో కలిపి ఇందులో ఐదుమంది కథానాయికలు కనిపిస్తారు.

**సెట్‌లో నటీనటుల్ని నిలబెట్టి ఓ పాఠంలా సన్నివేశాలు వివరిస్తుంటారని జగపతిబాబు పాటల వేడుకలో చెప్పారు. మీ పనితీరు అలా ఉంటుందా?**

నటీనటుల నుంచి కోరుకొంటున్నది రాబట్టుకోవడంలో భాగంగానే అలా చేస్తుంటా. నా సినిమాలో ఒక నటుడు కొత్తగా కనిపించాడంటే కారణం అలాంటి జాగ్రత్తలే.

**వాణిజ్య చిత్రాలతో విమర్శకుల మెప్పు పొందడం కష్టమవుతుంటుంది. మీ అభిప్రాయం?**

వందమందిలో ఉన్నప్పుడు ఇద్దరి కోసం సినిమా తీస్తామా? లేక 98 మంది కోసం తీస్తామా? రూ. 50 కోట్ల నుంచి రూ. 60 కోట్లు ఉన్న మన మార్కెట్ స్థాయిని మించి ఒక సినిమా రూ:. 100 కోట్లకుపైగా వసూళ్లు సాధించినప్పుడు విమర్శించాలా? మెచ్చుకోవాలా?

**తదుపరి మీరు చేయబోయేది చిరంజీవి 152వ సినిమానేనా?**

చిరంజీవిగారి కోసం కథ సిద్ధమైంది. అలాగే బాలకృష్ణ, మహేష్‌బాబు, అఖిల్‌ల కోసం కథలు సిద్ధం చేశా. వచ్చే యేడాది జూన్, జులైలో బాలకృష్ణతో సినిమా మొదలవడం మాత్రం ఖాయం.

## ఏదో అనుకొంటే... ఇంకేదో జరిగింది

తమన్నా కెరీర్ కాస్త విచిత్రంగానే కనిపిస్తుంది. ఇక్కడి అమ్మాయి కాదు, కానీ తెలుగు కథానాయికగానే చలామణీ అవుతోంది. పనిలో పనిగా తమిళంలోనూ విజయాల్ని సొంతం చేసుకొంది. సొంత భాషలో చేసిన ఏ ప్రయత్నమూ సఫలం కాలేదు. బాలీవుడ్‌లో చేసిన సినిమాలన్నీ నిరాశ పరిచాయి. 'ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు కదా..' అని అడిగితే.. "నాకు అలాంటి పట్టింపులేం లేవు. నాకు సినిమా రంగంలో మంచి పేరు వచ్చింది. దానికి భాషతో సంబంధం లేదు. సినిమా ముఖ్యం. ఓ కథ వింటున్నప్పుడు ఇది తెలుగు సినిమానా, హిందీ సినిమానా అని ఆలోచించను. నాకెంత పేరు వస్తుంది? అనేదే ముఖ్యం. బాలీవుడ్‌లో నేను చేసిన సినిమాలు ఆడలేదు. ఆ తప్పు నా ఒక్కదానిదే కాదు. మనం ఏదో అనుకొంటాం. చివరికి ఏదో జరుగుతుంది. జీవితం అంటే అదే. హిందీలో ఓ సినిమా బాగా ఆడితే దానికొచ్చే పేరు ప్రఖ్యాతులు వేరు. అంత మాత్రాన దక్షిణాదిని తక్కువ చేసి చూడలేం. 'బాహుబలి'లాంటి సినిమాని తెలుగు సినిమా అంటారా, హిందీ సినిమా అంటారా? అందులో పనిచేసిన ప్రతి ఒక్కరికీ దేశవ్యాప్తంగా మంచి పేరొచ్చింది. ఇక్కడ సినిమా ముఖ్యం.. భాష కాదు" అని చెబుతోంది తమన్నా.


తమన్నా

### గీతోపదేశం

*ప్రతి దినం ప్రభాతమై*
*వరాలు తెచ్చే సూర్యుడు*
*ప్రకాశమే తగ్గించునా*
*నా వల్ల కాదంటూ*
*ప్రతి క్షణం హుషారుగా*
*శ్రమించి సాగే వాగులు*
*ప్రయాణమే చాలించునా*
*మాకింక సెలవంటూ*
*ఉల్లాసంగా ఉత్సాహంగా బ్రతుకే సాగనీ*
*అంతే లేని సంతోషాలు ఒళ్లో వాలనీ*

గీతం: ఓ మారియా... ఓ మారియా...
చిత్రం: చూడాలని ఉంది
రచన: చంద్రబోస్
- పంపినవారు: ఎం.అప్పాజీకృష్ణ, బెంగళూరు

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం! **చిరునామా:** సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512

## యాక్షన్ మొదలైంది


సాయిధరమ్ తేజ్‌పై క్లాప్‌నిస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు

సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సికె ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లి. సంస్థ ఓ చిత్రాన్ని రూపొందిస్తోంది. వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్నారు. సి.కల్యాణ్ నిర్మాత. లావణ్య త్రిపాఠి కథానాయిక. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తొలి సన్నివేశానికి ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్‌నిచ్చారు. సత్యానంద్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఆకుల శివ గౌరవ దర్శకత్వం వహించారు. "'ఖైదీ నంబర్ 150' తరవాత వినాయక్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఆయన శైలిలోనే మాస్, యాక్షన్ అంశాలు పుష్కలంగా ఉంటాయి. సెప్టెంబరు మొదటి వారంలో చిత్రీకరణ మొదలెడతాం. ఇతర నటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో చెబుతామ"న్నారు నిర్మాత. ఈ చిత్రానికి కథ, మాటలు: ఆకుల శివ, ఛాయాగ్రహణం: విశ్వేశ్వర్, కూర్పు: గౌతంరాజు, కళ: బ్రహ్మ కడలి.

## కథ ఆక్సిజన్‌లాంటిది



'అందాల రాక్షసి'తో ఆకట్టుకొన్న దర్శకుడు హను రాఘవపూడి. 'కృష్ణగాడి వీర ప్రేమగాథ'తో విజయాన్ని అందుకొన్నారు. ఇప్పుడు నితిన్‌తో 'లై' తెరకెక్కించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా బుధవారం హను రాఘవపూడి హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు.

"యాక్షన్, స్క్రీన్‌ప్లే, థ్రిల్స్... వీటి మధ్య సాగే ప్రేమకథ ఇది. 'కోట్ల మంది సైనికులు సరిపోలేదట, పంచపాండవులు సాధించలేదట, చివరికి కృష్ణుడూ ఒంటరి కాదట, అబద్ధం తోడు లేకుండా ఏ కురుక్షేత్రం జరగదట. అశ్వత్థామ హతః కుంజరః' అనే ఈ డైలాగ్ ప్రచార చిత్రంలో వినిపించింది. ఈ కథలో చెప్పిన విషయం అదే. పద్మనాభం, ఎ.సత్యం అనే ఇద్దరి మధ్య సాగే సంఘర్షణ. ప్రతినాయకుడి ఇష్టం వేరు. కథానాయకుడి ఇష్టం వేరు. కానీ ప్రతినాయకుడు ఇష్టాన్ని సాధించే క్రమంలో కథానాయకుడు ఇరుక్కుంటాడు. ఆ తరవాత ఏం జరిగిందన్నది ఆసక్తికరం"

- "ప్రతినాయకుడుగా అర్జునే సరిపోతారనిపించింది. నితిన్‌కి ఈ పాత్ర కొత్తగా అనిపిస్తుంది. కథానుసారం మూడు ఛాయల్లో కనిపిస్తాడు. నాయిక మేఘా ఆకాష్ చాలా పిసినారి. ఆమెకీ ప్రాధాన్యతుంది"
- "పద్మనాభం పాత్రలో అర్జున్ తీరు చూసి అందరూ ఆశ్చర్యపోతారు. విలనిజం ఓ కొత్తస్థాయిలో ఉంటుంది. కథను బట్టే మూడు పోరాట దృశ్యాల్ని తెరకెక్కించాం. మణిశర్మ సంగీతం, పతాక దృశ్యాలు ఆకట్టుకుంటాయి. ఒకరకంగా ఇది మైండ్‌గేమ్‌లాంటి సినిమానే"
- "ఓ దర్శకుడిగా నా ప్రయాణం ఆశాజనకంగానే ఉంది. ప్రేక్షకులకి వినోదాన్ని అందించే కథలనే ఎంచుకొంటా. కథ ఆక్సిజన్ అయితే కథానాయకుడు భోజనం అని నా ఉద్దేశం. దేహానికి ప్రాణం ఉండాలి. ప్రాణం వున్న ఆ దేహానికి ఆకలి తీర్చే భోజనమూ కావాలి. ఈ భోజనాన్ని రుచికరంగా అందించేది కథానాయకుడే"
- 'కృష్ణగాడి వీరప్రేమగాథ' తర్వాత మళ్లీ నానితో ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నాను. ఇది ఆర్మీ నేపథ్యంలో నడిచే కథ. లద్దాఖ్ పరిసరాల్లోనే చేయాలి. 2018 మేలో ఆరంభమవుతుంది. అఖిల్‌తోనూ ఓ సినిమా అనుకొన్నాం. ఆ పనిలోనూ నిమగ్నమవుతాను. నా బలం నా మిత్రులే. నాని, నితిన్ ఎప్పుడూ నాలో ఉత్సాహాన్ని నింపుతారు"
- "జయాపజయాలను పట్టించుకోకూడదు. చేసే కృషిలో అలసత్వం ఉండకూడదు. మన పని మనం చేసుకుంటూ పోవాలి. విజయాలున్నప్పుడు చుట్టూ జనం చేరతారు. దాంతో పొంగిపోయి తప్పులు చేయకూడదు"

## ఓ ఇడియట్ కథ

నవీన్ చంద్ర, నివేదా థామస్ జంటగా నటించిన చిత్రం 'జూలియట్.. లవర్ ఆఫ్ ఇడియట్'. అజయ్ వోధిరాల దర్శకుడు. కొత్తపల్లి ఆర్.రఘుబాబు, కె.బి.చౌదరి నిర్మాతలు. హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నవీన్ చంద్ర మాట్లాడుతూ "ప్రతి ప్రేమికుడూ ఒక విధంగా ఇడియట్‌లానే కనిపిస్తాడు. అన్నిరకాల భావోద్వేగాలున్న ప్రేమకథ ఇది. నివేదా చాలా బాగా నటించింది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేయడం ఆనందాన్నిచ్చింద"న్నారు. "ఓ జూలియట్.. ఓ ఇడియట్‌ని ప్రేమిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనకు ప్రతిరూపం ఈ చిత్రం. ప్రేమ సన్నివేశాలన్నీ ఆకట్టుకొనేలా ఉంటాయి. ఈ చిత్రాన్ని చూసినవాళ్లంతా 'బాగుంద'ని మెచ్చుకొన్నార"న్నారు దర్శకుడు. "కథకు నవీన్ చంద్ర అయితేనే సరిపోతాడనిపించింది. నవీన్, నివేదాల జంట ఆకట్టుకొంటుంది. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తామ"న్నారు నిర్మాత. సంగీతం : రతీస్ వేగ


నవీన్ చంద్ర, నివేదా థామస్

### పంచ్ డైలాగ్

**డబ్బు సంపదలో ఒక భాగం మాత్రమే. కానీ నిజమైన సంపద ప్రేమాభిమానాలు మాత్రమే!**

చిత్రం: మిస్టర్
- పంపినవారు: వి.భవానీ శంకర్, సికింద్రాబాద్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

## వస్తారా.. మా ఇంటికి

శ్రీధర్, సాకేత్ సాయిరామ్, అవంతిక, కావ్యాసింగ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'రావోయి...మా ఇంటికి'. సాకేత్‌రామ్ దర్శకత్వం వహించారు. ఆయనే స్వరాలు అందించారు. డాలీ భట్ నిర్మాత. ఈ చిత్రంలోని గీతాల్ని బుధవారం హైదరాబాద్‌లో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. రేలంగి నరసింహారావు స్వీకరించారు. అనంతరం తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "సాకేత్ సాయిరామ్ సంగీతదర్శకుడిగా నా చిత్రాలతోనే పరిచయం అయ్యాడు. ఇప్పుడు దర్శకుడిగానూ పేరు తెచ్చుకోవాల"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇదో కామెడీ థ్రిల్లర్. కొత్త పంథాలో సాగుతుంది. అయిదు పాటలూ విభిన్నమే. నేనూ ఓ కీలక పాత్రలో కనిపిస్తా" అన్నారు. "వచ్చే నెల ప్రథమార్థంలో విడుదల చేస్తామన్నా"రు నిర్మాత. కార్యక్రమంలో శ్రీధర్, అవంతిక, దిలీప్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అవంతిక



పోలీసుల అదుపులో వికాస్ బరాలా

## ఐఏఎస్ కుమార్తెను వెంబడించిన కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

దిల్లీ/చండీగఢ్: హరియాణాకు చెందిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తె కారును ఇటీవల వెంబడించి ఆమెను భయాందోళనలకు గురిచేశారన్న ఘటనలో వికాస్ బరాలా(23), ఆషిష్ కుమార్‌లను పోలీసులు బుధవారం ఇక్కడ అరెస్టు చేశారు. వారిపై అపహరణ యత్నం ఆరోపణలను నమోదు చేశారు. చండీగఢ్ డీజీపీ తేజీందర్ సింగ్ లూథ్రా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు చండీగఢ్ పోలీసు అధికారులు కేంద్రహోం మంత్రిత్వశాఖకు ఒక నివేదికను పంపారు. నిందితులిద్దరిపై ఐపీసీ 365/511 సెక్షను(అక్రమంగా నిర్బంధంలో ఉంచే ఉద్దేశంతో అపహరణ యత్నం) కింద కేసు నమోదు చేసినట్లు కేంద్రహోంశాఖకు తెలియచేశారు. బాధితురాలు ఘటన జరిగిన రోజు ఫిర్యాదు దాఖలు చేసిన వెంటనే నిందితులను అరెస్టు చేసి వైద్యపరీక్షల నిమిత్తం వైద్యుడిని పిలిపించిన విషయాన్ని కూడా పోలీసులు హోంశాఖకు పంపిన నివేదికలో పేర్కొన్నారు. నిందితులైన వికాస్, ఆషిష్‌లు మాత్రం, రక్తనమూనాలు ఇవ్వడానికి తిరస్కరించిన విషయాన్నీ తెలియచేశారు. వారి వద్ద మద్యం వాసన వచ్చినట్లు వైద్యుడు పేర్కొన్న విషయాన్నీ పోలీసులు నివేదికలో పొందుపరిచారు. కాగా, బుధవారం తాజాగా పోలీసులు అరెస్టు చేయడానికి ముందు నిందితులిద్దరూ కూడా విచారణ నిమిత్తం పోలీసుల ఎదుట హాజరైనారు. నిందితులిద్దరూ రాత్రిపూట కారులోవెళుతున్న ఆమెను వెంబడించి వేధించినట్లుగా చెబుతున్న రహదారిలో ఉన్న అయిదు సీసీటీవీ దృశ్యాలను మంగళవారం సేకరించిన పోలీసులు బుధవారం వారిని అరెస్టు చేశారు.

# వ్యవసాయానికి రుణమేది?

- వడ్డీ వ్యాపారుల బారినే ఎక్కువ మంది రైతులు
- సకాలంలో పంట రుణాలు అందడంలేదు
- కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంచాలి
- బీమా అన్ని పంటలకు వర్తింపచేయాలి
- జాప్యంలేకుండా పరిహారాన్ని అందించాలి
- పార్లమెంట్ స్థాయి సంఘం

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయరంగానికి అవసరమైన రుణ తోడ్పాటు సంస్థాగతంగా అందడంలేదని కేంద్ర స్థాయి సంఘం విశ్లేషించింది. బ్యాంకులు, సహకార సంఘాల నుంచి అందుతున్న రుణాలు పరిమితంగా ఉండటంతో అత్యధికంగా రైతులు పెట్టుబడికి వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడి ఉన్నారని అభిప్రాయపడింది. ఇస్తున్న రుణాలు సైతం సకాలంలో అందడంలేదని స్పష్టం చేసింది. సుదీర్ఘమైన ప్రక్రియ రుణాలు సకాలంలో అందించడానికి అవరోధంగా ఉందని తెలిపింది.

> గ్రామీణ ప్రాంతాల్లో 31% కుటుంబాలు అప్పుల ఊబిలో ఉన్నాయి. బ్యాంకులు, సహకార సంఘాలు వంటి సంస్థల నుంచి కేవలం 17 శాతం కుటుంబాలకే రుణాలు అందుతున్నాయి. ఎక్కువ భాగం వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడి ఉన్నారు.
>
> – పార్లమెంట్ స్థాయి సంఘం

వ్యవసాయ రుణాల ఎక్కువ మందికి ఇవ్వడంతోబాటు ఎక్కువ మొత్తంలో ఇవ్వడంపై భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బిఐ), నాబార్డ్‌లు దృష్టిసారించాలని సూచించింది. స్వల్ప కాల అవసరాలు, పంట రుణాల కోసమే కిసాన్ క్రెడిట్ కార్డుల విధానం అమల్లో ఉందని ఆర్‌బీఐ, నాబార్డ్ ఇచ్చిన వివరణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వ్యవసాయరుణాలు, పంటల బీమాపై నియమించిన స్థాయి సంఘం పార్లమెంట్‌కు నివేదిక అందచేసింది. నివేదికలో ఇంకా ఏ అంశాలున్నాయంటే..

- వడ్డీల భారంతో బాటు రుణభారం అన్నదాతపై ఎక్కువగా ఉంది. బ్యాంకులు, సహకార సంఘాలనుంచి ఇచ్చే రుణాలను పెంచాల్సిన అవసరం ఉంది. దీర్ఘకాలిక వ్యవసాయరుణాలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలి. నైపుణ్యం పెంచి సాంకేతిక కోణంలో కూడా సహకార సంఘాలను ముందుంచాలి.
- రైతులతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వీటిని ఏర్పాటు చేసి తగినంత రివాల్వింగ్ ఫండ్ ద్వారా రైతుల అవసరాలకు ఉపయోగపడేలా చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తులపై ఆధారపడినవారు, మత్స్యకారులు, సాంప్రదాయ కళలను ప్రదర్శించేవారికి రుణాలందించేందుకు దృష్టి సారించాలి. ముద్ర పథకం ద్వారా వీరికి తోడ్పాటును అందించాలి.
- ప్రాధాన్యరంగం రుణాల నిబంధనలు సరళీకృతం చేయాలి. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ఇవి ఉండాలి.
- కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఇస్తున్న రుణ పరిమితిని పెంచాలి. ఐదారేళ్లకు ఒకసారి సమీక్షించాలి. పంట రుణాలకంటే ఐదారు రెట్లు ఇది పెరగాల్సిన అవసరం ఉంది. ఈ పెంచిన రుణ పరిమితి మేరకు వినియోగించుకునేందుకు ముందుకు వచ్చే రైతుల భూమి రికార్డులు, ఆధార్ సహ ఇతర ప్రక్రియలను ఆలస్యం చేయకూడదు. ఈ విధానం అందుబాటులోకి వస్తే రైతులకు సంస్థాగతంగా అందే రుణాలు పెరగడమే కాకుండా, ప్రభుత్వ ఆర్థిక సంస్థలపై విశ్వాసం పెరుగుతుంది.
- వ్యవసాయానికి బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో ఎన్నో మార్పులు చేయాల్సి ఉంది. రుణాలిచ్చే బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, సహకార సంఘాలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది.
- రైతుల ఆత్మహత్యల నివారణ, నైరాశ్యం తొలగించేందుకు పంటలబీమా వంటి అంశాలపై విస్తృత ప్రచారం కల్పించాలి. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి రుణాలు అవసరమైన రైతులకు రుణాలు అందచేయడం, బీమా పరిహారం చెల్లింపు వంటి అంశాల్లో సమన్వయంతో వ్యవహరించాలి.
- రైతులకు రుణాలను సులభంగా కావాల్సిన మొత్తంలో అవసరమైన సమయంలో అందించడంపై దృష్టి సారించాలి. బ్యాంకులు, బ్యాంకింగ్ విధానాల గురించి తెలియకపోవడంతో కూడా రైతులు రుణాలు పొందలేకపోతున్నారనే అంశాన్ని గుర్తించాలి.

### అన్ని ప్రాంతాలు... అన్ని పంటలకు బీమా ఉండాలి

పంటల బీమాను కొన్ని పంటలకు కొన్ని ప్రాంతాలకు పరిమితం చేయడం సరికాదు. పంట నష్టం జరిగిన వెంటనే నిర్దేశించిన గడువులోపు పంట నష్టం అంచనాలను రూపొందించి వారంలోపు పరిహారం అందచేయాలి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ని దేశ వ్యాప్తంగా పండే అన్ని పంటలకు వర్తింప చేయాలి. బీమా కంపెనీల ఎంపికలో పారదర్శకత ఉండాలి. బ్యాంకులు, సహకార సంఘాలు రుణాలివ్వడానికి సెప్టెంబర్ 30వ తేదీ ఆఖరు తేదీగా ఉంది. ఈ నేపథ్యంలో బీమాకు జులై 31 తేదీ ఆఖరు తేదీగా నిర్ణయించడంపై సమీక్షించాలి. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునేవారందరికీ పంటల బీమా పథకం విధిగా వర్తిస్తున్నా అమలు కావడంలేదు. కవరేజీ పరిమితంగా ఉండటంతో విస్తృత ప్రయోజనాలు నెరవేరడంలేదు.

## 50 లక్షల చీరలు సిద్ధం

- నెలాఖరుకు మరో 40 లక్షలు
- వచ్చే నెల 20 నుంచి పంపిణీ
- సీఎం చేతుల మీదుగా ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: వచ్చే బతుకమ్మ పర్వదినం సందర్భంగా పేద మహిళలకు పంపిణీ కోసం 50 లక్షల చీరలు సిద్ధమయ్యాయి. మరో 40 లక్షలు నెలాఖరు వరకు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వచ్చే నెల 20 నుంచి వీటిని బతుకమ్మ పండుగ ఆరంభ దినం నుంచి పూర్తయ్యే వరకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మందికి ఉచిత చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 60 లక్షల చీరలు సిరిసిల్లలో ఉత్పత్తి చేసేందుకు ఆర్డర్లు ఇచ్చారు. మరో 30 లక్షల కొనుగోలు టెండరును సూరత్‌కు చెందిన సంస్థ దక్కించుకుంది. సిరిసిల్ల కార్మికులు ఇప్పటికే 50 లక్షలు ఉత్పత్తి చేశారు. మరో 10 లక్షలను ఈ నెలాఖరు వరకు సిద్ధం చేస్తారు. సూరత్ నుంచి కూడా నెలాఖరు వరకు 30 లక్షల చీరలు వస్తాయి. 50 లక్షల చీరలు రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో)కి చేరాయి. వీటిని అన్ని మండల, జిల్లా కేంద్రాల్లోని గోదాముల్లో నిల్వ చేయాలని నిర్ణయించారు. వచ్చే నెల మొదటి వారం నుంచి మహిళా సంఘాలకు వీటిని చేరుస్తారు.

### ముగ్గురితో కమిటీ

గ్రామాల వారిగా లబ్ధిదారుల జాబితాను రూపొందించేందుకు ప్రభుత్వం ముగ్గురేసి మంది సభ్యులతో కమిటీని నియమించనుంది. ఇందులో గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు, రేషన్ డీలరు, గ్రామ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. తెల్లకార్డు లేదా ఆహారభద్రత కార్డుతోపాటు ఆధార్ ఉన్న వారికి మాత్రమే చీరలను పంపిణీ చేస్తారు. ప్రతి ఒక్కరి సంతకం తీసుకొంటారు. ఆన్‌లైన్‌లో ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేస్తారు. చీరలపై తెలంగాణ ప్రభుత్వ ముద్ర ఉంటుంది. దాదాపు రూ. 200 కోట్లతో చేపట్టిన ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ వచ్చే నెల 20న బతుకమ్మ పండుగ తొలిరోజు ప్రారంభిస్తారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో దీనిని ప్రారంభించే వీలుంది. తొమ్మిది రోజుల పాటు సాగే బతుకమ్మ పర్వదినాల సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు స్థానికంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

## ర్యాగింగ్ నిరోధానికి ఎంసీఐ చర్యలు

కేంద్రస్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారి

అన్ని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక బృందాలు

ఈనాడు, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 2017-18 వైద్యవిద్య సంవత్సరం ప్రారంభమై తొలి వారం పూర్తి కావడంతో కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధంపై భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) దృష్టిపెట్టింది. ఎంసీఐ మార్గదర్శకాల ప్రకారం ఈనెల 1 నుంచే వైద్యవిద్య తొలి ఏడాది తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది. కొన్ని రాష్ట్రాల్లో తొలివిడత కౌన్సెలింగ్ పూర్తయి నిర్దేశించిన తేదీల్లో తరగతులు ప్రారంభంకాగా, తెలంగాణలో ఇంకా తొలివిడత ప్రవేశాలే పూర్తికాలేదు. బుధవారంనాటికి కన్వీనర్, యాజమాన్య, ప్రవాస భారతీయ కోటాల్లో చేరడానికి ఆఖరి తేదీ కావడంతో, వచ్చేవారంలో తరగతులు ప్రారంభిస్తారని తెలుస్తోంది. వైద్యకళాశాలల్లోకి తొలిసారిగా అడుగుపెట్టిన విద్యార్థులను వారి సీనియర్ విద్యార్థులు ఆటపట్టించడం సాధారణంగా జరుగుతున్నదే. అది శృతిమించి వికృత రూపం దాల్చిన సంఘటనలూ అనేకమున్నాయి. తొలినాళ్లలోనే ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేయడం ద్వారా విపరీత ధోరణులను అడ్డుకోవడం సాధ్యమవుతుందని ఎంసీఐ భావిస్తోంది. ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేకంగా యంత్రాంగాన్ని ఏర్పాటుచేసింది. కేంద్ర స్థాయిలో సహాయ కార్యదర్శి బీడీ జైన్‌ను ర్యాగింగ్ నిరోధకానికి నోడల్ అధికారిగా నియమించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లోనూ ప్రత్యేకంగా ర్యాగింగ్ నిరోధక బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఆయా కళాశాల బృందాలు నేరుగా కేంద్ర నోడల్ అధికారితో సంప్రదింపులు జరపొచ్చు. విద్యార్థులూ ర్యాగింగ్‌పై తమ ఆందోళనను, సమస్యలను antiragging-mci@nic.in కు మెయిల్ చేయొచ్చు. ర్యాగింగ్ నిరోధకానికి చేపడుతున్న చర్యలు, ఆదేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడూ ఎంసీఐ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఎంసీఐ తాజాగా బుధవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.



వెబ్‌సైట్‌ను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, తెలుగు రాష్ట్రాల ఏజీలు తదితరులు

## బార్ కౌన్సిల్ వెబ్‌సైట్ ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను బుధవారమిక్కడ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ప్రారంభించారు. బార్ కౌన్సిల్ సమాచారాన్ని తెలుసుకోవడానికి వీలుగా రూపొందించిన ఈ వెబ్‌సైట్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులకు ఉపయుక్తంగా ఉండనుంది. 2012కు ముందున్న కేసులను 2018 మార్చి 30లోగా పరిష్కరించాలంటూ కింది కోర్టులకు ఆదేశాలు జారీ చేస్తూ ఇచ్చిన సర్క్యులర్‌ను పునఃసమీక్షించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డి ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసేలా చూడాలని రెండు రాష్ట్రాల అడ్వకేట్ జనరల్‌లకు వినతి పత్రం ఇచ్చారు. జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, ఏపీ, తెలంగాణ అడ్వొకేట్ జనరళ్లు దమ్మాలపాటి శ్రీనివాస్, దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, జాతీయ బార్ కౌన్సిల్ సభ్యుడు, ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు, బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పొన్నంకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న జైపాల్‌రెడ్డి

## మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దీక్ష విరమణ

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: కరీంనగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు కోరుతూ 5రోజులుగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన ఆమరణ దీక్షను కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి బుధవారం విరమింపజేశారు. మంగళవారం తెల్లవారుజామున కరీంనగర్ పోలీసులు పొన్నంను అరెస్టు చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పొన్నం ఆస్పత్రిలోనే దీక్ష కొనసాగించారు. ప్రభాకర్‌ను బుధవారం సాయంత్రం జైపాల్‌రెడ్డి పరామర్శించారు. దీక్ష విరమణ విషయమై మొదట ప్రభాకర్ నిరాకరించినా జైపాల్‌రెడ్డితోపాటు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కుంతియాల హామీ మేరకు విరమణకు ఒప్పుకున్నట్లు సమాచారం. కరీంనగర్‌లో వైద్యకళాశాల ఏర్పాటు చేసే వరకు పార్టీపరంగా వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగిస్తామని హామీ ఇచ్చి ప్రభాకర్‌కు జైపాల్‌రెడ్డి నిమ్మరసం తాగించి విరమింపజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఇచ్చిన మాట నిలుపుకోకపోవడం బాధాకరమని.. ఇప్పటికైనా వైద్య కళాశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాలన్నారు.

## ‘సార్వత్రిక’ విద్యార్థులు విదేశీ వైద్యవిద్యకు అనర్హులు: ఎంసీఐ

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సార్వత్రిక విద్యా పీఠంలో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు విదేశాల్లో ఎంబీబీఎస్ అభ్యసించడానికి అనర్హులని భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) తెలిపింది. విదేశీ వైద్య విద్యను అభ్యసించాలంటే భౌతిక, రసాయన, జీవశాస్త్రాలు, ఆంగ్లం పాఠ్యాంశాలతో తప్పనిసరిగా ఇంటర్, తత్సమాన కోర్సుల్లో నేరుగా తరగతులకు హాజరై, అనుభవపూర్వక పాఠాలనూ అభ్యసించాల్సిందేనని స్పష్టం చేసింది. 2017-18లో విదేశాల్లో ఎంబీబీఎస్ చదవడానికి కొందరు సార్వత్రిక ఇంటర్ విద్యార్థులు ‘అర్హత ధ్రువీకరణ పత్రం’ కోసం తమను సంప్రదించారనీ, ఎంసీఐ నిబంధనలు అందుకు అంగీకరించవని పేర్కొంది.

### ప్రైవేటు వైద్య కళాశాలల్లో బి, సి కేటగిరీల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

తెలంగాణలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో యాజమాన్య(బి), ప్రవాసభారతీయ(సి) కేటగిరీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరడానికి మరో మూడు రోజుల గడువు(ఈనెల12) పొడిగించారు.

# చిక్కిన డ్రగ్ రాకెట్ సూత్రధారి గాబ్రియేల్

- అతని ప్రియురాలినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గోవా నుంచి మాదకద్రవ్యాల దిగుమతిలో కీలకం

ఈనాడు – హైదరాబాద్

నైజీరియన్ల డ్రగ్ రాకెట్ కేసులో సూత్రధారిగా భావిస్తున్న గాబ్రియేల్ రాచకొండ ఎస్‌వోటీ పోలీసులకు చిక్కాడు. ఈ రాకెట్ వెలుగులోకి వచ్చినప్పటి నుంచి అజ్ఞాతంలో ఉన్న గాబ్రియేల్‌ను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. దిల్లీ నుంచి ఇటీవలే నగరానికి వచ్చిన గాబ్రియేల్ యాప్రాల్ సమీపంలోని కౌకూరు గ్రీన్‌హుడ్ అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నారు. కొంత మొత్తం కొకైన్, ల్యాప్‌టాప్, పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. అతని నైజీరియన్ ప్రియురాలినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గాబ్రియేల్ ఇచ్చే సమచారం నైజీరియన్ డ్రగ్ రాకెట్ వ్యవహారంలో కీలకం అవుతుందని పోలీసులు భావిస్తున్నారు. గోవా నుంచి మాదకద్రవ్యాల్ని నగరానికి దిగుమతి చేయడంలో అతనిదే ముఖ్య భూమికని అనుమానిస్తున్నారు. కొకైన్, బ్రౌన్‌షుగర్, ఎంపిటమైన్.. తదితర మాదకద్రవ్యాల విక్రయ ముఠాలతో గాబ్రియేల్‌కు సత్సంబంధాలున్నాయని ఇప్పటికే పోలీసులు గుర్తించారు. గోవాలో ఎవరి దగ్గరి నుంచి వీటిని తీసుకొచ్చేవాడు? ఇక్కడ ఎవరెవరికి సరఫరా చేశాడు? అనే విషయాలపై ఆరా తీస్తుండటంతోపాటు గాబ్రియేల్ ఇంట్లో దొరికిన ల్యాప్‌టాప్‌ను విశ్లేషించే పనిలో నిమగ్నమయ్యారు.

### మాదకద్రవ్యాల కేసులో ఇప్పటికే అరెస్ట్

గత నెలాఖరులో ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో నైజీరియన్ ఒజుకు కాస్మోస్, అతని ప్రియురాలు విజయవాడకు చెందిన పాలపర్తి సంగీత ముఠా మాదకద్రవ్యాలను విక్రయిస్తూ చిక్కడంతో గాబ్రియేల్ వ్యవహారం తెర పైకి వచ్చింది. ఈ ముఠా విక్రయిస్తున్న మాదకద్రవ్యాల్ని గాబ్రియేల్ సమకూర్చినట్లు పోలీసుల దర్యాప్తులో ముఠాసభ్యులు వాంగ్మూలం ఇవ్వడంతో ఇతడి గురించి ఆరా తీశారు. ఈక్రమంలోనే గాబ్రియేల్ పాత కేసు ఒకటి వెలుగులోకి వచ్చింది. 2013లో రెండేళ్ల బిజినెస్ వీసాపై నగరానికి వచ్చిన అతను.. గోవా నుంచి మాదకద్రవ్యాల్ని దిగుమతి చేయడంలో ఆరి తేరాడని పోలీసులు గుర్తించారు. గతంలో 20 గ్రాముల కొకైన్ విక్రయించేందుకు ప్రయత్నించిన క్రమంలో ఈస్ట్‌మారెడ్‌పల్లి పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. ఆ కేసులో బెయిల్‌పై బయటికి వచ్చిన గాబ్రియేల్.. ఆ తర్వాత కూడా దందా సాగించినట్లు కాస్మోస్ ముఠా వాంగ్మూలంతో బహిర్గతమైంది. ఈనేపథ్యంలో అతని కదలికపై నిఘా ఉంచిన ఎస్‌వోటీ పోలీసులకు దిల్లీ నుంచి గాబ్రియేల్ వచ్చినట్లు సమాచారం అందింది. దీంతో కౌకూరులోని అతని ఇంటిపై మంగళవారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు.

## అందుబాటులోకి ఆన్‌లైన్ వే బిల్లులు

ఈనాడు, హైదరాబాద్: సరకుల రవాణాకు తాత్కాలిక ఆన్‌లైన్ వే బిల్లులను తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర జీఎస్టీ విభాగం అందుబాటులోకి తీసుకురావాల్సిన ఈ-వేబిల్లుల జారీలో జాప్యం నేపథ్యంలో తాత్కాలికంగా వేబిల్లులను జారీ చేయడానికి వీలుగా వాణిజ్య పన్నులశాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జీఎస్టీలో రిజిస్టర్ చేసుకున్న వారు తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ వెబ్‌సైట్ నుంచి వే బిల్లులను తీసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రం నుంచి వెలుపలికి, బయటి నుంచి రాష్ట్రానికి సరకులు తీసుకురావడానికి వీలుగా వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ఆన్‌లైన్ వే బిల్లుల విధానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చినట్లుపేర్కొన్నారు.

# నేటి నుంచి అఖిల భారత టెంట్ డెకరేటర్ల సంక్షేమ సంఘ జాతీయ సదస్సు

- రామోజీ ఫిల్మ్‌సిటీ వేదికగా..
- టెంట్, డెకరేటివ్ అత్యాధునిక సామగ్రితో ప్రత్యేక ప్రదర్శన

నాంపల్లి, న్యూస్‌టుడే : 16వ ఆలిండియా టెంట్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సదస్సును ఈనెల 10 నుంచి 13వతేదీ వరకు నగరంలోని రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం నాంపల్లి సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా టెంట్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ఏఐటీడీడబ్ల్యుఏ) అధ్యక్షుడు మనోహర్‌లాల్ గులాటీ, సీనియర్ వైస్‌ఛైర్మన్ రవిజిందాల్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ పవన్‌సేట్, ప్రధానకార్యదర్శి అనిల్‌రావు, సూరజ్‌సింగ్ మల్హోత్రా, గిరిష్‌మిటల్, తెలంగాణ శాఖ అధ్యక్షుడు తౌఫిక్‌ఖాన్ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా టెంట్ డెకరేటర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన ప్రస్తుత నేపథ్యంలో టెంట్, డెకరేటర్ల విభాగాన్ని పరిశ్రమగా గుర్తించి ప్రత్యేక రాయితీలు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌పై ఈ సదస్సు జరుగుతుందన్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రామోజీ ఫిలింసిటీలోని ప్రిన్సెస్ స్ట్రీట్ హాల్‌లో ఈ సదస్సు ప్రారంభమవుతుందన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన టెంట్, డెకరేటివ్ సామగ్రి, స్టాళ్లతో కూడిన ప్రత్యేక ప్రదర్శనతో సదస్సు ప్రారంభమవుతుందన్నారు. 11న ఉదయం 10గంటలకు జరిగే ప్రధాన సదస్సును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. 21 రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది ప్రతినిధులు వస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక ఆకర్షణగా ప్రతీ రోజు సాయంత్రం వివిధ రాష్ట్రాల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. సదస్సుకు స్టేట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవహరిస్తుందన్నారు.



సదస్సు వివరాలు వెల్లడిస్తున్న ఆలిండియా టెంట్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

### రోజురోజుకు తగ్గుతున్న ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బేసిన్లలోని రిజర్వాయర్లలోకి ప్రవాహం రోజురోజుకు తగ్గిపోతోంది. ఆలమట్టిలోకి ప్రవాహం పూర్తిగా తగ్గింది. మంగళవారం 6వేల క్యూసెక్కులు రాగా బుధవారం 3086 క్యూసెక్కులకు పడిపోయింది. నారాయణపూర్‌లోకి 1916 క్యూసెక్కులకు తగ్గిపోగా.. కాలువలకు మాత్రం 11444 క్యూసెక్కుల నీటిని వదిలారు. విద్యుదుత్పత్తి నిలిపివేశారు. జూరాలలోకి మాత్రం కొద్దిగా పెరిగి 8396 క్యూసెక్కులు రాగా, 4947 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదిలారు. తుంగభద్రలోకి 16491 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. శ్రీశైలంలోకి ఏమీలేదు. నాగార్జునసాగర్‌కు 621, పులిచింతలకు 826 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. సాగర్ మట్టం 500.40 అడుగులకు చేరింది. గోదావరిలో ఏ ప్రాజెక్టులోకి ప్రవాహం లేదు.


## కాళేశ్వరానికి రెండోదశ రుణం రూ.11400 కోట్లు

- ఇచ్చేందుకు బ్యాంకుల సంసిద్ధత

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రెండోదశ రుణం తీసుకునేందుకు నీటి పారుదల శాఖ బ్యాంకులతో సంప్రదింపులను ముమ్మరం చేసింది. మొదటి దశలో రూ. 7500 కోట్లు అప్పు తీసుకోవడానికి ఒప్పందం చేసుకొన్న ప్రభుత్వం, రెండోదశలో రూ. 11,400 కోట్లు తీసుకోవాలని నిర్ణయించింది. రెండోదశ రుణానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు లీడ్‌బ్యాంకుగా వ్యవహరిస్తోంది. బుధవారం నీటిపారుదల శాఖ అధికారులతో జరిగిన సమావేశానికి సుమారు 15 బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు. అన్ని బ్యాంకులూ రుణమివ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. పునరాకృతిలో భాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం రూ. 80,500 కోట్లతో చేపట్టింది. ఇందులో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించేందుకు చేపట్టిన బ్యారేజీలు, లిఫ్టులకే సుమారు రూ. 14వేల కోట్లు అవసరం. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలంటే మొత్తం ప్రాజెక్టుకు కేటాయించే బడ్జెట్ అవసరమవుతుంది. దీంతో బ్యాంకుల నుంచి రూ. 7500 కోట్లు రుణం తీసుకోవడానికి ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. ఇప్పటికే బ్యాంకులు రుణమివ్వడం ప్రారంభించాయి. వడ్డీకి అవసరమైన మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయిస్తారు. ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరు, ఇక్కడి నుంచి మల్లన్నసాగర్‌తో పాటు ఇతర రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులకు కూడా రుణం తీసుకోవడానికి బ్యాంకులతో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయి. అన్ని బ్యాంకులూ రెండోదశ రుణాన్ని ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిసింది. రెండోదశతో కలిపితే ఈ ప్రాజెక్టు కోసం బ్యాంకుల నుంచి సుమారు రూ. 19వేల కోట్లు రుణం తీసుకొన్నట్లవుతుంది.



మినపపప్పులో చనిపోయిన ఎలుక..



ప్యాకెట్ విప్పకముందు కింద భాగంలో కనిపిస్తున్న చనిపోయిన ఎలుక

## మినపపప్పు ప్యాకెట్‌లో చచ్చిన ఎలుక ప్రత్యక్షం

ఆన్‌లైన్ సూపర్‌మార్కెట్ నిర్వాకమిది

మాదాపూర్ న్యూస్‌టుడే: ఓ మహిళ ఆన్‌లైన్ సూపర్‌మార్కెట్‌లో ఆర్డర్ చేసిన మినపపప్పులో చచ్చిన ఎలుక కనిపించింది. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మాదాపూర్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్‌లో ఉండే సుమన పరమట(41) రెండేళ్లుగా బిగ్‌బాస్కెట్ ఆన్‌లైన్ సూపర్‌మార్కెట్‌లో సరకులు కొనుగోలు చేస్తోంది. ఈ నెల 6న ఆమె సరకులు ఆర్డర్ చేయగా 7న పంపిణీ చేశారు. బుధవారం సరకుల అట్టపెట్టెలోని మినపపప్పు ప్యాకెట్ విప్పి చూడగా అందులోంచి దుర్వాసన రావడంతోపాటు చనిపోయిన ఎలుక ఉంది. వెంటనే సదరు ప్యాకెట్‌ను తీసుకొని స్టేషన్‌కివెళ్లి ఆమె ఫిర్యాదు చేసింది. బిగ్‌బాస్కెట్ ఆన్‌లైన్ సూపర్‌మార్కెట్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వినియోగదారుల ఫోరంలోనూ ఫిర్యాదు చేయనున్నట్లు సుమన తెలిపారు.

# ఆ పదిహేడు తూటాలు ఎక్కడ?

- ముగిసిన విక్రంగౌడ్ ఒక రోజు కస్టడీ

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే : తనపై తనే కిరాయి మనుషులతో కాల్పులు చేయించుకున్న మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రంగౌడ్‌ను బుధవారం బంజారాహిల్స్ పోలీసులు విచారించారు. నాంపల్లి కోర్టు ఒక్క రోజు కస్టడీకి అనుమతివ్వగా బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు ప్రశ్నించారు. డీసీపీ వెంకటేశ్వరరావు, ఏసీపీ నోముల మురళీ, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ విచారించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం విక్రంగౌడ్ ఒప్పందం కుదుర్చుకున్న విధానం, తుపాకీ కొనుగోలు తదితర అంశాలపై పోలీసులు విచారించినట్లు సమాచారం. తుపాకీ కొనుగోలు సమయంలో 20 బుల్లెట్లు తేగా.. మూడు మాత్రమే వినియోగించారు. మిగితావి ఎక్కడున్నాయని అడగ్గా, తెలియదని విక్రంగౌడ్ చెప్పినట్లు ఓ పోలీసు అధికారి ధ్రువీకరించారు. మరోవైపు మిగతా నిందితులు మాత్రం మొత్తం 20 బుల్లెట్లూ విక్రంగౌడ్‌కే ఇచ్చినట్లు తెలిపారు. దీంతో వాటి కోసం అతని ఇంటికి తీసుకెళ్లి మరీ సోదా చేశారు. అయినా లభ్యం కాలేదు. విచారణ సమయంలో వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. తర్వాత వైద్య పరీక్షల నిమిత్తం అపోలో హాస్పిటల్‌కు తరలించి అనంతరం బంజారాహిల్స్ ఠాణాకు తీసుకొచ్చారు. కాల్పుల ఘటనలో నిందితులుగా ఉన్న మరో ఐదు గురిని కూడా కస్టడీకి తీసుకున్న పోలీసులు వేర్వేరుగా విచారించారు. విచారణ అనంతరం విక్రంగౌడ్‌ను చంచల్‌గూడ జైలుకు పంపారు.

### జంతర్‌మంతర్ వద్ద మాలమహానాడు ధర్నా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టవద్దని మాలమహానాడు డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారమిక్కడ జంతర్‌మంతర్ వద్ద మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య నేతృత్వంలో ధర్నా చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే భాజపా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని చెన్నయ్య హెచ్చరించారు. ధర్నాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన జంగా శ్రీనివాస్, కౌశన్న రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బీసీలు రాజకీయశక్తిగా ఎదగాలి: శరద్‌యాదవ్


తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో బీసీలు రాజకీయ శక్తిగా ఎదగాలని జేడీయూ నేత శరద్‌యాదవ్ ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీసీ నేతలు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బుధవారమిక్కడ శరద్‌యాదవ్‌తో భేటీ అయ్యారు.

‘అమ్మాయి ఆఫీసు నుంచి బయలుదేరిందో లేదో... ఇంటికి రావడానికి ఇంకెంత టైమ్ పడుతుందో?

‘ఇంటికి వెళ్లగానే చెప్పమన్నాను... ఇంకా ఫోన్ చేయలేదేంటి?

**ఇంటి నుంచి బయటికెళ్లిన అమ్మాయి తిరిగి ఇంటికి చేరుకునేంతవరకు కుటుంబ సభ్యుల ఆలోచన తీరిది. ఇలాంటి సందర్భాల్లో అటు తల్లిదండ్రులకు, ఇటు అమ్మాయిలకు భరోసాగా నిలిచే ఆప్స్ ఉన్నాయని తెలుసా? వీటి ద్వారా అత్యవసర సమయాల్లో అతివలు తమ స్నేహితులు, బంధువుల్ని అలర్ట్ చేయొచ్చు. వాటి వివరాలే ఇవి.**

# అతివలకు భరోసా!



## చేరుకున్నాక చెప్పేస్తుంది

‘ఇంటికి చేరుకున్నాక... కాల్ చేయ్’ ఏదైనా పార్టీ, వేడుక నుంచి మీరొక్కరే ఇంటికి వెళ్తుంటే మీ స్నేహితులు చెప్పే మాట ఇది. ఒకరిద్దరికైతే కాల్ చేసి చెప్తారు. మీకేమో పదుల సంఖ్యలో మిత్రులున్నారు. వారందరికీ మీ క్షేమ సమాచారం చెప్పాలంటే మీ మొబైల్‌లో bSafe - Personal Safety App ఉండాల్సిందే. ఈ ఆప్‌లో మీ స్నేహితులు, బంధువుల కాంటాక్ట్స్‌ని గార్డియన్స్‌గా ఏర్పాటు చేసుకోవచ్చు. మీరు నిర్ణీత ప్రాంతానికి (ఇల్లు, రూమ్, ఆఫీస్ లాంటివి) చేరుకున్నాక ఆటోమేటిక్‌గా మీ గార్డియన్స్‌కు మీ సమాచారం అందిపోతుంది. మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు మీకు దగ్గరలో ఎవరైనా గార్డియన్స్ ఉన్నారా అనేది కూడా ఈ ఆప్ ద్వారా మ్యాప్ రూపంలో తెలుసుకోవచ్చు.

❑ https:///goo.gl/Jx9z6B

## ఆటోమేటిక్‌గా ఆన్...

మీరు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మీకో కాల్ వస్తుంది. దాన్ని అటెండ్ చేస్తే మీ ఇబ్బందిని చెప్పుకోవచ్చు. అయితే కాల్ లిఫ్ట్ చేసే పరిస్థితి లేదు. ఇలాంటప్పుడు మీ కాల్ ఆటోమేటిక్‌గా ఆన్ అయితే సేఫ్ కదా. Rescuer – A Women Safety App ఆప్‌తో ఇది జరుగుతుంది. మీ మొబైల్ పవర్ బటన్‌ను వరుసగా ఐదు సార్లు క్లిక్ చేస్తే ఆప్ యాక్టివేట్ అయిపోతుంది. ఆ తర్వాత దానికి ఏ కాల్ వచ్చినా ఆటోమేటిక్ కాల్ ఆన్సర్ అయిపోతుంది. అప్పుడు మీ మాటలు అవతలి వ్యక్తికి వినిపిస్తాయి. ❑ https:///goo.gl/m2242z

## గొంతును పసిగడుతుంది

మీరు ఇబ్బందుల్లో ఉన్నారు... బ్యాగులో ఫోన్ ఉంది.. కానీ అది దూరంగా ఉంది. మరి మీ పరిస్థితిని మీ స్నేహితులకు చెప్పడం కష్టమే. Chilla : Anti Rape women app ఆప్‌తో ఇది పెద్ద విషయం కాదు. మీ గొంతును గుర్తించి ఈ ఆప్ యాక్టివేట్ అవుతుంది. ఆ వెంటనే మీరున్న ప్రాంతం, మీ మాటల వాయిస్ రికార్డు మీ స్నేహితులకు పంపించేస్తుంది. లేదంటే పవర్ బటన్ వరుసగా ఐదు సార్లు క్లిక్ చేయడం ద్వారా కూడా ఈ ఆప్‌ను యాక్టివేట్ చేయొచ్చు.

❑ https:///goo.gl/1JvKfH

### ఇది తప్పనిసరి

ఈ ఆప్స్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని మీ ప్రాథమిక వివరాలు.. అంటే మొబైల్ నెంబరు, మెయిల్ ఐడీ, చిరునామా నమోదు చేయాలి. దీంతోపాటు మీరు అత్యవసర పరిస్థితుల్లో మెసేజ్ పంపాలనుకునే వాళ్ల మొబైల్ నెంబరు, మెయిల్ ఐడీ పొందుపరచాలి. ఆపద సమయంలో మీ ఫొటో తీయడానికి మొబైల్‌కు పర్మిషన్ కూడా ఇవ్వాలి. ఆండ్రాయిడ్ మార్ష్‌మాలో, ఆపై వెర్షన్ల ఆపరేటింగ్ సిస్టమ్‌తో పని చేస్తున్న మొబైల్స్ అన్నింటికి ఈ పర్మిషన్ ప్రక్రియ తప్పనిసరి.

## స్క్రీన్ మీద టచ్ చేస్తే...

మీ స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ మీద టచ్ చేస్తే... మీరు ఎక్కడున్నారనేది మీ కుటుంబ సభ్యులకు తెలిస్తే బాగుంటుంది కదా? ప్రమాదవశాత్తు మీరు గుర్తు తెలియని ప్రాంతంలో చిక్కుకుంటే ఈ ఆప్షన్ ఉపయుక్తంగా ఉంటుంది. Feel Safe ఆప్‌తో ఈ పని చేయొచ్చు. మీకెప్పుడైనా ఇబ్బందులు ఎదురైతే ఆప్‌ను ఓపెన్ చేసి స్క్రీన్ మీద టచ్ చేయాలి. వెంటనే మీరు ముందుగా నమోదు చేసిన మొబైల్ నెంబరు, మెయిల్ ఐడీకి సందేశం వెళ్లిపోతుంది. అందులో మీరున్న ప్రాంతం, దాని అక్షాంశ, రేఖాంశాల వివరాలు (మ్యాప్‌లోని ప్రాంతం తెలిపే వివరాలు) ఉంటాయి. దాంతో మీరెక్కడున్నారనేది సులభంగా తెలుసుకోవచ్చు. ❑ https:///goo.gl/f5Bgvk

## మూడు రకాలుగా...

‘నేను ఫలానా ప్రాంతంలో ఉన్నాను’, ‘నేను ఇక్కడ ఉన్నాను... ఎందుకైనా మంచిదని నీకు చెబుతున్నాను’, ‘ఇక్కడ నేను ఇబ్బందుల్లో ఉన్నాను. నన్ను రక్షించండి’... మహిళలు తమ క్షేమ సమాచారాన్ని దగ్గరవాళ్లకు అందించడంలో ఇలా కొన్ని రకాలుంటాయి. అలా రకరకాల అవసరాలకు పనికొచ్చే ఆప్ Women Safety. ఈ ఆప్ ఓపెన్ చేయగానే మీకు ఎరుపు, ఆకుపచ్చ, నారింజ రంగులో మూడు డబ్బాలు కనిపిస్తాయి. ఎరుపు రంగు వృత్తం ‘పానిక్ అలెర్ట్’. దీన్ని టచ్ చేస్తే... 30 సెకన్లపాటు సైరన్ శబ్దం వినిపిస్తుంది. దీని వల్ల మీరు ఇబ్బందిలో ఉన్నట్లు మీ చుటుపక్కల వాళ్లకు తెలుస్తుంది. దీంతోపాటు మీరు నమోదు చేసుకున్న మీ స్నేహితులకు మెసేజ్, మెయిల్ ద్వారా సందేశం వెళ్తుంది. అదే ఆకుపచ్చ రంగు వృత్తం క్లిక్ చేస్తే మీరున్న ప్రాంతం, అక్కడి ఫొటో వివరాలు సందేశం రూపంలో వెళ్తాయి. నారింజ రంగు బాక్స్ క్లిక్ చేస్తే కేవలం ప్రదేశం వివరాలు వెళ్తాయి.

❑ https:///goo.gl/Q922Ft

## దారి మారితే... చెప్పేస్తుంది

ఆఫీసు నుంచి క్యాబ్‌లో ఇంటికొస్తున్నప్పుడు దారిలో కునుకు పట్టేసింది. మధ్యలో కళ్లు తెరిచి చూస్తే ఏదో తెలియని ప్రదేశం. ఉద్యోగినులకు ఇలాంటి అనుభవాలు ఈ మధ్య ఎక్కువయ్యాయి. అయితే redEye Women Safety ఆప్‌లో మీరు ఇంటికి వెళ్లాల్సిన దారిని సెట్ చేసుకొని పెట్టుకుంటే ఇలాంటి సమస్య నుంచి తప్పించుకోవచ్చు. ముందుగా ఏర్పాటు చేసుకున్న దారిలో కాకుండా మీ వాహనం దిశ మారితే ఈ ఆప్ ఆ విషయాన్ని మీ స్నేహితులు/బంధువులకు తెలియజేస్తుంది. వెంటనే మీకు కూడా సందేశం వస్తుంది. దీంతోపాటు మీ మొబైల్‌ను స్విచ్ఛాఫ్ చేయకుండా ఈ ఆప్ అడ్డుకుంటుంది. ❑ https:///goo.gl/N8BVao

## ఎక్కడున్నారో చెబితే

‘ఇంటికి బయలుదేరా అని చెప్పి చాలా టైమ్ అయ్యింది... ఇంకా రాలేదేంటి’ ఇంట్లో అమ్మానాన్న నుంచి ఇలాంటి ప్రశ్న తరచుగా వస్తుంటుంది. అలాంటప్పుడు మీరు ఎక్కడున్నారనే విషయం వాళ్లకు ఆటోమేటిక్‌గా తెలిస్తే ఇబ్బంది ఉండదు కదా. అప్పుడు గూగుల్ మ్యాప్స్ సాయంతో మీ కదలికల్ని అవతలి వ్యక్తి తెలుసుకోవచ్చు. Google Trusted Contact ఆప్‌తో ఈ పని చేయొచ్చు. ఇందులో తొలుత ట్రస్టెడ్ కాంటాక్ట్స్‌ను ఎంచుకోవాలి. మీరెప్పుడైనా ఇబ్బందుల్లో పడితే షేర్ బటన్ క్లిక్ చేయగానే ఆ కాంటాక్ట్స్‌కు మీ లొకేషన్ వివరాలు షేర్ అవుతాయి. మళ్లీ మీరు దాన్ని ఆఫ్ చేస్తేనే ఆగుతుంది. దీంతోపాటు ఈ ఆప్ ద్వారా మీ లొకేషన్ వివరాలు కావాలి అని ఇతరులకు రిక్వెస్ట్ కూడా పెట్టొచ్చు.


❑ https:///goo.gl/wpPbq3

## 15 నిమిషాలకొకసారి

ఆఫీసు నుంచి ఇంటికొస్తున్నప్పుడు వంట్లో ఏదో నలతగా అనిపించింది. దగ్గరలో ఏమైనా ఆసుపత్రులున్నాయా అని చూశారు, కానీ ఏమీ తెలియ లేదు. దీని కోసం ఓ ఆప్ అందుబాటులో ఉంది. V-Safe ఆప్‌తో మీ పరిసరాల్లో ఉన్న ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్ల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. దీంతోపాటు మీరు ప్రయాణిస్తున్న దారిని ప్రతి 15 నిమిషాలకొకసారి స్నేహితులతో షేర్ చేసుకోవచ్చు. ఇంటికి ఎంత టైమ్‌లో చేరుకుంటారు అనేది చూచాయగా చెప్పేయొచ్చు. మొబైల్ పవర్ బటన్‌ను వరుసగా మూడు సార్లు నొక్కితే సైరన్ మోగుతుంది. మీరు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఈ ఆప్షన్ ఉపయోగపడుతుంది.

❑ https:///goo.gl/PsgM1g

## చకా చకా ఎక్కేయండి



ఎప్పుడైనా రాక్ క్లైంబింగ్ చేశారా? పెద్ద పెద్ద కొండరాళ్లను పట్టి చేతులతో అధిరోహిస్తుంటారు. అమ్యూజ్‌మెంట్ పార్క్స్‌లో ఆ తరహా కొండల్ని కృత్రిమంగా ఏర్పాటు చేస్తుంటారు కూడా. కొంచెం కఠినమే అయినా సాహసోపేతంగా ఉంటుంది. ఎందుకులే అంత రిస్క్ అనుకుంటే... మొబైల్‌లోనే ఆ ఆటను ఆడేయండి. Climb The Wall గేమ్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని చకాచకా కొండలెక్కేయండి. ఇందులో ఛాలెంజ్, ఎండ్‌లెస్, రష్ అని మూడు విభాగాలున్నాయి. వాటిలో మీకు నచ్చింది ఎంచుకొని సరదాగా ఆడేయండి. థ్రిల్ పొందండి.

❑ https:///goo.gl/zJ81NW

## పోస్ట్‌గా... స్టోరీ

ఫేస్‌బుక్ ఆప్‌లో ఎడమవైపునున్న కెమెరా ఐకాన్‌ను క్లిక్ చేసి ఫిల్టర్లు జోడించి ఫొటోలు తీస్తుంటారు. వాటిని ‘స్టోరీస్’ అంటారు. మీరు పబ్లిష్ చేసిన స్టోరీస్ ఆప్‌లో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు వాటిని ఎఫ్‌బీలో పోస్టుల్లా మార్చేయొచ్చు. స్టోరీస్ ఆప్షన్‌లో దీన్ని కొత్తగా జోడించారు. ఎప్పటిలాగే స్టోరీస్‌లోకి వెళ్లి ఫొటో తీసి, షేర్ చేసేటప్పుడు రెండో ఆప్షన్‌గా ఉన్న ‘పోస్ట్’ను ఎంచుకోండి. అప్పుడు మీరు రూపొందించిన ఫొటో... పోస్ట్‌గా మారిపోతుంది.

## షార్ట్‌కట్‌లు పెట్టొచ్చు

వాట్సాప్ కెమెరాతో ఫొటో తీయాలను కోండి... ముందు వాట్సాప్ ఆప్ ఓపెన్ చేసి, ఆ తర్వాత కెమెరా బటన్‌ను క్లిక్ చేయాలి. వాట్సాప్‌లో స్టేటస్ అప్‌డేట్ చేయాలన్నా ఇదే పరిస్థితి. త్వరలో అంత ఇబ్బంది అవసరం లేదు. వాట్సాప్ కెమెరా, స్టేటస్, స్టార్డ్ కాంటాక్ట్స్‌కు షార్ట్‌కట్‌లు క్రియేట్ చేసుకొని హోమ్ స్క్రీన్ మీద పెట్టుకోవచ్చు. ఆ తర్వాత ఎప్పుడు అవసరమైనా ఆ షార్ట్‌కట్‌ను క్లిక్ చేసి ఆ సదుపాయం పొందొచ్చు. ప్రస్తుతం ఈ ఆప్షన్ ప్రయోగాత్మకంగా కొందరికే అందుబాటులో ఉంది.

## ఈవెంట్లు జరిగితే

‘మీ ఊళ్లో రేపు సంగీత కచేరీ ఉంది. మీకు ఆసక్తి ఉంటే వెళ్లండి’ త్వరలో గూగుల్‌లో ఇలాంటి నోటిఫికేషన్లు వస్తాయి. కొందరికి ఈ పాటికే వస్తున్నాయి. గూగుల్ ఇటీవల ప్రారంభించిన ‘ఈవెంట్ ఫైండర్’ ఆప్షన్ దీనికి కారణం. మీ పరిసర ప్రాంతాల్లో జరిగే ఈవెంట్ల గురించి మీకు సమాచారం అందించడం ఈ ఆప్షన్ ఉద్దేశం. ఆ నోటిఫికేషన్ మీద క్లిక్ చేస్తే దాని తేదీ, సమయం, ప్రాంతం, ఎంట్రీ పాస్‌ల కొనుగోలు లాంటి వివరాలు కనిపిస్తాయి.

## ఎప్పుడెళ్తే మంచిది

గూగుల్ మ్యాప్స్‌లో ఏదైనా రెస్టరెంట్‌ను సెర్చ్ చేసి చూస్తే... అక్కడ ఏ టైమ్‌కి రద్దీ ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు. గ్రాఫ్ ద్వారా ఎప్పుడు ఎంత రద్దీ ఉంటుందనేది సుమారుగా చూపిస్తుంది. ఇదే తరహాలో ట్రాఫిక్ రద్దీ సమయాల్ని కూడా త్వరలో తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్స్‌లో ఓ ప్రాంతానికి దారి వెతికినప్పుడు, ఆ రూట్‌లో గతంలో ఉన్న రద్దీ వివరాలు గ్రాఫ్ రూపంలో కనిపిస్తాయి. దాని బట్టి మీ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ప్రస్తుతం అమెరికా, బ్రిటన్‌లో అందుబాటులో ఉంది. త్వరలో మన దేశంలోనూ వినియోగించొచ్చు.

## వ్యాలెట్ లాంటిదే... కానీ!



డబ్బులు దాచుకునే వ్యాలెట్‌కు సాంకేతిక హంగులు జోడించింది వాల్టర్‌మాన్. ఈ వ్యాలెట్ చూడటానికి సాధారణ పర్సులానే ఉంటుంది. ఇందులో క్రెడిట్, డెబిట్ కార్డులు లాంటివి పెట్టుకోవచ్చు. ఇందులో ఓ ప్రత్యేకమైన చిప్ కూడా ఉంటుంది. అదే దీని ప్రత్యేకత. తొలుత వ్యాలెట్‌ను బ్లూటూత్ సాయంతో మొబైల్‌కు అనుసంధానం చేసుకోవాలి. ఆ తర్వాత వ్యాలెట్ అనుబంధ ఆప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దీని సాయంతో మీ మొబైల్‌ను ట్రాక్ చేయొచ్చు. దీనిపై ఉండే బటన్‌ను టచ్ చేస్తే మొబైల్ నుంచి రింగ్ వస్తుంది. మొబైల్ ఎక్కడుందో తెలియని పరిస్థితుల్లో ఈ రింగ్ ఆప్షన్ ద్వారా తెలుసుకోవచ్చు. మొబైల్ చోరీ అయితే వ్యాలెట్ వెబ్‌సైట్‌లో దాని కదలికల్ని తెలుసుకోవచ్చు. అలాగే దీంట్లో కెమెరా ఆప్షన్ కూడా ఉంది. దీంతో సులభంగా ఫొటోలు తీసుకోవచ్చు.

## మెరుగులు కొత్తగా



ఫొటోలకు బేసిక్ ఎడిటింగ్ చేసి, ఫిల్టర్లు అద్ది, ఎమోజీలు జోడించడం ఎప్పటినుంచో చేస్తున్నదే. కాస్త ఏదైనా కొత్తగా ప్రయత్నిద్దాం అనుకుంటున్నారా? అయితే Framy ఆప్ ఒకసారి వాడి చూడండి. లైవ్ ఇమేజెస్ దీని ప్రత్యేకత. దీని కెమెరాతో ఫొటోను క్లిక్ చేసి... నీటి ప్రవాహం, జలపాతం, జంతువులు లాంటి లైవ్ ఇమేజెస్‌ను జోడించొచ్చు. ఆ తర్వాత వాటిని అదే ఆప్‌లో షేర్ చేసుకోవచ్చు. లేదంటే డౌన్‌లోడ్ చేసుకొని సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్‌లో పోస్ట్ చేసుకోవచ్చు.

❑ https:///goo.gl/ LU8VTS

## కలిపేయ్... విడదీసేయ్

పాట నుంచి ఓ భాగాన్ని కత్తిరించాలంటే ఒక ఆప్... రెండు పాటల్ని కలపాలంటే ఇంకో ఆప్... వీడియోను ఆడియోగా కన్వర్ట్ చేయాలంటే మరొక ఆప్... ఇలా ఒక్కోదాని కోసం ఒక్కో ఆప్ డౌన్‌లోడ్ చేసుకునేదాని కన్నా అన్నింటికీ ఒకే ఆప్ ఉంటే బాగుంటుంది కదా. Timbre: Cut, Join, Convert mp3 అలాంటిదే. ఈ ఆప్‌తో ఎంపీ3 పాటను జాయిన్, కట్, కన్వర్ట్, స్ప్లిట్ చేసుకోవచ్చు. వీడియోలను కూడా ఇలా ఎడిట్ చేసుకోవచ్చు. దీంతోపాటు వీడియోల నుంచి ఫ్రేమ్స్‌ను ఎక్స్‌ట్రాక్ట్ చేసుకోవచ్చు. వీడియో ప్లే అయ్యే వేగాన్ని కావల్సినట్లు మార్చుకోవచ్చు.

❑ https:///goo.gl/gohJce

- **వెంకట సాయికిరణ్ మతుకుమల్లి,** ఏలూరు


ఈ కబుర్లు మీవే

## విమానం ఎక్కడుంది?

ప్రపంచంలో ఏ విమానం ఎక్కడుందో, ఎంతసేపటిలో గమ్య స్థానానికి చేరుకుంటుందో, ప్రస్తుతం విమానాశ్రయంలో ఉన్నవేంటి, రాబోయేవేంటి? ఇలాంటి వివరాలు చెప్పడానికి ఓ ఆప్ ఉంది. అదే Flightradar24 Flight Tracker. ఇందులో మీకు కావల్సిన విమానం నెంబరు ఇస్తే దాని ప్రస్తుత స్థితి కనిపిస్తుంది. అది గాల్లో ఎంత ఎత్తులో ఉంది, ఎంత వేగంగా ప్రయాణిస్తోంది, ఇప్పటివరకు ఎలా ప్రయాణించింది లాంటి వివరాలు ట్రాక్ ఆప్షన్‌లో తెలుసుకోవచ్చు. ఆ విమానం గత వారం రోజుల్లో ఎలా ప్రయాణించింది అనేదీ తెలుస్తుంది. దీంతోపాటు ఓ విమానాశ్రయంలో ప్రస్తుతం ఉన్న విమానాలు, ప్రయాణానికి సిద్ధమైన వాటి గురించి వివరంగా సమాచారం లభిస్తుంది. ❑ https:///goo.gl/k99f7G

- **ఎన్.నిహాల్,** హైదరాబాద్

## ఈ-టూన్




# తొమ్మిది వస్తుంది... కొత్త ఆప్షన్లు తెస్తుంది!

**స్మార్ట్‌ఫోన్లను కొత్త ఆప్షన్లతో రూపొందించడమే కాదు... అదేస్థాయిలో వినూత్నమైన ఫీచర్లతో ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్)ను రూపొందిస్తూ వస్తోంది షామీ. తాజాగా తన స్మార్ట్‌ఫోన్ల కోసం ‘ఎంఐయూఐ 9’ ఓఎస్ బీటా వెర్షన్ (ప్రయోగాత్మక వెర్షన్)ను చైనాలో విడుదల చేసింది. సెప్టెంబరు ఆఖరుకల్లా ప్రపంచవ్యాప్తంగా ఈ ఓఎస్ అందుబాటులోకి వస్తుంది. ఈలోగా అందులోని కొత్త ఫీచర్ల గురించి చూసేద్దామా!**

◗ తాజా సమాచారం, క్రికెట్ స్కోరు, వాతావరణ స్థితిగతులు లాంటి వివరాల్ని హోమ్‌స్క్రీన్ మీద అందిస్తూ ‘గూగుల్ నౌ’లో కార్డ్స్ ఆప్షన్ ఉంది. ఆ తరహాలో ఎంఐయూఐలో స్మార్ట్ అసిస్టెంట్‌ను జోడించారు. హోమ్ స్క్రీన్‌ను కుడివైపు జరిపితే ఈ స్మార్ట్ అసిస్టెంట్ వివరాలు కనిపిస్తాయి.

◗ ఒకటికి మించిన ఆప్స్‌ను ఒకేసారి అన్‌ఇన్‌స్టాల్ చేయడం కుదురుతుందా? ప్రస్తుతం ఉన్న ఓఎస్‌తో అయితే ఇది సాధ్యం కాదు. ‘తొమ్మిది’లో ఇది చాలా సులభం. స్క్రీన్ మీద లాంగ్ ప్రెస్ చేస్తే... ఐకాన్లను టిక్ మార్క్ చేసే ఆప్షన్ వస్తుంది. అలా మీకు కావల్సిన ఆప్‌లను ఎంచుకొని పైకి డ్రాగ్ చేస్తే అన్‌ఇన్‌స్టాల్ ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేసి ఈ ప్రక్రియ పూర్తి చేయొచ్చు. అలాగే ఒక స్క్రీన్ నుంచి మరో స్క్రీన్‌కు ఆప్స్ మార్చాలన్నా ఈ పద్ధతిని అనుసరించొచ్చు.



◗ గతేడాది ఆండ్రాయిడ్ నూగట్ ఓఎస్‌లో స్ప్లిట్ స్క్రీన్ మోడ్‌ను ప్రవేశపెట్టింది గూగుల్. దీనికి మరిన్ని ఆప్షన్లు జోడించి షామీ ‘తొమ్మిది’లో అందించింది. మొబైల్‌లోని మెనూ (స్క్రీన్ కింద ఉన్న మూడు అడ్డ గీతల బటన్)ను క్లిక్ చేస్తే రీసెంట్ ఆప్స్ కనిపిస్తాయి. దాని పైన ‘స్ప్లిట్ స్క్రీన్ మోడ్’ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. అప్పుడు స్క్రీన్ రెండు భాగాలుగా కనిపిస్తుంది. ఆ తర్వాత ఏ భాగంలో ఏ ఆప్ రన్ అవ్వాలనేది మీరే ఎంచుకోవచ్చు. అలా ఒకే స్క్రీన్ మీద రెండు ఆప్స్‌ను ఒకేసారి రన్ చేసుకోవచ్చు.

◗ షామీ మొబైల్స్‌లో మెనూ బటన్‌ను క్లిక్ చేస్తే రీసెంట్ ఆప్స్ వివరాలు కనిపిస్తాయి. వరుసగా రెండోసారి క్లిక్ చేస్తే... ఇప్పటి వరకు ఆ ఆప్షన్ క్లోజ్ అయిపోయేది. కొత్త ఓఎస్‌లో అయితే అంతకుముందు వాడిన ఆప్ ఆన్ అవుతుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సమయంలో వివరాలు ఎంటర్ చేయడానికి ఈ ఆప్షన్ ఉపయుక్తంగా ఉంటుంది.

◗ వాట్సాప్‌లో ఒకేసారి పది మంది మెసేజ్‌లు పంపించారనుకోండి... మీ నోటిఫికేషన్ బార్ ఫుల్ అయిపోతుంది. మొత్తంగా ఆ నోటిఫికేషన్లే కనిపిస్తాయి. ‘తొమ్మిది’లో బండిల్ నోటిఫికేషన్ సౌకర్యం అందించారు. అంటే ఒక ఆప్‌కు సంబంధించి ఎన్ని నోటిఫికేషన్లు వచ్చినా అవన్నీ కలిసిపోయి ఒకే నోటిఫికేషన్ రూపంలో కనిపిస్తాయి. దాని మీద ఒకేసారి రెండు వేళ్లతో స్వైప్ చేసి వాటి వివరాలను సంక్షిప్తంగా చూసుకోవచ్చు. అక్కడి నుంచే క్విక్ రిప్లై ఇచ్చుకోవచ్చు. ఆ నోటిఫికేషన్‌ను ఎడమవైపు జరిపితే ‘అన్ ఇంపార్టెంట్’ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని ఎంచుకుంటే ఇకపై ఆ ఆప్‌కు సంబంధించిన నోటిఫికేషన్లకు ప్రాధాన్యం తక్కువగా ఉండి దిగువన కనిపిస్తాయి.

◗ ప్రస్తుతం ఉన్న ‘ఎంఐయూఐ 8’లో లాక్ స్క్రీన్‌ను ఎడమవైపునకు జరిపితే మెసేజ్ లేదా కెమెరా ఓపెన్ అవుతుంది. కొత్త ఓఎస్‌లో ‘ఎంఐ హోమ్’, ‘ఎంఐ రిమోట్’ ఆప్షన్లు కనిపిస్తాయి. దీంతోపాటు ఫ్లాష్‌లైట్ షార్ట్‌కట్ కూడా ఉంటుంది.

◗ ‘తొమ్మిది’లో ఆప్స్ ఓపెన్ చేశాక మినిమైజ్ చేస్తే... ఆప్ ఐకాన్‌లో కొత్తదనం కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు సెట్టింగ్స్ ఆప్‌ను ఓపెన్ చేసి మినిమైజ్ బటన్‌ను క్లిక్ చేస్తే... ఆ ఐకాన్‌లోని చక్రం బొమ్మ గిరగిరా తిరుగుతుంది. ఇలా ప్రతి ఐకాన్‌కు ఓ యానిమేషన్ ఇచ్చారు.

### ఇవి రావొచ్చు

ఈ దిగువ ఆప్షన్లు చైనాలోని షామీ మొబైళ్ల వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్త వినియోగదారులకు ఇవి ఎప్పుడు అందిస్తారనేది తెలియాల్సి ఉంది.

◗ కొత్త ఓఎస్‌లో స్మార్ట్ ఆప్ లాంచర్ సౌకర్యాన్ని అందిస్తున్నారు. దీని ఉపయోగం ఏంటంటే... మీరు ఛాటింగ్‌లో స్నేహితునితో గోవా వెళ్దాం అని టైప్ చేసి పంపిచారనుకోండి. మీ స్క్రీన్ మీద అక్షరాల్ని మొబైల్‌లోని ప్రత్యేక సాంకేతికత గుర్తించి తెరపై గూగుల్ మ్యాప్స్, మేక్ మై ట్రిప్ లాంటి రవాణాకు సంబంధించిన ఆప్స్ మొబైల్ స్క్రీన్ దిగువన కనిపిస్తాయి.

◗ గూగుల్‌లో ఫొటోలు వెతకడంలో ‘ఇమేజ్ సెర్చ్’ ఓ ఆప్షన్. అంటే గూగుల్ ఇమేజెస్‌లోకి వెళ్లి మీ దగ్గర ఉన్న ఫొటోను అప్‌లోడ్ చేస్తే... ఆ తరహాలో ఉన్న ఫొటోలు కనిపిస్తాయి. అలా ఎంఐ కూడా ఓ సెర్చ్ ఇంజిన్ సౌకర్యాన్ని అందిస్తోంది.

◗ ఆపిల్, శాంసంగ్ మొబైల్స్‌లో మెనూ ఓపెన్ చేయాలంటే స్క్రీన్ మీద కింద నుంచి పైకి వేలితో స్వైప్ చేస్తే చాలు. ఇప్పుడు ఎంఐయూఐ 9లో ఈ ఆప్షన్ అందుబాటులోకి వచ్చింది.



విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేస్తూ బుధవారం ముంబయిలో నిర్వహించిన ర్యాలీకి హాజరైన మరాఠాలు

# మరాఠాల మహో ఉద్యమం

- ముంబయిలో లక్షల మందితో ప్రదర్శన
- రిజర్వేషన్లు, రుణమాఫీ తదితర డిమాండ్లు
- విద్యార్థులకు రాయితీలు ప్రకటించిన సీఎం

ముంబయి

విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తదితర డిమాండ్లతో మరాఠాలు ముంబయిలో బుధవారం పెద్ద ఎత్తున ఉద్యమించారు. మహారాష్ట్ర నలుమూలల నుంచీ తరలివచ్చిన లక్షలాది మంది 'మరాఠా క్రాంతి మోర్చా' పేరిట శాంతియుత మౌన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు, ప్రభుత్వోద్యోగులు, డబ్బావాలాలు (భోజనం సరఫరా చేసేవారు) తదితరులు భారీగా పాల్గొన్నారు. వేలాదిగా పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. 'సకల్ మరాఠా సమాజ్' ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బైకాలాలోని జిజామాత ఉద్యాన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన 10 కి.మీ.ల మేర సాగింది. కాషాయ టోపీలు, జెండాలతో పాల్గొన్న ప్రదర్శనకారులంతా అనంతరం దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో గుమిగూడటంతో ఆ ప్రాంతం కాషాయవర్ణ సాగరాన్ని తలపించింది. 'ఒక మరాఠా.. లక్ష మరాఠాలతో సమానం' అంటూ నినదించారు. ప్రదర్శన నేపథ్యంలో ముంబయిలోని జేజే ఫ్లైఓవర్‌పై ఇతర వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ట్రాఫిక్, రవాణా వ్యవస్థలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సబర్బన్ రైల్వేలపై తలకుమించిన భారం పడింది. పార్కింగ్ స్థలాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. రిజర్వేషన్లను కోరుతూ మూడేళ్ల బాలిక ఈశన్వీ దేశ్‌ముఖ్ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో 3 లక్షల మంది పాల్గొన్నట్లు పోలీసులు చెబుతుండగా.. 8 లక్షలకు పైగా హాజరైనట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది.

*సరిగ్గా ఏడాది క్రితం..*

దిల్లీలోని నిర్భయ ఘటనను తలపించేలా.. అత్యంత కిరాతకంగా 2016 జులై 13న అహ్మద్ నగర్ జిల్లా కోపర్డీ గ్రామంలో ఓ మరాఠా బాలిక(14)పై కొందరు అత్యాచారం జరిపి, హత మార్చారు. మహారాష్ట్రను కుదిపేసిన ఈ ఘటన నేపథ్యంలో సరిగ్గా ఏడాది క్రితం మరాఠాలు ఔరంగాబాద్‌లో ఈ తరహా తొలి ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఇంతవరకు 58 (తాజా కార్యక్రమంతో కలిపి) ప్రదర్శనలు నిర్వహించారు. ముంబయిలో ఇదే తొలిసారి. శివసేన కూడా ఈ ప్రదర్శనలో పాల్గొనగా.. తమకు రాజకీయ జోక్యం అవసరం లేదంటూ ప్రదర్శనకారులు ఆ పార్టీ బ్యానర్లను చించివేశారు. అజాద్ మైదాన్‌కు ముంబయి భాజపా అధ్యక్షుడు ఆశిష్ శేలార్ చేరుకోగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.

*ఉద్యమ నేపథ్యం..*

మహారాష్ట్ర జనాభాలో దాదాపు 35 శాతం మరాఠాలే. అధిక సంఖ్యలో చెరకు సాగు చేస్తుంటారు. పెరిగిపోతున్న నిరుద్యోగిత, రైతుల ఆర్థిక సమస్యలతో పాటు కోపర్డీ ఘటనతో ఆగ్రహంగా ఉన్నవారంతా కొంతకాలంగా ఉద్యమిస్తూ వస్తున్నారు. రిజర్వేషన్లతో పాటు, కోపర్డీ కేసులో దోషులను శిక్షించడం.. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం దుర్వినియోగం కాకుండా సవరణలు చేయడం.. రైతులకు రుణమాఫీ.. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర వారి డిమాండ్లు.

*ఓబీసీల మాదిరిగానే రాయితీలు: సీఎం*

ఓబీసీలకు ఇస్తున్న అన్ని విద్యారాయితీలనూ మరాఠా విద్యార్థులకూ వర్తింపజేస్తున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్ బుధవారం అసెంబ్లీలో ప్రకటించారు. అలాగే మరాఠాలకు వివిధ పథకాల అమలును సమీక్షించేందుకు కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు మహిళలు సహా 40 మంది మరాఠా ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. కాంగ్రెస్, ఎన్సీపీ తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. మరాఠా విద్యార్థుల కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక వసతిగృహాల నిర్మాణానికి రూ. 5 కోట్లు వంతున అందజేయనున్నట్లు వెల్లడించారు. కోపర్డీ కేసులో డిఫెన్సు న్యాయవాదులు కావాలని వాయిదాలకు ప్రయత్నిస్తున్నారన్నారు. అహ్మద్‌నగర్ జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ దాదాపు పూర్తికావచ్చిందని.. త్వరలోనే తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు అసెంబ్లీ బయట ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నివేదికను బాంబే హైకోర్టుకు సమర్పించే ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా కమిషన్‌ను కోరనున్నట్లు ఫడణవిస్ తెలిపారు.

## ఖతార్‌లోకి వీసా రహిత ప్రవేశానుమతి!

### భారత్‌తో సహా 80 దేశాలకు

**దోహా:** భారత్‌తో సహా 80 దేశాల ప్రజలకు వీసా రహిత ప్రవేశానుమతినిస్తున్నట్లు ఖతార్ బుధవారం ప్రకటించింది. విమాన రవాణా, పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే దిశగా ఈ చర్య చేపట్టినట్లు తెలిపింది. దీంతో, భారత్, అమెరికా, లెబనాన్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తదితర ఎన్నో దేశాల నుంచి ప్రజలు ఖతార్ చేరుకున్న వెంటనే అక్కడికక్కడే పర్యాటక వీసాలను మంజూరు చేస్తారు. ఖతార్ పర్యాటక అభివృద్ధి ప్రాధికార సంస్థ సారథి హసన్‌అల్-ఇబ్రహీం ఈ విషయాన్ని వెల్లడించారు. తీవ్రవాదానికి మద్దతునిచ్చారనీ, ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నారనీ అరోపిస్తూ..సౌదీఅరేబియా, ఈజిప్టు, బహ్రెయిన్, యుఏఈలు ఖతార్‌పై జూన్ 5న నిషేధం విధించిన విషయం గమనార్హం. ఖతార్‌తో ఉన్న రవాణా సంబంధాలను పూర్తిగా తెంచేసుకుంది. ఈ పరిణామంతో ఖతార్ గల్ఫ్ ప్రాంతానికి అతీతంగా దౌత్య, వాణిజ్య సంబంధాలను నెలకొల్పుకునే పనిలో పడింది. ఇందులో వీసా రహిత ప్రవేశానుమతి కూడా ఒక భాగం. కాగా, 2022లో ఖతార్ ప్రతిష్ఠాత్మక 'సాకర్ వరల్డ్ కప్' పోటీలకు వేదిక కానున్న విషయం గమనార్హం.

## మేధా పాట్కర్ అరెస్టు

**భోపాల్:** సర్దార్ సరోవర్ ప్రాజెక్టు (ఎస్ఎస్‌పీ) నిర్వాసితులను కలిసేందుకు మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలకు వెళ్తుండగా నర్మదా బచావో ఆందోళన్ (ఎన్‌బీఏ) ఉద్యమకర్త మేధా పాట్కర్‌ను బుధవారం పోలీసులు అరెస్టుచేశారు. 'ధార్ వెళ్లడానికి అనుమతించడం కుదరదని ఆమెకు స్పష్టంచేశాం. అయితే అక్కడకు వెళ్లి నిర్వాసితులను కలిసి తీరుతానని ఆమె నొక్కిచెప్పారు. దీంతో అరెస్టుచేశాం' అని అదనపు డీజీపీ అజయ్ శర్మ తెలిపారు. 'ధార్‌లో సెక్షన్ 144 విధించాం. నిబంధనలను ఉల్లంఘించనని పూచీకత్తు సమర్పిస్తేనే ఆమెను విడుదలచేస్తాం'అని వివరించారు. పాట్కర్‌ను సబ్-డివిజినల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ జైలుకు తరలించారు. నిర్వాసితులకు తగిన విధంగా పునరావాసం కల్పించాలని ధార్‌లో నిరశన చేపడుతున్న ఆమెను గత సోమవారం పోలీసులు బలవంతంగా ఖాళీ చేయించిన సంగతి తెలిసిందే.

## మహాత్ముల స్వప్నాలను సాకారం చేద్దాం!

### తీర్మానాలు ఆమోదించిన ఉభయసభలు
### స్పీకర్ సుమిత్రా మహాజన్ స్ఫూర్తిదాయక ప్రసంగం

**దిల్లీ:** 'అమూల్యమైన ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిద్దాం...దేశభక్తి, సామరస్యాన్ని మరింతగా పెంపొందించుకుందాం...అవినీతిని అంతమొందిద్దాం...మహాత్ముడు, స్వాతంత్ర్య సమరయోధులు కలలుకన్న భారతావనిని సుసాధ్యం చేసుకుందాం' అంటూ లోక్‌సభ, రాజ్యసభలు బుధవారం విడివిడిగా తీర్మానాలు చేశాయి. 'క్విట్ ఇండియా ఉద్యమ' 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయసభలూ ఏకగ్రీవంగా ఈతీర్మానాలను ఆమోదించాయి.

**లోక్‌సభలో:** 125కోట్లకు పైగా భారతీయుల ప్రతినిధులమైన మనం మహాత్ముడు, స్వాతంత్ర్య సమరయోధుల కన్నకలలను సాకారం చేస్తూ....వారు అభిలషించిన భారతావనిని 2022 నాటికల్లా నిర్మించుకునేందుకు కలిసి కట్టుగా కృషి చేద్దాం. 2022లో 75వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని మరింత కళకళలాడుతూ నిర్వహించుకుందాం' అంటూ తీర్మానం పేర్కొంది. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ...క్విట్ ఇండియా ఉద్యమ రోజుల తరహాలో ఇప్పుడు ప్రజలందరినీ ఒక్కతాటిపై నడిపించేందుకు కృషి ప్రారంభం కావాలన్నారు. బ్రిటిష్ దాస్యశృంఖలాల నుంచి విముక్తి కోసం నాడు సమరయోధులంతా 'భారత్ ఛోడో'(క్విట్ ఇండియా) అంటూ నినదించారు. ఇప్పుడు మనమంతా కలిసికట్టుగా 'భారత్ జోడో' (యునైట్ ఇండియా) అంటూ ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. సమ్మిళిత అభివృద్ధికోసం నాడు స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్నారు. ఆ స్వప్నాన్ని సాకారం చేసేందుకు...మనమంతా కృషిచేయాలని స్పీకర్ కోరారు. ప్రగతి విషయానికి వచ్చేసరికి నిరుపేదలకే ప్రాధాన్యతనివ్వాలనీ గాంధీజీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయలు పిలుపునిచ్చిన విషయాన్ని విస్మరించరాదన్నారు. ఇదే 'అంత్యోదయ'ఉద్యమసిద్ధాంతమన్నారు. స్వాతంత్ర్యం తన జన్మహక్కు అంటూ లోకమాన్య బాలగంగాధర తిలక్ గర్జించారనీ...సుపరిపాలన నా విద్యుక్తధర్మం అంటూ ఇప్పుడు ముందుకు సాగాలని కోరారు.

**రాజ్యసభలో..:** స్వాతంత్ర్యపోరాటాన్ని రాజ్యసభ గొప్పగా స్మరించుకుంది. లౌకిక, ప్రజాస్వామిక, శక్తిమంతమైన దేశాన్ని నిర్మించుకునేందుకు కలిసి కట్టుగా పరిశ్రమిద్దాం అంటూ రాజ్యసభ తీర్మానం చేసింది. ఛైర్మన్ హమీద్ అన్సారీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బ్రిటిష్ పాలనను అంతమొందించేందుకు 'విజయమో...వీరస్వర్గమో' అన్నట్లుగా పోరాడాలంటూ నాడు జాతిపిత మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపునిచ్చి 'క్విట్ ఇండియా' అంటూ గర్జించిన సందర్భాన్ని గుర్తు చేశారు. నాటి ఉద్యమస్ఫూర్తిని కొనసాగించాలంటూ తీర్మానించారు.

## రాజ్యసభలో కొనసాగిన ప్రతిష్టంభన

**దిల్లీ:** రాజ్యసభలో బుధవారం అధికార, ప్రతిపక్షాలు ఎవరికివారే పట్టుదలకు పోవటంతో ఎలాంటి కార్యకలాపాలను చేపట్టకుండానే సభ వాయిదాపడింది. బ్యాంకుల నియంత్రణ(సవరణ) బిల్లుపై చర్చించాలని ప్రభుత్వం, చండీగఢ్‌లో యువతిని వెంబడించిన ఘటన, నోట్ల ముద్రణలోని తేడాలపై చర్చ జరగాలని ప్రతిపక్షం పట్టుపట్టడంతో సభలో ప్రతిష్టంభన నెలకొంది. 'క్విట్ ఇండియా ఉద్యమం' 75వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చ అనంతరం ప్రభుత్వం బ్యాంకుల నియంత్రణ బిల్లుపై చర్చించాలని ప్రతిపాదించగా, తాము లేవనెత్తిన వివాదాస్పద చండీగఢ్ ఘటన, నోట్ల ముద్రణలో తేడాలపై ముందుగా చర్చ జరగాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్ష సభ్యులు సభ మధ్యలోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్ పాలనా వ్యవహారాలు కేంద్ర హోంశాఖ మంత్రి నియంత్రణలో ఉంటాయని, ఆయన సభకు వచ్చి వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ కోరారు. నోట్ల ముద్రణలో తేడాలపై చర్చజరగాలని కోరుతూ కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ నోటీసులివ్వగా సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్ కురియన్ తిరస్కరించారు. సభ రెండు సార్లు వాయిదాపడి తిరిగి సమావేశమైనా ఇరుపక్షాలు పట్టువిడవకపోవడంతో సభను ఆయన గురువారానికి వాయిదా వేశారు. మంగళవారం కూడా కరెన్సీ నోట్ల సైజులో తేడాలపై చర్చకు కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టగా సభ కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదా పడిన విషయం తెలిసిందే.

## ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చిన భద్రతా దళాలు

**శ్రీనగర్:** దక్షిణ కశ్మీరులోని పుల్వామా జిల్లాలో భారత భద్రతా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాయి. పుల్వామా పరిధిలో ట్రాల్‌లోని గులాబ్ బాఘ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారంతో భద్రతా దళాలు ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టి గాలింపు చర్య చేపట్టాయి. వారి కోసం గాలిస్తున్న క్రమంలో ఓ చోట నక్కిన ఉగ్రవాదులు ఒక్కసారిగా భద్రతా దళాలపై కాల్పులకు తెగబడ్డారు. కాల్పులను దీటుగా ఎదుర్కొన్న భద్రతా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. హతమైన ముగ్గురు ఉగ్రవాదులు వరుసగా జహిద్ అహ్మద్ బట్, హిష్యాఖ్ బట్, మహ్మద్ అశ్రఫ్ దార్‌లు. వీరు జాకీర్ ముస నేతృత్వంలోని ఆల్‌ఖైదా అనుబంధ శాఖ అయిన అన్సర్ గజ్వాతుల్ హింద్ ఉగ్రవాద సంస్థకు చెందిన వారని తేలింది. అయితే ఈ ముగ్గురు ఉగ్రవాదులు అన్సర్ గజ్వాతుల్ హింద్ ఉగ్రవాద సంస్థ నుంచి హిజ్‌బుల్ ముజాహిదీన్‌లో తిరిగి చేరేందుకు వస్తున్న క్రమంలో కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని హిజ్‌బుల్ ముజాహిదీన్ ప్రతినిధి తెలిపారు.

*పెల్లెట్ గాయాలతో బాలుడు మృతి*

పుల్వామా జిల్లాలో ట్రాల్ ప్రాంతంలో భద్రతా దళాలు ఉగ్రవాదులకు కాల్పులు జరుగుతున్న ప్రదేశానికి సమీపంలో నిరసనకారులు భద్రతా దళాలకు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో భద్రతాదళాల ప్రయోగించిన పెల్లెట్లుతగిలి మహ్మద్ యూనిస్ (16) అనే బాలుడు మృతిచెందాడు.

## ఏ సవాలుకైనా సైన్యం సిద్ధం

- ఎదుర్కోగల బలం మన బలగాలకు ఉంది
- 1962 చైనా యుద్ధం నుంచి పాఠం నేర్చుకున్నాం
- రాజ్యసభలో రక్షణ మంత్రి జైట్లీ వ్యాఖ్యలు



**దిల్లీ:** దేశ భద్రత పరిరక్షణలో ఏ సవాలునైనా దీటుగా ఎదుర్కొనే బలం భారత సైనిక బలగాలకు ఉందని రక్షణశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఉద్ఘాటించారు. డోక్లాం ప్రాంతంలో భారత్-చైనా బలగాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న తరుణంలో బుధవారం రాజ్యసభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'క్విట్ ఇండియా' ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా సభలో ప్రత్యేక చర్చను మంత్రి ప్రారంభించారు. నాటి ఉద్యమ కాలం నుంచి నేటికీ భారత్ సవాళ్లను ఎదుర్కొంటూ వస్తోందన్నారు. సవాలు ఎదురైన ప్రతిసారి మరింత బలంగా తయారైందని చెప్పారు. మన బలగాలను సొంతంగా పూర్తి స్థాయిలో బలోపేతం చేసుకోవాలనే పాఠాన్ని 1962 చైనా యుద్ధం నుంచి నేర్చుకున్నామని తెలిపారు. ఈ యుద్ధంతో పోలిస్తే 1965, 1971 పాకిస్థాన్ యుద్ధాల నాటికి భారత సైనిక దళాలు మరింతగా బలోపేతమయ్యాయన్నారు. "నేటికీ దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కొన్ని పొరుగు దేశాలు సవాలు చేస్తున్నాయి. తూర్పు సరిహద్దులో లేదా పశ్చిమ సరిహద్దులో ఎక్కడ సవాలు ఎదురైనా అధిగమించగల, దేశ భద్రతను పరిరక్షించగల సత్తా సాహసవంతులైన మన సైనికులకు ఉంది. దేశ భద్రత కోసం ఎలాంటి త్యాగానికైనా వారు సిద్ధం" అని చెప్పారు. 1948లో జమ్మూకశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను పాక్ ఆక్రమించుకోవడాన్నీ జైట్లీ ప్రస్తావించారు. "స్వాతంత్ర్యం తర్వాత మన పొరుగు దేశానికి కశ్మీర్‌పై కన్ను పడింది. భారత్‌లోని కొంత భాగం దాని ఆక్రమణలోకి వెళ్లిపోయింది. దీన్ని మనం మరచిపోలేం. కశ్మీర్‌లో పొరుగు దేశం ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే బలమైన కోరిక భారతీయుల్లో ఉంది" అన్నారు.

*ఉగ్రవాదం నుంచి పెను ముప్పు*

అన్ని రకాల హింస నుంచి దేశానికి విముక్తి కల్పించాల్సి ఉందని జైట్లీ చెప్పారు. ఉగ్రవాదం కారణంగా దేశంలో ఒక ప్రధాని, ఒక మాజీ ప్రధాని ప్రాణాలు కోల్పోయారని ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల మరణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల అవతల ఉండేవారితో పాటు ఆయుధాలు చేతబూనిన భారత్‌లోని కొంత మంది దేశంలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో ఉగ్రవాద వ్యాప్తికి యత్నిస్తున్నారని చెప్పారు. సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసు బలగాలు, ఇతర భద్రతా దళాలు కశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరాటంలో ఎంతగానో కృషి చేస్తున్నాయని ప్రశంసించారు. క్విట్ ఇండియా ఉద్యమం వార్షికోత్సవం సందర్భంగా భారత్‌ను మరింత బలమైన, ఆర్థికంగా ప్రగతిశీలమైన దేశంగా తీర్చిదిద్దుతామనే సంకల్పాన్ని తీసుకోవాల్సి ఉందని జైట్లీ చెప్పారు. చర్చలో కాంగ్రెస్ రాజ్యసభాపక్ష నేత గులాం నబీ ఆజాద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం గురించి ఆజాద్ మాట్లాడుతూ గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికలు, సంబంధిత పరిణామాలపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఏ పార్టీలు పాల్గొన్నాయి, ఏ పార్టీలు పాల్గొనలేదు అనేది ఇంటర్నెట్‌లో తేలిగ్గా తెలుసుకోవచ్చని ఆజాద్ చెప్పగా, 'నెట్ పనిచేయడం లేదు" అని సీపీఎం సభ్యుడు సీతారాం ఏచూరి సరదాగా స్పందించారు. దేశం అత్యంత శక్తిమంతులను ఓడించిందని, నెట్ పని చేయకపోవడం లాంటి చిన్న సమస్యల గురించి ఆందోళన చెందకూడదని ఆజాద్ బదులిచ్చారు.



తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

## 93 మంది సమరయోధులను సత్కరించిన కోవింద్

- సన్మాన గ్రహీతల్లో తెలంగాణవారు

**ఈనాడు, దిల్లీ:** రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం రాష్ట్రపతి భవన్‌లో తొలిసారిగా 'ఎట్ హోం' కార్యక్రమం ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 93 మంది స్వాతంత్ర్య సమరయోధులను ఆయన సత్కరించారు. క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో సమరయోధులకు కోవింద్ ఎలక్ట్రిక్ తేనీటి పాత్ర(కెటిల్)లను బహుమానంగా ఇచ్చారు. వ్యక్తిగత సందేశం కూడా అందించారు. సన్మానం పొందిన తెలంగాణ సమరయోధుల్లో బి.శ్రీనివాస్, కె.కొమరయ్య, బి.మురహరి, వేములపల్లి నారాయణ(వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలు), రామలింగయ్య, రామానుజం, ఎర్రబెల్లి రంగారావు(కరీంనగర్ జిల్లా), బాల పాపిరెడ్డి(జనగామ జిల్లా), కిషన్‌రావు (జయశంకర్ భూపాలపల్లి జిల్లా) ఉన్నారు. క్విట్ ఇండియా పోరాటంలో పాల్గొన్న దృశ్యాలు కళ్ల ముందు కదలాడుతున్నాయని, సన్మానం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని వారు తెలిపారు. దేశం కోసం పోరాడినందుకు గొప్ప గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమం వార్షికోత్సవం సందర్భంగా ఎనిమిది స్మారక తపాలా బిళ్లలను రాష్ట్రపతి విడుదల చేశారు.

## రాజీవ్‌గాంధీకి రాజకీయ పరిపక్వత లేదు

- ఇందిర మరణిస్తే ఆయన ప్రధానయ్యే అవకాశాలు తక్కువ
- 1980ల్లో రూపొందించిన నివేదికలో సీఐఏ అభిప్రాయాలు

**వారణాసి:** రాజీవ్‌గాంధీకి రాజకీయ పరిపక్వత లేదని.. తన తల్లి ఇందిరాగాంధీ అకాల మరణం చెందితే ఆయన భారత ప్రధాని పదవి చేపట్టే అవకాశాలు తక్కువని అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ గతంలో అభిప్రాయపడింది. కాంగ్రెస్ పార్టీని గానీ, ప్రజలను గానీ ఉత్తేజపరిచే శక్తి ఆయనకు లేదని అంచనా వేసింది. సీఐఏ తాజాగా బహిర్గతం చేసిన.. '1980ల్లో భారత్: లక్ష్యాలు, సవాళ్లు' అనే రహస్య నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 1983, జనవరి 14వ తేదీతో ఉన్న ఈ నివేదికలో.. అప్పటి భారత ప్రధాని ఇందిర అకాల మరణం చెందిన పక్షంలో ఏర్పడే పరిస్థితులను సీఐఏ చర్చించింది. ఒకవేళ రాజీవ్ ప్రధాని పదవి చేపట్టినా.. త్వరగా అధికారం చేజార్చుకోవచ్చని అంచనా వేసింది. ఇందిర ఎంత ఎక్కువ కాలం పదవిలో కొనసాగితే.. రాజీవ్‌కు అవకాశాలు అంతగా పెరుగుతాయని పేర్కొంది. ఆర్.వెంకట్రామన్, పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, ఎన్‌డీ తివారీలను ప్రధాని పదవికి అభ్యర్థులుగా పరిగణించవచ్చని అభిప్రాయపడింది. భారత్‌లోని సమాచార హక్కు చట్టం తరహాలో అమెరికాలో సమాచార స్వేచ్ఛ హక్కు ఉంటుంది. దీని కిందే సీఐఏ ఈ నివేదికను విడుదల చేసింది. అయితే సీఐఏ అంచనాలకు భిన్నంగా 1984 అక్టోబరులో ఇందిర హత్యకు గురయ్యాక.. రాజీవ్ ప్రధాని పదవి చేపట్టిన సంగతి తెలిసిందే. ఐదేళ్లకుపైగా ఆయన ఆ పదవిలో కొనసాగారు. వివిధ దేశాల భవిష్యత్తు రాజకీయ పరిణామాల గురించి గూఢచర్య సంస్థలు చర్చించడం సాధారణంగా జరుగుతూనే ఉంటుంది.

## 'భాజపా క్విట్ ఇండియా' పేరిట ప్రచారం మొదలుపెట్టిన మమత

**మేదినీపూర్:** ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అణచివేస్తోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. 2019లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించేందుకు విపక్షాలతో తృణమూల్ కాంగ్రెస్ కలిసిపని చేస్తుందని చెప్పారు. క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవం నేపథ్యంలో.. బుధవారం 'భాజపా క్విట్ ఇండియా' పేరిట ఆమె ఓ ప్రచారాన్ని ప్రారంభించారు. 'భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తోంది. 2019లో భాజపా క్విట్ ఇండియా అనే నినాదంతో బరిలోకి దిగుతాం' అని మమత వ్యాఖ్యానించారు.

## తిరోగామి శక్తులతో ప్రజాస్వామ్యానికి ముప్పు

- లోక్‌సభలో ఆరెస్సెస్‌పై సోనియాగాంధీ పరోక్ష విమర్శలు



**దిల్లీ:** దేశ ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యానికి, నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధానికి తిరోగామి శక్తులతో ప్రమాదం పొంచి ఉందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన బహుళత్వం, సమానత్వ విలువలపై విభజన, విద్వేష రాజకీయాలనే కారుమబ్బులు ఆవరించాయన్న భావన నెలకొందని, ప్రజలంతా ఏకమై ఆ శక్తులను ఓడించి స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కాపాడుకోవాల్సి ఉందని తెలిపారు. దేశ స్వాతంత్ర్య సమరంలో కీలక ఘట్టమైన క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక స్మారక చర్చా కార్యక్రమంలో సోనియా గాంధీ ప్రసంగించారు. "దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య, ఉదారవాద విలువలకు ప్రమాదం ఏర్పడిందనిపిస్తోంది. భిన్నాభిప్రాయాలపై బహిరంగ చర్చకు తావులేని పరిస్థితి. చీకటి శక్తులు ఉద్భవించాయా? సామాజిక న్యాయం, భావప్రకటన స్వేచ్ఛ, న్యాయాధారిత వ్యవస్థ, సమానత్వ పునాదులపై నిర్మితమైన ప్రజాస్వామ్య వేళ్లను పెకిలించే యత్నాలు జరుగుతున్నాయా? " అనే సందేహం కలుగుతోందని ఆమె అన్నారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో భాగస్వాములు కాకుండా, క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తులు, సంస్థల గురించి మనం మరచిపోరాదంటూ పరోక్షంగా ఆరెస్సెస్, దాని సిద్ధాంతకర్తలపై సోనియా గాంధీ విమర్శలు చేశారు. ఈ సమయంలో అధికార పక్షం నుంచి ఒక సభ్యుడు అభ్యంతరం వ్యక్తంచేయబోగా మిగిలిన సభ్యులు వద్దంటూ అతనిని వారించారు. విభజన, మతతత్వ సిద్ధాంతాల్లో, సంకుచిత మనస్తత్వాల చెరలో దేశం బందీకావటాన్ని అనుమతించబోమని సోనియా అన్నారు. మతతత్వ శక్తులను విజయం సాధించనివ్వరాదని కోరారు. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ కార్యకర్తల త్యాగాలను, జవహర్‌లాల్ నెహ్రూ కృషిని సోనియా తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.

## 'క్యోటో ప్రోటోకాల్' లక్ష్యాలపై ఐరాసకు భారత్ హామీపత్రం

**ఐక్యరాజ్యసమితి:** వాతావరణ మార్పులపై పోరాటానికి తాను ఎంతగా కట్టుబడి ఉన్నదీ భారత్ మరోసారి చాటిచెప్పింది. కర్బన ఉద్గారాల తగ్గింపుపై 'క్యోటో ప్రోటోకాల్'కు అనుగుణంగా 2020 వరకు నిర్దేశించిన లక్ష్యాల సాధనకు కట్టుబడుతూ ఐక్యరాజ్య సమితికి మంగళవారం హామీ పత్రాన్ని ఇచ్చింది. ఐరాసలోని భారత శాశ్వత దౌత్య కార్యాలయం ఒక ప్రకటనలో ఈ మేరకు తెలిపింది. 1997 డిసెంబరులో కుదిరిన క్యోటో ప్రోటోకాల్ 2005 ఫిబ్రవరిలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల సాధనకు ఆయా దేశాలు కట్టుబడాల్సిన తొలి కాలావధి 2008-2012. ఖతార్‌లోని దోహాలో 2012లో జరిగిన వాతావరణ సదస్సులో ఈ ఒప్పందానికి సవరణ తీసుకొచ్చారు. దీనిని దోహా సవరణగా పిలుస్తారు. 2013 జనవరి నుంచి 2020 డిసెంబరు వరకు సాధించాల్సిన లక్ష్యాలు, ఇతర అంశాలు ఈ సవరణలో భాగంగా ఉన్నాయి.

## డోక్లాంలో యథాపూర్వ స్థితి!

### యుద్ధం-శాంతికి అతీత పరిస్థితిలో సైన్యం!

**దిల్లీ:** డోక్లాంలో ప్రస్తుతం యథాపూర్వ స్థితి కొనసాగుతోందని అధికార వర్గాలు బుధవారం నాడిక్కడ వెల్లడించాయి. డోక్లాం వద్ద చైనా సైన్యం విషయానికి వస్తే భారత్ అటు యుద్ధాన్ని కోరుకోవడం లేదు - ఇటు చూస్తూ ఊరుకునేది లేదు అన్న స్థితిలో ఉన్నట్లు పేర్కొన్నాయి. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా భారత సైనిక దళాల కదలికలు కానీ...ఆయుధాల చేరవేతలు కానీ ఏమీ లేవని స్పష్టం చేశాయి. అయితే, నిర్వహణ సంబంధమైన కదలికలే తప్ప ...అంతకు మించినదేదీ లేదని పేర్కొన్నాయి. సుక్నా నుంచి దళాలను డోక్లాంకు పంపుతున్న విషయంపై అధికార వర్గాలు ఇలా స్పందించాయి. సైనిక బలగాల పెంపు అనేది ఎక్కడా లేదని అధికార వర్గాలు పునరుద్ఘాటించాయి.

*53 మంది భారత సైనికులున్నారు: చైనా*

**బీజింగ్:** డోక్లాం ప్రాంతంలో 53 మంది భారతీయ సైనికులు, ఒక బుల్‌డోజరు ఉన్నట్లు చైనా విదేశాంగశాఖను ఉటంకిస్తూ....అధికార వార్తాపత్రిక 'గ్లోబల్ టైమ్స్' తెలిపింది. తక్షణం తమ భూభాగం (చైనా చెప్పుకోవడమే)నుంచి దళాలను ఉపసంహించుకోవలసిందిగా భారత్‌ను కోరింది.

# శివార్లకు పట్టణ సొబగులు!

- రెండు పడక గదుల ఇళ్లతో మారనున్న గ్రామీణ ప్రాంతాలు
- కొత్తూరులో 100 ఎకరాల్లో 15 వేల ఇళ్ల నిర్మాణం
- హైదరాబాద్ శివార్లలోని అనేక ప్రాంతాల్లోనూ..
- ఇప్పటికే 48 వేల ఇళ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

హైదరాబాద్ నగరం చుట్టూ అనేక గ్రామీణ ప్రాంతాలు చిన్న పట్టణాలుగా మారనున్నాయి. రెండు పడక గదుల ఇళ్ల పుణ్యమా అని కొన్ని ప్రాంతాల్లో 50 వేల నుంచి లక్ష మంది మధ్యతరగతి ప్రజలు ఒకేచోట నివసించబోతున్నారు. హైదరాబాద్‌లో ఈ ఇళ్ల నిర్మాణాలకు స్థలం దొరక్కపోవడంతో ఇక్కడి లబ్ధిదారుల కోసం శివారు ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో పలు అంతస్తుల్లో 10-15వేల ఇళ్లను నిర్మించే బాధ్యతను అధికారులు గుత్తేదారులకు అప్పగించారు. భారీ సంఖ్యలో నివాస భవనాలు రావడంతో ఆయా ప్రాంతాలు చిన్నపాటి పట్టణాలుగా మారనున్నాయి. నగరంలోని మురికివాడలను ఖాళీ చేయించి వచ్చే ఏడాది చివరి నాటికి దాదాపు లక్ష ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం తలపెట్టింది. 100 మురికివాడల్లోని ప్రజలతో జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడారు. దాదాపు 20 మురికివాడల ప్రజలు ఇళ్లను ఖాళీ చేయడానికి అంగీకరించారు. మరికొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎన్ని మురికివాడలను ఖాళీ చేయించినా అక్కడ 400-500 మించి రెండు పడక గదుల ఇళ్లను నిర్మించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో హైదరాబాద్ మహానగరానికి దగ్గరలో ఉన్న ప్రాంతాల్లో 90 వేల ఇళ్లను నిర్మించాలని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. దీనికి అనుగుణంగా సంబంధిత జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవడంతో కొన్ని ప్రాంతాల్లో భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం లక్ష ఇళ్లకుగాను 48 వేల ఇళ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. 10వేల ఇళ్ల టెండర్లను ఉన్నతస్థాయి కమిటీ ఆమోదించాల్సి ఉంది. మరో 10వేల ఇళ్లకు టెండర్లు పిలిచారు.

**100 ఎకరాల్లో..:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రాంతంలోని కొత్తూరులో 100 ఎకరాల్లో దాదాపు 15 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టబోతున్నారు. ఒక్కో ఫ్లాట్‌లో నలుగురు చొప్పున మొత్తం ఇళ్లలో దాదాపు 60 వేల మంది ఉంటారని అధికారుల అంచనా. ఈ కాలనీ ఏర్పడితే.. వ్యాపారం, ఇతర పనులరీత్యా మరో 40 వేల మంది చుట్టపక్కల నివాసాలను ఏర్పాటు చేసుకోవడం ఖాయమని చెబుతున్నారు. ఇక్కడే వ్యాపార సముదాయాలు, వివిధ మార్కెట్లు, సినిమా థియేటర్లు కూడా రాబోతున్నాయని అంటున్నారు. ఇవన్నీ వస్తే ఈ ప్రాంతం పట్టణంగా మారుతుందని చెబుతున్నారు. పోచారం దగ్గరలో సింగపూర్ టౌన్‌షిప్ ఉంది. దీనికి ఆనుకునే అతిపెద్ద కాలనీ ఏర్పడబోతోంది. ఇక్కడ 8-10 వేల రెండు పడకగదుల ఇళ్లను నిర్మించబోతున్నారు. అలాగే మేడ్చల్ జిల్లా పరిధిలోని అహ్మద్‌గూడలో దాదాపు 5వేల ఇళ్లు వస్తాయి. జిల్లా కలెక్టర్లు ఇవ్వబోయే స్థలాలను పరిగణనలోకి తీసుకుంటే మరో 15 చోట్ల వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం మొదలుకాబోతుండడంతో ఈ ప్రాంతాలు మినీ పట్టణాలుగా మారతాయని జీహెచ్ఎంసీ సీఈ కె.సురేష్ చెప్పారు. ప్రస్తుతం 10వేల ఇళ్ల నిర్మాణ పనులను గుత్తేదారులు మొదలుపెట్టారన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామని తెలిపారు. లక్ష ఇళ్లకు గాను మిగిలిన ఇళ్లకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయబోతున్నామన్నారు. నిర్మించిన కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలన్నింటినీ తామే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



మల్లాపూర్ డివిజన్ సింగంచెరువు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇళ్లు



గోరటి వెంకన్నకు జాలాది జీవనకాల సాఫల్య పురస్కారం, సుద్దాల అశోక్‌తేజకు జాలాది జాతీయ పురస్కారం ప్రదానం చేస్తున్న మంత్రి గంటా, నటి యమున

## గోరటి వెంకన్న, సుద్దాలకు జాలాది పురస్కారాలు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** సినీ రచయిత జాలాది జయంతిని పురస్కరించుకుని జాలాది జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం-2017 విశాఖలోని వుడా బాలల థియేటర్‌లో బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజాకవి, గాయకుడు గోరటి వెంకన్నకు జాలాది జీవనకాల సాఫల్య పురస్కారం, సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు జాలాది జాతీయ పురస్కారం మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ తనకు జీవితాన్ని ఇచ్చింది జాలాదేనని పేర్కొన్నారు. పాటల రచయితగా ఎదిగేందుకు ఆయనే స్ఫూర్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినీ, బుల్లితెర నటులు, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంగలపూడి అనిత, జాలాది ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

# కళ్ల ముందే చెదిరిన కలల పంట

## కింది అంతస్తులో ఫీజు చెల్లిస్తున్న తండ్రి.. పై అంతస్తులో ఉరేసుకున్న కుమార్తె

**బండ్లగూడ, వలిగొండ, న్యూస్‌టుడే:** ఫీజు చెల్లించేందుకు కళాశాల భవనం కింది అంతస్తులో తండ్రి ఉండగానే పైఅంతస్తులో కుమార్తె ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ విషాద ఘటన బుధవారం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన పబ్బు వెంకటేశం, దుర్గమ్మల రెండో కూతరు శ్రావ్య(16) నాగోల్ సమీపంలోని బండ్లగూడలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆమె శనివారం వలిగొండకు వెళ్లింది. బుధవారం తిరిగి శ్రావ్యను తండ్రి కళాశాలకు తీసుకురాగానే.. తన గదిలోకి వెళ్లిపోయింది. ఫీజుకట్టాల్సి ఉండటంతో తండ్రి కౌంటర్ వద్దకు వెళ్లాడు. సిబ్బంది లేకపోవడంతో సుమారు 40 నిమిషాలు వెంకటేశం అక్కడే ఉండిపోయాడు. ఇంతలో అంబులెన్సు కళాశాల బయటికి వచ్చి ఆగే సరికి అందరిలాగే వెంకటేశం కూడా ఆసక్తిగా గమనించాడు. గదిలో ఉరివేసుకున్న ఓ అమ్మాయిని అంబులెన్సులోకి తీసుకెళ్తుండగా చూసి నిర్ఘాంతపోయాడు. తన కుమార్తె అని తెలిసి కన్నీరుమున్నీరయ్యాడు. ఆసుపత్రికి తరలించే సరికే శ్రావ్య ప్రాణాలు కోల్పోయింది. కళాశాలలో ఒత్తిడి కారణంగానే తన కుమార్తె మృతి చెందినట్లు వెంకటేశ్ ఆరోపించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న హయత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని మృతదేహం



బుధవారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తన కుమారుడి వివాహ శుభలేఖను అందించి ఆహ్వానిస్తున్న తెలంగాణ శాసనసభాపతి మధుసూదనాచారి

## నేడు దిల్లీకి చంద్రబాబు

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం దిల్లీ పర్యటనకు బయల్దేరి వెళ్లనున్నారు. శుక్రవారం ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి కూడా హాజరవుతారు. అనంతరం పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు.

# రాజధానిలో వాన కష్టాలు

- రహదారులపై బారులుతీరిన వాహనాలు
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన నీరు

**ఈనాడు, హైదరాబాద్, ఖమ్మం:** వర్షం దెబ్బకి హైదరాబాద్ నగరం అతలాకుతలమైంది. బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపిలేకుండా కురవడంతో పలు కూడళ్లు నీట మునిగాయి. ఉదయం 9గంటల నుంచే రహదారులపై వాహనాలు బారులు తీరాయి. మోకాళ్లలోతు నీళ్లలో వాహనదారులు అవస్థలుపడ్డారు. పాఠశాలలు, కళాశాలల బస్సులు గంటల తరబడి నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. మురుగునీటిని తోడలేక జనం ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ఎంసీ, విద్యుత్తుశాఖలు సహాయక చర్యల్ని ముమ్మరంచేయడంతో సాయంత్రానికి నగరం ఊపిరి పీల్చుకుంది. నగర పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ వర్షంధాటిగాకురవడంతో మురుగుకాల్వల్లో ప్రవాహం తీవ్రమైంది. చెట్లువిరిగిపోవడం, విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం, తదితర సమస్యలపై కాల్ సెంటర్, డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించామని కమిషనర్ డాక్టర్. బి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో పాటు, వర్షాకాల అత్యవసర బృందాలు, ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటుచేసిన బృందాలు, అత్యవసర వాహనాలు అన్ని గల్లీల్లో పర్యటించాయన్నారు. మధ్యాహ్నం 12గంటల వరకు అత్యధికంగా అంబర్‌పేట్‌లో 4.8సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



జలమయమైన మొజంజాహి మార్కెట్ ప్రాంగణం

### ఖమ్మంలో భారీ వర్షం

ఖమ్మం జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఖమ్మం నగరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోతగా కురిసింది. భారీ వర్షానికి జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని వరదనీరు ముంచెత్తింది. సుమారు రెండు గంటలపాటు బస్టాండులోకి రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. కార్పొరేషన్ పరిధిలోని పంపింగ్‌వెల్, దాన్వాయిగూడెం, వరదయ్యనగర్ తదితర ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల తదితర మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది.

## రేపటి నుంచి వర్షాలు తగ్గుముఖం

తెలంగాణలో గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలు శుక్రవారం నుంచి కాస్త తగ్గుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. శుక్ర, శనివారాల్లో అక్కడక్కడ ఒక మాదిరిగా కురుస్తాయని ఆయన తెలిపారు. బుధవారం అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 105, గుబ్బకుర్తిలో 90.8, బచ్చోడులో 72 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 8గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు రాష్ట్రంలోని 424 ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. నైరుతి రుతుపవనాలు సాధారణంగా ఉన్నాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాలతో పలు ప్రాంతాల్లో పంటలకు జీవకళ వచ్చింది. ఇంతకాలం వర్షాభావంతో ఎండుముఖంపట్టిన పంటలుకోలుకుంటున్నాయి.

## ‘ప్రజాప్రతినిధులకు ఇళ్ల స్థలాల కేటాయింపు’ విచారణ వాయిదా

**ఈనాడు, దిల్లీ:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ నగరంలో న్యాయమూర్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు ఈ నెల 17కు వాయిదా వేసింది. బుధవారం జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అమరావతిలో వివిధ ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులకు వందలాది ఎకరాల భూకేటాయింపులకు సంబంధించి ఏపీ ప్రభుత్వానికి ఉన్న అధికారాలు నిర్వచించాలని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. అమరావతిలో భూసమీకరణ కింద తీసుకున్న భూములకు తిరిగి ఇచ్చే ప్లాట్లలో విలువైన స్థలాలు కేవలం రాజకీయనాయకులకు దక్కడం ఆశ్చర్యంగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణకు స్వీకరించిన ధర్మాసనం ఆయా అంశాలపై కౌంటరు దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## పండ్లలో విష రసాయనాలు.. ముగ్గురు వ్యాపారులకు జైలు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** హైదరాబాద్ నగరంలో పండ్ల నిల్వ, మెరుగుల కోసం విష రసాయనాలను వినియోగిస్తున్న ముగ్గురు వ్యాపారులకు న్యాయస్థానం మూడునెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 చొప్పున జరిమానా విధించింది. మున్సిపాలిటీలోని ఆహార కల్తీ నిరోధక విభాగం అధికారులు గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌లోని సాయిపూజా కంపెనీ నుంచి నల్లద్రాక్ష పండ్లను పరీక్ష చేయించారు. వాటిని రసాయనాలతో మిళితం చేసినట్లు తేలడంతో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు దుకాణదారు వినాయక్‌రెడ్డితో పాటు పండ్లు అమ్మిన రమేశ్‌లకు మూడేసి నెలల కారాగార శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. కొత్తపేటలోని న్యూబాంబే/ఆంధ్రా ఫ్రూట్ కంపెనీ నుంచి సేకరించిన యాపిల్ పండ్లలో కూడా రసాయనాలు మిళితమైనట్లు తేలడంతో 1వ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ దుకాణ యజమాని మహ్మద్‌అలీంకు 3నెలల జైలుశిక్ష, రూ. 10 వేల జరిమానా విధించారు.

# తెలంగాణలో ‘సింహ’ నాటకోత్సవాలు

- ప్రభుత్వ సలహాదారు రమణాచారి వెల్లడి

**రవీంద్రభారతి, న్యూస్‌టుడే:** నాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్‌లో ఏటా నిర్వహిస్తున్న ‘నంది నాటకోత్సవాల’ తరహాలోనే తెలంగాణలో ‘సింహ నాటకోత్సవాలు’ నిర్వహించడానికి ప్రణాళికల రూపకల్పన చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి వెల్లడించారు. త్వరలోనే ప్రకటన వస్తుందని తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ(తెలంగాణ), నార్త్ ఈస్ట్ జోన్ కల్చరల్ సెంటర్(నాగాలాండ్), తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్, కన్నడ అండ్ కల్చర్(కర్ణాటక)ల సహకారంతో అభినయ థియేటర్ ట్రస్ట్, అభినయ నేషనల్ థియేటర్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్నట్లుగానే బుధవారం రవీంద్రభారతి వేదికపై పన్నెండో జాతీయ బహుభాషా నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను రమణాచారి ప్రారంభించి మాట్లాడారు. నాటకం బతకాలంటే ప్రేక్షకుల ఆదరణ అవసరమన్నారు. త్వరలో సింహ నాటకోత్సవాల ప్రణాళిక వెల్లడించనున్నట్లు రమణాచారి తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు రామకృష్ణశాస్త్రి, మధురిమలకు గండవరం సుబ్బరామిరెడ్డి థియేటర్ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

## పరిశ్రమల అభివృద్ధికి శోభన కామినేని కృషి అభినందనీయం

- కాంగ్రెస్ ఎంపీ సుబ్బరామిరెడ్డి

**ఈనాడు, దిల్లీ:** దేశంలో పరిశ్రమల అభివృద్ధికి సీఐఐ అధ్యక్షురాలు శోభన కామినేని కృషి అభినందనీయమని కాంగ్రెస్ ఎంపీ సుబ్బరామిరెడ్డి కొనియాడారు. సీఐఐ తొలి మహిళా అధ్యక్షురాలిగా చరిత్ర సృష్టించిన అపోలో ఆసుపత్రుల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ శోభన కామినేనిని అభినందిస్తూ సుబ్బరామిరెడ్డి బుధవారమిక్కడ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐఐ సమస్యల పరిష్కారానికి శోభన కామినేని డైనమిక్ విధానం ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు, ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, ఆస్ట్రేలియా, బెల్జియం, బ్రెజిల్, చైనా, జర్మనీ, జపాన్, మలేసియా, శ్రీలంక రాయబారులు పాల్గొన్నారు.

# ఒలింపిక్స్‌లో బంగారు పతకమే లక్ష్యం

- డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగంలో చేరిన పీవీ సింధు

**విజయవాడ, న్యూస్‌టుడే:** 2020లో టోక్యోలో నిర్వహించనున్న ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు పేర్కొన్నారు. ఆమెను డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నియామకపత్రాన్ని అందించిన సంగతి తెలిసిందే. బుధవారం ఆమె ఉద్యోగంలో చేరేందుకు గొల్లపూడిలోని సీసీఎల్ఏ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం తనను డిప్యూటీ కలెక్టర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. ప్రస్తుతం క్రీడారంగంపైనే దృష్టి పెడుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే విషయమై ఉన్నతోద్యోగుల సలహాలు, సూచనలు తీసుకుంటానని తెలిపారు. తొలుత సీసీఎల్ఏ కార్యదర్శి బి.రామారావుకు తన నియామకపత్రాన్ని అందించారు. రామారావు మాట్లాడుతూ.. పి.వి.సింధు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగంలో చేరినట్లు వెల్లడించారు. కొన్నాళ్లపాటు శిక్షణ ఇచ్చి పోస్టింగు ఇస్తామన్నారు. ఉద్యోగం చేసేందుకు ఆమె కృష్ణా జిల్లాను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.



సీసీఎల్ఏ కార్యదర్శి రామారావుకు తన నియామక పత్రాన్ని అందజేస్తున్న పి.వి. సింధు

## సామాజిక న్యాయంతోనే తెలంగాణ అభివృద్ధి: తమ్మినేని

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పురోగతి సాధించినప్పుడే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక(టీమాస్) రంగారెడ్డి జిల్లా ఆవిర్భావ సభ నిర్వహించారు. దీనికి తమ్మినేని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దళిత, గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. గద్దర్, విశ్వేశ్వరరావు, విమలక్క, చెరుపల్లి సీతారాములు తదితరులు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయనుకున్న యువతకు నిరాశే మిగిలిందన్నారు.

## ఏకకాలంలో ఇన్ని ప్రాజెక్టులెందుకు?: చాడ

**హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఒకేసారి ఇన్ని సాగునీటి ప్రాజెక్టులను చేపట్టాల్సిన అవసరం ఏమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారమిక్కడ ఆయన మాట్లాడారు. ఇదే పద్ధతిని నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అవలంబించి రూ.వేల కోట్లను దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాల్వల కోసం చేపట్టిన తవ్వకాలు బొందలుగా మారయని వాటిని ఎప్పటికి పూర్తిచేస్తారని ప్రశ్నించారు. నాడు ప్రతిపక్షంలో ఉండగా ‘బొందలగడ్డ తెలంగాణ’ అన్న కేసీఆర్, ఇప్పుడు తాను చేపట్టిన విధాన రహిత పనులను ఏమనాలన్నారు. సురవరం సుధాకరరెడ్డి వ్యక్తిగత దూషణలేమీ చేయలేదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావించారన్నారు. దీన్ని సహించలేని కేసీఆర్.. కమ్యూనిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

# అమెరికా భూభాగంపై క్షిపణిదాడి చేస్తాం

- గ్వామ్ దీవి లక్ష్యంగా ఉత్తరకొరియా హెచ్చరిక
- ట్రంప్ ఆగ్రహానికి ప్రతిస్పందనగా ప్రకటన

**సియోల్/హగాత్న్యా:** అమెరికా, ఉత్తరకొరియాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అమెరికాకు చెందిన వ్యూహాత్మక సైనిక స్థావరాలపై క్షిపణి దాడి విషయాన్ని చురుగ్గా పరిశీలిస్తున్నట్లు ఉత్తరకొరియా వెల్లడించింది. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలోని గ్వామ్ దీవిని తమ మధ్యంతర శ్రేణి బ్యాలిస్టిక్ క్షిపణిదాడులకు లక్ష్యంగా చేసుకున్నట్లు హెచ్చరించింది. అణ్వాయుధ క్షిపణుల తయారీ కార్యక్రమాన్ని ఉత్తరకొరియా త్యజించకపోతే తమ ఆగ్రహ జ్వాలలకు ఆ దేశం గురికాకతప్పదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ప్యాంగ్‌యాంగ్ నుంచి ఈ స్పందన వెలువడటం గమనార్హం. ఐక్యరాజ్యసమితి ఇటీవల ఉత్తరకొరియాపై ఆంక్షలను మరింత కఠిన తరం చేసిన విషయం తెలిసిందే. గ్వామ్‌లోని అమెరికా నావికా దళం, వైమానిక దళాల స్థావరాలపై మధ్యంతర శ్రేణి నుంచి సుదీర్ఘ శ్రేణి క్షిపణులతో దాడి చేయటానికి తగిన సన్నాహాలను సిద్ధం చేస్తున్నట్లు ఉత్తరకొరియా అధికార వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ(కేసీఎన్ఏ) వెల్లడించింది. తమ సుప్రీంకమాండర్ కిమ్ జోంగ్ ఉన్ నుంచి తుది నిర్ణయం వెలువడిన వెంటనే దాడుల ప్రణాళికలు ఖరారవుతాయని పేర్కొంది.

**గ్వామ్ దీవిపై గురి ఎందుకంటే...:** పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలోని సుందరమైన దీవి గ్వామ్. పర్యాటకులకు స్వర్గధామం. రాజధాని హగాత్న్యా. జనాభా సుమారు లక్షా60వేలు. ఇక్కడ జన్మించే వారందరినీ అమెరికా పౌరులుగానే పరిగణిస్తారు. విస్తీర్ణం 544 చదరపు కిలోమీటర్లు. పరిమాణంలో షికాగో నగరమంత ఉంటుంది. 1565 నుంచి స్పెయిన్ ఆక్రమణలో ఉన్న ఈ దీవిని 1898లో అమెరికా స్వాధీనం చేసుకుంది. రెండో ప్రపంచ యుద్ధంలో రెండున్నరేళ్ల పాటు జపాన్ ఆధీనంలో ఉంది. 1950 నుంచి అమెరికా భూభాగంలో ఓ భాగమైంది. భారీ నావిక, వైమానిక స్థావరాలను నిర్మించిన అమెరికా 6వేల మంది సైనికులను ఇక్కడ సర్వసన్నద్ధంగా ఉంచుతుంది. వియత్నాంపై యుద్ధం సమయంలో అమెరికా ఈ స్థావరాల నుంచే ఆ దేశంపై దాడులకు చేసింది.

## తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలో సినారె, దేవులపల్లి విగ్రహాలు

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** తెలంగాణ సారస్వత పరిషత్‌ను ఏడున్నర దశాబ్దాలుగా సమున్నత భాషా సంస్కృతుల నిలయంగా నిలిపిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి, డా.దేవులపల్లి రామానుజరావు కాంస్య విగ్రహాలను హైదరాబాద్‌లోని పరిషత్ ప్రాంగణంలో ప్రతిష్ఠించనున్నారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 25న దేవులపల్లి రామానుజరావు శత జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలని, సినారె కాంస్య విగ్రహాన్ని వచ్చే జయంతి నాటికి ఆవిష్కరించాలని నిర్ణయించారు. ఇరువురు పెద్దల పేరిట పురస్కారాలను నెలకొల్పాలని పరిషత్తు కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. దేవులపల్లి రామానుజరావు పురస్కారాన్ని తెలంగాణలో జర్నలిజం, సంస్కృతి, సాహిత్యరంగాల్లో సేవలను అందిస్తున్న ప్రముఖులకు, సినారె స్మారక సాహితీ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులైన వారికి అందజేయాలని తీర్మానం చేశారు.

# అమరావతికి గృహ శోభ

- ప్రముఖులు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు 4,016 యూనిట్లు
- 2018కి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఫార్ములా-1 రేసులకు అనువుగా రహదారి నిర్మాణం
- ఆరు గ్రామాల పరిధిలో బలహీన వర్గాలకు గృహ నిర్మాణం
- ప్రైవేటు పాఠశాలలకు ఎకరం రూ.50 లక్షల చొప్పున భూములు
- సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయాలు

**ఈనాడు, అమరావతి:** రాజధాని అమరావతిలో గవర్నర్, ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, మంత్రుల వంటి ప్రముఖులకు, చట్టసభల ప్రతినిధులు, అఖిలభారత సర్వీసుల అధికారులు, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారులు, ఇతర ఉద్యోగులకు 4,016 నివాస యూనిట్లు అవసరమవుతాయని, వీటిలో 3820 యూనిట్లను బహుళ అంతస్తుల భవనాలుగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) 11వ అథారిటీ సమావేశం బుధవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగింది. విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. చట్టసభల ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన 3820 గృహ నిర్మాణ యూనిట్ల నిర్మాణానికి రూ.1991 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. రాజధాని అమరావతిలో 2018 చివరి నాటికి 2 లక్షల జనాభా అవసరాలకు తగ్గట్టుగా గృహ నిర్మాణాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజధానిలో నిర్మించే ప్రతి భవనం దేనికదే సుప్రసిద్ధంగా ఉండాలన్నారు.

### సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలు... వివిధ ప్రస్తావనలు ఇలా...

- నివాస యూనిట్ల కోసం వివిధ మార్గాల ద్వారా సేకరించే నిధులను తిరిగి చెల్లించేందుకు అవసరమైనట్టుగా ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించి, అందుకు తగ్గ వ్యూహ ప్రణాళిక సిద్ధం చేస్తారు.
- జర్నలిస్టులకు నిర్మించే బహుళ అంతస్తుల భవనాలు మీడియా సిటీలో ఏ ప్రాంతంలో వస్తాయి? అక్కడి నుంచి పాలన నగరం ఎంత దూరంలో ఉంటుందనే అంశాలపై ముఖ్యమంత్రి ఆరా. ప్రభుత్వ భవనాల సముదాయానికి 2 కి.మీ. లోపు తుళ్లూరుకి చుట్టుపక్కల మీడియా ప్రతినిధులకు గృహ నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని సీఎం సూచన.
- రైతుల కోసం అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌లలో ఏడు జోన్లలో రూ.13,157 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధికి పాలనాపరమైన అనుమతుల మంజూరు. జోన్ 4, 5, 7, 9, 10, 12, 12ఎలలో మౌలిక వసతుల్ని అభివృద్ధి చేస్తారు. ఈపీసీ, హైబ్రిడ్ యాన్యుటీ విధానాల్లో వీటిని చేపడతారు.
- రాజధానిలో సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణానికి అనుమతి. 60వేల చ.అడుగుల్లో ఈ భవనం నిర్మిస్తారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా నగరం మధ్యలో సరైన స్థలాన్ని గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశం. 3.5 ఎకరాల్లో ఈ కార్యాలయాన్ని ప్రీ ఫ్యాబ్రికేటెడ్ విధానంలో జీప్లస్ వన్‌గా నిర్మిస్తారు. ఈ భవన నిర్మాణానికి రూ.40 కోట్లు వ్యయమవుతుందని అంచనా.
- రాజధాని గ్రామాలకు చెందిన 100మంది రైతుల్ని మూడు దఫాలుగా సింగపూర్ పర్యటనకు తీసుకెళ్తారు. ఒక్కో బృందంలో 35 మంది ఉంటారు. భూసమీకరణ ప్రక్రియలో పాల్గొన్న అధికారులు వెళతారు. రైతులకు రాను,పోను విమాన ఖర్చులు రూ.30 వేల వరకు అవుతాయని అంచనా. దాన్ని రైతులే భరిస్తారు. మిగతా ఖర్చుల్ని సీఆర్‌డీఏ భరిస్తుంది. రైతులు మూడు రోజులపాటు సింగపూర్‌లో పర్యటిస్తారు. సింగపూర్‌లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలపై అవగాహన కల్పిస్తారు. సెంటర్ ఫర్ లివబుల్ సిటీ, ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు రూ.47 లక్షలు వ్యయమవుతుందని అంచనా. అక్కడకు వెళ్లేందుకు ముందు వారికి రెండు రోజులపాటు నైపుణ్యాల పెంపుపై ఇక్కడ శిక్షణ ఉంటుంది.
- సింగపూర్‌లో మాదిరిగా అమరావతిలో ఒక రహదారిని ఫార్ములా వన్ రేసులకు అనుగుణంగా నిర్మించాలని ముఖ్యమంత్రి సూచన. కొత్త రాజధానిలో రహదారులపై ఎక్కడా రాజీపడొద్దని స్పష్టీకరణ.
- బ్రిటిష్ జియోలాజికల్ సర్వే (బీజీఎస్)తో సీఆర్‌డీఏ అవగాహన ఒప్పందం. ముఖ్యమంత్రి సమక్షంలో సీఆర్‌డీఏ, బీజీఎస్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు. ఆసియన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ హబ్ ఫర్ అర్బన్ జియో సైన్స్ ప్రాజెక్టులో భాగంగా కౌలాలంపూర్, హనోయ్ నగరాలతోపాటు అమరావతిలోనూ బీజీఎస్ సర్వే చేయనుంది.
- రాజధానిలో ప్రపంచబ్యాంక్ ఆర్థిక సహాయంతో ఈ6, ఈ12, ఎన్11 రహదారుల నిర్మాణానికి ఆమోదం. మొత్తం 25.3 కి.మీ. పొడవైన ఈ రోడ్లను రూ.889.9 కోట్ల వ్యయంతో చేపడతారు.
- రాజధానిలో బలహీన వర్గాల గృహనిర్మాణం కోసం తుళ్లూరు, దొండపాడు, బోరుపాలెం, మందడం, ఉండవల్లి, నవులూరు గ్రామాల పరిధిలో 32.19 ఎకరాల భూమిని ఏపీ టిడ్కోకు కేటాయిస్తూ కమిషనర్ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- రాజధానిలో భూసమీకరణలో తీసుకున్న నాలుగు పౌల్ట్రీ యూనిట్ల యజమానులకు రూ.12.48 కోట్లు చెల్లించేందుకు అథారిటీ నిర్ణయం.
- రాజధానిలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి పాఠశాలల ఏర్పాటుకి ముందుకు వచ్చే సంస్థలకు ఎకరం రూ.50 లక్షల చొప్పున ఫ్రీహోల్డ్ విధానంలో స్థలాలు కేటాయించాలని నిర్ణయం

# ఛాంపియన్


సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్

## ఒక్కో సెలక్టర్‌కు రూ.15 లక్షలు

దిల్లీ: ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేరిస్తే భారత్ ఆడాలా వద్దా అన్నదానిపై బీసీసీఐ సర్వసభ్య సమావేశంలోనే తేల్చనున్నారు. బుధవారం బీసీసీఐ పరిపాలకుల కమిటీ, బోర్డు ఆఫీస్ బేరర్ల మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కినా.. పోటీపడేందుకు విముఖంగా ఉన్న బోర్డు వైఖరిలో మార్పు ఉండే అవకాశం లేదు. ఒలింపిక్స్‌లో ఆడితే బీసీసీఐని జాతీయ క్రీడా సమాఖ్యగా పరిగణిస్తారు. అప్పుడు ఆటగాళ్లు అంతర్జాతీయ డోపింగ్ నిరోధ సంస్థ (వాడా) 'ఎప్పుడు, ఎక్కడ' నిబంధనకు ఒప్పుకోవాల్సివుంటుంది. అందుకే బోర్డు ఒలింపిక్స్‌లో ఆడడాన్ని వ్యతిరేకిస్తోంది. "ఒలింపిక్స్‌లో పాల్గొనడంపై చర్చ జరుగుతోంది. ఇక దీనిపై సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు" అని సీఓఏ సభ్యురాలు ఎడుల్జీ చెప్పింది. పురుషులు, మహిళల సెలక్షన్ కమిటీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల నజరానా ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. మంచి జట్లను ఎంపిక చేసినందుకే వాళ్లకు ఈ బహుమతని ఎడుల్జీ తెలిపింది. దేశవాళీ క్రీడాకారుల జీతాల పెంపుపై బోర్డు కోశాధికారి అనిరుధ్ చౌదరి మార్గదర్శకాలను రూపొందిస్తారని ఆమె చెప్పింది. మాజీ కెప్టెన్ అజహరుద్దీన్‌కు చెల్లించాల్సిన బకాయిలపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఆ అంశాన్ని సర్వసభ్యులకు నివేదించారు. మ్యాచ్ ఫిక్సింగ్‌కు సంబంధించి అజహరుద్దీన్ బీసీసీఐ నుంచి జీవితకాల నిషేధాన్ని ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. 2012లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అతడిపై అభియోగాలను కొట్టేసింది.

## అందరూ ఆ హామీ ఇవ్వాల్సిందే



దిల్లీ: మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ సహా బీసీసీఐ వ్యాఖ్యాతల బృందంలో ఉన్న వాళ్లంతా తమకు విరుద్ధ ప్రయోజనాలు లేవంటూ బోర్డుకు హామీ పత్రం ఇవ్వాల్సివుంటుంది. బోర్డు ఇప్పటికే గావస్కర్‌తో పాటు సంజయ్ మంజ్రేకర్, మురళీ కార్తీక్, హర్ష భోగ్లేలను తమ వ్యాఖ్యాతల బృందంలో చేర్చుకోవాలని నిర్ణయించింది. కానీ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. బోర్డు ముఖ్యంగా.. ఏ ఆటగాళ్ల మేనేజ్‌మెంట్ సంస్థతో తమకు సంబంధంలేదని ప్రకటించాలని వ్యాఖ్యాతలను కోరనుంది.

ప్రపంచ బ్యాడ్మింటన్

## సింధు, సైనాలకు బై

### శ్రీకాంత్, సాయిలకు సులువైన డ్రా




దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారులు పి.వి.సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్‌లకు సులువైన డ్రా ఎదురైంది. ఈనెల 21 నుంచి 27 వరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరగనున్న ఈ టోర్నీ డ్రాను బుధవారం విడుదల చేశారు. ఒలింపిక్ రజత పతక విజేత, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు సార్లు కాంస్య పతకాలు సాధించిన సింధు మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలో దిగుతోంది. నాలుగో సీడ్ సింధు, 2015 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెల్చుకున్న సైనాకు తొలి రౌండ్లో బై లభించింది. రెండో రౌండ్లో కిమ్ మిన్ (కొరియా) లేదా హదియా (ఈజిప్ట్)తో సింధు తలపడుతుంది. రెండో రౌండ్, ప్రిక్వార్టర్స్ దాటితే క్వార్టర్‌ఫైనల్లో ఐదో సీడ్ సున్ యు (చైనా)తో సింధు పోటీపడుతుంది. 12వ సీడ్ సైనా రెండో రౌండ్లో సబ్రినా జాక్వెట్ (స్విట్జర్లాండ్) లేదా నటాల్యా (ఉక్రెయిన్)తో తలపడుతుంది. రెండో రౌండ్ అధిగమిస్తే ప్రిక్వార్టర్స్‌లో సైనాకు రెండో సీడ్ సుంగ్ హ్యున్ (కొరియా) ఎదురవ్వొచ్చు. సుంగ్‌ను ఓడిస్తే క్వార్టర్స్‌లో ఆరో సీడ్ హి బింగ్జియావో (చైనా)తో సైనా తలపడొచ్చు. ప్రథమార్ధంలో సింధు.. ద్వితీయార్ధంలో సైనా ఉండటంతో ఫైనల్ వరకు వీరిద్దరు ముఖాముఖి తలపడే అవకాశం లేదు. జాతీయ ఛాంపియన్ రితుపర్ణ దాస్.. తొలి రౌండ్లో ఐరి మికెలా (ఫిన్‌లాండ్)తో పోటీపడుతుంది. వరుసగా రెండు సూపర్ సిరీస్ టైటిళ్లు కైవసం చేసుకున్న శ్రీకాంత్.. పురుషుల సింగిల్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాడు. తొలి రౌండ్లో సెర్గీ సిరాంత్ (రష్యా)తో 8వ సీడ్ శ్రీకాంత్ తలపడతాడు. రెండు, మూడో రౌండ్లు కూడా అధిగమిస్తే క్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సాన్ వాన్ హో (కొరియా)ను శ్రీకాంత్ ఢీకొంటాడు. తాను విజేతగా నిలిచిన రెండు సూపర్ సిరీస్‌లలో సాన్ వాన్‌ను శ్రీకాంత్ మట్టికరిపించాడు. మరో స్టార్ ఆటగాడు సాయిప్రణీత్.. తొలి రౌండ్లో వీ నాన్ (హాంకాంగ్)తో తలపడతాడు. లూకా వ్రేబర్ (ఆస్ట్రియా)తో అజయ్ జయరాం, పాబ్లో అబియన్ (స్పెయిన్)తో సమీర్‌వర్మ పోటీపడతారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో చుంగ్- కిమ్ (కొరియా)తో సుమీత్‌రెడ్డి- మను అత్రి, హిరోయుకి- యుతా వతనాబె (జపాన్)తో సాత్విక్ సాయిరాజు- చిరాగ్ శెట్టి; మహిళల డబుల్స్ తొలి రౌండ్లో ఎమీలా- అనా చింగ్ (ఇండోనేసియా)తో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప; మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సావన్- సెత్యానాతో సుమీత్‌రెడ్డి- అశ్విని, టామ్ చున్- జు యావ్‌తో సాత్విక్- మనీషా తలపడతారు. సిక్కిరెడ్డి- ప్రణవ్ చోప్రాకు తొలి రౌండ్లో బై లభించింది.

ప్రో కబడ్డీ




## వారియర్స్‌కు బుల్స్ పంచ్

నాగ్‌పూర్: ప్రో కబడ్డీలో మంగళవారం తెలుగు టైటాన్స్‌తో గెలవాల్సిన మ్యాచ్‌లో టైతో సరిపెట్టుకున్న బెంగళూరు బుల్స్.. బుధవారం అదరగొట్టింది. రెండు వరుస విజయాలతో లీగ్‌ను ఆరంభించిన బెంగాల్ వారియర్స్‌పై 31-25తో విజయం సాధించింది. ప్రథమార్ధంలో 12-10తో స్వల్ప ఆధిక్యం సాధించిన వారియర్స్.. రెండో అర్ధంలో స్పష్టమైన పైచేయి సాధించింది. ద్వితీయార్ధంలో రెండు జట్లూ దూకుడుగా ఆడాయి. 16-16తో స్కోరు సమమైన దశలో బెంగళూరు దూకుడుగా ఆడి 24-18తో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. తర్వాత కూడా అంతరాన్ని కొనసాగిస్తూ.. ఆధిపత్యం చలాయిస్తూ గెలుపు బాటలో సాగింది. రెండు జట్లూ రెండేసిసార్లు ఆలౌటయ్యాయి. రైడ్ పాయింట్లలో బెంగాల్ 15-14తో ఆధిక్యం సాధించినా.. ట్యాకిల్‌లో బెంగళూరు 12-8తో పైచేయి సాధించింది. ఆ జట్టుకు 3 అదనపు పాయింట్లు కూడా లభించాయి. అజయ్ కుమార్ 8 రైడ్ పాయింట్లతో, ఆశిష్ కుమార్ 5 ట్యాకిల్ పాయింట్లతో బెంగళూరు విజయంలో కీలక పాత్ర పోషించారు. ప్రత్యర్థి జట్టులో కున్ లీ కూడా 8 రైడ్ పాయింట్లతో సత్తా చాటాడు. 6 మ్యాచ్‌ల్లో మూడో విజయంతో మొత్తం 19 పాయింట్లు సాధించిన బెంగళూరు గ్రూప్-బిలో అగ్రస్థానానికి చేరుకుంది. బెంగాల్ 11 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

ప్రో కబడ్డీలో ఈనాడు
పుణెరీ పల్టాన్ × జైపూర్ పింక్ పాంథర్స్ రాత్రి 8 నుంచి
బెంగళూర్ బుల్స్ × తమిళ్ తలైవాస్ రాత్రి 9 నుంచి
వేదిక: నాగ్‌పూర్; ప్రసారం: స్టార్ స్పోర్ట్స్-2లో

## అయ్యో.. ఆ రెజ్లర్!

రాంచి: ఝార్ఖండ్ రాజధానిలో విషాదం చోటు చేసుకుంది. రాంచిలోని జైపాల్ సింగ్ స్టేడియంలో విద్యుదాఘాతం వల్ల యువ రెజ్లర్ విశాల్ కుమార్ వర్మ మృతిచెందాడు. కొన్ని రోజులుగా రాంచిలో భారీ వర్షాలు కురుస్తుండటంతో స్టేడియంలో నీళ్లు చేరాయి. రెజ్లింగ్ సంఘం కార్యాలయం ముందు నిలిచిన నీళ్లను విశాల్ తోడే ప్రయత్నంలో ఉండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతణ్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తేల్చారు. 25 ఏళ్ల విశాల్.. ఆరుగురు సభ్యులున్న కుటుంబానికి జీవనాధారం. అతడికి ఝార్ఖండ్ రెజ్లింగ్ సంఘం రూ.లక్ష పరిహారం ప్రకటించింది.



## జడేజా స్థానంలో అక్షర్ పటేల్

కొలంబో: సస్పెన్షన్ కారణంగా మూడో టెస్టుకు దూరమైన రవీంద్ర జడేజా స్థానంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ అక్షర్ పటేల్ 15 మంది సభ్యుల భారత జట్టుకు ఎంపికయ్యాడు. "సెలక్షన్ కమిటీ బుధవారం జడేజా స్థానంలో అక్షర్ పటేల్‌ను మూడో టెస్టు కోసం ఎంపిక చేసింది'' అని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి చెప్పాడు. మంగళవారం దక్షిణాఫ్రికా 'ఎ'ను ఓడించి ముక్కోణపు సిరీస్‌ను గెలుచుకున్న భారత జట్టులో అక్షర్ సభ్యుడు. చివరిదైన మూడో టెస్టు ఈ నెల 12న క్యాండీలో ఆరంభవుతుంది.

షూటింగ్



## కైనన్‌కు మరో కాంస్యం

దిల్లీ: ఆసియా షాట్‌గన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ కుర్రాడు కైనన్ షెనాయ్ మరో కాంస్య పతకం సాధించాడు. కజకిస్థాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మిక్స్‌డ్ టీమ్ ట్రాప్‌లో కైనన్- శ్రేయాంశిసింగ్ 40-38తో లెబనాన్ జోడీపై నెగ్గి కాంస్యం గెల్చుకున్నారు.

చెస్



## రెండో స్థానంలో ఆనంద్

సెయింట్‌లూయిస్ (యుఎస్‌ఏ): సింక్వఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్లో ఆరో రౌండు ముగిసేసరికి విశ్వనాథన్ ఆనంద్ ఉమ్మడిగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. బుధవారం ఆరో రౌండ్లో ఆనంద్.. కర్జాకిన్ (రష్యా)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. టోర్నీలో ఆనంద్‌కిది నాలుగో డ్రా. అతను ఆరు రౌండ్లలో మొత్తం 3.5 పాయింట్లతో కార్ల్‌సన్, అరోనియన్‌లతో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ మాగ్జిమ్ 4 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.




## రాజ్ కుంద్రా.. కొత్త ఐపీఎల్!

ముంబయి: బెట్టింగ్‌కు పాల్పడటం ద్వారా ఐపీఎల్ నుంచి బహిష్కృతుడై.. తనతో పాటు రాజస్థాన్ రాయల్స్ జట్టు మీదా రెండేళ్ల సస్పెన్షన్ వేటు పడేలా చేసిన ఆ ఫ్రాంఛైజీ సహ యజమాని రాజ్ కుంద్రా.. మళ్లీ 'ఐపీఎల్'లోకి వస్తున్నాడు. కాకపోతే ఈసారి అతను రానున్నది క్రికెట్‌కు సంబంధించిన లీగ్‌లోకి కాదు.. పేకాట లీగ్‌లోకి. దాని పేరు కూడా ఐపీఎలే. విడమరిచి చెప్పాలంటే అది.. 'ఇండియన్ పోకర్ లీగ్'. కుంద్రా ఆధ్వర్యంలో మంగళవారం ఈ లీగ్ ఆరంభమైంది. ఈ సందర్భంగా అతను ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఐపీఎల్ నన్ను దూరం పెట్టలేదు. నేను పునరాగమనం చేస్తున్నా" అని కుంద్రా పేర్కొన్నాడు.

## జడేజా ఇంకా ఉంది!

**భారత్‌తో రెండో టెస్టులో శ్రీలంక బ్యాట్స్‌మెన్ పుష్పకుమార కొంచెం ముందుకొచ్చి జడేజా బంతిని నేరుగా అతడికే ఆడాడు. దాన్ని అందుకున్న జడేజా ఆలస్యం చేయకుండా.. తిరిగి బ్యాట్స్‌మన్ ఉన్న వికెట్ల వైపు విసిరే ప్రయత్నం చేశాడు. అప్పుడు జడేజా అతిగా స్పందించిన మాట వాస్తవమే! కానీ ఆ స్పందన తనపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధానికి దారి తీస్తుందని జడేజా ఊహించి ఉండడేమో! ఈ నిర్ణయం జడేజాకే కాదు.. భారత క్రికెట్ అభిమానులకు కూడా పెద్ద షాకే! అంత చిన్న తప్పిదానికే ఇంత పెద్ద శిక్షా అన్నది ఇప్పుడందరినీ వెంటాడుతున్న సందేహం! జడేజాపై మరో టెస్టు నిషేధం పడే ప్రమాదం కూడా పొంచి ఉండటం ఈ వ్యవహారంలో మరో కీలక మలుపు! అసలు జడేజా వ్యవహారం ఇంత తీవ్రంగా ఎందుకు మారింది?**




జడేజాపై నిషేధం పడింది రెండో టెస్టులో చేసిన ఆ ఒక్క తప్పిదానికే కాదు. అంతకుముందు చేసిన తప్పిదానికి కూడా కలిపి ఐసీసీ అతడిపై వేటు వేసింది. అంతర్జాతీయ క్రికెట్ కోసం ఐసీసీ రూపొందించిన ప్రవర్తన నియమావళి ప్రకారం ఆటగాళ్ల తప్పిదాల తీవ్రతను బట్టి ఆయా తప్పిదాల వరకు శిక్షలుండేవి. చిన్న స్థాయి తప్పిదాలకు జరిమానా విధించడం.. పెద్ద స్థాయి తప్పిదాలకు మ్యాచ్ నిషేధం విధించడం ఉండేది. ఐతే గత ఏడాది ఐసీసీ ప్రవర్తన నియమావళిలో కొన్ని కీలక మార్పులు చేసింది. ఆటగాళ్లు నిబంధనల్ని ఉల్లంఘించినపుడు, హద్దులు దాటినపుడు వారికి అయోగ్యత పాయింట్లు విధించి, వాటి ఆధారంగా శిక్షలు వేసేలా కొత్త నిబంధనలు తెచ్చింది.

### ఈ పాయింట్ల లెక్క ఎలా ఉంటుందంటే..

- 24 నెలల వ్యవధిలో ఓ క్రికెటర్ 4 అయోగ్యత పాయింట్లు తెచ్చుకుంటే అతడిపై ఒక టెస్టు లేదా రెండు వన్డేల నిషేధం పడుతుంది. ఈ పాయింట్ల సంఖ్య ఎనిమిదికి చేరితే శిక్ష రెట్టింపవుతుంది.
- మైదానంలో ఆటగాళ్ల తప్పిదాలపై అంపైర్లు మ్యాచ్ రిఫరీకి నివేదిస్తారు. వారి నివేదిక ఆధారంగా ఆటగాడికి ఎన్ని అయోగ్యత పాయింట్లు ఇవ్వాలన్నది రిఫరీ నిర్ణయిస్తాడు.
- గత ఏడాది అక్టోబరులో ఈ అయోగ్యత పాయింట్ల విధానం అమల్లోకి వచ్చింది. 11 నెలల వ్యవధిలో 45 మంది పురుష, ఏడుగురు మహిళా క్రికెటర్లకు ఈ పాయింట్ల పంచ్ పడింది.
- శ్రీలంక ఆటగాడు డిక్వెలా (7), జడేజా (6) మాత్రమే ఆరు అంతకంటే ఎక్కువ పాయింట్లు తెచ్చుకున్నారు.
- జడేజా నిరుడు ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్ సందర్భంగా పిచ్ మీద నడిచినందుకు అంపైర్ మూడు అయోగ్యత పాయింట్లు వేశాడు. తాజాగా లంకతో మ్యాచ్‌లో తప్పిదానికి ఇంకో మూడు పాయింట్లు పడ్డాయి. పుష్పకుమారతో జడేజా వ్యవహరించిన తీరు ప్రమాదకరమని అంపైర్లు రిఫరీకి నివేదించారు. పాయింట్ల సంఖ్య 4 దాటడంతో జడేజాపై ఓ టెస్టు నిషేధం పడింది.

### అక్కడితో అయిపోదు..


జడేజా ఇప్పుడు ఓ మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్నాడు కాబట్టి అతడికి పడ్డ అయోగ్యత పాయింట్లు తొలగిపోవు. అవి అతడి ఖాతాలోనే ఉంటాయి. అతను ఇంకో తప్పిదం చేసి రెండు పాయింట్లు తెచ్చుకున్నాడంటే రెండు టెస్టులు లేదా నాలుగు వన్డేల నిషేధం పడుతుంది. ఈ పాయింట్ల పద్ధతి నిరుడు అక్టోబరులో మొదలైంది. అంటే 2018 అక్టోబరు వరకు జడేజా ఇప్పుడున్న ఆరు పాయింట్లతో కొనసాగుతాడు. అతను ఎప్పుడు తప్పు చేసినా రెండు టెస్టులు లేదా నాలుగు వన్డేల నిషేధం ముప్పు పొంచి ఉంటుంది. కాబట్టి జడ్డూ ఇకముందూ జాగ్రత్తగా ఉండాల్సిందే.

### కార్డులు కూడా వస్తున్నాయ్..

ప్రస్తుతానికి ఆటగాళ్లను అయోగ్యత పాయింట్ల ఆధారంగా శిక్షించడమే జరుగుతోంది. ముమ్ముందు వారిపై మైదానంలో చర్యలు చేపట్టే అధికారం అంపైర్లకు రాబోతోంది. అక్టోబరు 1 నుంచి మైదానంలో హద్దులు దాటే ఆటగాళ్లను నియంత్రించేందుకు అంపైర్లకు అధికారం వస్తుంది. క్రికెటర్ల అనుచిత ప్రవర్తన స్థాయిని బట్టి అంపైర్లు పసుపు, ఎరుపు రంగు కార్డులు జారీ చేస్తారు. పసుపు కార్డు తొలి హెచ్చరిక కోసం వినియోగిస్తారు. ఎరుపు కార్డు చూపెడితే ఆ ఆటగాడు మైదానం నుంచి బయటికెళ్లాల్సిందే.

అథ్లెటిక్స్

## నీకెర్క్‌దే 400మీ పసిడి



నీకెర్క్

లండన్: ఒలింపిక్ ఛాంపియన్ అథ్లెట్ వేడ్ వాన్ నీకెర్క్ ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు. ఈ దక్షిణాఫ్రికా అథ్లెట్ 400మీ పరుగులో టైటిల్‌ను నిలుపుకున్నాడు. 43.98 సెకన్లలో అతడు లక్ష్యాన్ని పూర్తి చేసి స్వర్ణాన్ని కైవసం చేసుకోగా.. స్టీవెన్ గార్డినర్ (బహమాస్) 44.41 సెకన్లతో రజతం గెలుచుకున్నాడు. కతార్ అథ్లెట్ హారోమ్ (44.48సె) కాంస్యం గెలుచుకున్నాడు. 800 మీటర్ల పరుగులో ఫ్రాన్స్‌కు చెందిన పీరె ఆంబ్రోస్ బోసె బంగారు పతకం సాధించాడు. 300మీ పరుగులో కిప్రుటో (కెన్యా), పోల్‌వాల్ట్‌లో సామ్ కెండ్రిక్స్ (అమెరికా) స్వర్ణాలను ఎగరేసుకుపోయారు. మహిళల జావెలిన్ త్రోలో 36 ఏళ్ల బార్బరా స్పోతకోవా (చెక్) విజేతగా నిలిచింది.. తొలి టైటిల్ గెలుచుకున్న పదేళ్ల తర్వాత ఆమె మళ్లీ ఛాంపియన్ కావడం విశేషం.



నీరజ్

## ఆశలన్నీ నీరజ్‌పైనే

ప్రపంచ అథ్లెటిక్స్‌లో ఎప్పుడూ భారత్‌ది పేలవ ప్రదర్శన. ఏనాడూ పతక ఆశలు లేవు. కనీసం పతకం కోసం పోటీ పడే వరకు వెళ్లినా గొప్పే అనుకునే పరిస్థితి. ఈసారి కూడా పరిస్థితి అంతే దారుణంగా ఉంది. వివిధ క్రీడాంశాల్లో పోటీపడ్డ భారత అథ్లెట్లలో చాలా మంది హీట్స్‌లోనే నిష్క్రమించారు. ఒక్కరు కూడా ఫైనల్ చేరలేదు. కానీ ఒకే ఒక్క ఆటగాడు ఆశలు రేపుతున్నాడు. కళ్లన్నీ 19 ఏళ్ల జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పైనే. జూనియర్ స్థాయిలో ప్రపంచ రికార్డు సాధకుడైన నీరజ్.. గురువారం అర్హత రౌండ్లో పోటీపడనున్నాడు. పెద్దగా అంచనాలేమీ లేవు కానీ.. అతడి పతక అవకాశాలపై ఏ మూలో ఉన్న చిన్న ఆశను మాత్రం కొట్టిపారేయలేం. ఈ సీజన్‌లో అతడి అత్యుత్తమ ప్రదర్శన 85.63 మీటర్లు. ఐఏఏఎఫ్ ర్యాంకింగ్స్‌లో నీరజ్ ప్రస్తుతం 14వ స్థానంలో ఉన్నాడు.

## సచిన్, కోహ్లీలను పోల్చొద్దు




చెన్నై: భారత దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ తెందుల్కర్, ప్రస్తుత టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీలను పోల్చడం సరి కాదని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు జాంటీ రోడ్స్ అభిప్రాయపడ్డాడు. "రికార్డుల మీద నాకు పెద్దగా ఆసక్తి లేదు. వేర్వేరు కాలాలకు చెందిన ఇద్దరు ఆటగాళ్లను పోల్చడం నాకిష్టముండదు. సచిన్, కోహ్లీ ఇద్దరూ అద్భుతమైన ఆటగాళ్లు. ఎవరి శైలిలో వారు గొప్ప. తెందుల్కర్ తెందుల్కరే.. విరాట్ విరాటే" అని చెన్నైలో పాల్గొన్న ఓ కార్యక్రమంలో రోడ్స్ వ్యాఖ్యానించాడు. సచిన్ రికార్డుల్ని కోహ్లీ బద్దలు కొడతాడా అని రోడ్స్‌ను అడిగితే.. "సచిన్ 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ క్రికెట్ ఆరంభించి 40వ ఏట వరకు ఆడాడు. 24 ఏళ్ల కెరీర్లో అనేక ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాడు. ఆధునిక క్రికెట్ అవసరాల ప్రకారం చూస్తే కోహ్లీ అంత సుదీర్ఘ కాలం ఆడతాడో లేదో నాకు తెలియదు. కోహ్లీ తన కెరీర్‌ను చాలా బాగా ఆరంభించాడు. అతడి పరుగుల ప్రవాహం అమోఘం. తక్కువ వయసులోనే చాలా పరుగులు చేశాడు. ఐతే కోహ్లీని సచిన్‌తో పోల్చరాదు" అన్నాడు.

## అధిక ఉష్ణోగ్రతలు గర్భిణులకు ప్రమాదకరం



**వాషింగ్టన్:** వాతావరణ మార్పుల వల్ల కలిగే అధిక ఉష్ణోగ్రతలు గర్భిణులకు, వారికి పుట్టబోయే బిడ్డలకు హానికరమని ఓ అధ్యయనం తెలిపింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రసవ ఫలితాలపై ప్రభావం చూపుతుందని, బరువు, బిడ్డను కనే కాలంలో తేడాలు ఉండటం, ఒక్కో సారి బిడ్డమరణించడంతో పాటు, ప్రసవ సమయంలో ఒత్తిడి పెరగడం లాంటి ప్రతికూలతలు సంభవిస్తాయని అమెరికాలోని జార్జివాషింగ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కనుగొన్నారు. గర్భందాల్చిన నాటి నుంచి సరైన జాగ్రత్తలు తీసుకోని వారికి అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదకరమని అసోసియేట్ ప్రొఫెసర్ సబ్రీనా మెక్‌కార్మిక్ తెలిపారు.

## లాలాజలం ఆధారంగా శక్తి ఉత్పత్తి



**న్యూయార్క్:** అత్యవసర పరిస్థితుల్లో, మామూలు బ్యాటరీలు పనిచేయలేని సందర్భంలో సైతం పనిచేసేలా అమెరికా శాస్త్రవేత్తలు కాగితపు ఆధారిత బ్యాటరీని అభివృద్ధి చేశారు. దీనికి లాలాజలం అందించడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అమెరికాలోని బింగామ్టన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఘనీభవన తేమలేని ఘటాలు, క్రియారహిత జీవ ఇంధన ఘటాల ఆధారంగా బ్యాటరీని తయారుచేశారు. దీనికి లాలాజలం చేర్చడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేశారు. ఈ బ్యాటరీలు ఒక్క చుక్క లాలాజలంతో వినియోగించదగినస్థాయిలో శక్తిని వెలువరిస్తాయని నిరూపించారు. వీటిద్వారా కాగితపు ఆధారిత రోగనిర్ధారణ ఉపకరణాలకు శక్తిని అందించవచ్చని, వీటినుపయోగించి రోగి పడక వద్దే నిర్ధారణ పరీక్షలు జరుపవచ్చన్నారు. సంప్రదాయ శక్తి వనరుల బ్యాటరీలతో పోల్చుకుంటే వీటితో అధిక ప్రయోజనాలున్నాయని, వనరుల లభ్యత లేని తరుణంలో సైతం ఈ బ్యాటరీలు అందుబాటులో ఉంటాయని పరిశోధకులు తెలిపారు. ఈ ఘటాలలో ఉపయోగించిన సాంకేతికత వాటి సామర్థ్యం తగ్గిపోకుండా ఎక్కువ మొత్తంలో శక్తి నిల్వ ఉంచుతుందన్నారు. ఇటువంటి బ్యాటరీలు అభివృద్ధిచెందుతున్న దేశాల్లోని కాగితపు ఆధారిత రోగనిర్ధారణ ఉపకరణాలకు అవసరమని బింగామ్టన్ విశ్వవిద్యాలయ అధ్యాపకులు సీయోకిన్ చోయ్ తెలిపారు. ఇటువంటి రోగనిర్ధారణలో అనేకసార్లు మైక్రోవాట్ స్థాయి శక్తిని కొన్ని నిమిషాలపాటు అందజేయాల్సి ఉంటుంది. వాణిజ్య సంబంధిత బ్యాటరీలను ఉపయోగించడం చాలా ఖరీదుతో కూడిన వ్యవహారమే కాకుండా అవసరాలకు మించినదని, దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రస్తుతం ఈ బ్యాటరీల శక్తిని పెంచేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరిన్ని రోగనిర్ధారణ ప్రయోగాలకు శక్తిని అందించేలా పరిశోధనలు చేస్తున్నారు.

## యాంటీబయోటిక్‌లపై బ్యాక్టీరియా నిరోధకత్వాన్ని గుర్తించే కొత్త పరీక్ష



**లండన్:** యాంటీబయోటిక్‌లపై బ్యాక్టీరియా కనబరిచే నిరోధకత్వాన్ని త్వరగా గుర్తించేందుకు కొత్త పరీక్ష విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీని ద్వారా ఔషధం ప్రభావం చూపిస్తుందా లేక బ్యాక్టీరియానే దాన్ని తట్టుకుని నిలుస్తుందా అన్న విషయాన్ని వైద్యులు తెలుసుకోవచ్చు. రోగులకు యాంటీబయోటిక్‌లను సూచించే సమయంలో ఈ సమాచారం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. స్వీడన్‌లోని అప్‌సలా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరీక్ష విధానాన్ని అభివృద్ధి చేశారు. పరీక్షలో బాక్టీరియా ఉన్న ప్లాస్టిక్ మైక్రోఫ్లూయిడిక్ చిప్‌ను ఉపయోగించి.. ఏక కణ స్థాయిలో అది వృద్ధి చెందుతున్న తీరును విశ్లేషిస్తారు. 10 నుంచి 30 నిమిషాల వ్యవధిలో ఇందులో ఫలితాలు బయటపడతాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇతర విధానాల్లో ఇందుకు ఒకట్రెండు రోజుల సమయం పడుతోంది. ప్రాథమికంగా మూత్రనాళ ఇన్ఫెక్షన్లకు సంబంధించిన యాంటీబయోటిక్‌ల కోసం ఈ పరీక్షను శాస్త్రవేత్తలు రూపొందించారు. అయితే ఇతర రకాల ఇన్ఫెక్షన్లకు కూడా దీనిని ఉపయోగించవచ్చని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

## రొమ్ము క్యాన్సర్ వృద్ధిని నిరోధించే కొత్త ఔషధం




**హ్యూస్టన్:** సంప్రదాయ చికిత్సలు పనిచేయని పరిస్థితుల్లో రొమ్ము క్యాన్సర్ వృద్ధిని నిరోధించే సరికొత్త ఔషధ మాలిక్యూల్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. క్యాన్సర్ కణతి కణాల్లోని ఈస్ట్రోజన్ రిసెప్టర్‌లో ఉండే ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకునే అద్వితీయ యంత్రాంగం ఆధారంగా ఈఆర్ఎక్స్-11గా పిలిచే కొత్త మాలిక్యూల్ పనిచేస్తుంది. ప్రాథమికంగానే ఈ చికిత్స విధానం విభిన్నమైనదని భారత సంతతికి చెందిన, అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు గణేష్‌రాజ్ వెల్లడించారు. ఈ సరికొత్త ఔషధ సమ్మేళనం అత్యంత ప్రభావం చూపుతుందనీ, ఇతరత్రా సంప్రదాయ చికిత్సలు పనిచేయని బాధితులకు ప్రత్యామ్నాయం కాగలదన్నారు. పరిశోధకులు దశాబ్దాలుగా కలలుకన్న ప్రక్రియ ఈ అధ్యయనంతో సుసాధ్యమైనట్లు మరో పరిశోధకులు డేవిడ్ మాంగెల్స్‌డోర్ఫ్ పేర్కొన్నారు.

## భావాన్నే 'పసి'గడతారు!


**జర్మనీ:** శిశువులు తమకు వినిపించిన పదాలను వాటి భావం ఆధారంగానే గుర్తుంచుకుంటారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. జర్మనీలోని మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్ (ఎంపీఐ సీబీఎస్) పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. ఇప్పటివరకు శిశువులు ఎక్కువ వయస్సు వచ్చాకే పదాలను వాటికి సంబంధించిన విషయాల ఆధారంగా గుర్తుంచుకుంటారని భావిస్తున్నారు. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు 6 నుంచి 8 నెలల వయస్సున్న శిశువులకు ఊహాజనిత చిత్రాలను చూపించి, వాటికి అదే తరహాలో పేర్లు పెట్టారు. అనంతరం చిత్రాల్లోని రంగులను మార్చి వాటిని పాత పేర్లతో పిలిచారు. పాత పదాలతోనే కొత్త చిత్రాలను పిలిచినప్పటికీ శిశువులు వాటిని గుర్తించలేదు.

## శక్తినిచ్చే పానీయాలతో మాదకద్రవ్యాల అలవాటు?



**వాషింగ్టన్:** కెఫిన్ ఎక్కువగా గల శక్తినిచ్చే పానీయాలు క్రమం తప్పకుండా తీసుకునే యువకులు మాదకదవ్యాలకు అలవాటుపడే ప్రమాదం పొంచి ఉందని మేరీలాండ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రజారోగ్య పాఠశాల (సీవైఏహెచ్‌డీ) నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు 21 నుంచి 25 ఏళ్ల వయస్సున్న వారి అలవాట్లను పరిశీలించారు. వీరిలో కెఫిన్ అధికంగా గల శక్తినిచ్చే పానీయాలు తాగేవారు.. కొకైన్‌తోపాటు, వైద్యుల చీటీ లేకుండా వివిధ ఔషధాలను (డ్రగ్స్) సేవిస్తున్నట్లు గుర్తించారు. కళాశాల విద్యార్థులుగా చేరిన వారిని శాస్త్రవేత్తలు ఈ అధ్యయనానికి ఎంచుకున్నారు. అనంతరం వారిని అప్పుడప్పుడు క్రమం తప్పకుండా.. ఆహారపు అలవాట్లు, శక్తినిచ్చే పానీయాలు, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రశ్నించారు. "శక్తినిచ్చే పానీయాలు తాగేవారు.. ఇతర మాదక ద్రవ్యాలు లేదా ఉద్దీపనలకు (స్టిమ్యులెంట్స్‌కు) ఎక్కువగా అలవాటు పడుతున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది" అని సీవైఏహెచ్‌డీ సహ ఆచార్యుడు డాక్టర్ ఆరియా పేర్కొన్నారు.

## పెంపుడు జంతువులతో చిన్నారుల ఆరోగ్యం అపోహే!



**కాలిఫోర్నియా:** ఇంట్లో ఓ శునకాన్నో, పిల్లినో పెంచుకుంటే.. చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందనేది అపోహ మాత్రమేనా. రాండ్ కార్పొరేషన్ తాజా అధ్యయం ఈ ప్రశ్నకు అవుననే సమాధానమిస్తోంది. పెంపుడు జంతువుల వల్ల శారీరక శ్రమ పెరగడంతోపాటు చిన్నారుల ఆరోగ్యం మెరుగు పడుతుందా, యువతలో సహానుభూతి పెరుగుతుందా అనే అంశాలపై వాస్తవాలను తెలుసుకునేందుకు ఈ అధ్యయనం నిర్వహించారు. చిన్నారులు బాగా ఉండేందుకు దోహదపడే అధికాదాయం గల ఇంట్లో జన్మించడం, సౌకర్యవంతమైన జీవనం తదితర కారకాలను నియంత్రించేందుకు రాండ్ అధునాతన గణాంక సాధనాలను వినియోగించింది. ఒక్క పెంపుడు జంతువులు కలిగి ఉండడాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. "శునకం, పిల్లిని పెంచుకునే ఇళ్లలోని పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారనడానికి మాకు ఎలాంటి ఆధారాలు కనిపించలేదు" అని రాండ్ సహ అధ్యయన కర్త లైలా పర్సాత్ పేర్కొన్నారు.







2009లో ఒకటే గదితో చౌటగడ్డతండా ప్రాథమిక పాఠశాల ★ ప్రస్తుతం 3 గదులతో పాఠశాల భవనం★ విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు

# ఆదర్శప్రాయుడు.. ఈ నరేంద్రుడు!

ప్రైవేట్‌కు దీటుగా తమ పాఠశాలలోని విద్యార్థులకు వసతులను కల్పిస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోగం నరేందర్. ఆయన కృషి ఫలితంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని చౌటగడ్డతండా ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం చూడముచ్చటగా తయారైంది. 2009లో ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చినపుడు ఒక్క తరగతి గది మాత్రమే ఉండేది. పాఠశాలలో కనీస వసతులూ కరవే. ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అధికారుల సాయంతో గదుల సంఖ్యను మూడుకు పెంచి చుట్టూ ప్రహరీ నిర్మించారు. వాటిలోని గోడలను అందమైన చిత్రాలతో తీర్చిదిద్దారు. పాఠశాల ఆవరణ పచ్చదనంతో కళకళలాడేలా విరివిగా మొక్కలు నాటారు. ప్రస్తుతమిక్కడ 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దాతల సహకారంతో విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా మూత్రశాలలు, మరుగుదొడ్లు కట్టించారు. ప్రత్యేక ఏర్పాటుతో వర్షపునీటిని ఒడిసిపట్టి జాగ్రత్తగా వినియోగిస్తున్నారు. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్గిస్తూ.. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకునేలా ఏర్పాట్లు చేయించారు. ఇందుకు కొంత మొత్తాన్ని తన వేతనం నుంచే ఆయన వ్యయం చేస్తున్నారు. పాఠశాలఅభివృద్ధికి నరేందర్ కనబరుస్తున్న చొరవను స్థానికులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

–ఈనాడు, మహబూబ్‌నగర్



బోధనా సామగ్రితో విద్యార్థులకు పాఠాలు చెపుతున్న ప్రధానోపాధ్యాయుడు నరేందర్

# ఇందిర అమూల్య సేవలనూ విస్మరించలేం

### మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్

**ముంబయి:** భారత్‌లో ఎమర్జెన్సీ చీకటి రోజులను మరువలేం...అలాగని దేశానికి ఇందిరాగాంధీ చేసిన అమూల్య సేవలనూ మరచిపోలేం... అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఉద్ఘాటించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన బుధవారం శాసనమండలిలో ఘన నివాళులర్పించారు. ఆమె శతజయంతి సంవత్సరం నేపథ్యంలో ఫడణవీస్ ఇందిర సేవలను శ్లాఘిస్తూ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ..., ఇందిరాగాంధీ సిద్ధాంతాలతో తాము పూర్తిగా ఏకీభవించలేమని చెప్పారు. ముఖ్యంగా ఎమర్జెన్సీ రోజులను తాను వ్యతిరేకిస్తానన్నారు. ఎమర్జెన్సీలో జనసంఘ్ నేత అయిన తన తండ్రి(గంగాధర్ ఫడణవీస్), సమీప బంధువు ఇద్దరూ కూడా 19 నెలల పాటు కారాగారంలో మగ్గిపోయారన్నారు.

# కశ్మీర్‌లో బస్సు ప్రమాదం

### పదిమంది మృతి

**జమ్ము:** ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు 200 అడుగుల లోయలో పడి 10 మంది మృతిచెందిన ఘటన జమ్మూకశ్మీర్‌లోని రేయాసి జిల్లాలో జరిగింది. ఈ ప్రమాదంలో 15 మందికి గాయాలయ్యాయి. బుధవారం బుద్దాన్ నుంచి మహోర్ వెళ్తున్న మినీ బస్సు శిశి నల్లాహ్ ప్రాంతంలోని లోయలో పడిపోయినట్లు జిల్లా పోలీస్ సీనియర్ సూపరింటెండెంట్ తాహి సజాద్ భట్ తెలిపారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించామన్నారు. ప్రమాద ఘటనపై గవర్నర్ ఎన్.ఎన్.వోహ్రా, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు.

# భర్త బలవంత సంయోగాన్ని నేరంగా పరిగణించలేం

**దిల్లీ:** అర్ధాంగిపై జీవిత భాగస్వామి బలవంత సంయోగానికి పాల్పడితే అది శిక్షార్హమైన నేరం కింద పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భాగస్వామి అంగీకారం లేకుండా బలవంతంగా లైంగిక చర్యకు పాల్పడటం అత్యాచార నేరం కిందికే వస్తుందా లేదా అనే విషయాన్ని పార్లమెంటు విస్తృతంగా చర్చించిందనీ, అందువల్ల ఇప్పుడు దానిని నేరపూరిత చర్యగా పరిగణించలేమని జస్టిస్ ఎం.బి. లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. అయితే 15-18 ఏళ్ల మధ్య వయసులోని వివాహిత బాలికలను వారి భర్తల బలవంతపు శృంగార చర్యల నుంచి రక్షించే అంశాన్ని పార్లమెంటు చర్చించిందో లేదో తెలుసుకోగోరింది. అలాంటి బాలికల హక్కుల్ని పరిరక్షించుకోవడంలో న్యాయస్థానం జోక్యం చేసుకోగలుస్తుందా! కూడా తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 15 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న భార్యతో ఆమె భర్త సంయోగంలో పాల్గొనడం అత్యాచారం కాదని భారత శిక్షాస్మృతిలోని 375వ నిబంధన చెబుతోంది. 15 ఏళ్లలోపు బాలికలకు పెళ్లి చేయడం చట్టవిరుద్ధమని ధర్మాసనం స్పష్టం చేసింది. భార్య వయసు 15 నుంచి 18 ఏళ్లలోపు ఉంటే ఆమెతో భర్త శారీరక సంబంధం పెట్టుకోవడాన్ని అనుమతించడంలో రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

### కొన్ని అంశాలు మాకూ ఇబ్బందే

'18 ఏళ్లలోపు కాలేజీ విద్యార్థులు కూడా పరస్పర అంగీకారంతో లైంగిక చర్యలో పాల్గొంటున్న దాఖలాలు ఉంటున్నాయి. వారిపై చట్ట ప్రకారం కేసులూ నమోదవుతున్నాయి. దీనివల్ల బాధితులయ్యేది ఎవరు? ఏడేళ్ల శిక్ష విధించడం చాలా క్రూరం. అదే విధంగా 18 ఏళ్లలోపు అమ్మాయి ఎవరితోనైనా లేచిపోయి, పరస్పర అంగీకారంతో శృంగారంలో పాల్గొంటే అబ్బాయిపై అత్యాచార కేసు పెడుతున్నారు. ఇలాంటి కేసుల్లో వివిధ అంశాలను చూస్తే మాకూ కొంత ఇబ్బందిగానే ఉంటుంద'ని ధర్మాసనం పేర్కొంది. 15 ఏళ్లలోపు బాలికతో లైంగిక చర్యకు పాల్పడితే ఆమె సమ్మతి ఉన్నా, లేకపోయినా అది అత్యాచారమేనని స్పష్టం చేసింది. 15 ఏళ్లు పైబడి, 18 ఏళ్లలోపు వయసులో వివాహిత ఉంటే మాత్రం అత్యాచార నేరాన్ని మోపలేమని పునరుద్ఘాటించింది. అయితే, ఇలాంటి తేడా చూపించడం చట్టానికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని 'ఇండిపెండెంట్ థాట్' స్వచ్ఛంద సంస్థ తరపు న్యాయవాది గౌరవ్ అగర్వాల్ చెప్పారు. 18 ఏళ్లలోపు వివాహాలను అనుమతించడం ద్వారా 21వ రాజ్యాంగ అధికరణను పార్లమెంటు ఉల్లంఘించజాలదన్నారు. 15 నుంచి 18 ఏళ్లలోపు అమ్మాయిలు శారీరకంగా తగినంత అభివృద్ధి చెందరనీ, వారు సొంతగా నిర్ణయాలు తీసుకోలేరనీ చెప్పారు.

### బాల్య వివాహాలపై చర్యలేమిటో తెలపండి

సీనియర్ న్యాయవాది గోపాల్‌సుబ్రమణ్యం వాదనలు వినిపిస్తూ అనేక అంశాలను పరిగణనలో తీసుకున్నాకే వైవాహిక అత్యాచారాలను నేరపూరితంగా పరిగణించాల్సిందిగా సూచించామన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టం కింద గత మూడేళ్లలో ఎన్ని కేసులు పెట్టారో మూడు వారాల్లో తెలపాలని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల్య వివాహాల నిషేధ అధికారుల నియామకం గురించీ వివరాలు ఇవ్వాలంటూ కేసును నాలుగు వారాలపాటు వాయిదా వేసింది.

# వచ్చే సమావేశాల్లో బీసీ బిల్లు ఆమోదం: దత్తాత్రేయ

**ఈనాడు, దిల్లీ:** బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించే బిల్లు వచ్చే సమావేశాల్లో ఆమోదం పొందుతుందని కేంద్ర మంత్రి దత్తాత్రేయ తెలిపారు. బుధవారమిక్కడ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఉద్యోగ సంఘం, బీసీ మహిళా సంఘాలు దత్తాత్రేయతో భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. వచ్చే సమావేశాల్లో కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి గెహ్లాట్ సభలో బీసీ బిల్లు ప్రవేశపెడతారని, దీనికి ఆమోదం లభిస్తుందని గట్టిగా విశ్వసిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో బీసీ కులాలకు అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు లేవని, వెంటనే ఒక్కో కార్పొరేషన్‌కు రూ.250 కోట్లు చొప్పున విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి దత్తాత్రేయ సూచించారు. వేరే ప్రాంతం నుంచి తీసుకొచ్చిన గొర్రెలు తెలంగాణ వాతావరణం సరిపోక చనిపోతున్నాయని, దీనిపై ఎన్సీడీసీతో చర్చిస్తానని తెలిపారు. ఆ సంస్థ ద్వారా రూ.1000 కోట్లు వచ్చే అవకాశంపై వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడతానని మంత్రి తెలిపారు. ఈ భేటీలో తెలంగాణ బీసీ సంఘం సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇ. నిరంజన్, వి.నాగరాజు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు కేంద్ర ఉద్యోగాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరగాలని, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు.

### రజకులు ఎస్సీల్లో చేర్చడానికి యత్నిస్తా

తెలంగాణలో రజకులను ఎస్సీల జాబితాలో చేర్చడానికి కృషి చేస్తానని కేంద్ర కార్మిక మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని బుధవారం తెలంగాణ రాష్ట్ర రజక సంఘం నేతలు దత్తాత్రేయను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై కేంద్రమంత్రి గెహ్లాట్‌తో మాట్లాడతానని దత్తాత్రేయ వారికి హామీ ఇచ్చారు.

# ఈసారి ఎంటెక్ సీటు కష్టమే!

- రెండేళ్లలో సగానికిపైగా సీట్లకు కోత
- ఈ ఏడాది 36 శాతం సీట్లు తగ్గుదల
- ఎంఫార్మసీ సీట్లదీ ఇదే పరిస్థితి

**ఈనాడు, హైదరాబాద్:** ఎంటెక్‌లో చేరండి.. మేమే మీకు ఎదురు నగదు ఇస్తామనే పరిస్థితికి దాదాపు తెరపడే పరిస్థితి వచ్చింది. గత రెండేళ్లలో సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గడమే దీనికి కారణం. అధ్యాపకుల విషయంలో జేఎన్‌టీయూహెచ్ అమలు చేసిన నిబంధనలతో అసలుకే ఎసరు రాకుండా చాలా కళాశాలలు స్వయంగా ముందుగానే డిమాండ్ లేని, అధ్యాపకులు దొరకని కోర్సులను రద్దు చేసుకున్నాయి. మౌలిక వసతులు లేవని వర్సిటీ సైతం మరికొన్ని వందల సీట్లకు కోత పెట్టింది. మొత్తానికి 2015-16 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటివరకు సగానికిపైగా సీట్లు తగ్గిపోవడం గమనార్హం. రెండేళ్ల క్రితం వరకు ఎంటెక్ సీట్లను పిలిచి ఇచ్చేవారు. సీట్లు ఎక్కువ...చేరే వారు తక్కువ ఉండటంతో ఖాళీగా ఉంచడం కంటే చేరితే బోధనారుసుమైనా వస్తుంది కదాని విద్యార్థులను యాజమాన్యాలు ప్రలోభపెట్టి చేర్చుకునేవి. అందుకు వారికి కొంత ఎదురుముట్టచెప్పి బోధనా రుసుంను యాజమాన్యాలు తీసుకునేవి.

### నిబంధనల పక్కా అమలుతో...

యాజమాన్యాల అక్రమాలను కట్టడి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో జేఎన్‌టీయూహెచ్ నిబంధనల అమలును కఠినతరం చేస్తూ వచ్చింది. దాంతో కళాశాలలే స్వయంగా సీట్లను తగ్గించుకుంటూ వస్తున్నాయి. ఈసారి ఒక బ్రాంచీకి ఇద్దరు పీహెచ్‌డీ విద్యార్హతగల అధ్యాపకులుండాలన్న నిబంధన కచ్చితంగా అమలు చేయడంతో సీట్లకు భారీగా కోత పడింది. ఇప్పటివరకు పీజీ తరగతులు సక్రమంగా జరిగేవి కావు. తాత్కాలిక ఉద్యోగం చేసుకునే వారు, తరగతులకు వెళ్లకున్నా పీజీ పట్టా వస్తుంది కదానుకొనే వారు ప్రవేశాలు పొందేవారు. గతేడాది బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ కళాశాలలకు ఆదేశాలిచ్చినా సరిగా అమలు జరగలేదు. ఈసారి తప్పనిసరిగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో ఈ నెల 11వ తేదీ నాటికి ప్రతి 100 మందికి ఒకటి చొప్పున బయోమెట్రిక్ యంత్రం ఏర్పాటు చేసి జేఎన్‌టీయూహెచ్ సర్వర్‌తో అనుసంధానం చేయాలని వర్సిటీ అధికారులు కళాశాలలకు తుది ఆదేశాలు జారీ చేశారు. బయోమెట్రిక్ అమలు చేస్తే తరగతులకు వెళ్లక తప్పదని కొందరు, బోధనా రుసుములు రావని మరికొందరు విద్యార్థులు ప్రవేశాలకు వెనకడుగు వేస్తున్నారు.

### సీట్లు 8,951... అర్హులు 32 వేల మంది

పీజీఈసెట్‌లో అర్హులైన 29,742 మందితోపాటు గేట్, జీప్యాట్ ర్యాంకర్లు మరో 2157 మంది ఉన్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడానికి ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఉంది. 8వ తేదీ నాటికి 9 వేల మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఈ సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంది. 16న సీట్లు కేటాయిస్తారు. ఎంఈ/ఎంటెక్ సీట్లు 5,978, ఎంఫార్మసీ సీట్లు 2973 మాత్రమే కన్వీనర్ కోటా కింద అందుబాటులో ఉన్నాయి.

**గత మూడేళ్లలో కన్వీనర్ కోటా సీట్లు ఇలా..**

| కోర్సు | 2015–16 | 2016–17 | 2017–18 |
| --- | --- | --- | --- |
| ఎంఈ/ఎంటెక్ | 13,955 | 9270 | 5978 |
| ఎంఫార్మసీ | 7650 | 3435 | 2973 |

(★ మరో 30% సీట్లు యాజమాన్య కోటా కింద ఉంటాయి)

# నీటి ఆవిరి ప్రజ్వలనంతో నింగిలోకి

### బుల్లి ఉపగ్రహాన్ని అభివృద్ధిచేసిన శాస్త్రవేత్తలు

**వాషింగ్టన్:** కొత్తరకం బుల్లి ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. నీటిఆవిరిని మండించడంతో అంతరిక్షంలోకి దూసుకెళ్లడం దీని ప్రత్యేకత. దీనికి "క్యూబ్‌శాట్"గా నామకరణం చేశారు. ఇటీవల కాలంలో మైక్రో, నానో శాటిలైట్‌లు బాగా ప్రచుర్యంలోకి వస్తున్నాయి. సంప్రదాయ ఉపగ్రహాల కంటే చాలా చిన్నగాఉండే ఇవి చవకైన ధరలోనే అందుబాటులోకి వస్తున్నాయి. అంతర్జాల సేవలు, అత్యంత నాణ్యమైన చిత్రాలు, సైనిక నిఘా, పర్యావరణ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ తదితర విధుల కోసం ఇప్పటికే వేలకొద్దీ ఇలాంటి బుల్లిఉపగ్రహాలను ప్రయోగించారు. 'నక్షత్ర మండలాల అన్వేషణకు ఇవి చక్కగా పనిచేస్తాయి.

# భారత్‌లో ఆకస్మికంగా 'ఇంటర్నెట్ ఆర్కైవ్' నిలిపివేత

**దిల్లీ:** లాభాపేక్షేతర డిజిటల్ గ్రంథాలయం..'ఇంటర్నెట్ ఆర్కైవ్' వెబ్‌సైట్‌ను భారత్‌లో ఆకస్మికంగా నిలిపివేశారు. దీనికి కారణమేంటో తెలియరాలేదు. తాజా పరిణామాలతో వెబ్‌సైట్ సంస్థ కేంద్ర టెలికం, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖలను సంప్రదించినా ప్రయోజనం దక్కలేదు. ఇంటర్నెట్ ఆర్కైవ్‌ను దేశంలో పలు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీనిని నిలువరించడం ద్వారా ఉచితంగా లభ్యమయ్యే సమాచార సంపద నెటిజన్లకు అందుబాటులో లేకుండా పోయినట్లయింది.

# ఖైరతాబాద్ గణేష్‌కు భారీ భద్రత

- ఉగ్రముప్పు నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- గ్రంథాలయ పరిసరప్రాంతాల్లో ఇంటింటి సర్వే

**ఈనాడు, హైదరాబాద్:** ఖైరతాబాద్ గణేష్‌కు పోలీసులు భారీ భద్రతను ఏర్పాట్లు చేస్తున్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ముంబయి, హైదరాబాద్, ఇతర నగరాల్లో ఉగ్రవాదులు విధ్వంసం సృష్టించే అవకాశాలున్నాయన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నారు. గణేష్ ఉత్సవాలకు రెండురోజుల ముందే పోలీసులు గ్రంథాలయ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. భారీ వినాయకుడి విగ్రహాన్ని తిలకించేందుకు రోజూ 50 వేల నుంచి లక్షమంది భక్తులు రానున్న నేపథ్యంలో మూడంచెల భద్రతా విధానాన్ని అమలు చేయనున్నారు. బందోబస్తు విధులు, కార్యాచరణకు సంబంధించి గణేష్ మండప నిర్వాహకులతో పోలీసులు ఇప్పటికే ఒకసారి సంప్రదింపులు జరిపారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా తొలి నిమజ్జనం ఖైరతాబాద్ గణేష్‌తోనే మొదలవనుంది. బందోబస్తు, ఇతర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సమీక్షించారు.

**ఇంటింటి సర్వే..:** అవాంఛనీయ ఘటనలను నియంత్రించేందుకు పోలీసులు తొలిసారిగా జనాభా లెక్కల తరహాలో గణేష్ విగ్రహ పరిసర ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్న ఇళ్లలో నాలుగైదు రోజుల్లో ఎవరైనా అద్దెకు దిగేందుకు వస్తే వారి వివరాలను తమకు అందజేయాలని చెబుతున్నారు. పంద్రాగస్టు వేడుకలు పూర్తయ్యాక ప్రత్యేక బృందాలతో ఇంటింటి సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఖైరతాబాద్ రైల్వేగేట్ నుంచి గణేష్ విగ్రహం వరకూ, గణేష్ విగ్రహం నుంచి టెలిఫోన్ భవన్ వరకూ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నారు. 24గంటలూ భద్రతను పర్యవేక్షించేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలను అమర్చనున్నారు. సమీపంలో తాత్కాలికంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి దాన్ని కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించనున్నారు.



# ఆధార్ ఉంటేనే.. వాహనాల క్రయవిక్రయాలు

- వాహనాల విక్రయ సమాచారం రవాణా శాఖ వెబ్‌సైట్‌లో
- వాహనాల ఫైనాన్షియర్ల ఆగడాలపై త్వరలో చెక్
- ప్రమాదాల నియంత్రణకు మరింత కసరత్తు
- అధికారులతో రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్:** వాహనాల క్రయవిక్రయాల్లో ఆధార్‌ను తప్పనిసరి చేయాలని తెలంగాణ రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రవాణా, నగర పోలీసు అధికారులతో జరిపిన సమీక్షలో మాట్లాడుతూ అధార్‌ను అనుసంధానం చేయకపోవటంతో వివిధ రకాల సమస్యలను గుర్తించటం సాధ్యం కావటం లేదని అన్నారు. పాత వాహనాల క్రయవిక్రయాలు చాలావరకు రిజిస్ట్రేషన్ కావటం లేదని, దీనివలన నిబంధనలు అతిక్రమణ లేదా నేరాలు జరిగినప్పుడు వాహనాన్ని విక్రయించిన వ్యక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. యాజమాన్య హక్కు బదలాయించుకోకపోతే బీమా పొందటం కూడా ఇబ్బంది అనే అంశంపై వాహనదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వాహనం విక్రయించిన వెంటనే పత్రాలను రవాణా శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.



**వాహన పెట్టుబడిదారులపై నిఘా:** వాహనాలు కొనుగోలుకు డబ్బు సమకూర్చే పెట్టుబడిదారుల (ఫైనాన్షియర్స్) వేధింపులపై తరచు ఫిర్యాదులు వస్తున్నాయని, వారిపై నిఘా పెట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదాల నియంత్రణకు పక్కా ప్రణాళికను అమలు చేయాలని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రమాదాలు, మరణాల శాతం తక్కువగానే ఉన్నా వాటిని మరింతగా తగ్గించాలన్నారు. హైదరాబాద్‌లో ప్రమాదాలు 33 శాతం తగ్గాయని చెప్పారు.

**డ్రైవర్ ఆధారంగానే పాయింట్లు:** ప్రస్తుతం అమలు చేస్తున్న పాయింట్ల విధానంలో అవసరమైన మార్పులు చేయాలని మహేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. డ్రైవర్ ఆధారంగానే పాయింట్లు విధానం ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన సందర్భాల్లో అప్పటికప్పుడే డ్రైవర్ ఆధారంగా పాయింట్లు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ రంగనాథ్, రవాణా శాఖ అధికారులు రఘునాథ్, పాండు రంగ నాయక్, ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2015-17, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.